మంగళవారం 9-12-2025

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 18 సంచిక: 258

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'

తీర్పు ఏదైనా..

కేరళ నటుడు దిలీప్‌పై న్యాయ పోరాటం చేసిన నటిపై కథనం - 11లో

ఇక ధనాధన్ షురూ

నేడు భారత్, దక్షిణాఫ్రికా మధ్య తొలి టీ20 మ్యాచ్ - 12లో



నేడు ఎస్ఐఆర్‌పై చర్చ

12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈసీ నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ సర్వేపై నేడు లోక్‌సభలో చర్చ జరగనుంది.

వివరాలు 6లో ▸

థాయిలాండ్ దాడులు

కాంబోడియాపై థాయిలాండ్ వైమానిక దాడులు చేసింది. దీంతో నలుగురు కాంబోడియా పౌరులు మరణించారు.

వివరాలు 6లో ▸

సిద్ధరామయ్యకు నోటీసులు

కర్ణాటక సీఎం సిద్ధరామయ్య ఎన్నిక చెల్లదంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారించింది. వివరణ ఇవ్వాలని నోటీసులిచ్చింది.

వివరాలు 14లో ▸



సెన్సెక్స్ 610 పాయింట్లు మైనస్

విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలతో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. దీంతో సెన్సెక్స్ 610 పాయింట్లు క్షీణించింది.

వివరాలు 13లో ▸

ఎన్టీఆర్ జిల్లా నున్న శివారులోని రహదారిపై రైతులు ఆరబోసిన ధాన్యం రాశులు

ధాన్యం.. దళారీదే రాజ్యం

హైవే పక్కనే పడిగాపులు..

హైవే పక్కన సర్వీసు రోడ్లపై పది రోజులుగా పంట ఆరబోస్తూనే ఉన్నా. వర్షం వస్తే ఇక అంతే. ఎన్నిసార్లు రీడింగ్ తీసినా ఆర్బీకే సిబ్బంది తేమ ఉందనే చెబుతున్నారు. మిల్లర్ల దగ్గరకు వెళితే నూక అవుతుందని భయపెట్టి తక్కువ రేటుకు అడుగుతున్నారు. కౌలుకు 8 ఎకరాలు సాగు చేశా. కూలీలతో బస్తాలు నింపి వాహనంపెట్టుకుని మేమే మిల్లుకు చేర్చాలి. ఇదో అదనపు ఖర్చు. ఈ ప్రభుత్వం రూపాయి ఇవ్వట్లేదు. తుపానుకు పంట పడిపోతే రూపాయి పరిహారం రాలేదు. నాలుగు ఎకరాలు పడిపోతే రెండు ఎకరాలు నష్టపోయినట్టు రాశారు. అలాంటి పొలాల్లో వడ్లు కొనబోమని చెప్పడంతో భయపడ్డాం.

- కె.సముద్రుడు, చలివేంద్రపాలెం, కంకిపాడు మండలం, కృష్ణా జిల్లా

సాయం మరిచి.. వెన్నువిరిచి!

వడ్లు కొనుగోళ్లలో చంద్రబాబు సర్కారు దారుణ వైఫల్యం

దళారుల చేతుల్లోకి ఆర్బీకేలు, సొసైటీ వ్యవస్థలు

పంట ఎంత బాగున్నా ధర, ధాన్యంలో అడ్డగోలుగా కోతలు

75 కిలోల బస్తాకు ఏకంగా రూ.400 వరకు తగ్గింపు

ఎకరానికి రూ. 6 వేలు-7 వేలు నష్టపోతున్న అన్నదాతలు

2 లో

ధాన్యం లోడింగ్, మిల్లుకు చేర్చే బాధ్యత రైతులపైనే వదిలేసిన సర్కార్

ప్రభుత్వం డబ్బులు ఇవ్వట్లేదని రవాణాకు ముందుకురాని వాహన యజమానులు

మిల్లులో తేమ శాతం పేరుతో మోసగిస్తున్నా వేడుక చూస్తున్న ప్రభుత్వం

ఈ-క్రాప్ నమోదులో తీవ్ర నిర్లక్ష్యంతో కౌలు రైతులకు దగా

'సాక్షి' క్షేత్రస్థాయి పరిశీలనలో వెలుగులోకి ధాన్యం కొనుగోళ్ల దందా

ధాన్యం కొనుగోళ్లతో పాటు 'జీఎల్‌టీ' కింద ఎకరాకు రూ.పది వేలు చొప్పున నేరుగా రైతన్నల ఖాతాల్లోకి జమ చేసి ఆదుకున్న వైఎస్ జగన్ సర్కార్

పంటలన్నీ కొనలేం



2లో

- వరి మనమే తినట్లేదు.. ప్రభుత్వం కొని ఏం చేస్తుంది?: సీఎం చంద్రబాబు
- ఉద్యాన పంటలకూ ధరల సమస్య
- రైతుల్లో మార్పు రావాలి.. ఇండిగో సంక్షోభాన్ని కేంద్రం పరిష్కరిస్తుంది
- కేంద్రంలో బీజేపీ తప్పు చేస్తే.. మంత్రి సత్యకుమార్‌ను నేను అడగలేను కదా!



నెహ్రూ విశ్వాస ఘాతుకం

జిన్నా ఒత్తిడికి లొంగిపోయి వందేమాతరాన్ని ముక్కలు చేశారు

ముస్లింలను రెచ్చగొట్టేలా ఉందంటూ ముఖ్యమైన చరణాలు తొలగించారు

సామాజిక సామరస్యం ముసుగులో బుజ్జగింపు రాజకీయాలు చేశారు

వందేమాతరాన్ని ముక్కలు చేయడంతో చివరకు దేశం ముక్కలైంది

లోక్‌సభలో ప్రధాని మోదీ ఆగ్రహం.. ప్రత్యేక చర్చను ప్రారంభించిన ప్రధాని

6 లో

బెంగాల్ ఎన్నికల కోసమే... వందేమాతరంపై చర్చ

అంతా మోదీ డ్రామా: ప్రియాంక

- జాతీయ గేయాన్ని నెహ్రూ వ్యతిరేకించలేదు
- తొలి ప్రధానిపై ఎన్నాళ్లిలా బురదజల్లుడు?
- బోస్‌కు ఆయన లేఖను వక్రీకరించిన ప్రధాని
- దమ్ముంటే నెహ్రూపై పూర్తిస్థాయి చర్చకు రండి

6 లో

బెల్టు షాపు నిర్వాహకులను నిలదీస్తున్న మహిళలు

అ'సుర' సంహారం!

- బాపట్ల జిల్లా కోటపాడులో బెల్టు షాపులపై మహిళల దాడి
- అక్రమంగా దాచిన మద్యం సీసాలను తీసుకొచ్చి దహనం
- ఇక నుంచి మద్యం అమ్మితే ఖబడ్దార్ అంటూ హెచ్చరిక

14లో

'విమాన' సంక్షోభంపై

రామ్మోహన్‌ను నిలదీసిన ఎంపీలు

ఇండిగో సమస్యపై రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీల ప్రశ్నల వర్షం

కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు జవాబులపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ నిరసన

ధరలపై క్యాప్ విధించినా ఎందుకు అమలు కావడం లేదని నిలదీత

ఎఫ్‌డీటీఎల్ నిబంధనలు నవంబర్ 1 నుంచి రెండో దశ అమల్లోకి వస్తే.. డిసెంబర్‌లో ఇండిగో సంక్షోభం ఎందుకు ఏర్పడిందని నిలదీసిన ఎంపీలు

మంత్రి జవాబులపై ఆగ్రహిస్తూ వాకౌట్

జాతీయ మీడియాతో పాటు అన్ని రాష్ట్రాల చానళ్లలో టీవీ డిబేట్లు

మంత్రి రాజీనామా చేయాలంటూ డిమాండ్



వాకౌట్ చేస్తున్న విపక్ష సభ్యులు

- వివరాలు 3లో

తప్పని తిప్పలు

సోమవారం మరో 562 విమానాలు రద్దు

సరిపడా విమానసర్వీసులు లేక ఇబ్బంది పడుతున్న ప్రజలు

ప్రయాణికులకు రూ.827 కోట్లు రీఫండ్ చేసిన ఇండిగో

సంక్షోభానికి కారణాలు వెంటనే చెప్పడం కుదరదన్న ఇండిగో

6 లో

కర్నూలు పోలీసులు ఇచ్చిన నోటీసును తీసుకుంటున్న 'సాక్షి' ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి

'సాక్షి' ఎడిటర్‌పై సర్కార్ దాష్టీకం

చంద్రబాబు సర్కారులో ఏకంగా 19 అక్రమ కేసులు నమోదు

14 లో

- ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డికి తాజాగా విచారణ నోటీసులు
- హైదరాబాద్‌లోని పత్రిక ప్రధాన కార్యాలయానికి కర్నూలు పోలీసులు
- అవినీతి, అరాచకాలను ప్రశ్నిస్తున్నందుకు 'సాక్షి'పై ప్రభుత్వ కక్షసాధింపు
- ప్రజా సమస్యలపై గళమెత్తుతుండడంతో అణచివేసేందుకు కుయుక్తులు

నేటి గుడ్లు & చికెన్ గుంటూరు జోన్ ధరలు

12 గుడ్ల రిటైల్ ధర ₹90	ఫారం దగ్గర లైవ్ బర్డ్	135 కిలో	డ్రెస్సిడ్ స్కిన్‌తో	235 కిలో
	రిటైల్ లైవ్ బర్డ్	162 కిలో	స్కిన్ లెస్	267 కిలో

Conditions Apply

వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది

ఇదండీ సంగతి

సార్! ఇలా ఓకేగా!!

తాడేపల్లిలోని సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు, విద్యార్థులు

గళమెత్తిన విద్యార్థి దళం

కర్కశ సర్కారుపై కదనం

- ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ధర్నా
- తాడేపల్లిలో విద్యార్థి నేతలను అరెస్ట్ చేసిన పోలీసులు
- ఎక్కడికి తీసుకెళ్తున్నారో చెప్పాలని విద్యార్థి సంఘాల డిమాండ్
- దుగ్గిరాల పీఎస్‌కు విద్యార్థి నేతల తరలింపు

10 లో

జీతమో.. రామ'చంద్ర'!

జీతాల కోసం లక్షమంది ఉద్యోగుల ఎదురుచూపు

18 శాఖల ఉద్యోగుల జీతాలు నేటికీ ఇవ్వని చంద్రబాబు సర్కారు

8వ తేదీ వరకు జీతాలు ఇవ్వకపోతే ఎలాగంటూ ఉద్యోగులు ఆగ్రహం

జీతాలను విడతల వారీగా చెల్లించే తంతుగా మార్చేసిన బాబు ప్రభుత్వం

ఈ నెల 2న రూ.3 వేల కోట్లు అప్పు చేసినా ఇంకా వేతనాలు ఇవ్వలేదు

ఒకటినే జీతాలు ఒక నెల ముచ్చటగానే మిగిల్చిన కూటమి

ప్రభుత్వ ఉద్యోగి అంటే ఠంచనుగా ఒకటో తేదీన జీతం.. డబ్బులు అవసరం పడితే జీపీఎఫ్, పీఎఫ్ నుంచి అడ్వాన్సులు, రుణాలు వంటి సదుపాయాలు అందుకునే పరిస్థితులు ఉండేవి. రాష్ట్రంలో చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ పరిస్థితులన్నీ తల్లకిందులయ్యాయి. 8వ తేదీ వచ్చినా.. రాష్ట్రంలో సుమారు లక్ష మంది ఉద్యోగులకు నేటికీ నవంబర్ నెల జీతం అందలేదు. ఆర్థిక అవసరాలకు డబ్బులు ఇవ్వాలంటూ చేసుకున్న దరఖాస్తులకు మోక్షం ఎప్పుడో తెలియడం లేదు. డీఏ బకాయిలు చెల్లించకుండానే ప్రభుత్వం రోజులు గడిపేస్తోంది. ఈ పరిస్థితి ఉద్యోగులకే పరిమితం కాలేదు. పెన్షనర్లు సైతం ప్రతి నెలా పెన్షన్ డబ్బుల కోసం ఆందోళనపడే దుస్థితి దాపురించింది.

3 లో

మంగళగిరిలోని ఏపీఐఐసీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దళిత పారిశ్రామికవేత్తలు

ప్రోత్సాహకాలు ఇవ్వకపోతే ఆత్మహత్యలే

పెట్టుబడుల రాయితీల కోసం ఏపీఐఐసీ ఎదుట ఐదు రోజులుగా దళిత పారిశ్రామికవేత్తల నిరసన

- చలిలో కుటుంబాలతో ధర్నా చేస్తున్నా కనికరించని చంద్రబాబు సర్కారు
- రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన బాధితులు
- ఏపీఐఐసీ గేట్లు మూసివేసి రోడ్డుపై బైఠాయింపు
- లిఖితపూర్వక హామీ ఇవ్వకపోతే ఆమరణ దీక్షకు వెనుకాడబోమని హెచ్చరిక

10 లో

• ధాన్యం.. దళారీదే రాజ్యం

సాయం మరిచి.. వెన్ను విరిచి!

వడ్ల కొనుగోళ్లలో చంద్రబాబు సర్కారు దారుణ వైఫల్యం

'సాక్షి' క్షేత్రస్థాయి పరిశీలనలో వెలుగులోకి ధాన్యం కొనుగోళ్ల దందా

విజయవాడ-మచిలీపట్నం రహదారి వెంబడి కృష్ణాజిల్లా దావులూరు వద్ద ఆరబెట్టిన ధాన్యం

సీఎం చంద్రబాబు నివాసానికి కూతవేటు దూరంలో విజయవాడను ఆనుకుని ఉన్న ఉప్పలూరు ప్రభుత్వ సొసైటీలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం ఓ దళారీ కబంద హస్తాల్లో బందీగా మారింది. ఈ కేంద్రంలో ధాన్యం కొనుగోలుకు అనేక కొర్రీలు పెడుతుండటంతో రైతులు రోడ్డుకు ఇరువైపులా రోజుల తరబడి ధాన్యం ఆరబెట్టుకుంటున్నారు. రాష్ట్రంలో ఎంతటి అసమర్థ పాలన కొనసాగుతోందో చెప్పేందుకు ఉప్పలూరి సొసైటీ ధాన్యం కొనుగోలు కేంద్రమే నిదర్శనం! "మాకు కనీసం సంచులు ఇవ్వలేదు. పంట కోత కోసి రోడ్లపైనే వేశాం. వాళ్లు ఎప్పుడొస్తే అప్పుడే కాటా వేయాలి. ధాన్యం శుభ్రంగా ఎండినా ఇక్కడంతా దోపిడీనే. సొసైటీలో దళారీ ఎంత చెబితే అంతే! మిల్లులు కూడా వాళ్లవే. ఇక మాకు మద్దతు ధర ఎక్కడ దక్కుతుంది..?" అంటూ ఓ అన్నదాత ఆవేదన వ్యక్తంచేశారు. "మా పంట తేమ శాతాన్ని కూడా వాళ్లే నిర్ణయిస్తున్నారు. సొసైటీ దగ్గర 17 శాతం వస్తే మిల్లులో 21 శాతం చూపిస్తోంది. ఒక్కో పాయింట్‌కు కేజీ చొప్పన ధాన్యాన్ని అదనంగా లాగేస్తున్నారు. లేదంటే అంత తరుగుకు డబ్బులు కట్టాల్సిందే. ఈ ప్రభుత్వంలో అడిగేవాడు లేడు. పట్టించుకునే వాళ్లే ఉండరు. ప్రశ్నిస్తే మాపై కక్షగడతారు. పంట కొనకుండా ఇబ్బంది పెడతారు. అసలు ప్రభుత్వ సొసైటీలో ప్రైవేటు వ్యక్తుల పెత్తనం ఏమిటో? తరుగు రూపంలో నేను రూ.35 వేలు ముట్టచెప్పా. తుపాన్లు వచ్చి పంట పడిపోతే పరిహారం ఇవ్వని ఈ ప్రభుత్వం.. మద్దతు ధర కల్పిస్తుందనుకోవడం అత్యాశే..!" ఇదీ మరో రైతన్న గోడు.

సాక్షి, అమరావతి: తుపాన్లు, వర్షాలు అన్నదాతలను ముంచేస్తే.. చంద్రబాబు సర్కారు వారి పొట్టగొడుతూ ఏడిపిస్తోంది! ప్రకృతి వైపరీత్యాలకు మించి రైతన్నలను దగా చేస్తోంది. ధాన్యం కొనుగోళ్లలో దళారీల దందా కొనసాగుతోంది. పంట కోసి రోజుల తరబడి ఆరబెట్టినా తేమ శాతం తగ్గలేదని కుటిల సాకులు చెబుతూ నిలువు దోపిడీకి గురి చేస్తోంది! ప్రభుత్వ ఆధ్వర్యంలో పని చేయాల్సిన కొనుగోలు కేంద్రాలు(ఆర్బీకేలు, సొసైటీలు) ఎక్కడికక్కడ అధికారపార్టీ నాయకుల కబంధ హస్తాల్లో చిక్కుకుపోయాయి. ఫలితంగా ధాన్యం అమ్ముకునేందుకు రైతులు నానా అవస్థలు పడాల్సిన దుస్థితి నెలకొంది. దళారీని దాటుకుని వెళ్లే పరిస్థితి లేక పోవడంతో అయినకాడికి విక్రయించి మౌనంగా కుమిలిపోతున్నారు. ఇది రాష్ట్రంలో ఏ ఒక్క ప్రాంతానికో ఇది పరిమితం కాలేదు. ఎన్టీఆర్, కృష్ణా జిలాల్లోని నున్న, సూరంపల్లి, మేదరపాలెం, ముస్తాబాద, ఉప్పులూరు, కంకిపాడు, చలివేంద్రపాలెం, మూర్తురాజుపాలెంతోపాటు మచిలీపట్నం హైవే, కాకినాడ, చింతలపూడిలో సోమవారం 'సాక్షి' బృందం క్షేత్రస్థాయి పర్యటనలో అన్నదాతల అగచాట్లు, దయనీయ దృశ్యాలు కళ్లకు కట్టాయి.

ఎకరాకు రూ.6 వేలు - రూ.7 వేలు నష్టం

'రైతే రాజు' నినాదాన్ని చంద్రబాబు సర్కార్ మార్చేసింది. మిల్లరే 'మహారాజు' అన్న చందంగా వ్యవస్థను దిగజార్చింది. మద్దతు ధర కల్పించడంలో ఘోరంగా విఫలమైంది. పైగా మిల్లర్లు, దళారుల దందాకు గేట్లు తెరిచి కనీవిని ఎరుగని రీతిలో మద్దతు ధర దోపిడీకి బీజం వేసింది. ధాన్యం సాధారణ రకానికి రూ.1,777, ఏ–గ్రేడ్‌కు రూ.1,792 చొప్పున మద్దతు ధర కల్పించాలి. అయితే వారాల తరబడి పంటలను ఆరబెట్టినా రైతులకు 75 కిలోల బస్తాకు రూ.400 వరకు కోత పడుతోంది. ఇదే తుపాను సమయంలో అయితే ఏకంగా రూ.500 వరకు కోత విధించారు. రోజుల తరబడి ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా మభ్యపెడుతోంది. చివరికి రైతు విసిగి వేసారి దళారీని ఆశ్రయించేలా పరోక్షంగా దోపిడీకి సహకరిస్తోంది. దీంతో రైతన్నలు ఎకరానికి సుమారు రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకు నష్టపోతున్న దుస్థితి కనిపిస్తోంది. మరోవైపు ఈ క్రాప్ నమోదు సక్రమంగా లేకపోవడంతో కౌలు రైతులు ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకోవడం మినహా గత్యంతరం లేకుండా పోయింది.

తేమ శాతంలో ఎంతో తేడా..

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు, సొసైటీల్లో వినియోగించే తేమ శాతం మిషన్ల లాంటివే మిల్లుల్లో కూడా పెట్టించామని ప్రభుత్వం చెబుతోంది. కానీ, ఆర్బీకేలో రైతు ధాన్యం శాంపిళ్లు 17 శాతం లోపు తేమ చూపిస్తుంటే, అదే ధాన్యం మిల్లుకు చేరేసరికి 21 శాతానికి పెరిగిపోతోంది. అసలు ఎందుకు ఇలా జరుగుతోంది? అనేది ప్రభుత్వం కనీసం పట్టించుకోవట్లేదు. ఫలితంగా ఒక్కో పాయింట్‌కు కేజీ చొప్పున ధాన్యాన్ని కోత వేస్తున్నారు.

విజయవాడ రూరల్ మండలం నున్న-గన్నవరం మండలం సూరంపల్లి మధ్య రహదారి వెంబడి గుట్టలుగా ధాన్యం బస్తాలు

దేశంలోనే తొలిసారిగా వైఎస్ జగన్ హయాంలో..

వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలో ఉండగా మద్దతు ధరకు ధాన్యం కొనుగోళ్లతోపాటు దేశంలో తొలిసారిగా జీఎల్‌టీ (గన్నీ బ్యాగ్స్, లేబర్ అండ్ ట్రాన్స్‌పోర్ట్) చార్జీల కింద ఎకరాకు రూ.పది వేలు చొప్పన నేరుగా రైతన్నల ఖాతాలో జమ చేసి ఆదుకోవడం గమనార్హం.

లేదంటే తరుగుకు డబ్బులు సమర్పించుకోవాల్సిందే. ఈ దందా యథేచ్ఛగా ప్రతి మిల్లులోనూ జరుగుతోంది. ఆర్బీకేలో వచ్చిన తేమ శాతాన్ని ఫైనల్‌గా గుర్తించాల్సి ఉండగా, మిల్లర్లు చెప్పిందే వేదం అవుతోంది. మిల్లుల్లో కస్టోడియన్ ఆఫీసర్లు కనీసం కంటికి కనపడటం లేదు. ఆరబెట్టిన ధాన్యాన్ని బస్తాల్లో నింపిన తర్వాత రోజుల తరబడి తరలించకపోవడంతో శీతాకాలం మంచు ప్రభావం బస్తాలపై పడుతోంది. ఫలితంగా చెమ్మ చేరి, ధాన్యం రంగుమారి రైతులు నష్టపోతున్నారు. ఇక లక్షల మంది రైతులున్న మన రాష్ట్రంలో 50 వేల టార్పాలిన్లు ఇచ్చినట్లు ప్రభుత్వం చెబుతుండగా క్షేత్రస్థాయిలో ఏ ఒక్కరికీ అందడంలేదు.

మిల్లులకు చేర్చే భారం రైతులపైనే!

ధాన్యం కొనుగోళ్లలో చంద్రబాబు ప్రభుత్వం పూర్తిగా చేతులెత్తేసింది. ఆర్బీకే సిబ్బంది షెడ్యూల్ ఇవ్వడం, శాంపిల్ పరీక్షించడం తూతూమంత్రంగా మారింది. రైతే శాంపిళ్లు పట్టుకుని ఆర్బీకేల చుట్టూ తిరగాల్సి వస్తోంది. 7.50 కోట్ల గోనె సంచులు సిద్ధంగా ఉన్నాయని చెబుతున్న ప్రభుత్వం క్షేత్రస్థాయిలో సంచుల కోసం ప్రాథేయపడేలా చేస్తోంది. ఇవన్నీ ఉంటే.. చివరకు లోడు ఎత్తడానికి వాహనాలు రావు. పేరుకు మాత్రమే ప్రభుత్వం 25 వేల రవాణా వాహనాలకు రిజిస్ట్రేషన్ చేసింది. కానీ గతేడాది డబ్బులు చెల్లించకపోవడంతో ఏ ఒక్కరూ ముందుకు రావట్లేదు. ఫలితంగానే రైతులు మిల్లుకు సొంత ఖర్చుతో లోడు తరలించాల్సి వస్తోంది. మిల్లుల దగ్గర రెండు మూడు రోజుల వరకు దిగుమతి చేసుకోకపోవడంతో వెయిటింగ్ చార్జీలు తడిసి మోపెడు అవుతున్నాయి. ఒక బస్తాలో ధాన్యం నింపడానికి రూ.20, రవాణాకు టన్నుకు సుమారు రూ.300–రూ.400 వరకు చెల్లించుకోవాల్సి వస్తోంది. ఇంత నష్టపోతున్నా ప్రభుత్వం నుంచి జీఎల్‌టీ రావట్లేదు.

నేలకొరిగిన కష్టం..!

ఇటీవల తుపాన్లు, వర్షాల ధాటికి పంట చాలా వరకు నేలకొరిగింది. ఇప్పుడు పంట కోత తలకుమించిన భారంగా మారింది. గతేడాది ఎకరా వరి పొలం మిషన్లపై కోత కోసేందుకు రూ.2,500 వ్యయం అయితే ఈ ఏడాది రూ.3,600కు పెరిగింది. నేలకొరిగిన పైరును కోయడానికి సుమారు 3 గంటలు పడుతుంది. అంటే ఎకరా నేలకొరిగిన పంట కోతకు రైతన్నలు ఏకంగా రూ.10,800 చెల్లించాల్సి వస్తోంది. ఫలితంగా రైతులపై అదనపు భారం పెరిగిపోయింది. వాస్తవానికి విత్తు వేసిన దగ్గర నుంచి కోత కోసేవరకు ఎకరానికి రూ.35 వేల నుంచి రూ.40 వేలు పెట్టుబడి ఖర్చు అవుతుంది. కానీ తీరా పంట చేతికొచ్చాక మద్దతు ధరలో కోత పెట్టడంతో చేసిన అప్పులకు వడ్డీ కూడా చెల్లించలేని పరిస్థితి నెలకొంది.

ఇది మోసం కాదా!

చంద్రబాబు ప్రభుత్వం రైతులకు పంట నష్టపరిహారం ఎగ్గొట్టేందుకు కుట్ర పూరితంగా వ్యవహరించింది. తుపాను సమయంలో పంట నష్టం నమోదు చేసిన సర్వే నంబర్లలో ధాన్యాన్ని కొనుగోలు చేయబోమని ప్రచారం చేయించింది. దీంతో ధాన్యాన్ని అమ్ముకోలేమని ఆందోళన చెందిన రైతులు పంట నష్టాన్ని తగ్గించి రాయించుకున్నారు. నాలుగు ఎకరాలు నష్టపోతే.. గత్యంతరం లేక రెండెకరాలు మాత్రమే పంటనష్టం జరిగినట్లు నమోదు చేయించుకున్నారు. తీరా ప్రభుత్వం నుంచి పంట నష్టపరిహారం రాకపోగా.. ఇప్పుడు మద్దతు ధరలో కోత పెట్టడంతో రైతులు రెండు విధాలుగా నష్టపోతున్నారు.

ఎన్ని రోజులైనా ఎండబెట్టుకోవటమే!

35 ఏళ్ల నుంచి వ్యవసాయం చేస్తున్నా ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ చూడలేదు. కౌలు రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. త్వరగా కాటా వేస్తే రైతుకు దిగులు ఉండదు. అటు చేలల్లో పని చేసుకోవాలా? ఇటు వడ్లు రోజుల తరబడి ఆరబెట్టాలా? ఏ పని చేయాలి? ఆరబోసుకోవడానికి చోటు లేదు. వర్షాలు వస్తే కాపాడుకోవడానికి, మంచులో రాశులు తడిచిపోకుండా పట్టాలు కూడా ఇవ్వట్లేదు. మా ప్రాంతంలో వడ్లు కోసి పది రోజులు అయినా మిల్లుకు చేరట్లేదు. ఎన్ని రోజులైనా ఎండబెట్టుకోవడమే సరిపోతుంది. కాటా మాత్రం వేయట్లేదు. ప్రభుత్వం ఏమో కొనట్లేదు. ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తే రేటు కోసేస్తున్నారు. ఆర్బీకేలో గోనె సంచులు అడుగుతుంటే వడ్లు ఆరితేనే ఇస్తామంటున్నారు. పంట నేలకొరిగితే కనీస పరిహారం కూడా అందించలేదు.

– కాసుల నాగేశ్వరరావు, మేదరపాలెం, విజయవాడ రూరల్ మండలం

రూ.1.10 లక్షలు నష్టపోయా..

తొలకరిలో నాలుగు ఎకరాలలో వరి సాగు చేశా. భారీ వర్షాలకు పంట దెబ్బతినడంతో ఎకరాకు 30 బస్తాలే దిగుబడి వచ్చింది. ప్రభుత్వం గిట్టుబాటు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో తీవ్రంగా నష్టపోయా. షావుకారుకు తక్కువ రేటుకు అమ్ముకున్నా. వర్షాలకు తడిసి రంగు మారిందనే నెపంతో రేటు కత్తిరించారు. దిగుబడి తగ్గడం, రేటు లేకపోవడంతో సుమారు రూ.1.10 లక్షలు నష్టపోయా.

– యాళ్ల సత్తిబాబు, కాజులూరు, కాకినాడ జిల్లా

రైతుకు భరోసా దక్కట్లేదు

మా వద్ద కొనుగోలు కేంద్రమే పెట్టలేదు. ఊరు మొత్తం వ్యాపారస్తుల చేతుల్లోనే ఉంది. దళారీ చెప్పిందే రేటు. ధాన్యం ఆరబెట్టినా బస్తాకు (75 కిలోలు) రూ.300 కోత వేస్తున్నారు. తుపానుకు పంట నేలకొరిగితే నష్టపరిహారం అందలేదు. వడ్డీలకు కూడా సరిపోవట్లేదు. దళారులు, మిల్లర్లు బాగుపడటం మినహా రైతుకు ఎక్కడా భరోసా దక్కట్లేదు.

– మహబూబ్ షరీఫ్, ముస్తాబాద, కృష్ణా జిల్లా

రేటులో కోత.. కిరాయి వాత!

మా పరిస్థితి దారుణంగా ఉంది. పంటకు గిట్టుబాటు లేదు. మిల్లరు చెప్పిన రేటుకే అమ్ముకున్నా. బస్తా లోడు చేసినందుకు రూ.20, ట్రాక్టర్ కిరాయి టన్నుకు రూ.300 వసూలు చేశారు. తుపాన్ దెబ్బకు నష్టపోయాం. మళ్లీ వాతావరణం మారితే సర్వం కోల్పోవాల్సిందే. ఆర్బీకే వాళ్లు ధాన్యాన్ని మిల్లుకు చేర్చాల్సిన బాధ్యత మాపైనే వదిలేశారు.

– శ్రీనివాసరెడ్డి, చలివేంద్రపాలెం, కంకిపాడు మండలం, కృష్ణా జిల్లా

కమీషన్ ఏజెంట్ల ఇష్టారాజ్యం

ధాన్యం కొనుగోలులో వ్యాపారులు, దళారులదే ఇష్టారాజ్యం. తేమశాతం ఎక్కువగా ఉందనే సాకుతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో వెనక్కి పంపుతున్నారు. చేసేదిలేక తక్కువ ధరకు దళారులకు అమ్ముకుంటున్నాం. బస్తా రూ.400–రూ.500 నష్టానికి అమ్ముకోవాల్సి వస్తోంది.

– దొంతా కృష్ణ, రైతు, చింతలపూడి, ఏలూరు జిల్లా

అధికార పార్టీ నేతలు బెదిరిస్తున్నారు..!



మేం ఏ పంట వేయాలి? ఎంతకు అమ్ముకోవాలి? అన్నీ వాళ్లే నిర్ణయిస్తారా? అధికారంలో ఉంటే ఏమైనా చెల్లుతుందా? 20 ఎకరాలు కౌలుకు చేస్తున్నా. ధాన్యం మిల్లుకు తరలిస్తే తేమ శాతం పేరుతో ఇబ్బంది పెడుతున్నారు. లారీ, కూలీలను మేమే పెట్టుకోవాలి. చేసేది లేక వ్యాపారికే అయినకాడికి ఇస్తున్నాం. ఆరబోస్తే కూలీల ఖర్చు తడిసిమోపెడు అవుతుంది. ఎకరాకు 35–40 (40 కిలోలు) బస్తాలు దిగుబడి వస్తుంది. సార్వాలో పంట అమ్ముకోలేని పరిస్థితి. దాళ్వాకు వెళ్దామంటే పెద్ద చెరువు ఆయకట్టు కింద సాగు చేయొద్దని అంటున్నారు. అధికార పార్టీకి చెందినవారు శివారులోని వారి పొలాల కోసం మమ్మల్ని ఆరుదల (మొక్కజొన్న) పంట మాత్రమే వేయాలని ఒత్తిడి చేస్తున్నారు. వాళ్ల పొలానికి నీళ్ల కోసం మమ్మల్ని ముంచేయాలని చూస్తున్నారు. గతంలో ఇలానే వాళ్ల మాటలు నమ్మి మొక్కజొన్న వేస్తే తూములు తెరవడంతో పొలంలో ఊట చేరి నష్టపోయాం. రైతులు అందరితో జనరల్‌బాడీ మీటింగ్ పెట్టి నిర్ణయం తీసుకోవాలంటే కుదరదట. వాళ్లు చెప్పిందే ఏకగ్రీవమని బెదిరిస్తున్నారు.

– మల్లంపల్లి ఫ్రాన్సిస్, ముస్తాబాద, విజయవాడ రూరల్ మండలం

పంటలన్నీ కొనలేం..!

వరి మనమే తినట్లేదు.. ప్రభుత్వం కొని ఏం చేస్తుంది?: సీఎం చంద్రబాబు

సాక్షి, అమరావతి: రైతులు పండించే అన్ని పంటలను ప్రభుత్వం కొనుగోలు చేయడం సాధ్యం కాదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ ఏడాది 55 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామని, వచ్చే ఏడాదీ కొనాలంటే సాధ్యం కాదన్నారు. మనం పండించే వరిని మనమే తినడం లేదని, అలాంటి వరిని ప్రభుత్వం కొనుగోలు చేసి ఏం చేస్తుందని సీఎం ప్రశ్నించారు. ఈ ఆర్థిక సంవత్సరం తొలి రెండు త్రైమాసికాల్లో జీఎస్డీపీ వృద్ధిపై సీఎం చంద్రబాబు సోమవారం సచివాలయంలో మీడియా సమావేశంలో ప్రజెంటేషన్ ఇచ్చారు. రైతులు పండించే ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు రావడం లేదన్న ప్రశ్నపై సీఎం చంద్రబాబు స్పందించారు. ఎక్కువ మంది వరి పండించడంతో ఉత్పత్తి పెరిగిందన్నారు. ఎరువులు, క్రిమిసంహారక మందులను రైతులు ఎక్కువగా వినియోగిస్తున్నారని, దీంతో వాటి కొనుగోలుకు ఎవరూ ముందుకు రావడం లేదన్నారు. 'రాబోయే రోజుల్లో వరి తినరు. బియ్యం తింటే డయాబెటిస్‌తో పాటు ఇతర జబ్బులన్నీ వస్తాయి. రైతులు కూడా ప్రజలు వినియోగించే పంటలనే సాగు చేయాలి. ఉద్యాన పంటలకు కూడా ధరల సమస్య తలెత్తింది. అరటి సాగు ఎక్కువ కావడంతో ఉత్పత్తి పెరిగి ధరల సమస్య ఉత్పన్నమైంది. ఓ రైతు 60 ఎకరాల్లో అరటి పంట వేశారు. మార్కెట్ డిమాండ్ ఆధారంగా రైతులు పంటలు సాగు చేయాలి. ఉద్యాన పంటలను కూడా ప్రభుత్వం కొనుగోలు చేయలేదు. అనంతపురంలో 51 రకాల పండ్లు పండిస్తున్నారు. అన్నీ కొనాలంటే ప్రభుత్వానికి సాధ్యం కాదు. సమతుల్యం చేసుకోవాలి. పంటల మార్పిడిపై రైతులకు అవగాహన కల్పించి చైతన్యం తెచ్చేందుకు రైతు సేవా కేంద్రాల వారీగా కార్యాచరణ తయారు చేస్తున్నాం. బిల్ గేట్స్ ఫౌండేషన్ ద్వారా రాష్ట్రంలో అగ్రిటెక్ అమలు చేస్తున్నాం' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

గత ప్రభుత్వం ఉద్యోగుల సంఖ్య పెంచేసింది

ఈ ఆర్థిక ఏడాది తొలి రెండు త్రైమాసికాల్లో జీఎస్డీపీ లక్ష్యంలో 40.64 శాతం వృద్ధి సాధించామని, మిగతా రెండు త్రైమాసికాల్లో 59.36 శాతం వృద్ధి సాధిస్తామని చంద్రబాబు చెప్పారు. గత ప్రభుత్వ చర్యల వల్ల ఆదాయం తగ్గిపోయిందంటూ మరోసారి నిందించారు. సూపర్ సిక్స్ హామీల అమలుకు, అభివృద్ధి కోసం అప్పులు చేస్తున్నామన్నారు. 18 నెలల్లో ఎన్ని అప్పులు చేశారన్న ప్రశ్నకు తరువాత జవాబు చెబుతానన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉద్యోగుల సంఖ్యను పెంచేయడంతో రాష్ట్ర సొంత ఆదాయం అంతా ఉద్యోగులు వేతనాలకే సరిపోతోందని చంద్రబాబు పేర్కొన్నారు. అవసరం లేకపోయినా ప్రభుత్వ ఉద్యోగులను నియమించారని, పునర్ వ్యవస్థీకరణ ఎలా చేయాలనేది ఆలోచిస్తున్నామన్నారు. పరకామణిలో డబ్బులు కొట్టేయడం చిన్న నేరం అనడం సరి కాదన్నారు.

కేంద్రంలో బీజేపీ తప్పు చేస్తే సత్యకుమార్‌ను అడగలేను కదా?

ఇండిగో సంక్షోభం నేపథ్యంలో పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు రాజీనామా చేయాలంటూ దేశవ్యాప్తంగా వెల్లువెత్తుతున్న డిమాండ్లపై స్పందించాలని విలేకరులు కోరగా.. ఊహించని సమస్య వచ్చిందని, దీన్ని కేంద్రం పరిష్కరిస్తోందని చంద్రబాబు పేర్కొన్నారు. బీజేపీకి చెందిన సత్యకుమార్ రాష్ట్ర మంత్రిగా ఉన్నారని, అయితే కేంద్రంలో బీజేపీ తప్పు చేస్తే సత్యకుమార్‌ను నేను అడగలేను కదా? అని చంద్రబాబు ఎదురు ప్రశ్నించారు. కేంద్ర మంత్రుల పనితీరులో తన జోక్యం ఉండదన్నారు.

సంక్రాంతి నుంచి అన్ని సేవలూ ఆన్‌లైన్‌లోనే

సంక్రాంతి నుంచి రాష్ట్ర పౌరులకు అన్ని సేవలూ ఆన్‌లైన్‌లోనే అందించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఆ దిశగా శాఖలన్నీ చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్టీజీఎస్‌పై సీఎం సోమవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజలు తమకు కావాల్సిన ప్రభుత్వ సేవలన్నీ మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అందజేస్తున్నామన్నారు. రిజిస్ట్రేషన్ల అనంతరం డాక్యుమెంట్లు కొరియర్ ద్వారా నేరుగా సంబంధిత వ్యక్తుల ఇళ్లకే పంపే ఏర్పాట్లు చేయాలన్నారు.

స్క్రబ్ టైఫస్‌తో 9 మంది మృతి

ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ వీరపాండియన్ వెల్లడి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో స్క్రబ్ టైఫస్ కేసులు ఈ ఏడాది 1,566 నమోదయ్యాయని.. ఇందులో తొమ్మిది మంది బాధితులు మరణించారని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ వెల్లడించారు. అయితే, ఈ మరణాలన్నీ స్క్రబ్ టైఫస్‌వల్లే జరిగినట్లు ఇప్పటివరకు నిర్ధారణ కాలేదన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని తన కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా స్క్రబ్ టైఫస్ బాధితులు ఎందువల్ల మరణించారనే దానిపై పరిశోధన జరగాల్సి ఉందన్నారు. ఇందుకు కనీసం రెండు నెలల నుంచి మూడునెలల సమయం పట్టే అవకాశముందని తెలిపారు. బాధితుల నుంచి సేకరించిన నమూనాలను జీనోమ్ స్వీకెన్సీ (గుంటూరు, తిరుపతి) ద్వారా పరీక్ష చేయించేందుకు కూడా చర్యలు తీసుకుంటున్నామని ఆయన చెప్పారు. బోధనాసుపత్రుల్లో ఉండే ర్యాపిడ్ రెస్పాన్స్ టీం (ఆర్ఆర్)లు అధిక కేసులు/అసాధారణ మరణాలు నమోదైన ప్రాంతాల్లో పరిశోధన చేస్తాయన్నారు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో ఆర్ఆర్ టీంలు ఉన్నాయన్నారు. ఎలీశా పరీక్ష చేయించి, స్క్రబ్ టైఫస్‌పై అవగాహనకు వస్తామన్నారు. గుంటూరు జీజీహెచ్‌లో గడిచిన 38 రోజుల్లో 26 స్క్రబ్ టైఫస్ కేసులు వచ్చాయన్నారు. ఈ సమావేశంలో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ రఘునందన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మన్యంలో స్క్రబ్ టైఫస్ కేసు

చింతూరు: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు ప్రభుత్వాస్పత్రిలో ఓ గిరిజనుడికి స్క్రబ్ టైఫస్ పాజిటివ్ కేసు నమోదైనట్లు సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి తెలిపారు. చింతూరు మండలం కొత్తపల్లికి చెందిన మడివి లక్ష్మయ్య ఈనెల 4న అధికజ్వరం, ఒళ్లునొప్పులతో సీహెచ్‌సీకి రాగా, వైద్యులు అనుమానంతో పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో అతనికి స్క్రబ్ టైఫస్ బ్యాక్టీరియా పాజిటివ్‌గా తేలింది. లక్ష్మయ్యకు చికిత్సకు అందిస్తున్నామని అతని పరిస్థితి స్థిరంగా ఉందని కోటిరెడ్డి తెలిపారు. వ్యాధి నిర్ధారణకు సంబంధించిన కిట్లు, మందులు ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నాయని ఆయన చెప్పారు.

వైద్య విద్య ప్రవేశాల్లో పారదర్శకతకు పాతర

బీడీఎస్ సీట్ల ఖాళీలు ప్రకటించకుండానే భర్తీ

సాక్షి, అమరావతి: వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాల ప్రక్రియలో పారదర్శకతకు చంద్రబాబు ప్రభుత్వం పాతర వేసింది. బీడీఎస్ సీట్లు ఎన్ని ఖాళీగా ఉన్నాయో ప్రకటించకుండానే విద్యార్థులకు కేటాయింపు చేపట్టింది. మూడో విడత బీడీఎస్ కన్వీనర్ సీట్ల కేటాయింపు ప్రొవిజనల్ లిస్ట్‌ను సోమవారం ఆరోగ్య విశ్వవిద్యాలయం ప్రకటించింది. వాస్తవానికి రెండో విడత కౌన్సెలింగ్‌లో విద్యార్థులు చేరని, వదులుకున్న సీట్ల వివరాలను తొలుత ప్రకటించాలి. ఇలా ఏ కాలేజీలో ఎన్ని సీట్లు ఖాళీగా ఉన్నాయో విద్యార్థుల ముందు ఉంచాకే తదుపరి కౌన్సెలింగ్‌లో సీట్లు కేటాయించాల్సి ఉంటుంది. ఈ ఏడాది అక్టోబర్ 23న విశ్వవిద్యాలయం రెండో విడత కౌన్సెలింగ్‌లో సీట్లు కేటాయించింది. విద్యార్థులకు ఫ్రీ–ఎగ్జిట్ అవకాశం కల్పించింది. నవంబర్ 20తోనే దేశంలో మెడికల్ యూజీ ప్రవేశాల గడువు ముగిసింది. అయితే ఎంబీబీఎస్ ప్రవేశాలను తప్పుల తడకగా చేపట్టి వాటిని సరిదిద్దుకోవడంలోనే వర్సిటీ కాలయాపన చేసింది. దీంతో తుది దశ బీడీఎస్ కౌన్సెలింగ్ చేపట్టలేదని విద్యార్థులు, తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఇదిలా ఉండగా, రెండో దశ కౌన్సెలింగ్ ముగిసిన నెలన్నర అనంతరం నేరుగా మూడో దశ కౌన్సెలింగ్ ప్రొవిజనల్ సీట్ల కేటాయింపు జాబితాను సోమవారం వర్సిటీ విడుదల చేసింది. ఖాళీల వివరాలు ప్రకటించకుండా సీట్ల కేటాయింపు చేపట్టడంపై విద్యార్థులు, తల్లిదండ్రులు అనుమానాలు, ఆరోపణలు వ్యక్తం చేస్తున్నారు. ప్రొవిజనల్ సీట్ల కేటాయింపులో అభ్యంతరాలుంటే మంగళవారం మధ్యాహ్నం 2 గంటల్లోపు తెలియజేయడానికి అవకాశం ఇచ్చారు.

సాక్షి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్నా..
మా టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ.7.00 గం.ల నుండి రా.8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం.
టోల్ ఫ్రీ నెం 1800 425 9899

క్లుప్తంగా...

శీతాకాల విడిదికి 17న హైదరాబాద్‌కు రాష్ట్రపతి రాక

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శీతాకాల విడిది కోసం ఈనెల 17న హైదరాబాద్‌కు రానున్నారు. 17 నుంచి 22 వరకు బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ఆమె విడిది చేయనున్నారు. ఈ మేరకు రాష్ట్రపతి పర్యటన షెడ్యూల్ ఖరారైంది. 19న రామోజీఫిల్మ్‌సిటీలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. 20న గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో గ్లోబల్ పీస్ కమిటీ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. 21న పలువురు ప్రతినిధులతో సమావేశం అవుతారు. అనంతరం తేనీటి విందులో పాల్గొంటారు. ఈ నెల 22న ఉదయం ఢిల్లీకి రాష్ట్రపతి బయల్దేరి వెళ్తారు.

నేటి అర్ధరాత్రి నుంచి లారీల సమ్మె

న్యూ ఆంధ్ర మోటార్ ట్రక్కర్స్ అసోసియేషన్

లబ్బీపేట(విజయవాడతూర్పు): కేంద్ర ప్రభుత్వం 12 ఏళ్లు దాటిన లారీలకు ఫిట్‌నెస్ చార్జీలను భారీగా పెంచడాన్ని నిరసిస్తూ లారీ యజమానులు మంగళవారం అర్ధరాత్రి నుంచి సమ్మె చేయనున్నట్టు న్యూ ఆంధ్ర మోటార్ ట్రక్కర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొడ్డ శేషగిరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 12 ఏళ్లు దాటిన లారీలన్నీ సరుకు రవాణాను నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. గతంలో ఫిట్‌నెస్ చార్జీలు 12 ఏళ్లు దాటిన లారీలకు రూ.900 నుంచి రూ.1400 వరకూ ఉండేదని, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం రూ.33 వేలకు పెంచేయడంతో లారీ యజమానులపై తీవ్రమైన ఆర్థిక భారం పడిందన్నారు. ఈ పెంపు ఫలితంగా ప్రజలపై అదనపు భారం పడుతుందన్నారు. రైతులకు కూడా రవాణా చార్జీలు పెరగడం వల్ల వ్యవసాయ వ్యయాలు మరింతగా అధికమవుతాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో రోడ్ల పరిస్థితి దారుణంగా ఉందని, గుంతలు ఉన్న రోడ్ల కారణంగా వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయన్నారు. వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పనిసరి చేసిన ప్రభుత్వం, వారు నిర్మించే రోడ్లకు కూడా ఫిట్‌నెస్ సర్టిఫికేషన్ ఇవ్వగలదా? అంటూ ప్రశ్నించారు.

రేపు విద్యుత్, సీడ్ బిల్లులకు వ్యతిరేకంగా ఆందోళనలు

సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యుత్, సీడ్ బిల్లులను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10వ తేదీన గుంటూరులోని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) కేంద్రం వద్ద, రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో ఆందోళనలు నిర్వహించనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ తెలిపారు. ఈ ఆందోళనల్లో రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వారు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రంలో రైతుల నుంచి చంద్రబాబు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకుండా దగా చేస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కేవలం ప్రకటనలకే పరిమితమయ్యారని విమర్శించారు.

జనవరిలో చంద్రబాబు దావోస్ పర్యటన

సాక్షి, అమరావతి: వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) సదస్సులో పాల్గొనడానికి ఎనిమిది మంది సభ్యులతో కూడిన బృందంతో సీఎం చంద్రబాబు దావోస్ వెళ్లనున్నారు. జనవరి 19 నుంచి 23 వరకు జరిగే ఈ సదస్సులో సీఎంతో పాటు పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, సీఎం కార్యదర్శి కార్తికేయ మిశ్రా, పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్, ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్, పరిశ్రమల శాఖ డైరెక్టర్ శుభం భన్సాల్, సీఎం ముఖ్య భద్రతా అధికారి తంగిరాల దత్తయశ్వంత్, సీఎం వైద్య బృందం దావోస్ వెళ్లడానికి అనుమతిస్తూ సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

11న కేబినెట్ సమావేశం

సాక్షి, అమరావతి: సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఈ నెల 11వ తేదీ ఉదయం 10.30 గంటలకు రాష్ట్ర సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో మంత్రివర్గ సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి సంబంధించిన ప్రతిపాదనలను 9వ తేదీ సాయంత్రం 4 గంటలకల్లా సాధారణ పరిపాలన శాఖ(కేబినెట్ విభాగం)కు పంపాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అన్ని శాఖలకు ఆదేశాలు జారీ చేశారు.

ఫైబర్ నెట్ కేసు విచారణ నేటికి వాయిదా

సాక్షి, అమరావతి: చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న 2014–19 మధ్య కాలంలో జరిగిన ఏపీ ఫైబర్ నెట్ కుంభకోణంపై నమోదైన చేసిన కేసును మూసివేయాలని కోరుతూ సీఐడీ దాఖలు చేసిన క్లోజర్ రిపోర్ట్‌పై విజయవాడ ఏసీబీ కోర్టు విచారణను మంగళవారానికి వాయిదా వేసింది. ఫైబర్ నెట్ కాంట్రాక్ట్ అప్పగింత వ్యవహారంలో రూ.320 కోట్ల మేర చంద్రబాబు హయాంలో అక్రమాలు జరిగాయి. దీనిపై గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఫైబర్ నెట్ చైర్మన్ గౌతంరెడ్డి ఫిర్యాదు మేరకు సీఐడీ కేసు నమోదు చేసింది. అయితే చంద్రబాబుపై నమోదు చేసిన కేసులో సాక్ష్యాలు లేవని, అందువల్ల ఆ కేసును మూసివేయాలని కోరుతూ ఏసీబీ కోర్టులో సీఐడీ క్లోజర్ రిపోర్ట్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై సోమవారం విచారణ జరగాల్సి ఉండగా, కోర్టు విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.

'విమాన' సంక్షోభంపై మంత్రి రామ్మోహన్‌ను

నిలదీసిన ఎంపీలు

ఇండిగో సమస్యపై రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీల ప్రశ్నల వర్షం

సాక్షి, న్యూఢిల్లీ: ఇండిగో సంక్షోభంపై కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడును ఎంపీలు నిలదీశారు. సంక్షోభం జరుగుతున్నా చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. టికెట్ల ధరలు రూ.50 వేలు, రూ.60 వేలు, రూ.75 వేలు, రూ.1 లక్ష ఏమిటని మండిపడ్డారు. తమ ప్రశ్నలకు మంత్రి రామ్మోహన్‌నాయుడు చెప్పిన సమాధానాలపై ఆ ఎంపీలు అసంతృప్తి వ్యక్తం చేశారు. తాము అడిగిన ప్రశ్నలకు కేంద్రమంత్రి సూటిగా సమాధానం చెప్పకుండా ఏదేదో చెబుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ రాజ్యసభ నుంచి ఇండియా కూటమి ఎంపీలు వాకౌట్ చేశారు. మరోపక్క జాతీయ మీడియాతో పాటు, అన్ని రాష్ట్రాల మీడియా ఫ్లాట్ ఫామ్‌లలో జరిగే డిబేట్స్‌లో పాల్గొంటున్న వక్తలు, నెటిజన్లు కేంద్రమంత్రి రాజీనామా చేయాలంటూ డిమాండ్ చేస్తున్నారు. సోమవారం రాజ్యసభ జీరో అవర్‌లో పౌరవిమానయానశాఖపై పలువురు ఎంపీలు ప్రశ్నలు సంధించారు. వీరిలో సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్, అన్నాడీఎంకే వారున్నారు. ఆటోమేటిక్ మెసేజ్ స్విచింగ్ సిస్టమ్ (ఏఎంఎస్ఎస్), ఎఫ్‌డీటీఎల్ నిబంధనలు, ఇండిగో సంక్షోభం, టికెట్ల ధరలు, క్యాన్సిలేషన్ రీఫండ్ తదితర సమస్యలపై ఎంపీలు ప్రశ్నలు వేశారు. వీటికి కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు మౌఖిక సమాధానమిచ్చారు. 'ఎఫ్‌డీటీఎల్ నిబంధనలను రూపొందించే ముందు మేం అందరితో చర్చించాం. నవంబర్ 1 నుంచి రెండోదశ నిబంధనలు అమల్లోకి తెచ్చాం. అవి అమల్లోకి వచ్చాక నెలవరకు సర్వీసులు సజావుగా సాగాయి. డిసెంబర్ 3 నుంచే ఈ సమస్య తలెత్తింది. ఇండిగో అంతర్గత సమస్యల వలనే ఈ సంక్షోభం ఏర్పడింది' అని చెప్పారు. ఈ సమాధానాలపై ఎంపీలు రాంజీలాల్ సుమన్, ప్రమోద్ తివారీ, డాక్టర్ తంబిదొరై తదితరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. . సంక్షోభం రాబోతోందని తెలిసి కూడా ముందే ఎందుకు అడ్డుకోలేకపోయారని నిలదీశారు. పైలెట్ రోస్టర్, క్రూ సిబ్బంది సమస్యల వల్లే విమాన సర్వీసులు రద్దయ్యాయని, తాము ప్రయాణికులకు భరోసా కల్పిస్తున్నామని మంత్రి చెప్పారు. మీరు ధరలను నియంత్రిస్తే నేను రూ.75 వేలు ఖర్చుచేసి టికెట్ ఎందుకు కొంటానంటూ అన్నాడీఎంకే ఎంపీ డాక్టర్ తంబిదొరై మంత్రిని ప్రశ్నించారు. ఇప్పటి వరకు 5,86,705 టికెట్లు క్యాన్సిల్ అయ్యాయని, వీటికి దాదాపు రూ.569 కోట్లు రీఫండ్ చేశారని మంత్రి సమాధానమిచ్చారు. తాము ఒకటి అడిగితే మంత్రి మరొకటి చెబుతున్నారంటూ ఎంపీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'దేశ వ్యాప్తంగా విమాన సంక్షోభం ఏర్పడితే దాన్ని అరికట్టడంలో కేంద్రమంత్రి పూర్తిగా వైఫల్యం చెందారు. ఎఫ్‌డీటీఎల్ నిబంధనలు రెండోదశవి నవంబర్ 1 నుంచి అమల్లోకి వస్తే డిసెంబర్ నెల మొదటి వారంలో ఇండిగో సంక్షోభం ఎందుకు ఏర్పడింది? వీటిపై మీకు ముందే తెలిసినా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదా? మేం అడిగే వాటికి మీరెందుకు సూటిగా సమాధానం చెప్పటంలేదు..' అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎంపీలు సభనుంచి వాకౌట్ చేశారు.

రామ్మోహన్‌నాయుడిపై ఆగ్రహజ్వాలలు

కేంద్రమంత్రిపై ప్రజల్లో ఇంకా ఆగ్రహజ్వాలలు తగ్గలేదు. జాతీయ మీడియాతో పాటు అన్ని రాష్ట్రాలకు చెందిన మీడియాలోను డిబేట్లు పెట్టి కేంద్రమంత్రి రామ్మోహన్ తీరును ఎండగడుతున్నారు. లక్షలాదిమంది ప్రయాణికులు అష్టకష్టాలు పడుతుంటే మంత్రికి కనిపించడం లేదా అంటూ నిలదీస్తున్నారు. ఇండిగో సంక్షోభం రాబోతుందని ముందే తెలిసినా మంత్రి మౌనంగా ఎందుకు ఉన్నారంటూ ప్రశ్నలు సంధిస్తున్నారు. ఫ్లైట్‌క్యాన్సిల్ అయినప్పుడు క్షణాల వ్యవధిలో రీఫండ్ వచ్చేలా ఎందుకు చేయలేకపోయారంటూ మండిపడుతున్నారు. దేశంలోని అన్ని విమానాశ్రయాలు.. బస్టాండ్లు, రైల్వేస్టేషన్లను తలపిస్తున్నాయని పేర్కొంటున్నారు. తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న ప్రయాణికులకు మంత్రి ఎందుకు భరోసా కల్పించలేదని నిలదీస్తున్నారు. కేంద్రమంత్రి తన పదవికి గౌరవంగా రాజీనామా చేయాలంటూ మీడియా డిబేట్లలో కూర్చున్న విశ్లేషకులు డిమాండ్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో సైతం ఈ డిమాండ్ రోజురోజుకు పెరగడం గమనార్హం. కేంద్ర మంత్రి తీరును ఎండగడుతూ ఎక్స్ వేదికగా నెటిజన్లు నిరసన వ్యక్తం చేస్తున్నారు.

4 రోజులపాటు న్యూఢిల్లీ ఇండిగో విమానాలు రద్దు

మధురపూడి విమానాశ్రయంలో వేచి ఉన్న ప్రయాణికులు

విమానాశ్రయం (గన్నవరం)/కోరుకొండ/గోపాలపట్నం: న్యూఢిల్లీ–విజయవాడ, న్యూఢిల్లీ–మధురపూడి (రాజమహేంద్రవరం) మధ్య నడిచే ఇండిగో విమాన సర్వీసులను ఈనెల 11వ తేదీ వరకు ఆ సంస్థ రద్దుచేసింది. దీంతో.. ముందుగానే టికెట్లు బుక్ చేసుకున్న ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు.. మధురపూడికి హైదరాబాద్ నుంచి ఆరు సర్వీసులు, బెంగళూరు, చెన్నై నుంచి ఒక్కో సర్వీసు నడుస్తోంది. అయితే, ఢిల్లీ సర్వీసు ఈనెల 11 వరకూ రద్దవ్వగా, మిగిలిన సర్వీసులు ఆలస్యమవుతున్నాయి. ఇక మధురపూడి టెర్మినల్‌లో టీ, కాఫీ తదితర ఆహార పదార్థాలన్నీ అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అలాగే, ఎయిర్ ఇండియా విమాన టికెట్ ధర రూ.18 వేల వరకు ఉండడంతో ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, సోమవారం విశాఖకు సంబంధించి ఏడు విమానాలు రద్దయ్యాయని ఎయిర్‌పోర్టు డైరెక్టర్ పురుషోత్తం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్, బెంగుళూరు, ఢిల్లీ వెళ్లే విమానాలు రద్దయినట్టు పేర్కొన్నారు. కాగా సోమవారం వివిధ ప్రాంతాల నుంచి శంషాబాద్‌కు రావల్సిన 58 అరైవల్ విమానాలు రద్దయ్యాయి. అక్కడి నుంచి ఆయా ప్రాంతాలకు వెళ్లాల్సిన 54 డిపార్చర్ విమానాలు కూడా రద్దు చేసినట్లు ఎయిర్‌లైన్స్ వర్గాలు వెల్లడించాయి.

జీతమో.. రామ'చంద్ర'!

జీతాల కోసం లక్షల మంది ఉద్యోగుల ఎదురుచూపు

18 శాఖల ఉద్యోగుల జీతాలు నేటికీ ఇవ్వని బాబు సర్కారు

సాక్షి, అమరావతి: ఒకరు కాదు.. వెయ్యి కాదు.. రాష్ట్రంలో ఏకంగా లక్ష మంది ఉద్యోగులు జీతాల కోసం నిరీక్షిస్తున్నారు. ఒకటో తేదీ వెళ్లిపోయి ఇప్పటికే వారం దాటిపోయింది. అయినా చంద్రబాబు సర్కారు కనికరించడం లేదు. గతంలో సమస్యల పరిష్కారం.. ఆర్థిక ప్రయోజనాల కోసం ఉద్యోగ సంఘాలు ఆందోళనలు చేసేవి. ఇప్పుడు జీతాలు కోసం ధర్నాలు చేసే పరిస్థితి వచ్చింది. ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు అందుకుని ఎన్ని నెలలో అవుతోందని ఉద్యోగులు వాపోతున్నారు.

8వ తేదీ వెళ్లినా..

రాష్ట్ర ప్రభుత్వంలోని 18 శాఖలతోపాటు జలవనరులు, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ, పబ్లిక్ హెల్త్ వంటి ఇంజనీరింగ్ విభాగాల్లోని సుమారు లక్ష మంది ఉద్యోగులకు ఈ నెల 8వ తేదీ వచ్చినా చంద్రబాబు సర్కారు జీతాలు ఇవ్వలేదు. ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు ప్రతినెలా 1వ తేదీనే వేతనాలు, పెన్షన్లు చెల్లిస్తామంటూ ఎన్నికల ముందు ప్రగల్భాలు పలికిన చంద్రబాబు ఆ హామీని నెరవేర్చడం లేదు. ఈ నెల 8వ తేదీ వచ్చినా పౌర సరఫరాలు, ప్రజారోగ్యం, చక్కెర–డైరెక్టరేట్, సర్వే విభాగం, వ్యవసాయం, ప్రణాళిక, పరిశ్రమలు, సహకార, రవాణా, సమాచార, ఈఎస్ఐ, ఆర్ అండ్ బీ, గనులు–భూగర్భ, ఎన్‌సీసీ, పశుసంవర్ధక, గిరిజన సంక్షేమ, బీసీ శాఖల్లో ఉద్యోగులకు జీతాలు అందకపోవడంతో వారంతా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జగన్ హయాంలో ఇలా ఎదురుచూడలేదు

వైఎస్సార్‌సీపీ హయాంలోనే ఉద్యోగులకు వేతనాలు మెరుగ్గా వచ్చాయని, 8వ తేదీ వరకు వేతనాల కోసం ఎదురు చూడలేదని ఉద్యోగులు స్పష్టం చేస్తున్నారు. గతంలోని చంద్రబాబు పాలనలో ఉద్యోగులపై ఎప్పుడూ సానుకూలత ఉండేది కాదని.. ఇప్పుడు మళ్లీ అదే తరహాలో చంద్రబాబు వ్యవహరిస్తున్నారనే అభిప్రాయాన్ని ఉద్యోగులు వ్యక్తం చేస్తున్నారు. కొన్ని శాఖలకు ఈ నెల 3న వేతనాలు చెల్లించారని, 8వ తేదీ వచ్చినా 18 శాఖల్లో పనిచేసే ఉద్యోగులకు వేతనాలు చెల్లించకపోవడం ఉద్యోగుల పట్ల వివక్ష చూపడం కాదా అని ఉద్యోగ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. ఉద్యోగులను విభజించి కొంతమంది ఉద్యోగులకు ముందుగా.. మరికొందరికి ఆలస్యంగా జీతాలు చెల్లించడం చంద్రబాబు ప్రభుత్వంలోనే చూస్తున్నామని వాపోతున్నారు.

ఈఎంఐలు కట్టేందుకు ఇబ్బందులే..

జీతాలు అందకపోవడంతో పాలు పోసే వ్యక్తి నుంచి కిరాణా కొట్టులో బాకీ వరకు.. ప్రతి ఖర్చుకూ ఎలా సర్దుబాటు చేయాలో తెలియక ఉద్యోగులు, ఉపాధ్యాయులు మదనపడుతున్నారు. ఒకటో తేదీ జీతం వస్తుందనే ఉద్దేశంతో ప్రభుత్వ ఉద్యోగుల్లో చాలా మంది రుణ వాయిదాలను ప్రతినెలా 5వ తేదీలోపే పెట్టుకున్నారు. సకాలంలో జీతాలు రాకపోవడంతో వాయిదాలకు వడ్డీ కింద ప్రతినెలా రూ.600 నుంచి రూ.1,500 వరకు అదనంగా చెల్లించాల్సి వస్తోంది. మందులు కొనుక్కునేందుకు అప్పులు చేయాల్సి వస్తోందని పింఛనర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈఎంఐలు సకాలంలో చెల్లించకపోతే ఉద్యోగులను బ్యాంకులు డిఫాల్టర్లుగా చూస్తాయని, భవిష్యత్‌లో రుణాలు ఇవ్వడానికి ఇది మచ్చగా మిగులుతుందని ఆందోళన చెందుతున్నారు.

రూ.3 వేల కోట్లు అప్పు తెచ్చి ఏం లాభం

రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 2న రూ.3 వేల కోట్లను అప్పు చేసినప్పటికీ 8వ తేదీన కూడా జీతాలు ఇవ్వకపోతే ఏం లాభమని, ఆ డబ్బంతా ఏమైందని ఉద్యోగ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. గత నెల వరకు ఉపాధ్యాయులకు ఏ నెలలోనూ 1వ తేదీన జీతాలు ఇవ్వలేదు. ఉపాధ్యాయులు వేతనాల కోసం పలుసార్లు రోడ్లెక్కాల్సి వచ్చింది. దీంతో ఈ నెల 3న ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించారు. రాష్ట్ర సచివాలయ ఉద్యోగులకు ముందుగా వేతనాలు చెల్లిస్తూ.. మిగతా ఉద్యోగులకు విడతల వారీగా 10వ తేదీ వరకు చెల్లించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

చిరుద్యోగులకూ ఎదురుచూపులే

చంద్రబాబు ప్రభుత్వంలో చిరుద్యోగులు వేతనాల కోసం ప్రతినెలా ఎదురు చూపులే మిగులుతున్నాయి. 104 ఉద్యోగులు, కాంట్రాక్ట్ లెక్చరర్లు, హోంగార్డులు, వీఆర్ఏలు, ఆరోగ్య మిత్రలు వేతనాల కోసం రోజుల తరబడి ఎదురుచూస్తూనే ఉన్నారు. వారంతా జీతాలు చెల్లించాలని ప్రతినెలా ప్రభుత్వాన్ని అడుక్కోవాల్సిన దుస్థితి నెలకొంది.

డీఏ బకాయిల సంగతేమిటో మరి

2019 ఎన్నికల ముందు చంద్రబాబు ప్రభుత్వం డీఏలకు పోస్టు డేటెడ్ జీవోలను జారీ చేసిందని ఉద్యోగులు గుర్తు చేస్తున్నారు. డీఏలకు పోస్ట్ డేటెడ్ జీవోలను జారీ చేసే ఆనవాయితీని చంద్రబాబు ప్రభుత్వమే తీసుకువచ్చిందని, అప్పటివరకు ఏ ప్రభుత్వం పోస్ట్ డేటెడ్ జీవోలు ఇవ్వలేదని ఉద్యోగులు గుర్తు చేస్తున్నారు. వచ్చే జనవరితో కలిపి చూస్తే చంద్రబాబు ప్రభుత్వం 5 డీఏలు బకాయిలుంటే ఎట్టకేలకు ఒక డీఏను మంజూరు చేసి ఆ బకాయిలను మూడు వాయిదాల్లో చెల్లిస్తామని జీవోలో పేర్కొనడాన్ని ఉద్యోగులు గుర్తు చేస్తున్నారు.

ఈ హామీల సంగతేమిటో!

ఎన్నికల సందర్భంగా ఉద్యోగులకు చంద్రబాబు ఇచ్చిన హామీలను ఏడాదిన్నరైనా అమలు చేయకుండా ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. అధికారంలోకి రాగానే ఐఆర్ ఇస్తానని, పీఆర్సీ వేస్తానని, బకాయిలన్నీ వీలైనంత త్వరగా చెల్లిస్తానని, ఓపీఎస్‌ను–జీపీఎస్‌ను సమీక్షించి మెరుగైన సీపీఎస్ విధానాన్ని తీసుకొస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఏడాదిన్నరైనా ఉద్యోగులకు ఐఆర్ ప్రకటించలేదు. పీఆర్సీ వేయలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎన్నికల ముందే పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేసి కమిషనర్‌ను కూడా నియమించింది. చంద్రబాబు అధికారంలోకి రాగానే పీఆర్సీ కమిషనర్‌తో రాజీనామా చేయించారు. ఇప్పటికీ పీఆర్సీని ఏర్పాటు చేయకుండా.. కమిషనర్ నియమించకుండా కాలయాపన చేస్తున్నారు. మరోపక్క ఉద్యోగులకు రూ.31 వేల కోట్లు బకాయిలను చెల్లించకుండా వాయిదాలు వేస్తూ వస్తున్నారు.

జీతాలు రాక ఈఎంఐలు కట్టలేకపోతున్నారు

అప్పుడే ఎనిమిదో తేదీ వచ్చేసింది. ఇంతవరకు జీతాలు రాక చిరుద్యోగులు చాలా ఇక్కట్లకు గురవుతున్నారు. ప్రతి నెలా మొదటి వారంలో ఈఎంఐలు చెల్లించాలి. అవి చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ప్రతి నెలా మొదటి వారమే జీతాలు విడుదల చేయాలి.

– గుద్దటి రామ్మోహనరావు, అధ్యక్షుడు, ఏపీఎన్‌జీజీఓ, కాకినాడ

వేతన కష్టాలు మొదలయ్యాయి

ఉద్యోగులకు వేతన కష్టాలు మొదలయ్యాయి. దాదాపు అన్ని శాఖల్లో ఈ నెల ఇప్పటి వరకు జీతాలు పడలేదు. 5వ తేదీలోగా వేతనం అందకపోతే చాలా ఇబ్బందులు వస్తాయి. లోన్ల ఈఎంఐలు ప్రతినెలా 5వ తేదీలోగా కచ్చితంగా కట్టాల్సి ఉంటుంది.

– ఎన్.దివాకర్‌రావు, రెవెన్యూ ఉద్యోగుల సంఘం అనంతపురం జిల్లా అధ్యక్షుడు

ప్రభుత్వ ఉద్యోగులపై చిన్నచూపు తగదు

ప్రభుత్వ ఉద్యోగులతో సర్కారు ఆటలాడుకుంటోంది. వారిని చిన్నచూపు చూస్తోంది. సమయానికి జీతాలు వేయకపోతే ఉద్యోగుల జీవనం సాగేదెలా? ఇప్పటివరకు నాకు తెలిసి 15 డిపార్ట్‌మెంట్లకు జీతాలు పడలేదు. గతంలో 1వ తేదీనే జీతం ఇస్తామని ప్రభుత్వం చెప్పింది. 8వ తేదీ వచ్చినా జీతాలు జమ చేయకపోవడంతో ఉద్యోగుల కుటుంబాలు పస్తులుండాల్సి వస్తోంది. ప్రభుత్వం వెంటనే జీతాలను జమ చేయాలి.

– గిరి కుమార్ రెడ్డి, ఏపీజేఏసీ మాజీ జిల్లా అధ్యక్షుడు, కర్నూలు

దేశ ప్రతిష్టను దెబ్బతీసిన మంత్రి రామ్మోహన్‌నాయుడు

- **ఇండిగో సంస్థ సంక్షోభంలో ఉంటే ఏం చేస్తున్నారు**
- **కేంద్ర మంత్రిగా రామ్మోహన్‌నాయుడు అసమర్థత బయటపడింది**
- **వైఎస్సార్‌సీపీ జాతీయ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్**

రాజమహేంద్రవరం సిటీ: ఇండిగో విమానయాన సంస్థ ఆంతరంగిక సమస్యల కారణంగా కొన్ని వేల మంది ప్రయాణికులు ఇక్కట్లకు గురవుతుంటే కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు దేశ ప్రతిష్టను దెబ్బతీసేలా ప్రవర్తించారని వైఎస్సార్‌సీపీ జాతీయ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ ధ్వజమెత్తారు. తెలుగువారి గౌరవాన్ని మంటగలిపారని మండిపడ్డారు. కేంద్ర మంత్రిగా రామ్మోహన్‌నాయుడు అసమర్థత బయట పడిందని చెప్పారు. భరత్‌రామ్ సోమవారం రాజమహేంద్రవరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఇండిగో సంస్థలో అంతర్గత సమస్యలు, పైలట్‌లు, సిబ్బంది కొరత ఉన్నప్పటికీ, రామ్మోహన్ నాయుడు పట్టించుకోకపోవడం, పరిష్కరించకపోవడం సిగ్గు చేటని చెప్పారు. రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ఈ సమస్యను పర్యవేక్షిస్తున్నారు అని చెప్పడం రామ్మోహన్‌నాయుడు అసమర్థతను బయట పెట్టిందని అన్నారు. కేంద్ర మంత్రి వ్యవహారంలో రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ పాత్ర ఏమిటో అర్థం కావడం లేదని చెప్పారు. దేశవ్యాప్తంగా రోజూ వందలాది ఇండిగో సర్వీసులు రద్దవుతున్నా మంత్రి ఏమి చేస్తున్నారని నిలదీశారు. నిబంధనల ప్రకారం ఇండిగోకు మరో 900 మంది పైలట్లు ఉండాలని, కానీ ఉన్న వారితోనే వెట్టి చాకిరీ చేయిస్తున్నారని ధ్వజమెత్తారు. నిబంధనలను పట్టించుకోని ఇండిగో సంస్థ విషయంలో పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఏమి చేస్తోందో ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. విమానాల రద్దుతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. షిల్లాంగ్‌లో భర్త చనిపోయిన మహిళ శవపేటికతో ఎయిర్‌పోర్టులోనే 48 గంటలు నిలిచిపోవడం దారుణమైన విషయమని అన్నారు. విమానాల రద్దుతో అనేక మంది ఆన్‌లైన్‌లో పెళ్లిళ్లు చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని ధ్వజమెత్తారు. రష్యా అధ్యక్షుడు ఇండియా పర్యటనలో ఉన్న సమయంలో ఈ రకమైన పరిస్థితి ఏర్పడటం మరింత దారుణమని భరత్‌రామ్ చెప్పారు.

విమానయాన రంగం గందరగోళానికి మంత్రి రామ్మోహన్ వైఫల్యమే కారణం

- **కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలి**
- **మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం**

ఆమదాలవలస: కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిగా టీడీపీ నేత కింజరాపు రామ్మోహన్‌నాయుడు విఫలమవడం వల్లే దేశవ్యాప్తంగా విమానయాన రంగంలో గందరగోళం నెలకొందని మాజీ స్పీకర్, వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం జిల్లా పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయకర్త తమ్మినేని సీతారాం చెప్పారు. ఆయన సోమవారం శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలసలో విలేకరులతో మాట్లాడుతూ.. ఇండిగో సంస్థలో పరిస్థితిని రామ్మోహన్‌నాయుడి మంత్రిత్వ శాఖ ముందే అంచనా వేయలేకపోవడం ఘోర వైఫల్యమని మండిపడ్డారు. రామ్మోహన్ నాయుడికి తన శాఖపై పట్టు, అవగాహన లేకపోవడం ఈ సంక్షోభానికి కారణాలుగా చెప్పవచ్చున్నారు. దేశీయ విమానయానంలో 60 శాతం వాటా ఉన్న ఇండిగో రోజూ వందలాది విమానాలను రద్దు చేయడంతో వేలాది ప్రయాణికులు ఎయిర్‌పోర్టుల్లో చిక్కుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వైమానిక రంగాన్ని నడపలేకపోతోందని, టికెట్ ధరలు అమాంతం పెరిగినా, ఫేర్ కంట్రోల్ విధించడంలో కేంద్ర మంత్రిత్వ శాఖ వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని తెలిపారు. ప్రజలు ఇబ్బందుల్లో పడ్డాకే సమావేశాలు పెట్టడం అంటే ఇది రియాక్టివ్ అడ్మినిస్ట్రేషన్ అని తమ్మినేని మండిపడ్డారు. దేశ ప్రతిష్ట అంతర్జాతీయ స్థాయిలో దెబ్బ తిన్నా, కేంద్ర మంత్రి స్పందించకపోవడం బాధాకరమని అన్నారు. పెరుగుతున్న విమానయాన రంగానికి అనుగుణంగా భద్రత, పర్యవేక్షణ వ్యవస్థలు బలోపేతం కాకపోవడం పెద్ద ప్రమాదకర సంకేతమని హెచ్చరించారు. కనీస పర్యవేక్షణ చేయలేని మంత్రిత్వ శాఖ వల్లే విమానయాన రంగం ఈ స్థాయిలో అవమానానికి గురైందని చెప్పారు. ప్రధాని ఈ సంక్షోభంపై సమీక్ష సమావేశం పెట్టి, ఆ శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడిని పిలవకపోవడంతో రాష్ట్రం పరువు పోయిందన్నారు. మంత్రి పదవికి రామ్మోహన్‌నాయుడు వెంటనే రాజీనామా చేయాలని, లేకుంటే ప్రధాన మంత్రి ఆయన్ని పదవిలోంచి తొలగించాలని డిమాండ్ చేశారు. లోకేశ్ బాబు రివ్యూ చేసి సమస్య పరిష్కరిస్తారని టీడీపీ నేతలు చెప్పడం కేంద్ర మంత్రి చేతకానితనానికి నిదర్శనమని అన్నారు.

రూ.1.11 కోట్ల విలువైన గంజాయి పట్టివేత

ఐదుగురు అరెస్ట్

భద్రాచలం అర్బన్: ఏపీలోని మోతుగూడెం నుంచి మహారాష్ట్రలోని షోలాపూర్‌కు తరలిస్తున్న 222 కేజీల గంజాయిని భద్రాచలం పోలీసులు ఆదివారం రాత్రి పట్టుకున్నారు. ఈ మేరకు భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు సోమవారం వివరాలు వెల్లడించారు. భద్రాచలంలో ఆదివారం సాయంత్రం టౌన్ ఎస్ఐ సతీశ్ సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీలు చేస్తుండగా కూనవరం వైపు నుంచి వస్తున్న ఓ వాహన డ్రైవర్ పోలీసులను చూసి వెనక్కు తిప్పి పారిపోయేందుకు ప్రయత్నించాడు. దీంతో పోలీసులు ఆ వాహనాన్ని వెంబడించి పట్టుకోగా.. అందులో 110 ప్యాకెట్ల గంజాయి పట్టుబడింది. దాని విలువ రూ.1,11, 48,300 ఉంటుందని, గంజాయి తరలిస్తున్న కూరపాటి బుచ్చయ్య, కలుముల రమేశ్, షేక్ షఫీవుద్దీన్, మహమ్మద్ మోసీ, ప్రీతం పాత్రో సహా గంజాయి విక్రయించిన, కొనుగోలు చేస్తున్న వ్యక్తులను అరెస్ట్ చేసినట్లుగా ఎస్పీ వివరించారు.

నాలుగు విమానాలకు బాంబు బెదిరింపులు

శంషాబాద్: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి బాంబు బెదిరింపుల బెడద తగ్గడం లేదు. ఆదివారం అర్ధరాత్రి వచ్చిన ఓ మెయిల్‌లో మూడు వేర్వేరు విమానాలకు బాంబు బెదిరింపులు రావడంతో శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అధికారులు అప్రమత్తమయ్యారు. నీలకొండ రంజిత అనే ఐడీతో ఈనెల 6 మదీనా విమానానికి బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. తిరిగి అదే మెయిల్ ఐడీతో వచ్చిన ఈ సందేశాల్లో ఫ్రాంక్‌ఫర్ట్ నుంచి వచ్చే లుఫ్తాన్సా ఎయిర్‌లైన్స్ ఎల్‌హెచ్–752 విమానంతో పాటు లండన్ నుంచి వచ్చే బీఏ 277 విమానం, కేరళలోని కన్నూర్ నుంచి వచ్చే ఇండిగో 6ఈ–7178 విమానాలు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అయ్యే సమయంలో మానవబాంబులతో పేల్చివేయనున్నట్లు సందేశం ఉంది. అప్రమత్తమైన అధికారులు వెంటనే బీటీఏసీ (బాంబ్ థ్రెట్ అసెస్‌మెంట్ కమిటీ) వేసి విస్తృత బందోబస్తు ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టారు. ఇండిగో, లుఫ్తాన్సా విమానాలు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో సురక్షితంగా ల్యాండయ్యాయి. తెల్లవారుజామున బీఏ–277 విమానం కూడా సురక్షితంగా ల్యాండ్ అయినప్పటికీ విమానాలను ప్రత్యేక ప్రదేశంలోకి తీసుకెళ్లి పూర్తిగా పరిశీలించి ఐసోలేషన్ చేపట్టారు. కాగా సోమవారం రాత్రి మరోబాంబు బెదిరింపు ఈ మెయిల్ వచ్చింది.

సాక్షి ఉద్యోగ అవకాశాలు

GALGOTIAS UNIVERSITY
(Under the Uttar Pradesh Private Universities Act No. 12 of 2019)
NAAC A+
Accreditation in First Cycle
DEANS / ASSOCIATE DEANS
PROFESSORS / ASSOCIATE PROFESSORS / ASSISTANT PROFESSORS
SCHOOL OF BUSINESS
With Following Specialisations:
- Marketing
- Finance & Accounting
- Operations Management
- Business Analytics & IT
- Marketing & Automobile
- Logistics and Supply Chain Management
- Quantitative Techniques
- Human Resource
- Healthcare

Eligibility Conditions:
PROFESSOR- Ph.D. with 10 years experience in the relevant discipline or equivalent industry experience.
ASSOCIATE PROFESSOR- Ph.D. with 8 years experience in the relevant field.
ASSISTANT PROFESSOR- Post Graduate in relevant discipline. Ph.D. candidates will be preferred.
Interested candidates should email their resume within 15 days of this advertisement at the following:
Director HR
GALGOTIAS UNIVERSITY
www.galgotiasuniversity.edu.in
E-mail: recruitments.sob@galgotiasuniversity.edu.in
Plot No. 2, Sector-17A, Yamuna Expressway,
Distt Gautam Buddh Nagar, Uttar Pradesh.
Phone No.: 0120-4806860

జీవితంలో మీరేం చేసినా మీకు సంతృప్తిగా, సంతోషంగా ఉండాలి.
– తొలి ఫొటో జర్నలిస్టు హోమై వ్యారవాలా

సాక్షి
మంగళవారం, 9 డిసెంబర్ 2025

నిర్లక్ష్యం మంటలు!

ఎక్కడ ఎలాంటి ఉపద్రవాలు చోటుచేసుకుంటున్నా నిర్లిప్తంగా, నిమిత్తమాత్రంగా మిగిలిపోతున్న వ్యవస్థలున్నచోట మరో ఘోరం జరిగిపోయింది. గోవాలోని అర్పోరా గ్రామ సమీపంలో ఆదివారం వేకువజామున ఒక నైట్ క్లబ్‌లో చెలరేగిన మంటల్లో చిక్కుకుని, పొగతో ఊపిరాడక 25 మంది కన్నుమూశారు. మరో ఆరుగురు గాయపడ్డారు. రెండేళ్లుగా ఎలాంటి అనుమతులూ, లైసెన్సులూ లేకుండా అక్కడ వ్యాపారం సాగుతున్నా నిమ్మకు నీరెత్తినట్టున్న ప్రభుత్వం ఇప్పుడు సంతాపం ప్రకటించి, నష్టపరిహారం వాగ్దానం చేసింది. ఈ క్లబ్ నిర్మాణాన్ని గ్రామ పంచాయతీ సకాలంలో పసిగట్టి 2023 డిసెంబర్‌లో నోటీసులు జారీచేసింది. పర్యావరణపరంగా అది అత్యంత సున్నితమైన ప్రాంతం గనుక అక్కడ ఎలాంటి నిర్మాణాలూ జరపరాదని తెలిపింది. 2024 ఏప్రిల్‌లో దాన్ని కూల్చేయాలంటూ నోటీసులిచ్చింది. అటుతర్వాత ఏం జరగాలో అదే జరిగింది. స్థల యజమాని పంచాయతీరాజ్ డిప్యూటీ డైరెక్టర్ వద్ద అప్పీల్ చేశాడు. ఆ వెంటనే స్టే జారీ అయింది. మొన్న ఆగస్టులో బీజేపీ సభ్యుడు సంకల్ప్ అమోంకర్ దీన్ని అసెంబ్లీలో లేవనెత్తారు. ఉప్పు మడులు, పంటపొలాలు ఉన్నచోట యథేచ్ఛగా, చట్టవిరుద్ధంగా నైట్ క్లబ్‌లు నిర్మిస్తున్నారని ఆయన ఆరోపించారు. కానీ జరిగిందేమీ లేదు. అధికారులపై చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ అంటున్నారు. మంచిదే. కానీ శాసనసభలో ప్రస్తావనకొచ్చి మూణ్ణెల్లు దాటుతున్నా చేసిందేమిటి?

మంటలు ఆర్పడానికొచ్చిన అగ్నిమాపక వాహనాలు 400 మీటర్ల అవతలే నిలిచిపోవాల్సి వచ్చిందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉన్నదో ఊహించవచ్చు. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో చేరుకున్నా చాలాసేపు నిస్సహాయంగా ఉండిపోవాల్సి వచ్చింది. శనివారం రాత్రి 11.30 ప్రాంతంలో డీజేల హోరుమధ్య బెల్లీ డ్యాన్స్ కార్యక్రమం సాగుతుండగా మంటలు అంటుకున్నాయి. ఆ సమయంలో బాణాసంచా కాల్చడం, అలంకరణ కోసం పైకప్పుపై వెదురు, ఫైబర్, గడ్డి వగైరాలతో చేసిన నిర్మాణంపై ఆ నిప్పురవ్వలు పడటం వల్ల ప్రమాదం జరిగిందని చెబుతున్నారు. ఆ సమయానికి బయటకు పోయేందుకు ఉన్న ఒకే ఒక తోవ ఇరుగ్గా ఉండటంతో బయటపడటం కష్టమైందనీ, దాంతో కొందరు బేస్‌మెంట్‌వైపున్న మెట్లు దిగారనీ, అటు వెళ్లినవారంతా దట్టమైన పొగ వ్యాపించటంతో ఊపిరాడక చనిపోయారనీ ప్రత్యక్ష సాక్షుల కథనం. క్లబ్ నిర్మించాక అగ్నిమాపక సిబ్బంది, ఇతర అధికారులు దాన్ని సందర్శించి ఉంటే ఇలాంటి విషాదాన్ని ముందే ఊహించేవారు. ఎక్కడెక్కడ వెలుపలికి పోయే మార్గాలుండాలో, మంటలు ఆర్పటానికి తోడ్పడే పరికరాలను ఎక్కడ అందుబాటులో ఉంచాలో సూచించేవారు. మంటల కారణంగా విద్యుత్ నిలిచిపోయాక ఆ ప్రాంతమంతా గాఢాంధకారం అలుముకుని తొక్కిసలాట చోటుచేసుకుందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. గోవాలో క్లబ్‌ల కొచ్చేవారిలో అత్యధిక శాతం యువత. విదేశీయులతోపాటు వేర్వేరు రాష్ట్రాల్లో కార్పొరేట్ సంస్థల్లో పనిచేసేవారు వారాంతంలో బృందాలుగా గోవాకు వస్తుంటారు. ఎంతో బంగారు భవిష్యత్తుగల ఈ యువత కారణంగా కోట్లాది రూపాయల వ్యాపారం సాగించే క్లబ్‌లు కనీస రక్షణ చర్యలు తీసుకోవటంలో విఫలం కావటం, పన్నుల రూపంలో ఆదాయాన్ని ఆర్జించే ప్రభుత్వం కూడా పట్టనట్టు వ్యవహరించటం దుర్మార్గం. ఇలాంటి క్లబ్బుల్లో అడపా దడపా ప్రమాదాలు చోటుచేసుకుంటున్న ఉదంతాలు ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో బయటపడుతున్నాయి. అయినా ముందు జాగ్రత్తలు లేవు.

పాశ్చాత్య విష సంస్కృతిని అరువు తెచ్చుకుని వ్యాపారం సాగించటం ఈ బాపతు క్లబ్బుల బతుకుతెరువు. మద్యం ఏరులై పారే, జూదం చోటుచేసుకునే ఇలాంటి వాటిని నడవనీయరాదన్న ఉన్నతాశయం ప్రభుత్వాలకు ఎటూ ఉండటం లేదు. కనీసం వాటిని నియంత్రించటమైనా తమ బాధ్యతగా భావించకపోవటం విషాదకరం. క్లబ్బులే కాదు... ఆకాశాన్ని తాకే భవంతులు సైతం ఎలాంటి ప్రమాణాలూ పాటించకుండానే నిర్మాణమవుతున్నాయి. అసలు మన దేశంలో అగ్నిమాపక వ్యవస్థ అత్యంత నాసిరకమైనది. అగ్నిమాపక కేంద్రాలు తక్కువ. అక్కడి సిబ్బంది వాడే పరికరాలు, వాహనాలు చాలా భాగం కాలం చెల్లినవి. కనీసం తాజా ఉదంతమైనా పాలకుల కళ్లు తెరిపిస్తుందా? ఆ రంగం సమూల ప్రక్షాళనకు పురిగొల్పుతుందా?

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** బ.పంచమి రా.8.02 వరకు, తదుపరి షష్ఠి, **నక్షత్రం:** పుష్యమి ఉ.8.34 వరకు, తదుపరి ఆశ్లేష, **వర్జ్యం:** రా.9.31 నుండి 10.41 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.32 నుండి 9.16 వరకు, తదుపరి రా.10.34 నుండి 11.26 వరకు, **అమృత ఘడియలు:** లేవు.

సూర్యోదయం: 6.22
సూర్యాస్తమయం: 5.22
రాహుకాలం: ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం: ఉ.9.00 నుండి 10.30 వరకు

సోషల్ టాక్

తగ్గాలా?

బరువు తగ్గటానికి మీరు స్టార్ కిడ్ కానవసరం లేదు. ఖర్చు చేయటానికి మీ దగ్గర చాలా డబ్బు ఉండనవసరం లేదు. వ్యాయామాన్ని మీ రోజువారీ అలవాటుగా మార్చుకోండి. మీ స్పృహలో లేకుండానే అదొక తప్పనిసరి పనిగా అలవాటవ్వాలి. బరువు తగ్గేందుకు అది చాలు.

– సప్నా వ్యాస్, లైఫ్ స్టైల్ కోచ్

ప్రార్థన



నాట్యం నాకు దైవ ప్రార్థన వంటిది. పెదవులతో ఆ సర్వశక్తి సంపన్నుడైన పేరును పలుకుతూ, స్తుతిస్తాం కదా ; అలాగే నేను నాట్యంతో భగవన్నామ స్మరణ చేస్తాను. అప్పుడది బాహ్య నృత్యం మాత్రమే కాదు, అంతర్ నృత్యం కూడా అవుతుంది. అదొక పారవశ్య స్థితి.

– మంజరీ చతుర్వేది, కథక్ డ్యాన్సర్

ద్వారాలు

బిజినెస్‌లో మీరు సాల్వ్ చేసే ప్రతి సమస్యా అలాంటి మరో మూడు సమస్యల్ని ముందుకు తెచ్చిపెడుతుంది! నిరంతరం పరిష్కారాలు అవసరం అవుతూనే ఉండే రంగం ఇది. సమస్యల్ని అవాంతరాలుగా చూడకూడదు. అభివృద్ధికి ద్వారాలనుకుని, వాటిలోకి ప్రవేశించాలి.

– జయ్ కోటక్, 'కోటక్811' కో–హెడ్

సంక్షోభాలు

మనకున్న ఏకైక గ్రహం ఇదే. ఇది మూడు సంక్షోభాల మధ్యలో ఉంది. కాలుష్యం, వాతావరణ మార్పులు, జీవవైవిధ్యానికి ముప్పు. ఇవి మన ఆరోగ్యాన్ని, కుటుంబాలను, భవిష్యత్తును ప్రభావితం చేస్తాయి. ఇక్కడ ఏమీ జరగటం లేదన్నట్లు ఎంతకాలం నటిస్తాం?

– దియా మీర్జా, నటి

నేర్చుకోండి

రాబోయే 12 నెలల్లో, బహుశా ఆ తర్వాత కూడా 'కొత్తది నేర్చుకోవటం' అన్నది ఏఐ రంగంలో రాజ్యం ఏలబోతోంది! ఈ రోజు నేర్చుకున్నది రేపటికి పనికి రాదు. నిరంతరం నేర్చుకుంటూనే ఉండాలి. జ్ఞానం కంటే కూడా ఇప్పుడు, నేర్చుకోగల సామర్థ్యం కీలకమైనది.

– రాజేష్ నంబియార్, 'నాస్కామ్' ప్రెసిడెంట్

పోలిక

మీ ఫిట్‌నెస్‌ను ఒకరితో పోల్చి చూసుకోవద్దు. సోషల్ మీడియాలో మీరు చూసేవన్నీ నిజం కాదు. మీరెవరితోనూ పోటీపడటం లేదని గుర్తించండి. మీరు వర్సెస్ మీరు. అంతే! మరొక మాట.. ఆరోగ్యకరమైన జీవనశైలి శ్రమతో కూడుకున్నదిగా ఉండకూడదు.

– డినో మోరియా, మాజీ సూపర్ మోడల్

గెలవాలంటే మాయం కావాలి!

విశ్వ గురు

అమెరికాలోని ప్రిన్స్‌టన్ విశ్వవిద్యాలయ పట్టభద్రుల బ్యాచ్‌ను ఉద్దేశించి రచయిత, పాడ్‌కాస్టర్, లైఫ్ కోచ్ జయ్ శెట్టి చేసిన ప్రసంగ సంక్షిప్త పాఠం:

ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి పట్టభద్రులైన మీ అందరికీ అభినందనలు! నేను నా స్నాతకోత్సవానికి హాజరు కాలేదు. ఎందుకంటే, నేను సన్యాసిని కావాలనుకున్నా. సాధారణంగా, భారతదేశం నుంచి ఇక్కడకు వలస వచ్చేవారు ఎవరైనా డాక్టరు, లాయరు కావాలనుకుంటారు. లేదా దేనికీ కొరగాకుండా పోతారు. అందుకే మా అమ్మానాన్న నా మానసిక స్థితిపై ఆందోళనపడ్డారు. కానీ, దాన్ని బయటకు కనిపించనీయలేదు. 'వై వుయ్ మేక్ బ్యాడ్ డెసిషన్స్' అనే శీర్షికతో డ్యాన్ గిల్బర్ట్ రాసిన పుస్తకాన్ని నాకు పంపించారు. కాకతాళీయంగా, ఆయన కూడా ప్రిన్స్‌టన్ నుంచి పీహెచ్‌డీ చేసినాయనే! కనుక నా జీవితంలో ఒక చక్రభ్రమణం పూర్తయిందనుకుంటున్నాను. మీ విలువైన కాలానికి తగ్గ విలువైన అంశాలనే చెప్పగలనని ఆశిస్తున్నాను. ఈ ధైర్యం నాకు చిన్నప్పుడు లేదు.

స్వశక్తిపై సందేహాలు సహజమే!

ఎనిమిదేళ్ళ వయసులో మొదటిసారి దీపావళి సందర్భంగా స్కూల్లో స్టేజీ ఎక్కాను. నాతో మాట్లాడించి, పాడించాలని మా అమ్మ ఆశ. నా గొంతు విని అందరూ నవ్వడం మొదలెట్టారు. దాంతో మాటలు మరచిపోయాను. కాగితంలో తర్వాతి వాక్యం చూడాలని ప్రయత్నించాను. కన్నీటి చుక్కలతో అక్షరాలు మసకబారాయి. టీచరు వచ్చి భుజం చుట్టూ చేయి వేసి, స్టేజి మీద నుంచి కిందకు దింపింది.

తర్వాత, ఓ అమ్మాయి నా ప్రేమను తిరస్కరించింది. కొన్ని రోజులు నా బుర్రంతా అదే ఆలోచన. ఆమె నన్ను తిరస్కరించినందుకు కాదు. నా ప్రతిపాదనకు ఆమె ఏమనుకుందోనని నాలో భయం. కాలేజీ చదువు తర్వాత, ఆరామానికి వెళ్ళి భిక్షువుగా మారాను. అమ్మ, నాన్న నా నిర్ణయాన్ని ఎప్పటికైనా అర్థం చేసుకుంటారా అని ఆందోళన. మూడేళ్ళ తర్వాత, బౌద్ధారామానికి వీడ్కోలు పలికాను. ఫెయిలయ్యానని అనిపించింది. ఉద్యోగాల వేటలో 40 తిరస్కారాలు ఎదురయ్యాయి. కనీసం ఇంటర్‌వ్యూలకు కూడా పిలవలేదు. డిగ్రీలో ఫస్ట్ క్లాస్ తెచ్చుకున్నా అదీ పరిస్థితి. చివరకు కన్సల్టెంట్‌గా ఉద్యోగం వెలగబెట్టా. అందులోనూ అందరికన్నా వెనుకబడి ఉన్నానని బాధే. వాళ్ళు నా గురించి ఏమనుకుంటున్నారోనని ఆదుర్దా. మీడియాలో అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు కుదురుగా ఉన్న ఉద్యోగాన్ని వదిలిపెట్టా. నేను పాడ్‌కాస్ట్ మొదలుపెట్టినపుడు, చేయూత నిస్తానన్న ప్రొడక్షన్ కంపెనీ, అది మొదలవడానికి రెండు వారాల ముందే చేతులెత్తేసింది. నేను మొదటి పుస్తకం రాసినపుడు, 14 మంది పబ్లిషర్లు పుస్తకం పేరు మార్చమన్నారు. ఇలాంటివన్నీ ఎదుటివాళ్లు మన గురించి ఏమనుకుంటున్నారోనన్న ఆందోళనకు గురిచేస్తాయి.

> పని చేస్తూనే ఉండాలి. కానీ, అది నలుగురికీ కనిపించేలా ఉండనవసరం లేదు. ప్రతి అడుగూ ముందే ప్రకటించాల్సిన అవసరం లేదు. ప్రపంచ స్థాయి ప్రముఖులు తాము ఇష్టపడిన వ్యాపకంపై మౌనంగా కృషి చేసినవారే!

చార్లెస్ హోర్టన్ కూలే 1902లో చెప్పిన మాటల సారాంశం చెబుతాను: నేను తెలివైనవాడినని మీరు అనుకుంటున్నారని నేను అనుకుంటే, నేను తెలివైనవాడిగా వ్యవహరించడం ప్రారంభిస్తా! కానీ, పనికిరానివాడినని మీరు నా గురించి అనుకుంటున్నారని, నేను అనుకుంటే, నేను నిజంగానే పనికిరానివాడిగా మారతా!! మన చుట్టూ ఉన్న ప్రపంచం పన్నే ఈ వలలో మనం పడకూడదు.

మన రంగాల్లో ఏ పని చేయడానికైనా ఒత్తిడి అనుభవిస్తాం. అవి జనం అంగీకరించేవిగా, ముఖ్యమైనవని భావించేవిగా ఉండాలని కోరుకుంటాం. ఉనికిని చాటుకునేందుకు, ప్రాధాన్యాన్ని నిలుపుకొనేందుకు శతవిధాలా ప్రయత్నిస్తాం. ఎందుకంటే, ప్రపంచం ఆకట్టుకునేదిగా ఉన్నదానివైపే మొగ్గుతుంది. నేను చెప్పేది ఒకటే. మనం కనపడకూడదు.

బుద్ధుడు చెప్పిన పాఠం

అదృశ్యమైపోవడమంటే పని మానేయడం కాదు. పని చేస్తూనే ఉండాలి. కానీ, అది నలుగురికీ కనిపించేలా ఉండనవసరం లేదు. ప్రతి అడుగూ ముందే ప్రకటించాల్సిన అవసరం లేదు. జనం ఏమనుకుంటారోననే ఆలోచనను పక్కన పెట్టండి. మీకు ఏ పని చేయగలమని గట్టి నమ్మకం ఉందో దానికి విలువ నివ్వండి. మీకు ఆనందాన్ని ఇచ్చే దానితో పోలిస్తే, పైకి గొప్పగా కనిపించే లేదా సవ్యమైనదిగా తోచే పని ఏదైనా సరే దిగదుడుపే!

వృత్తి జీవితం మొత్తం ప్రజల కళ్ళెదుట ఆన్‌లైన్‌లో గడిపే వ్యక్తి ఇటువంటి సలహా ఇవ్వడం చోద్యంగా తోచవచ్చు. కానీ, ఒకసారి కాదు రెండు సార్లు అదృశ్యమైన తర్వాతే, నేను ఇప్పుడున్న స్థితికి చేరుకున్నా. మొదటిసారి భిక్షువునయ్యా. రెండవసారి, బౌద్ధ భిక్షువుల వద్ద నేర్చుకున్న అంశాలను నలుగురికీ పంచేందుకు, కుదురుగా చేసుకుంటున్న ఉద్యోగాన్ని మానేశా. వ్యవస్థాపక సామర్థ్యం ఉన్న ప్రపంచస్థాయి ప్రముఖులు, కళాకారులు, వ్యాపారవేత్తలు అందరూ తాము ఇష్టపడే వ్యాపకంపై మౌనంగా కృషి చేసినవారే!

ఒకసారి ఓ విద్యార్థి ''ధ్యానం ద్వారా ఏమి పొందుతారు?'' అని అడిగాడు. ''ఏమీ లేదు'' అన్నది బుద్ధుడి జవాబు. ''ఇంక ధ్యానం చేయడం దేనికి?'' అని విద్యార్థి అడిగాడు. ''నేను ఏదో పొందాలని ధ్యానం చేయడం లేదు. ధ్యానం ద్వారా ఆందోళన, అభద్రత, సంశయాలు పోగొట్టుకుంటున్నా'' అన్నాడు బుద్ధుడు.

ప్రిన్స్‌టన్‌లో పట్టభద్రులవడం ద్వారా మీరు ఏయే ప్రయోజనాలు పొందాలనుకుంటున్నారో ఊహించుకోవచ్చు. కానీ, మీరు వదిలించుకోవాల్సిన వాటి పట్ల కూడా కొంత ఆసక్తి వహించండి. ఎవరి ఆమోదం కోసమో చూసే అవసరాన్ని పోగొట్టుకోండి. ఎదుటివారితో పోల్చుకోవడమనే చాపల్యాన్ని వదులుకోండి. మన విజయాలను మరొకరి విజయాలతో పోల్చి చూసుకుంటే, మనం సాధించగలిగిన విజయాలు కూడా దెబ్బతింటాయి. మీరు మీ సాఫల్యాన్ని మరొకరితో పోల్చి చూసుకోవడం వల్ల మీకు ఎన్నటికీ అసంతృప్తే మిగులుతుంది.

జీవితాన్ని తీర్చిదిద్దే నిర్ణయాలు

మీరు నమ్మే వ్యక్తుల నుంచి పాఠాలు నేర్చుకోండి. కానీ, ఇతరుల అభిప్రాయాలు ఈ నిర్ణయాలను నిర్వచించకుండా చూసుకోండి. ఎందుకంటే, మనం తీసుకునే నిర్ణయాలకు మనమే బాధ్యులమవుతాం. మనపై మన స్వీయ అభిప్రాయమే ముఖ్యం. ప్రతి రోజు నిద్రపోయే ముందు మిమ్మల్ని మీరు సమీక్షించుకోవాలి. కొన్ని రోజులు అప్రియమైనవిగా గడుస్తాయి. ఏవేవో పొరపాట్లు చేస్తాం. అప్పుడు నిజాయతీతో కూడిన స్వీయ అభిప్రాయం అవసరం.

పొట్టకూటి కోసం ఏం చేస్తామన్నది మరో ముఖ్య నిర్ణయం అవుతుంది. మీకు ఏది ఇష్టమైన పనో దాన్ని చేయడానికి ప్రయత్నించండి. అటువంటి ఉద్యోగం దొరక్కపోతే, చేస్తున్న పనిలోనే పరమార్థాన్ని కనుగొనే ప్రయత్నం చేయండి. మన జీవితంలో మూడవ వంతు సమయాన్ని మనం పని చేస్తున్న చోటే వెచ్చిస్తాం. దాదాపుగా 90,000 గంటలు అనుకోవచ్చు. కనుక దాన్ని ద్వేషిస్తూ కూర్చోవద్దు. చేస్తున్న పనిపై మక్కువ పెంచుకునే ప్రయత్నం చెయ్యండి. పని ఇష్టం లేకపోయినా, ఆ పనికి మీరు ఇష్టపడేదేదో కలపండి. అయినా, ఏమాత్రం మనసుకు ఎక్కకపోతే, ఆ భావాన్ని మరో కొత్తదాన్ని ప్రయత్నించి చూడటానికి ఉత్ప్రేరకంగా వాడుకోండి. 2030 నాటికి ఉండగల ఉద్యోగాల్లో 85 శాతం ఉద్యోగాలు ఇంకా రూపొందనే లేదని చెబుతున్నారు. అంటే, ఏ రకమైన అవకాశాలు తలుపు తడతాయో చెప్పలేం!

> పొందాల్సినవే కాదు, వదిలించుకోవాల్సిన వాటి పట్ల కూడా కొంత ఆసక్తి వహించాలి. ఎవరి ఆమోదం కోసమో చూసే అవసరాన్ని పోగొట్టుకోండి. ఎదుటివారితో పోల్చుకోవడమనే చాపల్యాన్ని వదులుకోండి.

మానవాళికి మనం ఏమి చేస్తామన్నది మరో ముఖ్యాంశం. చాలా మంది అసలు దీని గురించే ఆలోచించరు. కానీ, ఈ ప్రశ్నను కనుక పక్కన పెడితే, నిజమైన సంతృప్తికి దారితీసే ఒక అంశాన్ని జార విడుచుకుంటున్నట్లే లెక్క. అది ఎక్కువో, లేదా తక్కువో కావచ్చు. కానీ, మీ సమయం, శక్తి, వనరులు మీ సొంతం కోసమే కాకుండా ఎదుటివారికి వినియోగపడినప్పుడు అవి మరింత అర్థవంతమైనవిగా మారతాయి. ◆

సంక్షోభం నేర్పుతున్న పాఠాలు

ఇండిగో సంక్షోభం కారణంగా ఇప్పుడు దేశం మొత్తం పబ్లిక్ రంగం ప్రాధాన్యంపై చర్చిస్తోంది. ప్రైవేటు రంగం ఎప్పుడూ లాభాలపై ఆధారపడే నడుస్తుంది. తనకు నష్టం వాటిల్లుతున్నదని భావిస్తే కాడి కిందపడేసి తన దారి తాను చూసుకుంటుంది. ఇప్పుడు ఇండిగో విమానయాన సంస్థ చేసింది కూడా ఇదే! యాజమాన్యం–వాటాదారుల మధ్య ఉన్న విభేదాలు; యాజమాన్యం – ఉద్యోగుల మధ్య ఉన్న సమస్యలు కారణంగా అది ప్రయాణికులను ఎక్కడివారిని అక్కడే వదిలేసి క్షమాపణ చెబుతూ నమస్కార బాణాలు వేస్తోంది. తనకు నష్టం వస్తోందని అడ్డగోలుగా టికెట్ రేట్లు పెంచేసింది. గత కొన్ని రోజులుగా ఇండిగోలో చోటుచేసుకున్న పరిస్థితులు... షేర్ మార్కెట్‌పై తీవ్ర ప్రభావాన్ని చూపుతూ ఎందరో చిన్నా చితక మదుపుదారుల డబ్బు ఆవిరి అయ్యేలా చేసింది.

ఇంతకు ముందు ప్రభుత్వ రంగంలో 'ఎయిర్ ఇండియా' విమానయాన సంస్థ ఉండేది. అది కేవలం లాభాల కోసమే పనిచేయలేదు. అది జాతీయ అవసరాలను తీర్చే బాధ్యతను కూడా మోసేది. దూరప్రాంతాలకూ, లాభం రానిచోట్లకూ సేవలను విస్తరించి పని చేసేది. అత్యవసర సమయాల్లో విదేశాల్లో ఇరుక్కున్న భారతీయులను తీసుకువచ్చేది. విపత్తుల సమయంలో రక్షణ, సహాయ చర్యల్లో పాల్గొనేది. ఇవన్నీ ప్రైవేట్ రంగం చేయగలదా?

ఎయిర్ ఇండియా ప్రైవేటు పరం కావడంతో దేశ విమానయాన రంగం మొత్తం ప్రైవేట్ పరమైనట్లు అయ్యింది. ఈ పరిస్థితిలో టికెట్ ధరలు ఆకాశాన్ని తాకాయి, సేవలు దిగజారిపోయాయి. విమానయానం లాంటి కీలక రంగాన్ని పూర్తిగా ప్రైవేటుకు అప్పగించడం దేశ భద్రతకు, ఆర్థిక స్థిరత్వానికి ముప్పే. విమాన రూట్ల కేటాయింపు, అత్యవసర ఎయిర్‌లిఫ్ట్‌లు, అభివృద్ధి చెందని ప్రాంతాలకు కనెక్టివిటీ వంటి సేవలను ప్రైవేట్ కంపెనీలు తమ బ్యాలెన్స్ షీట్‌లను చూసుకుని మాత్రమే నిర్వహిస్తాయి.

ప్రస్తుత సంక్షోభం ప్రభుత్వానికి హెచ్చరిక లాంటిది. విమానయాన రంగాన్ని పూర్తిగా ప్రైవేటీకరించడం కాదు; దీనిని అత్యవసర ప్రజా రవాణా వ్యవస్థలో అతి ముఖ్యమైనదిగా గుర్తించి పునర్నిర్మించాలి. కనీసం ఒక బలమైన పబ్లిక్ రంగ సంస్థ మార్కెట్‌ను సమతుల్యం చేయడానికి ఉండాలి కదా! దేశ భద్రత, ప్రజల ప్రయాణ అవసరాలు, ఆర్థిక స్థిరత్వం... పబ్లిక్ రంగం చేతుల్లోనే భద్రంగా ఉంటాయి. కాబట్టి కేంద్రం కళ్లు తెరచి వెంటనే తగు చర్యలు తీసుకోవాలి.

– టి. నాగరాజు
ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి । 94900 98292

ప్రజల గుండెల్లో పోరు పతాక

ఇన్ బాక్స్

జాతీయోద్యమంలోనూ; తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలోనూ; నక్సల్బరీ, శ్రీకాకుళం, గోదావరి లోయ సాయుధ పోరాటాల్లోనూ పాల్గొన్న యోధులు కామ్రేడ్ మాదాల నారాయణస్వామి (ఎమ్ఎన్ఎస్). మాజీ పార్లమెంట్ సభ్యులు, సీపీఐ(ఎమ్ఎల్) న్యూ డెమోక్రసీ కేంద్ర కమిటీ నాయకులైన ఆయన అమరులై 12 ఏళ్లయింది.

1914 ఫిబ్రవరి 13న ప్రకాశం జిల్లా సంతనూతలపాడు మండలం మైనంపాడులో జన్మించారాయన. బెనారస్ యూనివర్సిటీ నుంచి ఎంఏ ఎకనామిక్స్ పూర్తి చేశారు. 1936లో కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం జెడ్.ఏ. అహమ్మద్ ద్వారా పొందారు. వీర తెలంగాణ సాయుధ పోరాట కాలంలో కమ్యూనిస్టు పార్టీని కాంగ్రెస్ ప్రభుత్వం నిషేధించినప్పుడు నారాయణస్వామి రహస్య జీవితంలోకి వెళ్ళారు. నిత్య నిర్బంధాల మధ్య రైతులను, కూలీలను, మత్స్యకారులను సంఘటితం చేస్తూ భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా పోరాడారు. అంటరానితనానికి, అణిచివేతకు వ్యతిరేకంగా ఉద్యమించారు. ఆయన ఆచూకీ చెప్పమని తమ్ముళ్లు మాదాల కోటయ్య, మాదాల నర్సయ్యలను పోలీసులు పట్టుకుని హింసించినా చెప్పకపోవడంతో కాల్చి చంపారు. అయినా ఎమ్ఎన్ఎస్ చలించకుండా పోరాటపథంలో నడిచారు. కమ్యూనిస్టు పార్టీపై నిషేధం ఎత్తి వేసిన తర్వాత 1952లో ఒంగోలు ఎమ్మెల్యేగానూ, 1962లో ఒంగోలు పార్లమెంట్ సభ్యులుగానూ ఎన్నికయ్యారు. అసెంబ్లీ, పార్లమెంట్‌లను ప్రజా సమస్యలపై చర్చించడానికి వేదికలుగా ఉపయోగించుకున్నారు. ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు కొల్లా వెంకయ్యతో కలిసి 'విశాఖ ఉక్కు' ఆందోళన సందర్భంగా తమ పార్లమెంట్ సభ్యత్వానికి రాజీనామా చేశారు.

కామ్రేడ్ ఎమ్ఎన్ఎస్

1964లో కమ్యూనిస్టు ఉద్యమంలో తలెత్తిన విభేదాల కారణంగా ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ నుండి సీపీఎం వైపు వచ్చారు. ఆ తర్వాతి కాలంలో దాని నుండి బయటికి వచ్చి విప్లవ కమ్యూనిస్టు పార్టీ వైపు నిలబడ్డారు. 1968లో కామ్రేడ్స్ డీవీ, టీఎన్, సీపీ, కొల్లా వెంకయ్యలతో ఏర్పడిన 'ఆంధ్ర విప్లవ కమ్యూనిస్టు కమిటీ' వైపు నిలబడ్డారు. 77 సంవత్సరాలు కమ్యూనిస్టుగా బతికారు. అందులో 30 ఏళ్ళు 'ప్రజాపంథా' పత్రిక ఎడిటర్‌గా పనిచేశారు. 'భారత–చైనా మిత్రమండలి' జాతీయ కార్యదర్శిగా తన బాధ్యతలను నిర్వహించారు. భూస్వామ్య, పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద కూటమికి వ్యతిరేకంగా బలమైన ప్రజా పోరాటాల్ని నిర్మించడమే ఎమ్ఎన్ఎస్‌కు మనమిచ్చే నిజమైన నివాళి.

– చిట్టిపాటి వెంకటేశ్వర్లు । సీపీఐ (ఎమ్ఎల్) న్యూ డెమోక్రసీ ఏపీ అధికార ప్రతినిధి (నేడు గుంటూరులో కామ్రేడ్ ఎమ్ఎన్ఎస్ 12వ వర్ధంతి సభ)



సర్వాంతర్యామి

ఒకానొక రోజు ఒక శిష్యుడు గురువును, 'దేవుడు తానున్నా... ఉనికిని ఎందుకు వెల్లడించడు?' అని అడిగాడు. అంతట గురువు ఇలా ఒక కథ చెప్పారు:

దేవుడున్నాడని నమ్మే వ్యక్తి మెల్లగా, 'దేవుడా! దయచేసి నాతో మాట్లాడు!' అని అన్నాడు. అతను చెప్పడం ఆపిన మరుక్షణం ఒక కోకిల పాడింది. అతను అది వినలేదు. మళ్ళీ అతను గొంతు పెంచి అన్నాడు: 'దేవుడా! దయచేసి నాతో మాట్లాడు! నీ మాట వినాలని నా కోరిక' అని! వెంటనే, ఒక పెద్ద ఉరుము వినిపించింది. కానీ దానినీ పట్టించుకోకుండా, 'భగవంతుడా! నువ్వు మాట్లాడకపోయినా, కనీసం నువ్వు నాకు కనిపించు. చూసి తరిస్తాను. నీ దర్శనం నాకొక భరోసా' అని కోరాడు.

అప్పుడు ఒక నక్షత్రం ఆకాశంలో పుట్టుకొచ్చి ప్రకాశవంతంగా కనిపించింది. కానీ అతను దాని వంక దృష్టి నిలపలేదు. అతను మళ్ళీ భగవంతుడిని ఇలా అడిగాడు: 'నువ్వేదైనా అద్భుతం చేయలేవా?' అని. దేవుడు నెమ్మదిగా దిగి వచ్చి సీతాకోకచిలుకలా అతణ్ణి స్పృశించాడు. అతను తన చేతిపై వాలిన సీతాకోకచిలుకను తరిమికొట్టి ఇలా అన్నాడు:

'దేవుడంటూ ఉంటే అతను నాతో మాట్లాడి ఉండేవాడు. నేను చూడగలిగేవాడిని. కానీ నేనెంతలా కోరినా ఏ అద్భుతమూ జరగలేదు. కనుక లేడనే అనిపిస్తోంది'' అని గురువు కథ ఆపారు. కథ విన్న శిష్యుడు, 'నాకు విషయం అర్థమైంది గురువుగారూ! దేవుడు తనను తాను వ్యక్తపరుస్తుంటాడు. కానీ మనమే అర్థం చేసుకోలేము!' అన్నాడు.

ఇక్కడ, అక్కడ అనే కాదు, దేవుడు ప్రతి చోటా ఉన్నాడు. ఉంటాడు. కానీ అధిక శాతం మంది ఆ వాస్తవాన్ని గ్రహించక దేవుడి మీద అభిప్రాయాలు మార్చుకుంటూ ఉంటారు.

– యామిజాల జగదీశ్

యూరియా కోసం బారులు

బిక్కవోలులో పోలీసుల సమక్షంలో పంపిణీ **తిరుపతిలో టోకెన్లు ఉన్నవారికే బస్తా**

బిక్కవోలు సొసైటీ నుంచి హైస్కూల్ వరకు బారులు తీరిన రైతులు

కె.వడ్డేపల్లి రైతు భరోసా కేంద్రం వద్ద రైతులు

బిక్కవోలు/తిరుపతి రూరల్: రైతన్నను యూరియా కష్టాలు వెంటాడుతున్నాయి. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలంలోని సొసైటీ వద్ద సోమవారం రైతులు యూరియా కోసం బారులు తీరారు. బిక్కవోలు సొసైటీ పరిధిలో 378 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం. తొలి విడతగా 50 మెట్రిక్ టన్నులు మాత్రమే తీసుకువచ్చారు. యూరియా లేకపోతే ఇబ్బంది పడక తప్పదు అని రైతులు సొసైటీ వద్ద బారులు తీరారు. అయితే ఒక రైతుకు రెండు బస్తాలకు మించి ఇవ్వకపోవడంతో క్యూలో తోపులాట చోటు చేసుకుంది. దీంతో పోలీసుల సమక్షంలో యూరియాను అందించారు.

తిరుపతిలో...

తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండలంలో మండలంలోని కె.వడ్డేపల్లి రైతు భరోసా కేంద్రంలో యూరియా బస్తాల కోసం సోమవారం రైతులు పెద్ద ఎత్తున తరలిరావడంతో తోపులాట చోటుచేసుకుంది. దీంతో అధికారులు కొంత సమయం సరఫరా నిలిపివేయడంతో అన్నదాతలు క్యూ కట్టారు. పాకాల మండలంలోని గాదంకి, ఆదెనపల్లి, కావలివారి పల్లి, కె.వడ్డేపల్లి పంచాయతీలకు చెందిన 300మంది రైతులకు అధికారులు టోకెన్లను మంజూరు చేశారు. ఈ విషయం తెలుసుకుని మరికొంత మంది రైతులు అక్కడకు చేరుకున్నారు. టోకెన్లు ఉన్న వారు మాత్రమే రావాలని, మిగతా వారికి మరికొన్ని రోజుల్లో యూరియా ఇస్తామని అధికారులు చెప్పడంతో ఒకింత గందరగోళం చోటు చేసుకుంది. అనంతరం టోకెన్లున్న రైతులు యూరియా తీసుకెళ్లారు. అయితే టీడీపీ నేతలు తమకు కావాల్సిన వారికి ముందుగానే టోకెన్లు ఇచ్చి యూరియాను దారి మళ్లించారని, అందుకే తమకు ఈ కష్టాలని పలువురు రైతులు వ్యాఖ్యానించారు.

అరటి రైతు ఆక్రందన

బోరంపల్లిలో పంట తొలగించిన రైతు ఆనం రామిరెడ్డి
ప్రభుత్వ మద్దతు ధర కరువు... రూ.5 లక్షల వరకూ నష్టం

జేసీబీతో అరటి పంటను తొలగిస్తున్న రైతు ఆనం రామిరెడ్డి

కళ్యాణదుర్గం: అనంతపురం జిల్లాలో అరటి రైతుల ఆక్రందనలు వినేవారే కరువయ్యారు. చంద్రబాబు ప్రభుత్వం అరటి పంటకు కనీస మద్దతు ధర కల్పించకపోవడంతో రైతన్నలు పంటను జేసీబీలతో తొలగిస్తున్నారు. కళ్యాణదుర్గం మండలం బోరంపల్లికి చెందిన రైతు ఆనం రామిరెడ్డి తనకున్న నాలుగు ఎకరాల పొలంలో అరటి పంట సాగు చేశాడు. రూ.6 లక్షల వరకు పెట్టుబడి పెట్టాడు. తీరా పంట చేతికొచ్చాక ధర పడిపోయింది. కిలో అరటి రూ.2లతో కొనేందుకు వ్యాపారులు ముందుకు వచ్చారు. ఇలా రెండు మార్లు పంటను కోస్తే రైతుకు కేవలం రూ.లక్ష చేతికందింది. పైగా తోటలోనే పండ్లు కుళ్లిపోతుండటంతో చేసేదేమీలేక సోమవారం ఉన్న పంటను జేసీబీతో తొలగించేశాడు. రూ.5 లక్షల వరకు నష్టం వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశాడు.

క్లుప్తంగా...

16 నుంచి జనవరి 14 వరకు ధనుర్మాస తిరుప్పావై ప్రవచనాలు

తిరుపతితో పాటు దేశవ్యాప్తంగా 233 కేంద్రాల్లో తిరుప్పావై

తిరుమల: పవిత్ర ధనుర్మాసాన్ని పురస్కరించుకుని డిసెంబరు 16 నుంచి 2026 జనవరి 14 వరకు దేశవ్యాప్తంగా 233 కేంద్రాల్లో ప్రముఖ పండితులు తిరుప్పావై ప్రవచనాలు చేయనున్నారు. టీటీడీ ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఇందుకోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి. దీన్లో భాగంగా తిరుపతితో పాటు ఆంధ్రప్రదేశ్–76, తెలంగాణ–57, తమిళనాడు–73, కర్ణాటక–21, పాండిచ్చేరి–4, న్యూఢిల్లీ, ఒడిశాలో ఒక్కొక్క కేంద్రంలో తిరుప్పావై ప్రవచనాలు చేపట్టనున్నారు. తిరుమల శ్రీవారి ఆలయంలోనూ ధనుర్మాసంలో సుప్రభాతం బదులు తిరుప్పావై నివేదించడం విశేషం. తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరం, కెటి రోడ్డులోని శ్రీ వరదరాజస్వామివారి ఆలయంలో తిరుప్పావై ప్రవచనాలు పారాయణం చేస్తారు.

వీధికుక్కలు వెంబడించడంతో స్కూటరిస్టు మృతి

గుడి ఆవరణలో ఫజల్ మృతదేహం

రాయచోటి టౌన్: అన్నమయ్య జిల్లా రాయచోటిలో మున్సిపాలిటీ అధికారుల నిర్లక్ష్యంతో నిండు ప్రాణం బలైంది. రాయచోటిలోని కొత్తపేటలో నివాసం ఉండే ఫజల్ (42) ఆదివారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో గాలివీడు రోడ్డులో ద్విచక్రవాహనంపై తన ఇంటికి వెళుతుండగా కుక్కలు వెంటపడ్డాయి. వాటి నుంచి తప్పించుకోవాలని బైకును వేగంగా నడిపాడు. అయినా కుక్కలు విడిచిపెట్టలేదు. దీంతో వేగాన్ని అదుపుచేసుకోలేక ఎదురుగా ఉన్న గుడి గోడను ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, రాయచోటిలో రోడ్లపై ఎక్కడికక్కడ కుక్కలు విచ్చలవిడిగా తిరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్తే చలనం లేదని వాపోతున్నారు.

రూ.22 వేల ఇంటి పన్నా.. నేను చచ్చిపోతా!

అనంతపురం జిల్లా నార్పలలో పురుగు మందు డబ్బాతో ఓ వ్యక్తి నిరసన

పురుగు మందు డబ్బాతో నిరసన తెలుపుతున్న పెద్దన్న

శింగనమల(నార్పల): 'ఇంటి పన్ను రూ.22 వేలు కట్టమంటున్నారు. అంత డబ్బు ఎక్కడి నుంచి తేవాలి? దీనికంటే చచ్చిపోవడమే మేలు' అంటూ అనంతపురం జిల్లా నార్పలలోని దివ్యాంగుల కాలనీకి చెందిన సిద్దవట్టం పెద్దన్న వాపోయారు. ఆయన సోమవారం భార్య, పిల్లలతో కలిసి పురుగు మందు డబ్బా తీసుకొని.. నార్పల పంచాయతీ కార్యాలయం వద్దకు వచ్చారు. ఇంటి పన్ను తగ్గించకపోతే ఆత్మహత్య చేసుకుంటానని కన్నీటిపర్యంతమయ్యారు. రూ.22 వేలు ఇంటి పన్ను కట్టాలంటూ నోటీసు ఇస్తే.. ఎక్కడి నుంచి తేవాలని పంచాయతీ అధికారులను ప్రశ్నించారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు.. పంచాయతీ కార్యాలయానికి చేరుకొని.. పెద్దన్న నుంచి పురుగు మందు డబ్బా లాక్కున్నారు. చివరకు ఇంటి పన్నును రూ.16 వేలకు తగ్గించి.. ఆయనకు సర్దిచెప్పి పంపించేశారు.

ప్రపంచ జనాభా దినోత్సవ రాష్ట్ర సదస్సు ఖర్చు రూ.1.75 కోట్లు

రాష్ట్ర సచివాలయం పక్కన సదస్సు నిర్వహించిన బాబు సర్కారు

సాక్షి, అమరావతి: ఈ ఏడాది జూలై 11న ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర సచివాలయం పక్కన నిర్వహించిన రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహణకు రూ.1.75 కోట్లను చంద్రబాబు సర్కారు వ్యయం చేసింది. ఈ సదస్సు నిర్వహణకు తొలుత అడ్వాన్స్‌గా గతంలోనే ప్రభుత్వం రూ.82 లక్షలను గుంటూరు జిల్లా కలెక్టర్‌కు విడుదల చేసింది. ఇప్పుడు మిగతా మొత్తం రూ.93 లక్షలను విడుదల చేసింది. ఈ మేరకు ప్రణాళికా శాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఐఏఎస్ ఆమ్రపాలికి హైకోర్టులో చుక్కెదురు



సాక్షి, హైదరాబాద్: ఐఏఎస్ అధికారి ఆమ్రపాలికి తెలంగాణ హైకోర్టులో చుక్కెదురైంది. ఆమెను తెలంగాణకు కేటాయిస్తూ గత జూన్‌లో కేంద్ర పరిపాలనా ట్రిబ్యునల్ (క్యాట్) ఇచ్చిన ఆదేశాలను ఉన్నత న్యాయస్థానం నిలిపివేసింది. కౌంటర్ దాఖలు చేయాలని తెలంగాణ, ఏపీ సర్కార్‌లతో పాటు ఆమ్రపాలిని కోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది. ఖండేకర్ కమిటీ నివేదిక మేరకు ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో ఏ రాష్ట్రానికి కేటాయించిన అధికారులు, ఆ రాష్ట్రానికి వెళ్లాల్సిందేనని 2024 అక్టోబర్‌లో డీవోపీటీ ఉత్తర్వులు జారీ చేసింది.

సాంకేతిక విద్యలో సర్వీసు తకరారు!

పాలిటెక్నిక్ లెక్చరర్ల కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ అమలులో తప్పులు

- నిబంధనలకు విరుద్ధంగా కొందరికి లెవెల్–11 పదోన్నతి
- ఏపీపీఎస్సీ అనుమతి లేకుండా సీఏఎస్ అమలుపై సందేహాలు
- ఒకేసారి సర్వీసులో చేరినవారికి వేర్వేరు వేతనాలపై ఆందోళన
- డైరెక్టరేట్ అధికారుల తప్పులకు లెక్చరర్లు బలి
- డైరెక్టరేట్‌ను తప్పుదారి పట్టించిన కమిటీపై కనిపించని చర్యలు

సాక్షి, అమరావతి: సాంకేతిక విద్యా శాఖ చేస్తున్న తప్పులకు ఉద్యోగులు బలవుతున్నారు. డైరెక్టరేట్ అధికారుల తప్పుడు నిర్ణయాల కారణంగా ఆర్థికంగా నష్ట పోతున్నారు. అనుభవజ్ఞులుగా చలామణీ అవుతున్న కొందరు అధికారులు ఏకంగా చట్టాలనే ఉల్లంఘిస్తున్నా పట్టించుకునేవారే కరవయ్యారు. వీరు ఉన్నతాధికారులను సైతం తప్పుదారి పట్టించి, సిబ్బంది ప్రయోజనాలను దెబ్బ తీస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. చంద్రబాబు ప్రభుత్వం విద్యా శాఖను నిర్వీర్యం చేస్తుండటం, ఉన్నతాధికారుల ఉదాసీనతతో సాంకేతిక విద్యలో కొందరు అధికారులకు ఆడిందే ఆటగా సాగుతోంది. ఈ ఏడాది జూన్ నెలలో జరిగిన సాధారణ బదిలీల్లో సాంకేతిక విద్య డైరెక్టరేట్ నుంచి వేరే ప్రాంతాలకు బదిలీ అయిన వారు సర్వీస్ మేటర్స్‌లో నిష్ణాతులుగా చెప్పుకుని, బదిలీ ఉత్తర్వులను నిలిపివేయించుకున్న విషయం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఇదే అధికారులు ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టిస్తూ, నిబంధనలను ఉల్లంఘిస్తూ పాలిటెక్నిక్ కళాశాలల లెక్చరర్ల ప్రయోజనాలను దెబ్బ తీసేలా నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఈ అధికారులు ఇటీవల పాలిటెక్నిక్ లెక్చరర్లకు ఇచ్చే 'కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్'(సీఏఎస్)ను కోల్పోయేలా చేశారు. 2022లో ఇచ్చిన లెవెల్–10 పూర్తిస్థాయిలో అమలు చేయకుండానే లెవెల్–11 అమలుకు ఆదేశాలిచ్చేశారు. ఏపీపీఎస్సీ అనుమతి లేకుండానే ఈ ప్రక్రియ చేపట్టేశారు. తప్పును గుర్తించిన మూడు నెలలు తర్వాత తీరిగ్గా దిద్దుబాటు చర్యలు చేపట్టారు. దీనివల్ల తమకు ఇబ్బందులొస్తాయని భయపడ్డ కొందరు ఈ ఆదేశాలను పక్కనబెట్టగా, మరికొందరు అమలు చేసినట్టు విశ్వసనీయ సమాచారం. దీంతో ఒకేసారి సర్వీసులో చేరిన పాలిటెక్నిక్ లెక్చరర్ల వేతనాల్లో భారీ వ్యత్యాసం వచ్చింది. ఈ తప్పులకు పాల్పడ్డ అధికారులపై చర్యలు తీసుకోకపోగా, వీరినే వివిధ కమిటీల్లో వేస్తుండడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఇష్టారీతిన సీఏఎస్ అమలు

పాలిటెక్నిక్ లెక్చరర్లు సర్వీస్ కమిషన్ ద్వారా లెవల్–9ఏ ఆర్థిక ప్రయోజనాలతో నియమితులవుతారు. ఐదేళ్ల తర్వాత అనుభవం, విద్యార్హతలు ఉన్నవారికి లెవెల్–10కి పదోన్నతి ఇస్తారు. తర్వాత లెవెల్–11 (సీనియర్ లెక్చరర్ స్కేల్)కి పదోన్నతి కల్పిస్తారు. అలా పదోన్నతులిచ్చే పరిస్థితి లేనప్పుడు వారికి ఉన్న సర్వీసుకు అనుగుణంగా ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలి. ఇందుకోసం 'కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్'ను అమలు చేస్తారు. ఈ అధికారం ప్రిన్సిపల్స్‌కు కల్పించారు. 2012–13లో లెక్చరర్లుగా చేరినవారికి ఏఐసీటీఈ పే స్కేల్ 2016 ప్రకారం లెవల్–10 హోదా 2022లోనే అమలు చేశారు. అయితే, అర్హులైనవారిలో కొందరికి ఇప్పటికీ అమలు చేయలేదు. లెవెల్–11 మాత్రం జీవో నం.10 ప్రకారం తప్పనిసరిగా ఏపీపీఎస్సీ ద్వారానే జరగాలి. కానీ, అంతర్గత కమిటీని వేసి, దాని సూచనల మేరకు ఈ ఏడాది సెప్టెంబర్‌లో 244 మంది లెక్చరర్లకు లెవెల్–9ఏ నుంచి నేరుగా లెవెల్–11కు పదోన్నతి ఇచ్చారు. ఏపీపీఎస్సీ అనుమతి లేకుండా ఆదేశాలివ్వడంతో కంగుతిన్న లెక్చరర్లు.. లెవెల్–10 అమలు చేయకుండా లెవెల్–11 ఎలా ఇస్తారని డైరెక్టరేట్‌కు భారీగా ఫిర్యాదులు చేశారు. ఇది పెద్ద తప్పు అని విమర్శలు రావడంతో ఉన్నతాధికారులు నాలుగైదు రోజుల తర్వాత ఆ ఆదేశాలను వెనక్కి తీసుకున్నారు. కానీ, ఈలోగానే చాలా కాలేజీల్లో లెవెల్–11 అమల్లోకి తేవడంతో పాటు ఆ స్థాయి వేతనాలు కూడా డ్రా చేస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం.

తప్పు చేసిన వారిపై చర్యలేవీ?

వివాదాస్పదమైన లెవెల్–11పై తప్పటడుగులు వేసిన డైరెక్టరేట్ ఇప్పుడు ఆ లెక్చరర్లతో పాటు మరికొందరిని కొత్తగా కలిపి 412 మందికి లెవెల్–10 అమలుకు కసరత్తు చేస్తోంది. ఇందులోనూ స్థానిక కాలేజీల ప్రిన్సిపాల్స్ ఇవ్వాల్సిన సీఏఎస్‌పై డైరెక్టరేట్‌లోని కొందరు అధికారులు జోక్యం చేసుకుని వివరాలు అడుగుతుండడం అనుమానాలకు తావిస్తోంది. మూడు నెలలుగా డైరెక్టరేట్ వెబ్‌సైట్‌లో లెవెల్–11 ఆదేశాలు ఉండడంపై 'సాక్షి' ప్రతినిధి ఉన్నతాధికారులను సంప్రదించడంతో హడావుడిగా ఆదేశాల ఆర్డర్‌ను తొలగించారు. ఈ వ్యవహారంపై సాంకేతిక విద్య జాయింట్ డైరెక్టర్ (సర్వీసెస్)ను వివరణ కోరగా.. లెవల్–11 అమలుకు ఆదేశాలిచ్చింది వాస్తవమేనని, ఆ తర్వాత వాటిని విరమించుకున్నట్టు తెలిపారు. లెవెల్–10ను కాలేజీ ప్రిన్సిపల్స్ అమలు చేస్తారని వివరించారు. అయితే, లెవెల్–10 అమలుపై 2022 తర్వాత ఇప్పుడు డైరెక్టరేట్ జోక్యం చేసుకోవడం, లెవెల్–11కు నిబంధనలను అనుసరించకపోవడం, డైరెక్టరేట్‌ను తప్పుదారి పట్టించిన వారిపై చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

బస్సు టైరెక్కి పాదం నుజ్జునుజ్జు

ఫ్రీ బస్సు కోసం ఒక్కసారిగా ఎగబడిన ప్రయాణికులు
అదుపుతప్పి కిందపడిపోయి తీవ్రంగా గాయపడ్డ మహిళ

బస్సు ఎక్కేందుకు ఎగబడుతున్న జనం

నుజ్జునుజ్జయిన పాదం

మైలవరం: మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రవేశపెట్టిన ప్రభుత్వం ఆ దిశగా బస్సుల సంఖ్యను పెంచకపోవడంతో ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. బస్సు ఎక్కేందుకు ప్రయాణికులంతా ఒక్కసారిగా ఎగబడడంతో అదుపుతప్పి పడిపోయిన ఓ మహిళ కాలుపైకి బస్సు టైరు ఎక్కడంతో ఆమె తీవ్రంగా గాయపడ్డ ఘటన ఎన్టీఆర్ జిల్లా మైలవరం ఆర్టీసీ బస్టాండులో సోమవారం సాయంత్రం జరిగింది. రెడ్డిగూడెం మండల పరిధి కుదప గ్రామానికి చెందిన పజ్జూరు కృష్ణవేణి తన తల్లికి కంటి పరీక్షల నిమిత్తం సోమవారం ఉదయం మైలవరం వచ్చారు. తిరిగి ఇంటికి వెళ్లేందుకు మధ్యాహ్నం రెండున్నర గంటల సమయంలో బస్టాండుకు చేరుకున్నారు. సా.5.30 తరువాత విజయవాడ–విస్సన్నపేట 110వ నంబరు బస్సు రావడంతో ప్రయాణికులంతా ఒక్కసారిగా బస్సెక్కేందుకు ఎగబడ్డారు. దీంతో తన తల్లిని బస్సు ఎక్కించేందుకు కృష్ణవేణి ముందుగా బస్సు ఎక్కి సీటులో లగేజీ సంచిని ఉంచి కిందకు దిగుతుండగా తోపులాట జరగడంతో ఆమె అదుపుతప్పి కింద పడిపోయింది. అదే సమయంలో బస్సు కదలడంతో బస్సు టైరు కృష్ణవేణి కాలుపైకి ఎక్కగా పాదం నుజ్జునుజ్జయింది. బాధితురాలిని స్థానికులు వెంటనే మైలవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
పంచాయతీరాజ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
నెం. టి.ఓ/47 టు 49/2025-26, తేది : 03.12.2025
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని ముత్తుకూరు, అల్లూరి & కందుకూరు మండలాలలో 3 విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మాణ పనులకు ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. 3 పనులకు అంచనా విలువ రూ.126.00 లక్షలు. ఇ-ప్లాట్‌ఫారంలో డాక్యుమెంట్ లభ్యత : 09.12.2025 నుండి 23.12.2025, మ.3.00 గం.ల వరకు. ఇతర వివరాలను ఈ కార్యాలయములో పొందగలరు.
సం/- సూపరింటెండింగ్ ఇంజినీరు, పంచాయతీరాజ్ సర్కిల్, నెల్లూరు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా
DIPR RO No.18300/CL/Advt/1/1/2021-22, Dt: 08.12.2025

తిరుమల తిరుపతి దేవస్థానములు : తిరుపతి
చీఫ్ ఇంజినీర్ ఆఫీస్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
ADV No.50/D3/CE/TTD/2025-26 Dt: 07-12-2025
TTD ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్‌లో అరవై ఏడు (67) పనుల కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్‌పై ఇ-టెండర్లు కోరబడుచున్నవి: SE-I: NIT నం.65 నుండి 66/SE-I/2025-26 (2 పనులు), SE-II: NIT నం.822 నుండి 844/SE-II/2025-26 (23 పనులు), EE-III: NIT నం.90 నుండి 91/EE-III/2025-26 (2 పనులు), EE-VI: NIT నం.146/EE-VI/2025-26 (1 పని), EE-VII: NIT నం.67 నుండి 68/EE-VII/2025-26 (2 పనులు), EE-XIV: NIT నం.156/EE-XIV/2025-26 (1 పని), EE(FMS)-TML: NIT నం.66 నుండి 68/EE(FMS)-TML/2025-26 (3 పనులు), DE(Elec)-I: NIT నం.249 నుండి 263/DE(Elec)-I/2025-26 (15 పనులు), DE(Elec)-II: NIT నం.449 నుండి 459/DE(Elec)-II/2025-26 (11 పనులు), DE(Elec)-TML: NIT నం.370 నుండి 376/DE(Elec)-TML/2025-26 (7 పనులు), వివరాల కోసం www.tirumala.org కి లాగాన్ చేయండి మరియు పని వివరాల కోసం https://tender.apeprocurement.gov.in కు లాగిన్ చేయండి.
TTD-40021/10/2025-PRO SEC (Adv.No.313) Dt: 08-12-2025 ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

GREATER VISAKHAPATNAM SMART CITY CORPORATION LIMITED (GVSCCL)
Ref. No: GVSCCL/Project/421(Rejunovation of Open Well)/2025-26/Dt:08-12-2025
TENDER NOTICE
GVSCCL desires to invite the tender towards "Rejunovation of Open Well in Visakhapatnam". The detailed tender documents can be downloaded from website of https://apeprocurement.gov.in/from 08/12/2025 onwards. The last date for online submission of bids is 16/12/2025 upto 05:00 PM.
For more details contact: E-mail: visakhapatnamsmartcity@gvsccl.in
Mobile No: 98483 08824 Sd/- MD & CEO, GVSCCL

అనుబంధం–'A'
నేషన్ వైడ్ పెన్షన్ అదాలత్–2025
ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కేరళ, తెలంగాణ, తమిళనాడు మరియు కర్ణాటక లకు చెందిన మరణించిన BSF సిబ్బంది యొక్క రిటైరీస్/ NOK కోసం పెన్షన్ అదాలత్ సెక్టార్ HQ BSF, త్రివేండ్రం (ముత్తతర), PO–వల్లకాడవు, వల్లితుర, జిల్లా–తిరువనంతపురం, కేరళ–695008 వద్ద 20 డిసెంబర్ 2025న 0900 గం. నుండి జరుపబడుతుంది. పై రాష్ట్రాలకు చెందిన మరణించిన వారి పెన్షన్‌దారులు/ NOK మొ॥ వారందరూ పెన్షన్‌కు సంబంధించిన ఇతర సమస్యలు ఏవైనా మరియు పెండింగ్‌లో ఉన్న పెన్షనరీ బెనిఫిట్స్‌కు సంబంధించిన వారి సమస్యల పరిష్కారం కోసం గూగుల్ మీట్ లింక్ https://meet.google.com/pgg-jiob-jdy ద్వారా వీడియో కాన్ఫరెన్స్ (VC) ద్వారా లేదా స్వయంగా పెన్షన్ అదాలత్‌కు హాజరుకావాలని తెలియజేయడమైనది. వారి కేసుకు సంబంధించిన పూర్తి డాక్యుమెంట్స్‌ను వారితో తీసుకురావాల్సిందిగా / సిద్ధంగా ఉంచుకోవాల్సిందిగా అందరికీ సూచించడమైనది.
టెలిఫోన్ నం. 04712509351
ప్రదేశం SHQ BSF, త్రివేండ్రం (ముత్తతర), PO–వల్లకాడవు, వల్లితుర, జిల్లా–తిరువనంతపురం, కేరళ, పిన్: 695008
CBC 19110/11/0087/2526

మహిళలకు అనుచిత మెసేజ్‌లు పంపారు.. మీ ఆధార్ కార్డు అమ్మేశారు

- మీపై సీబీఐ కేసులు ఉన్నాయి.. అరెస్ట్ వారెంట్ ఉంది
- మీరు నిర్దోషి అని నిరూపించుకోవాలంటే రూ.8 లక్షలు డిపాజిట్ చేయండి
- తిరుపతిలో రిటైర్డ్ టీచర్‌కు సైబర్ నేరస్తుల బెదిరింపులు

తిరుపతి క్రైమ్: 'మీపై అనేక కేసులు ఉన్నాయి...' అంటూ తిరుపతి నగరానికి చెందిన ఒక రిటైర్డ్ ఉపాధ్యాయుడిని సైబర్ నేరస్తులు ఫోన్‌లో తీవ్రంగా బెదిరించారు. ఆయన్ను రెండు రోజులు ఉక్కిరిబిక్కిరి చేశారు. సైబర్ క్రైం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తిరుపతి నగరంలో నివాసం ఉంటున్న ఓ రిటైర్డ్ టీచర్(66)కు ఈ నెల 6న ఒక అజ్ఞాత వ్యక్తి నుంచి ఫోన్ కాల్ వచ్చింది. 'మీ ఫోన్ నంబర్‌ను ఉపయోగించి బెంగళూరులో మహిళలకు అనుచిత మెసేజ్‌లు పంపారు. మీపై ఎఫ్ఐఆర్ నమోదైంది. వెంటనే బెంగళూరుకు వచ్చి వివరణ ఇవ్వాలి' అని అజ్ఞాత వ్యక్తి భయపెట్టాడు. మరోసారి అతను మరొక నంబర్ నుంచి ఫోన్ చేసి 'మేము ఇండియన్ సైబర్ క్రైం కో–ఆర్డినేషన్ సెంటర్ నుంచి కాల్ చేస్తున్నాం. ఇప్పుడే పోలీసులకు కనెక్ట్ చేస్తున్నాం. మీపై సీబీఐ కేసులు కూడా ఉన్నాయి' అని చెప్పాడు. అనంతరం మరో వ్యక్తిని కాన్ఫరెన్స్ కాల్‌లో కలిపి పోలీస్ అధికారి అని, కొద్దిసేపటికి మరొకరిని కనెక్ట్ చేసి సీబీఐ ఆఫీసర్ అని తెలియజేశాడు. ముగ్గురూ కలిసి 'మీ ఆధార్ కార్డు అమ్మేశారు... మీ పేరుతో చాలా బ్యాంక్ అకౌంట్లు ఓపెన్ చేశారు. రూ.3 కోట్లకు పైగా ట్రాన్సాక్షన్లు జరిగాయి. కేసు సుప్రీంకోర్టుకు వెళ్లింది. మీపై అరెస్ట్ వారెంట్ ఉంది. ఈ విషయాన్ని ఇంట్లో ఎవరికీ చెప్పొద్దు. గదిలోకి వెళ్లి డోర్ లాక్ చేసి కాల్స్ మాట్లాడు. ప్రతి రెండు గంటలకు గుర్తింపు మెసేజ్ పంపండి...' అంటూ పూర్తిగా అతన్ని మానసికంగా కుంగదీశారు.

రూ.8లక్షలు డిపాజిట్ చేయండి.. నిర్దోషిగా నిరూపించుకోండి...

చివరకు 'మీరు నిర్దోషి అని నిరూపించుకోవాలంటే మేం చెప్పిన ఖాతాలో రూ.8 లక్షలు డిపాజిట్ చేయాలి' అని రిటైర్డ్ ఉపాధ్యాయుడిపై సైబర్ నేరస్తులు ఒత్తిడి చేశారు. ఆరో తేదీ నుంచి సతమతమవుతున్న ఆయన సోమవారం సైబర్ పోలీసులను కలిసి అన్ని విషయాలు తెలియజేశారు. పోలీసులు మొత్తం పరిశీలించి ఇది పూర్తిగా సైబర్ మోసమేనని నిర్ధారించారు.

నకిలీ విత్తనాలు కొంపముంచాయి

నకిలీ బాగోతాన్ని వివరిస్తున్న రైతులు

తిరుపతి అర్బన్: 'వందలాది మంది రైతులకు నకిలీ వరి విత్తనాలు కట్టబెట్టారు. రబీ సీజన్ ప్రారంభానికి ముందే వ్యవసాయ శాఖ అధికారులు పర్యవేక్షణ చేసి ఉంటే ఇలా జరిగేది కాదు. నకిలీ విత్తనాలతో నష్టాలకు గురై అప్పుల పాలయ్యాం. దిక్కుతోచని స్థితిలో ఉన్నాం. కలెక్టర్ గారూ.. మీరే ఆదుకోవాలి' అంటూ తిరుపతి జిల్లా సూళ్లూరుపేట ప్రాంతానికి చెందిన రైతులు వరి దుబ్బుల్ని తీసుకొచ్చి కలెక్టర్ వెంకటేశ్వర్‌కు మొరపెట్టుకున్నారు. సోమవారం పీజీఆర్ఎస్ సందర్భంగా కలెక్టరేట్‌కు పెద్దఎత్తున రైతులు తరలివచ్చి కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. 'సూళ్లూరుపేటలో పూజిత ఆగ్రో సర్వీసెస్ సెంటర్‌లో బీపీటీ–2782 రకం వరి విత్తనాలు కొనుగోలు చేశాం. నాట్లు వేసిన 70 రోజుల తర్వాత పొట్ట, వెన్ను రావాల్సి ఉంది. అలా వస్తేనే దిగుబడి బాగుంటుంది. అయితే నకిలీ విత్తనాలు కావడంతో నాట్లు వేసిన 20 రోజులకే పొట్ట, వెన్ను వచ్చేశాయి. దీనివల్ల దిగుబడి రాదు. పెట్టుబడులు కూడా రైతులకు దక్కేలా లేవు. మళ్లీ పంటను దున్ని సాగు చేయడానికి మావద్ద పెట్టుబడి లేదు. దశాబ్దాలుగా వ్యవసాయం చేస్తున్నాం. ఈ తరహాలో ఎప్పుడూ మోసం జరగలేదు. విచారణ చేపట్టండి. మీకు వాస్తవాలు తెలుస్తాయి. నకిలీ విత్తనాలతో నష్టపోయిన అన్నదాతలను ఆదుకోండి' అని రైతులంతా జిల్లా కలెక్టర్‌ను వేడుకున్నారు.

టీడీపీ నేతల వేధింపులతో దళిత ఆశా వర్కర్ మృతి

- ఉద్యోగం నుంచి తొలగింపు
- అన్యాయంగా తొలగించారన్న మానసిక వేదనతో మరణించిన ఆశా వర్కర్
- కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసిన మృతురాలి కుటుంబ సభ్యులు

వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పార్వతీపురం: టీడీపీ నాయకులు, వైద్యాధికారి వేధింపులతో ఉద్యోగం కోల్పోయి.. తీవ్ర మనోవేదనకు గురై ఆశా వర్కర్ గుండెపోటుతో మరణించింది. ఆమె కుమార్తె తండ్రితో కలిసి జిల్లాకు చెందిన మంత్రి సంధ్యారాణి కాళ్లమీద పడింది. మంత్రి అనుచరుల వేధింపుల వల్లే మాదిగ సామాజిక వర్గానికి చెందిన తన తల్లి మరణించిందంటూ గోడు వెళ్లబోసుకుంది. కానీ.. మంత్రి వారిపై కనికరం చూపలేదు. దీంతో సోమవారం కలెక్టరేట్ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో దళిత, మాదిగ సంఘాల నాయకులతో కలిసి వినతిపత్రం అందజేసింది. జిల్లాకు చెందిన మంత్రి అనుచరుల వేధింపుల వల్లే తాము రోడ్డున పడ్డామని గోడు వెళ్లబోసుకుంది. మృతురాలి భర్త శ్రీనివాసరావు, కుమార్తె జ్యోత్స్న, మాదిగ సంఘాల నాయకులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం జిల్లా మక్కువ మండలం డి.శిర్లాం పీహెచ్‌సీ పరిధిలో ఆశా వర్కర్‌గా పనిచేసిన పాందూరు విద్యావతిని టీడీపీ నాయకుడు డి.గౌరునాయుడు, పీహెచ్‌సీ వైద్యులు హరికృష్ణ వేధింపులకు గురిచేశారు. అనారోగ్యం కారణంగా గర్భిణులు, బాలింతలకు సకాలంలో వైద్య సేవలు అందించడం లేదంటూ తప్పుడు ఫిర్యాదు చేసి విద్యావతిని ఉద్యోగం నుంచి బలవంతంగా తొలగించారు. ఆమె ఉన్నతాధికారులను ఆశ్రయించి గోడు వినిపించింది. ఆరోగ్యంగా ఉన్నట్టు ధ్రువీకరణ పత్రం కూడా పొందింది. అయినప్పటికీ, అధికారులు ఆశా వర్కర్ ఉద్యోగం తిరిగి ఇవ్వలేదు. ఈ విషయాన్ని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి దృష్టిలో పెట్టినా కాలయాపన చేశారే తప్ప న్యాయం చేయలేదు. దీంతో విద్యావతి మానసికంగా కుంగిపోయి సెప్టెంబర్ 24న గుండెపోటుతో మృతి చెందినట్టు పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డికి ఇచ్చిన వినతి పత్రంలో బాధితులు పేర్కొన్నారు. ఆశా వర్కర్ మృతికి కారణమైన గౌరునాయుడు, వైద్యుడు హరికృష్ణపై కేసును నమోదుచేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. మృతురాలి కుటుంబానికి ఉద్యోగంతోపాటు రూ.కోటి పరిహారం, ఐదు ఎకరాల భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పులి డేవిడ్, ప్రధాన కార్యదర్శి మారిశెట్టి ఆనందరావు, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు మామిడి కృపారావు, ఏఎస్పీ ప్రధాన కార్యదర్శి బొద్దాన అప్పారావు, మృతురాలి భర్త శ్రీనివాసరావు, కుమార్తె జ్యోత్స్న ఉన్నారు.

నెహ్రూ విశ్వాస ఘాతుకం

జిన్నా ఒత్తిడికి లొంగిపోయి వందేమాతరాన్ని ముక్కలు చేశారు

- ముస్లింలను రెచ్చగొట్టేలా ఉందంటూ ముఖ్యమైన చరణాలు తొలగించారు
- సామాజిక సామరస్యం ముసుగులో బుజ్జగింపు రాజకీయాలు చేశారు
- వందేమాతరాన్ని ముక్కలు చేయడంతో చివరకు దేశం ముక్కలైంది
- లోక్‌సభలో ప్రధాని మోదీ ఆగ్రహం
- ప్రత్యేక చర్చను ప్రారంభించిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ: మహోన్నతమైన వందేమాతరం గీతాన్ని కాంగ్రెస్ పార్టీ ముక్కలు చేసిందని, ఈ గీతం విషయంలో జవహర్‌లాల్ నెహ్రూ విశ్వాస ఘాతుకానికి పాల్పడ్డారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు. ముస్లిం లీగ్ నాయకుడు మహమ్మద్ అలీ జిన్నా ఒత్తిడికి నెహ్రూ లొంగిపోయారని, వందేమాతరం ముస్లింలను రెచ్చగొట్టేలా ఉందంటూ గీతంలో ముఖ్యమైన చరణాలు తొలగించారని మండిపడ్డారు. వందేమాతరం 150 వార్షికోత్సవం పై సోమవారం లోక్‌సభలో ప్రత్యేక చర్చను ప్రధాని మోదీ ప్రారంభించారు. జాతీయ గీతానికి అన్యాయం చేసిందెవరో భవిష్యత్తు తరాలకు చెప్పాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. జిన్నా నేతృత్వంలోని ముస్లిం లీగ్ 1937లో వందేమాతరానికి వ్యతిరేకంగా ఉద్యమంగా ప్రచారం చేసిందని వెల్లడించారు. దుష్ప్రచారాన్ని అడ్డుకోవాల్సిన కాంగ్రెస్, నెహ్రూ అందుకు వత్తాసు పలికారు, గీతాన్ని ముక్కలు చేశారని ధ్వజమెత్తారు. జిన్నా వ్యతిరేకించిన తర్వాత నేతాజీ సుభాష్‌చంద్రబోస్‌కు నెహ్రూ లేఖ రాశారని, వందేమాతరం గీతం ముస్లింలను రెచ్చగొట్టేలా, అసహనం కలిగించేలా ఉందంటూ ఆ లేఖలో పేర్కొన్నారని మోదీ గుర్తుచేశారు. 1937లో కోల్‌కతాలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఈ గీతానికి నిజంగా అంత గొప్పదనం ఉందా? అంటూ సమీక్ష చేశారని తెలిపారు. అప్పట్లో కాంగ్రెస్ తీరు చూసి దేశంమొత్తం దిగ్భ్రాంతికి గురైందని, ఆ పార్టీకి వ్యతిరేకంగా నిరసన ర్యాలీలు జరిగాయని వెల్లడించారు. సామాజిక సామరస్యం ముసుగులో వందేమాతరాన్ని ముక్కలు చేయడం ద్వారా దేశాన్ని బుజ్జగింపు రాజకీయాల దిశగా నడిపించారని, చివరకు దేశం ముక్కలైందని ఆవేదన వ్యక్తంచేశారు.

గాంధీజీ కోరినా అన్యాయం చేశారు

''బంకిం దా(బంకించంద్ర చటర్జీ) 1875లో వందేమాతరం గీతం రాశారు. వెంటనే ఇది స్వాతంత్య్ర సమరయోధుల గళంలో నినాదంగా మారింది. దేశ స్వాతంత్య్ర పోరాటానికి కొత్త శక్తినిచ్చింది. ప్రజల సంకల్పానికి ఒక ప్రతీకగా మారింది. బ్రిటిష్ సామ్రాజ్యానికి బలమైన సవాలుగా నిలిచింది. వందేమాతరాన్ని నిషేధించడానికి బ్రిటిష్ పాలకులు ఎన్నో కుట్రలు చేశారు. ఈ గీతాన్ని ప్రచురించడం, ఆలపించడంపై చట్టాలు తీసుకొచ్చారు. ఎవరు ఎన్ని కుతంత్రాలు సాగించినా బంకించంద్ర చటర్జీ వెనక్కి తగ్గలేదు. ఆత్మస్థైర్యంతో సవాలను ఎదుర్కొన్నారు. వందేమాతరం ఇచ్చిన బలంతో కొనసాగుతున్న స్వాతంత్య్ర పోరాటం పట్ల బ్రిటిషర్లు ద్వేషం ప్రదర్శించారు. 1905లో బెంగాల్‌ను విభజించారు. అయినా సరే వందేమాతరం ఒక శిలా స్తంభంగా నిలిచే ఉంది. గత శతాబ్దంలో వందేమాతరం చాలా ప్రాచుర్యం పొందింది. దీన్ని జాతీయ గీతం మార్చాలని కోరుతూ మహాత్మాగాంధీ 1905లో లేఖ రాశారు. అయినప్పటికీ గీతానికి అన్యాయం జరిగింది. గాంధీజీ అభిమతాన్ని కూడా లెక్కచేయని శక్తివంతులైన వ్యక్తులెవరో ప్రజలు తెలుసుకోవాలి.



ఎలాంటి సవాలునైనా తిప్పికొట్టగలం

దేశానికి సవాళ్లు ఎదురైనప్పుడల్లా వందేమాతరం ఇచ్చిన స్ఫూర్తితో దీటుగా ప్రతిస్పందిస్తున్నాం. చరిత్రలో కొన్ని ఘట్టాలను పక్కనపెడితే.. ప్రతికూల పరిస్థితుల్లో దేశం ఒక్కటవుతోంది. ఆహార భద్రత సంక్షోభం ఎదురైనప్పుడు మన రైతులు పెద్ద ఎత్తున ఆహార ధాన్యాలు పండించి ప్రజల ఆకలి తీర్చారు. ఇందుకు వందేమాతరం స్ఫూర్తి. ఎమర్జెన్సీ మైండ్‌సెట్‌ను కూడా ఈ స్ఫూర్తి ఓడించింది. యుద్ధాలు జరిగినప్పుడు మన సైనికులు శత్రువులను చిత్తు చేశారు. కోవిడ్–19 సంక్షోభాన్ని కలిసికట్టుగా అధిగమించాం. వందేమాతరం మనకు సమైక్యత, బలం, సామర్థ్యాన్ని అందిస్తోంది. ఎలాంటి సవాలునైనా మనం తిప్పికొట్టగలం. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్య సాధనకు ఇది కేవలం ఒక గీతం కాదు. [illegible]మైన స్ఫూర్తి. 'స్వదేశీ' నినాదానికి మరింత బలం చేకూర్చాలి. వందేమాతరం మన మంత్రం. వందేమాతరం సేవద్భావాన్ని పరిశీలిస్తే ఆసక్తికరమైన విషయాలు తెలుస్తాయి. ఇది విలువల ప్రవాహం. వేదాల్లోని సత్యాన్ని చాటిచెబుతోంది. భూమి మన తల్లి, మనం ఈ భూమి బిడ్డలం అని తెలియజేస్తుంది'' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. మోదీ ప్రసంగిస్తున్న సమయంలో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు అడ్డుతగలడానికి పలుమార్లు ప్రయత్నించారు. నినాదాలు చేశారు. మోదీ స్పందిస్తూ కాంగ్రెస్ పార్టీ విధానాలను తృణమూల్ కాంగ్రెస్ ఔట్‌సోర్సింగ్‌కు తీసుకున్నట్లుగా కనిపిస్తోందని చురక అంటించారు.

ఆనాటి వైభవాన్ని పునరుద్ధరించాలి

''పవిత్రమైన వందేమాతరం మనకు గర్వకారణం. 150వ వార్షికోత్సవం సందర్భంగా ఈ చరిత్రాత్మక ఘటానికి సాక్షిగా నిలుస్తున్నందుకు మనమంతా గర్వించాలి. వందేమాతరం దశాబ్దాలుగా మనకు నిరంతరం స్ఫూర్తినిస్తూనే ఉంది. గీతానికి 50 ఏళ్లు పూర్తయిన సమయంలో మన దేశం బ్రిటిష్ పాలనలో ఉంది. 100 ఏళ్లు పూర్తయినప్పుడు దేశం ఎమర్జెన్సీ పడగ నీడలో ఉంది. అప్పట్లో దేశభక్తులను జైల్లో పెట్టారు. రాజ్యాంగం గొంతు కోశారు. దురదృష్టవశాత్తూ ఎమర్జెన్సీ సమయంలో చీకటి కాలం నడిచింది. గీతానికి ఇప్పుడు 150 ఏళ్లు పూర్తయ్యాయి. దేశానికి స్వాతంత్య్రం సాధించిపెట్టిన వందేమాతరం వైభవాన్ని పునరుద్ధరించడానికి ఇదొక గొప్ప అవకాశం'' అని మోదీ అన్నారు.

భారతీయ విశ్వాసాలకు ప్రతీక



''వందేమాతరం భారతీయ విశ్వాసాలు, విలువలకు ప్రతీక. ఈ గీతం దేశ సామరస్యం, బలాన్ని, సంస్కృతిని, మాతృత్వాన్ని సూచిస్తుంది. నేటికీ ప్రతి భారతీయుల గుండెల్లో ప్రతిధ్వనిస్తూనే ఉంది. స్వాతంత్య్ర పోరాటంలో లక్షల మందిని ముందుకు నడిపించింది. పరాయి పాలన నుంచి దేశానికి విముక్తి కల్పించాలన్న స్ఫూర్తిని రగిలించింది. దేశ సంకల్పానికి గుర్తుగా నిలిచింది.'' - ఓం బిర్లా, లోక్‌సభ స్పీకర్

వందేమాతరం ముస్లింలకు వ్యతిరేకం కాదు



''వందేమాతరం గీతం ముస్లింలకు వ్యతిరేకంగా ఉన్నట్లు ఇన్నాళ్లూ తప్పుడు ప్రచారం జరిగింది. అప్పట్లో బెంగాల్ నవాబ్, బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రజల అభిప్రాయాలనే ఇందులో ప్రస్తావించారు. కరువు కాలంలో పన్నుల పేరిట ప్రజలను పీడించిన పాలకుల గురించి ఆనంద్‌మఠ్ గ్రంథంలో రాశారు. ఆ గ్రంథంలోనే వందేమాతరం తొలుత ప్రచురితమైంది. దాంతో ఈ గీతం ముస్లింలకు వ్యతిరేకమనే వాదన మొదలుపెట్టారు. వందేమాతరం ముస్లింలకు వ్యతిరేకం అన్న వాదనలు ఏమాత్రం వాస్తవం లేదు. నిజాలు బహిర్గతం చేయడానికి ఇదే సరైన సమయం. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన తర్వాత వందేమాతరం స్థాయిని తగ్గించే ప్రయత్నం జరిగింది. తొలగించిన చరణాలు భారతీయతను వివరిస్తాయి. పూర్తి గీతం గురించి అందరూ తెలుసుకోవాలి''

- రాజ్‌నాథ్ సింగ్, రక్షణ శాఖ మంత్రి

బీజేపీ నేతలకు వందేమాతరం అర్థం తెలుసా?

''ఒకరి విశ్వాసాలను మరొకరిపై రుద్దడానికి వందేమాతరం గీతాన్ని ఆయుధంగా వాడుకోవాలని చూడడం సరైంది కాదు. భారతదేశ స్వాతంత్య్ర పోరాటంలో ఏనాడూ పాల్గొనని బీజేపీ నాయకులు ఇప్పుడు వందేమాతరం విలువల గురించి మాట్లాడుతున్నారు. వందేమాతరం స్ఫూర్తిని యథాతథంగా అలవర్చుకోవాలి. సొంతం ప్రయోజనాల కోసం దాన్ని వాడుకోవడం దారుణం. జాతీయ గీతాన్ని వారే సృష్టించినట్లు అధికార పార్టీ నాయకులు డ్రామాలాడుతున్నారు. ప్రజలను ఏమార్చాలని చూస్తున్నారు. జాతీయ గీతం రాజకీయ ఆయుధం కాకూడదు. బీజేపీ నాయకులకు వందేమాతరం అర్థం తెలుసా? విభజన శక్తులు ప్రజల్లో చిచ్చు పెట్టడానికి వందేమాతరం గీతాన్ని వాడుకుంటున్నాయి''

- అఖిలేశ్ యాదవ్, సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ

హిందువులకే సొంతమన్నట్లు చిత్రీకరించారు

వందేమాతరం గీతం హిందువులకే సొంతం అన్నట్లుగా 20వ శతాబ్దం మొదట్లో చిత్రీకరించారు. దీంతో ముస్లింలకు సంబంధం లేదన్నట్లుగా అసంబద్ధమైన వాదన తీసుకొచ్చారు. వందేమాతరం హిందువులదే అని చెప్పిన వ్యక్తులే అసలు వివాదానికి కారకులు. హిందువులకు ఈ గొడవతో సంబంధం లేదు. వందేమాతరాన్ని ముక్కలు చేయడం వల్లే దేశం ముక్కలైందని ప్రధాని మోదీ ఆరోపించడం గర్హనీయం. వందేమాతరం స్ఫూర్తిని అందరూ అందిపుచ్చుకోవాలి''

- ఎ.రాజా, డీఎంకే ఎంపీ

బెంగాల్ ఎన్నికల కోసమే బీజేపీ ఆరాటం

వచ్చే ఏడాది జరిగే పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో విజయంపై బీజేపీ దృష్టిపెట్టింది. రాజకీయ లబ్ధి కోసం వందేమాతరాన్ని వాడుకుంటోంది. వందేమాతరం ఆత్మను బీజేపీ హత్య చేస్తోంది. 1937 నాటి కాంగ్రెస్ తీర్మానం కంటే ఇప్పుడే ఎక్కువ అన్యాయం జరుగుతోంది. సరిగ్గా బెంగాల్ ఎన్నికల ముందే వందేమాతరంపై పార్లమెంట్‌లో చర్చ చేపట్టారంటే బీజేపీ అసలు ఉద్దేశం ఏమిటో అర్థం చేసుకోవచ్చు. జాతీయ గీతాన్ని బీజేపీ నాయకులు సరిగ్గా ఆలపించగలరా? స్వాతంత్య్ర పోరాటంతో సంబంధం లేదని వ్యక్తులు నేడు వందేమాతరానికి సంరక్షకులమని చెప్పుకుంటున్నారు. బీజేపీ పాలనలో వందేమాతరం స్ఫూర్తి ఎక్కడా అమలు కావడం లేదు. ప్రభుత్వ నిర్వాకాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే వందేమాతరంపై చర్చ సాగిస్తున్నారు''.

- మహువా మొయిత్రా, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ

బెంగాల్ ఎన్నికల కోసమే ఈ డ్రామా

- జాతీయ గేయాన్ని నెహ్రూ వ్యతిరేకించలేదు
- బోస్‌కు ఆయన లేఖను వక్రీకరించిన ప్రధాని
- తొలి ప్రధానిపై ఎన్నాళ్లిలా బురదజల్లుడు?
- దమ్ముంటే నెహ్రూపై చర్చకు రండి
- సభలో ప్రధానికి ప్రియాంక సవాల్

న్యూఢిల్లీ: వందేమాతరంపై పార్లమెంటులో చర్చించాల్సిన అవసరం అసలు ఏముందని కేంద్ర ప్రభుత్వాన్ని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ నిలదీశారు. కేవలం పశ్చిమ బెంగాల్‌లో రానున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే ప్రధాని నరేంద్ర మోదీ ఈ డ్రామాకు తెర తీశారంటూ దుయ్యబట్టారు. తొలి ప్రధాని నెహ్రూ వందేమాతరాన్ని అవమానించారన్న మోదీ ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. వందేమాతర రచయిత బంకించంద్ర చటర్జీ బెంగాలీ గనుక, ఆ గేయంపై చిచ్చు రాజేసి ఓట్లు రాబట్టుకోవడమే మోదీ పన్నాగమని ఆరోపించారు. 'ఇందుకోసం బెంగాల్ కే చెందిన మరో స్వాతంత్య్ర సమరయోధుడు సుభాష్ చంద్ర బోస్ కు నెహ్రూ రాసిన లేఖను మోదీ అడ్డం పెట్టుకుంటున్నారు. కానీ మోదీ ఆరోపించినట్టుగా వందేమాతరంలోని కొన్ని చరణాలు ముస్లింలను కించపరిచేలా ఉన్నాయని నెహ్రూ ఎన్నడూ అనలేదు. పైగా మోదీ చెబుతున్నట్టుగా వాటిని తీసేయించనూ లేదు. నిజంగా ఆయన అలా చేసి ఉంటే వందేమాతరంలోని తొలి రెండు చరణాలనే జాతీయ గేయంగా ఆమోదించిన రాజ్యాంగ అసెంబ్లీలో సభ్యుడైన ఆరెస్సెస్ నేత శ్యామా ప్రసాద్ ముఖర్జీ అభ్యంతర పెట్టలేదేం?'అని ప్రశ్నించారు. ముస్లిం సంతుష్టీకరణ కోసం నాటి ముస్లిం లీగ్ నేత జిన్నా డిమాండ్ కు లొంగి వందేమాతరంలోని పలు పంక్తులను నెహ్రూ తొలగించారని మోదీ పార్లమెంటులో ఆరోపించడం తెలిసిందే. ఈ విషయమై నెహ్రూ రాసిన లేఖే ఇందుకు రుజువని ఆయన చెప్పారు. ఇదంతా పచ్చి అబద్ధమని ప్రియాంక స్పష్టం చేశారు. వందేమాతర గేయానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పార్లమెంటులో చేపట్టిన ప్రత్యేక చర్చలో సోమవారం ఆమె పాల్గొన్నారు. నెహ్రూపై మోదీ ఆరోపణలన్నింటినీ పూర్తిస్థాయిలో తిప్పికొట్టారు. వందేమాతరంలోని కొన్ని పంక్తులపై నెహ్రూ అభ్యంతరాలు లేవనెత్తారన్నది నాటి మతోన్మాద శక్తుల దుష్ప్రచారమే తప్ప అందులో నిజం లేదని ఆమె చెప్పారు. బోస్ కు నెహ్రూ లేఖలో కొద్ది భాగాన్ని మాత్రమే తన వాదనకు అనువుగా మోదీ అన్వయించుకున్నారని ఆక్షేపించారు. 'నెహ్రూపై మీకెందుకీ అకారణ ద్వేషం? మీకు గనుక దమ్ముంటే నెహ్రూపై మీరు చేస్తాను అన్ని ఆరోపణల మీదా పూర్తి స్థాయిలో ముందుగా సభలో చర్చ చేపడదాం రండి. ఆ తర్వాత ఈ అంశానికి మీరు శాశ్వతంగా తెర వేయాలి. మీ రాజకీయ ప్రయోజనం కోసం అవసరమైనప్పుడల్లా నెహ్రూపై బురదజల్లడాన్ని మానుకోవాలి' అంటూ మోదీ సర్కారుకు సవాలు ప్రియాంక విసిరారు. 'కనీసం ఆ తర్వాతైనా ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం వంటి నిజమైన సమస్యలపై చర్చిద్దాం. తద్వారా సభా సమయాన్ని సద్వినియోగం చేద్దాం' అని సూచించారు. 'మోదీ దాదాపు 12 ఏళ్లుగా ప్రధానిగా ఉంటున్నారు. దేశం కోసం పోరాడినందుకు నెహ్రూ దాదాపు అంతేకాలం జైల్లో గడిపారు' అంటూ తూర్పారబట్టారు.

మోదీలో భయం..

ప్రధానికి ఆత్మవిశ్వాసం నానాటికీ సన్నగిల్లుతోందని ప్రియాంక అన్నారు. 'కొద్ది రోజులుగా అది కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. మోదీ ఒకప్పటి మోదీ కాదు. అన్నింటికీ భయపడుతూ గడుపుతున్నారు. ఆయన విధానాలన్నీ దేశాన్ని నానాటికీ బలహీన పరుస్తుండటమే అందుకు కారణం'అని ప్రియాంక అన్నారు.

నేడు ఎస్ఐఆర్‌పై చర్చ

- చర్చను ప్రారంభించనున్న ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ
- చర్చకు 10 గంటల సమయం
- ప్రభుత్వం తరపున సమాధానం ఇవ్వనున్న న్యాయ శాఖ మంత్రి మేఘ్వాల్

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) సర్వే, ఎన్నికలపై సంస్కరణలపై మంగళవారం లోక్‌సభలో ప్రత్యేక చర్చ జరుగనుంది. మధ్యాహ్నం 12 గంటలకు చర్చను లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ ప్రారంభించనున్నారు. ఈ అంశంపై లోక్‌సభలో మొత్తంగా పది గంటల సమయం కేటాయించారు. కాంగ్రెస్ తరపున కేసీ వేణుగోపాల్, మనీష్ తివారీ, వర్ష గైక్వాడ్, మొహమ్మద్ జావైద్, ఉజ్వల్ రామన్ సింగ్, ఇషా ఖాన్ చౌదరి, మల్లు రవి, ఇమ్రాన్ మసూద్‌లు మాట్లాడతారు. తర్వాత ప్రభుత్వం తరపున కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ మేఘ్వాల్ బుధవారం చర్చకు సమాధానం ఇవ్వనున్నారు. చర్చ సందర్భంగా రాహుల్ గాంధీ 'ఓట్ల చోరీ', ఎన్నికల కమిషన్ జవాబుదారీతనం అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీసే అవకాశముంది. ఓటర్ల జాబితాలో గణనీయమైన వ్యత్యాసాలు, ఎన్నికల విధానాలను తారుమారు చేయడం వంటి అంశాలపై ఇప్పటికే ప్రతిపక్షాలు కేంద్రంపై విమర్శనాస్త్రాలు సంధించడం తెల్సిందే. మహారాష్ట్ర, హరియాణా, కర్ణాటక రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాల్లో తీవ్రమైన తప్పిదాలు జరిగాయని, ఓటరు జాబితా సవరణ పేరిట పెద్ద ఎత్తున నిజమైన పౌరుల ఓట్లను తొలగించారని, నకిలీ ఓట్లను కలిపారని రాహుల్ గత కొంతకాలంగా ఆరోపిస్తున్నారు. ఎస్ఐఆర్ కసరత్తు చాలా మంది బూత్ స్థాయి అధికారుల(బీఎల్ఓ) పాలిట శాపంగా తయారైందని, అందుకే తీవ్ర ఒత్తిడితో పలువురు చనిపోయారని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈ అంశాన్ని విపక్ష సభ్యులు సభలో లేవనెత్తేందుకు సిద్ధమయ్యారని తెలుస్తోంది.

కాంగ్రెస్ నుంచి కౌర్ సస్పెన్షన్

చండీగఢ్: పంజాబ్‌లో రూ.500 కోట్లు ఇచ్చిన వారికి ముఖ్యమంత్రి కుర్చీ దక్కుతుందంటూ సంచలన వ్యాఖ్యలతో కలకలం రేపిన రాష్ట్ర కాంగ్రెస్ నేత నవ్ జోత్ కౌర్‌ను సస్పెండ్ చేస్తూ పార్టీ నిర్ణయం తీసుకుంది. ఆమెను పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి తొలగిస్తున్నట్టు పీసీసీ చీఫ్ అమరీందర్ సింగ్ రజా వారియర్ సోమవారం ప్రకటించారు. అయితే, ఆలోపే రాష్ట్ర కాంగ్రెస్ పార్టీపై కౌర్ మరో బాంబు పేల్చారు. తారన్ తరన్ అసెంబ్లీ స్థానానికి ఇటీవల జరిగిన ఉప ఎన్నికలో టికెట్ కోసం కాంగ్రెస్ అభ్యర్థి కర్ణబీర్ సింగ్ బుర్జ్ ఇద్దరు పార్టీ నేతలకు రూ.10 కోట్లు ఇచ్చారని సస్పెన్షన్‌కు ముందు ఆమె ఆరోపించారు. ఈ ఆరోపణలను బుర్జ్ వెంటనే ఖండించారు. సస్పెన్షన్ అనంతరం కౌర్ మాట్లాడుతూ పీసీసీ చీఫ్ వారియర్ పై నిప్పులు చెరిగారు. ఆయనకు కోర్టు పట్ల, ప్రజల పట్ల నిబద్ధత, నైతికత, బాధ్యత వంటివి ఏ కోశానా లేవంటూ దుయ్యబట్టారు. సీఎం కుర్చీకి సంబంధించి తన వ్యాఖ్యలను వక్రీకరించారని చెప్పుకొచ్చారు. ''నా భర్త (పీసీసీ మాజీ చీఫ్, రాష్ట్ర మాజీ మంత్రి నవ్ జోత్ సింగ్ సిద్ధూ) ఏ ఇతర పార్టీ నుంచైనా సీఎం అభ్యర్థి అవుతారా అన్న మీడియా ప్రశ్నకు, అందుకు ఆఫర్ చేసేందుకు కావాల్సిన డబ్బులు మా దగ్గర లేవని మాత్రమే నేనన్నా'' అని ఆమె ఎక్స్ పోస్టులో చెప్పుకొచ్చారు. నిజం చెప్పినందుకు కౌర్ పై కాంగ్రెస్ పార్టీ ఫత్వా జారీ చేసిందని బీజేపీ నేత షెహజాద్ పూనావాలా ఎద్దేవా చేశారు.

థాయ్‌లాండ్ దాడులు

- నలుగురు కాంబోడియా పౌరులు మృతి
- ప్రతిదాడిలో ఒక థాయ్‌లాండ్ జవాను మృతి
- మళ్లీ ఇరుదేశాలపై కమ్ముకుంటున్న యుద్ధమేఘాలు

బ్యాంకాక్: మీరే మొదట కాల్పుల విరమణను ఉల్లంఘించారంటూ పరస్పర ఆరోపణలు చేసుకుంటూనే దక్షిణాసియా దేశాలు థాయ్‌లాండ్, కాంబోడియా మళ్లీ దాడుల్లో మునిగిపోయాయి. గత జూలైలో పరస్పర దాడులతో సరిహద్దు ప్రాంతవాసుల కంటి మీద కునుకులేకుండా చేసిన ఇరుదేశాలు మళ్లీ కయ్యానికి కాలు దువ్వుతున్నాయి. యుద్ధానికి ఆజ్యం పోసేలా కాంబోడియా సరిహద్దు ప్రాంతాలపై థాయ్‌లాండ్ సోమవారం వైమానిక దాడులు చేసింది. ఈ ఘటనలో నలుగురు కాంబోడియా పౌరులు చనిపోయినట్లు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. మరో 8 మంది గాయపడ్డారు. కాంబోడియా జరిపిన ప్రతిదాడిలో ఒక థాయ్‌లాండ్ జవాను చనిపోయాడు. దాడుల ధాటికి సరిహద్దు వెంట ఉన్న గ్రామాల నుంచి సోమవారం వేలాది మంది స్థానికులు బతుకుజీవుడా అంటూ తమ స్వస్థలాలను వదిలి సురక్షిత ప్రాంతాలకు తరలిపోయారు. సరిహద్దు వెంట పలు గ్రామాల్లో ప్రజలను ఇప్పటికే ఖాళీ చేయించామని కాంబోడియా సమాచార శాఖ మంత్రి నేథ్ ఫియాక్‌త్రా చెప్పారు. '' హింసను థాయ్‌లాండ్ ఎప్పుడూ కోరుకోదు. యుద్ధాన్నిగానీ సైనికచర్యనుగానీ థాయ్‌లాండ్ తనంతట తానుగా మొదలుపెట్టబోదు. కానీ దేశ ప్రజల భద్రతను పరిరక్షించేందుకు అవసరమైతే మరిన్ని దాడులు చేస్తాం. మా దేశ సార్వభౌమాధికారాన్ని ఉల్లంఘిస్తే ఊరుకునేది లేదు'' అని థాయ్‌లాండ్ ప్రధానమంత్రి అనుతిన్ చార్న్‌విరకూల్ చెప్పారు. '' మా దేశ సార్వభౌమత్వానికి ఇక ఎలాంటి ముప్పు లేదని తేలేదాకా దాడులు చేస్తూనే ఉంటాం'' అని థాయ్‌లాండ్ విదేశాంగ శాఖ అధికారులు చెప్పారు. జూలైలో కాంబోడియా, థాయ్‌లాండ్ ఘర్షణల్లో 48 మంది చనిపోయారు. 3,00,000 మంది తాత్కాలికంగా వేరే ప్రాంతాలకు తరలిపోయారు.

ఢిల్లీలో గోవా పోలీసుల తనిఖీలు

నైట్ క్లబ్ యజమానులు లూథ్రా సోదరులపై ఆరా

న్యూఢిల్లీ: అగ్ని ప్రమాదం సంభవించిన గోవాలోని 'బిర్చ్ బై రోమియో లేన్'నైట్ క్లబ్ యజమానులు గౌరవ్ లూథ్రా, సౌరభ లూథ్రాల న్యూఢిల్లీ నివాసానికి పోలీసు బృందం సోమవారం చేరుకుంది. హడ్సన్ లేన్‌లోని వారి ఇంట్లో తనిఖీలు చేయగా లూథ్రా సోదరులు కనిపించలేదు. వారి ఆచూకీని తెలుసుకోవడానికి కుటుంబ సభ్యులను పోలీసులు ప్రశ్నించారు. నైట్ క్లబ్ రోజువారీ కార్యకలాపాలను పర్యవేక్షించే భరత్ కోహ్లీని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో గోవా పోలీసులు ఇప్పటివరకు క్లబ్ చీఫ్ జనరల్‌మేనేజర్ రాజీవ్ మోడక్, జనరల్ మేనేజర్ వివేక్ సింగ్, బార్ మేనేజర్ రాజీవ్ సింఘానియా, గేట్ మేనేజర్ రియాన్షు ఠాకూర్‌లను అరెస్టు చేశారు. క్లబ్ మేనేజర్‌ను విచారిస్తుండగా భరత్ కోహ్లీ ప్రస్తావన రావడంతో.. ఆయనను అరెస్టు చేశారు.

బంగ్లాదేశ్‌లో జర్నలిస్ట్‌కు జైలు

ఢాకా: బంగ్లాదేశ్‌లో మహమ్మద్ యూనుస్ సర్కారును కూల్చేసేందుకు కుట్ర పన్నారన్న ఆరోపణలపై సీనియర్ జర్నలిస్టు, నేషనల్ ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షుడు షౌకత్ మహమూద్ ను స్థానికం కోర్టు కటకటాల్లోకి పంపింది. పోలీసులు ఆయనను ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. విదేశీ నిఘా సంస్థలతో కుమ్మక్కై ఈ మేరకు కుట్ర పన్నారంటూ ఉగ్రవాద వ్యతిరేక చట్టంలోని పలు అభియోగాలు మోపారు. విచారణ నిమిత్తం ఆయనను రిమాండ్ కు అప్పగించాలని కోరుతూ పోలీసులు గురువారం పిటిషన్ దాఖలు చేయనున్నారు.

తప్పని తిప్పలు

- సోమవారం 562 విమానాలు రద్దు
- ఇబ్బంది పడుతున్న జనం
- ప్రయాణికులకు రూ.827 కోట్లు రీఫండ్ చేసిన ఇండిగో

న్యూఢిల్లీ/ముంబై: ఇండిగో విమానాల రద్దు సంక్షోభం కొనసాగుతోంది. సోమవారం సైతం 562 ఇండిగో విమానాలు రద్దయ్యాయి. దేశంలోని ఆరు ప్రధాన నగరాల్లోని ఎయిర్‌పోర్టులో ఇండిగో విమానాల రద్దు పర్వం ఏడోరోజూ కొనసాగింది. ఢిల్లీ ఎయిర్‌పోర్టులో 250కిపైగా విమానాలు, బెంగళూరులో 150 ఇండిగో విమానసర్వీసులు రద్దయ్యాయి. హైదరాబాద్‌లో 112, ముంబైలో దాదాపు 100, చెన్నైలో 56 విమానాలు రద్దయ్యాయి. వందల విమానాల రద్దుతో కీలక నగరాల్లోని ఎయిర్‌పోర్టుల్లో అప్పటికే చేరుకున్న ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. కీలకమైన శస్త్ర చికిత్సలు, పెళ్లిళ్లు, బిజినెస్ మీటింగ్‌లు, విహార యాత్రల కోసం టికెట్ బుక్‌చేసుకుని పిల్లాపాపలతో వచ్చిన వందలాది మంది ప్రయాణికులు సోమవారం సైతం విమానాశ్రయాల్లో చేదు అనుభవాలను చవిచూడాల్సి వచ్చింది. దీంతో హడావుడిగా వేరే కంపెనీల విమానాల కోసం రెట్టింపు ధరలకు టికెట్లు కొనాల్సిన దురవస్థను ఏడో రోజూ విమానప్రయాణికులు ఎదుర్కొన్నారు.

అస్పష్ట వివరణ ఇచ్చిన ఇండిగో

వందల విమానాల రద్దుకు కారణాలను సోమవారం సాయంత్రంకల్లా చెప్పాలంటూ ఇండిగో చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పీటర్ ఎల్బర్స్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సీఓఓ ఇసిడర్ పోర్క్వెరస్‌లకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ షోకాజ్ నోటీస్ జారీచేసింది. దీనికి స్పందనగా పీటర్, ఇసిడర్‌లు సోమవారం ఒక వివరణను ఇచ్చారు. అస్పష్టంగా చేతులు దులిపేసుకునే ధోరణిలోనే ఆ వివరణ ఉండటం గమనార్హం. '' చిన్న చిన్న సాంకేతిక సమస్యల కారణంగా ఈ సమస్యకు అంకురార్పణ జరిగింది. శీతాకాలపు ప్రయాణికుల రద్దీతో మేం మార్చేసిన షెడ్యూల్, విపత్కర వాతావరణ పరిస్థితులు, రెండో దశవిమాన విధుల కాల పరిమితి(ఎఫ్‌డీటీఎల్) నిబంధనల అమలుతో పైలట్ల రోస్టర్ విధానం సమగ్ర అమలులో వైఫల్యాలు.. ఇవన్నీ జత కలిసి డిసెంబర్ తొలి వారంలో మా విమానరాకపోకల రేటింగ్‌ను కిందకు దిగజార్చాయి. మొత్తం ఉదంతానికి సంబంధించిన అసలు కారణాలను ఇప్పుడే చెప్పలేం. అయినా డీజీసీఏ సూచించిన ఎఫ్‌డీటీఎల్ నిబంధనలు మాకు పెద్ద సవాల్‌గా నిలిచాయి. దీంతో గతిలేక డిసెంబర్ ఐదో తేదీన అత్యంత కఠిన నిర్ణయం తీసుకున్నాం. మొత్తం వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకు రీబూట్ చేశాం. దీంతో వందలాది విమానాలను రద్దుచేయాల్సి వచ్చింది. ఈ విషయంలో మాత్రం ప్రయాణికులకు క్షమాపణలు చెబుతున్నాం. మా కంపెనీ కార్యకలాపాలు ఎంతో సంక్లిష్టమైన, విస్తృతమైన స్థాయిలో ఉంటాయి. అందుకే సమగ్ర స్థాయిలో మూల కారణాల విశ్లేషణ(రూట్ కాజ్ అనాలసిస్) చేయడానికి మాకు మరికొంత సమయం కావాలి. డీజీసీఏ జారీచేసిన షోకాజ్ నోటీస్ ప్రకారం చూసినా మేం ప్రతిస్పందన తెలియజేసేందుకు 15 రోజుల గడువు ఇంకా ఉంది.'' అని పీటర్, ఇసిడర్ వివరణ ఇచ్చారు. ఈ పొడిపొడి వివరణతో డీజీసీఏ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.

లగేజి బ్యాగులతో నిండిపోయిన ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ లాంజ్

తగు చర్యలు తీసుకుంటాం: డీజీసీఏ

''షోకాజ్ నోటీస్‌కు స్పందనగా ఇండిగో ఇచ్చిన వివరణను పరిశీలిస్తున్నాం. తలబిరుసుతనంతో చేయాల్సిందంతా చేసేసి మొసలి కన్నీరు కార్చినట్లుగా ఈ వివరణ ఉంది. సమగ్ర దర్యాప్తు తర్వాత అసలు కారణాలు తెలిశాక కారకులపై కఠిన చర్యలు తీసుకుంటాం'' అని ప్రభుత్వ వర్గాలు వెల్లడించినట్లు విశ్వసనీయ సమాచారం. ఇండిగో వివరణను కూలంకషంగా పరిశీలిస్తున్నామని డీజీసీఏ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. వివరణతో అసంతృప్తిగా ఉన్న డీజీసీఏ నలుగురు సభ్యుల ప్యానెల్.. ఇండిగో సీఈఓ, సీఓఓలను బుధవారం నేరుగా తమ ఎదుట హాజరై సంజాయిషీ ఇవ్వాలని కోరాలని భావిస్తోంది.

సగం బ్యాగులు వెనక్కి

చెకిన్ సందర్భంగా ప్రయాణికుల నుంచి అందుకున్న వేలాది బ్యాగులను తిరిగి అప్పగించే పనిని యుద్ధప్రాతిపదికన పూర్తిచేసున్నట్లు ఇండిగో ప్రకటించింది. 9,000 బ్యాగులను తీసుకున్నాం. వీటిలో ఇప్పటికే 4,500 లగేజీ బ్యాగులను తిరిగి ఇచ్చేశాం. వచ్చే 36 గంటల్లోపు మిగతా బ్యాగులనూ ముట్టచెప్తాం. ఇప్పటిదాకా టికెట్‌ల బుకింగ్‌కు సంబంధించి రూ.827 కోట్ల నగదును రీఫండ్ చేశాం. నవంబర్ 21–డిసెంబర్ 7 తేదీల మధ్య 9,55,591 టికెట్లను రద్దుచేశాం ''అని ఇండిగో సోమవారం పేర్కొంది.

జపాన్‌లో భారీ భూకంపం

సునామీ హెచ్చరికలు జారీ

టోక్యో: జపాన్ ఉత్తర తీరంలో సోమవారం భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై దీని తీవ్రత ఏకంగా 7.6గా నమోదవడంతో పసిఫిక్ తీర ప్రాంతాలకు జపాన్ అత్యంత ప్రమాదకర సునామీ హెచ్చరికలు జారీచేసింది. జపాన్ స్థానికకాలమానం ప్రకారం సోమవారం రాత్రి 11.15 గంటలకు ఆమోరి తీరం నుంచి సముద్రంలో 80 కిలోమీటర్ల దూరంలో సముద్ర ఉపరితలం నుంచి 50 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. అత్యంత శక్తిమంతమైన ప్రకంపనల కారణంగా తీరాల్లో దాదాపు 50 సెంటీమీటర్ల మేర సునామీ అలలు విరుచుకుపడే అవకాశముందని తొలుత హెచ్చరికలు జారీచేశారు. ఇవాటె పరిధిలోని కుజీ నౌకాశ్రయం వద్ద 50 సెంటీమీటర్ల ఎత్తులో సునామీ అలలు వచ్చాయి. మరి కొన్ని చోట్ల ఏకంగా 10 అడుగుల ఎత్తులో సునామీ అలలు విరుచుకుపడొచ్చని జపాన్ చీఫ్ కేబినెట్ కార్యదర్శి మినోరు కిహారా హెచ్చరించారు. తీరప్రాంతాల ప్రజలు తక్షణం ఎత్తయిన సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలని, సుదూరంలోని శిబిరాలకు తరలిపోవాలని హెచ్చరించారు. తీర ప్రాంతాల్లోని అణు విద్యుత్ కేంద్రాలకు ఏమైనా ముప్పు వాటిల్లిందో లేదో తెల్సుకునేందుకు సమగ్రస్థాయిలో తనిఖీలుచేపట్టామని వెల్లడించారు. ప్రాణ, ఆస్తినష్టంపై వివరాలు సేకరించేందుకు, పౌరులను కాపాడేందుకు తక్షణం అత్యయిక టాస్క్‌ఫోర్స్‌ను రంగంలోకి దింపామని జపాన్ మహిళా ప్రధాని సనాయీ తకాయిచి మీడియాతో చెప్పారు.

సాక్షి
గుంటూరు
మంగళవారం । 9 । డిసెంబర్ । 2025

పుస్తకం ఆవిష్కరణ

నరసరావుపేట: పల్నాడు జిల్లా నరసరావుపేటలో సోమవారం దివ్యాంగుల హక్కుల చట్టం–2016 పుస్తకాన్ని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా ఆవిష్కరించారు.



పులిచింతల సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 900 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 4400 క్యూసెక్కులు వదులుతున్నారు. నీటి నిల్వ 43.5481 టీఎంసీలు.



నిమ్మకాయల ధరలు

తెనాలి: తెనాలి మార్కెట్ యార్డులో సోమవారం క్వింటా నిమ్మ కాయలు కనిష్ట ధర రూ.1000, గరిష్ట ధర రూ.1600, మోడల్ ధర రూ.1300 వరకు పలికింది.

న్యూస్‌రీల్

అనాథ ఆశ్రమ పిల్లలకు అమృత హెల్త్ స్కీం

హెల్త్ కార్డులు పంపిణీ చేసిన కలెక్టర్

గుంటూరు వెస్ట్: ప్రభుత్వ గుర్తింపు పొందిన అనాథాశ్రమాల్లో నివసిస్తున్న అనాథ పిల్లల సంక్షేమం దృష్ట్యా ఎన్టీఆర్ వైద్యసేవ, అమృత హెల్త్ స్కీంను అమలు చేస్తామని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం హెల్త్ కార్డులను చిన్నారులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో ప్రభుత్వ గుర్తింపు పొందిన 39 మంది చిన్నారులకు ప్రత్యేక అమృత హెల్త్ కార్డులు పంపిణీ చేశామని తెలిపారు.

స్క్రబ్ టైఫస్‌పై అప్రమత్తంగా ఉండాలి

జిల్లాలో స్క్రబ్ టైఫస్ జ్వరాలతో మరణాలు సంభవించకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో సోమవారం అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వైద్య ఆరోగ్యశాఖను సమన్వయం చేసుకుంటూ పంచాయతీ, రెవెన్యూ శాఖలు ముందస్తు జాగ్రత్త చర్యలు పకడ్బందీగా తీసుకోవాలని తెలిపారు. ఈ జ్వరాలకు ఉపయోగించే మందులు ఉప ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

రూ.10 లక్షల విలువైన బయో ఉత్పత్తులు సీజ్

సత్తెనపల్లి: సత్తెనపల్లిలోని శ్రీ వెంకటేశ్వర రైతు సేవా కేంద్రంలో అనధికారికంగా నిల్వ ఉంచిన బయో ఉత్పత్తులను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం సీజ్ చేశారు. విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, వ్యవసాయ అధికారులు సంయుక్తంగా సోమవారం పట్టణంలో తనిఖీలు నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వర రైతు సేవా కేంద్రం దుకాణంలో అనధికారికంగా నిల్వ ఉంచిన రూ.10 లక్షల విలువైన బయో ఉత్పత్తులను సీజ్ చేసి, 6ఏ కేసు నమోదు చేశారు. అచ్చంపేట రోడ్డులోని నయనికరాజు ఎరువుల దుకాణంలో రూ.9.47 విలువైన ఉత్పత్తుల అమ్మకాలు నిలిపివేశారు. దాడుల్లో విజిలెన్స్ సీఐ కె.చంద్రశేఖర్, సీహెచ్. ఆదినారాయణ, సత్తెనపల్లి ఏడీఏ బి.రవిబాబు, సత్తెనపల్లి ఏవో బి.సుబ్బారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్, విత్తన చట్టాల జీఓ ప్రతులు దహనం

నకరికల్లు: కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చిన విత్తన, విద్యుత్ చట్టాల వల్ల రైతులు, సామాన్య ప్రజలు తీవ్రంగా నష్టపోతారని కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జి.పిచ్చారావు మండిపడ్డారు. విత్తన, విద్యుత్ చట్టాలకు సంబంధించిన జీఓ ప్రతులను చేజర్ల గ్రామంలో సోమవారం దహనం చేసి నిరసన తెలిపారు. రైతులకు నష్టం చేకూర్చే విధంగా ఉన్న చట్టాలను వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఈవూరి అప్పిరెడ్డి, ఆవుల వెంకటేశ్వర్లు, చట్టు కోటేశ్వరరావు, కొండానాయక్, ఈవూరి వెంకటేశ్వరరెడ్డి, ఈవూరి శ్రీనివాసరెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు.

వినాయకునికి సంకట హర చతుర్థి పూజలు

అమరావతి: ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన అమరావతిలోని అమరేశ్వరాలయంలో గల విఘ్నేశ్వరస్వామి ఉపాలయంలో సోమవారం సంకట హర చతుర్థి పూజలను ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకస్వామి జాగర్లపూడి శేషసాయిశర్మ విఘ్నేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. స్వామి వారికి వివిధ రకాల పుష్పాలు, గరికెతో విశేషాలంకారం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి ఉండ్రాళ్లను సమర్పించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

పెదకాకానిలో సంతకాల సేకరణ

మెడికల్ కళాశాలల ఆవశ్యకతను రైతులు, కూలీలకు వివరిస్తున్న అంబటి మురళీకృష్ణ

మహోద్యమ చరిత.. మహోజ్వల భవిత

కోటి సంతకాల సేకరణలో దూసుకు వెళ్తున్న పొన్నూరు నియోజకవర్గం

- మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత
- వైఎస్సార్ సీపీ పోరాటానికి స్పందన
- నియోజకవర్గంలో 65 వేల సంతకాలు పూర్తి
- వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఉద్యమంలా సంతకాల సేకరణ

సుద్దపల్లిలో రైతు కూలీలతో సంతకాలు చేయిస్తున్న అంబటి మురళీకృష్ణ

పొన్నూరు : చంద్రబాబు ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై చేపట్టిన పోరాటంలో పొన్నూరు నియోజకవర్గ ప్రజలంతా భాగస్వాములయ్యారు. పార్టీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆధ్వర్యంలో వైద్య, విద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా నియోజకవర్గంలోని పెదకాకాని, చేబ్రోలు, పొన్నూరు మండలం, పట్టణ పరిధిలో నిర్వహించిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి అంబటి మురళీకృష్ణ గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి, చంద్రబాబు చేస్తున్న మోసాన్ని వివరించారు. పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరంచేసి, వైద్యాన్ని ఉచితంగా అందించే కళాశాలలను దూరం చేసేందుకు చంద్రబాబు ప్రభుత్వం కుట్ర చేస్తుందని ప్రజలకు తెలియచేశారు. రాష్ట్రవ్యాప్తంగా కోటి సంతకాలలో భాగంగా నియోజకవర్గంలో ఇప్పటి వరకు 65 వేల సంతకాలు సేకరించారు. ప్రజలు కూడా చంద్రబాబు చేస్తున్న ద్రోహంపై మండిపడుతున్నారు. ఇలాంటి దుర్మార్గ ప్రభుత్వాన్ని ఎన్నడూ చూడలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యమానికి సంపూర్ణ మద్దతు

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ పొన్నూరు పట్టణంలో నిర్వహించిన నిరసన ర్యాలీలకు ప్రజల నుంచి భారీ స్పందన వస్తోంది. పెద్ద సంఖ్యలో పాల్గొని కోటి సంతకాల ఉద్యమానికి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నారు. నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ చేపట్టిన ర్యాలీకి వచ్చిన ప్రజాదరణ చూసి చంద్రబాబు ప్రభుత్వం పోలీసులతో అడ్డుకునేందుకు చేసిన ప్రయత్నించి విఫలమైంది. అయినా ప్రజలు వెనుకాడకుండా భారీ సంఖ్యలో ప్రదర్శనల్లో పాల్గొంటున్నారు. చంద్రబాబు ప్రభుత్వ మోసాల్ని అంబటి మురళీకృష్ణ ప్రసంగాల్లో ఎండగడుతున్నారు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేద ప్రజలకు ఉచితంగా విద్య, వైద్యం అందించాలని 17 మెడికల్ కళాశాలలకు శ్రీకారం చుట్టారని, ప్రస్తుత చంద్రబాబు ప్రభుత్వం వాటిని పూర్తి చేయాల్సింది పోయి ప్రైవేట్‌కు అప్పగించేందుకు ప్రయత్నాలు చేస్తోందని ప్రజలకు ఆయన వివరిస్తున్నారు. కరోనా కష్టకాలంలో ప్రభుత్వ వైద్యశాలలే ప్రజల ప్రాణాలను కాపాడాయని, ప్రజల ఆవేదనను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ప్రైవేటీకరణను విరమింపచేయాలని అంబటి మురళీకృష్ణ అధికారులకు విన్నపం చేశారు.

రేపు కోటి సంతకాల సేకరణ ర్యాలీ

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా బుధవారం నియోజకవర్గంలో 65 వేలు పూర్తయిన సందర్భంగా పొన్నూరు నియోజకవర్గంలో ర్యాలీ నిర్వహించనున్నట్లు పార్టీ కార్యాలయ సిబ్బంది తెలిపారు. 10న ఉదయం 9 గంటలకు పొన్నూరు పట్టణంలో, అనంతరం చేబ్రోలు, పెదకాకాని గ్రామాల్లో ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పోరాటం ఆగదు

ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ చేయాలనే చంద్రబాబు ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ చేపట్టిన ప్రజా ఉద్యమానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను విరమింప చేసే వరకు పోరాటాన్ని ఆపే ప్రసక్తే లేదు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకే జగనన్న ఆదేశాల మేరకు కోటి సంతకాల సేకరణను మొదలు పెట్టాం. ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతోపాటు పెద్ద ఎత్తున గ్రామస్తులు స్వచ్ఛందంగా సంతకాలు చేశారు.

–అంబటి మురళీకృష్ణ, వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, పొన్నూరు

ప్రభుత్వ పరిధిలోనే ఉండాలి

మెడికల్ కళాశాలలు ప్రభుత్వం పరిధిలోనే ఉండాలి. వైద్యం, విద్య రెండూ ప్రభుత్వ రంగాల్లో ఉంటేనే ప్రజలకు మేలు జరుగుతుంది. ఇప్పటికే రెండూ ఖరీదు కావడంతో ఇబ్బందులు పడుతున్నాం. చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయం వెనక్కి తీసుకోవాలి. లేకపోతే వైద్య విద్య పేదలకు అందని ద్రాక్షగా మారుతుంది.

– పఠాన్ జాన్ సైదా, మామిళ్ళపల్లి, పొన్నూరు మండలం

సంతకాల డిజిటలైజేషన్

వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీ కృష్ణ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో చేపట్టిన కోటి సంతకాల సేకరణ ముమ్మరంగా సాగుతోంది. చంద్రబాబు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలంతా వ్యతిరేకిస్తున్నారు. చంద్రబాబు పనితీరును వ్యతిరేకిస్తున్నారు. స్వచ్ఛందంగా సంతకాలు చేసి తమ అభిప్రాయాన్ని తెలియజేస్తున్నారు. కోటి సంతకాలలో భాగంగా నియోజకవర్గంలో ప్రజల నుంచి సేకరించిన 65 వేల సంతకాలను విద్యార్థి, యువజన విభాగాల ఆధ్వర్యంలో డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేశారు.

సంతకాలను డిజిటలైజ్ చేస్తున్న యువకులు

అధికారుల తీరుపై ఎమ్మెల్యే గరం గరం

గుంతలు పూడుస్తున్న గుంటూరు టీడీపీ పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి

- గతంలో ప్రొటోకాల్‌పై టీడీపీ ఎమ్మెల్యే గల్లా మాధవి ఆవేదన
- తాజాగా గుంతల రోడ్డును స్వయంగా పూడ్చి అధికారుల నిర్లక్ష్యంపై మండిపాటు

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్) : పశ్చిమ నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే గల్లా మాధవి అధికారుల తీరుపై మరోసారి నిరసన గళం విప్పారు. ప్రజలు అడిగే చిన్న చిన్న సమస్యలను పరిష్కరించడంలోనూ అధికారులు విఫలం అవుతున్నారని, దీని వల్ల నియోజకవర్గంలో ప్రజల ముందుకు వెళ్లలేని పరిస్థితులు వస్తున్నాయని తెలిపారు. గతంలో జరిగిన నగర పాలక సంస్థ కౌన్సిల్‌లో సమావేశంలో ఎమ్మెల్యే గల్లా మాధవి అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఇటీవల తుపాను ఫాన్ కారణంగా నగరంలో ప్రభుత్వం సాయం అందించే కార్యక్రమాలను కనీసం సమాచారం ఇవ్వకుండానే కమిషనర్, మేయర్ ప్రొగ్రాం డిజైన్ చేయడంపై మండిపడ్డారు. దీనిని ఖండిస్తూ ఎమ్మెల్యే గల్లా ప్రత్యేకంగా ప్రెస్ మీట్ పెట్టి మరి అధికారులను, మేయర్ తీరును కడిగి పారేశారు. రేషన్ డీలర్ల ఆక్రమాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తాజాగా గుంతల రోడ్డుకు ప్యాచ్ వేసి మరోసారి అధికారుల తీరును ఎండగట్టారు.

పశ్చిమ నియోజకవర్గంలో రోడ్లు అధ్వానం

గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఎందుకు ఉన్నారో.. ఏ పని చేస్తున్నారో తెలియడం లేదని ఎమ్మెల్యే గల్లా మాధవి ఆరోపించారు. పశ్చిమ నియోజకవర్గంలో రోడ్లు అధ్వానంగా ఉన్నా కనీసం తట్ట మట్టి కూడా వెయ్యకపోవడం సిగ్గుచేటని తెలిపారు. స్వయంగా తానే నియోజకవర్గంలో బైక్‌పై తిరిగి రోడ్ల అధ్వాన పరిస్థితిని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్ల పరిస్థితిపై ఆర్ అండ్ బీ డిపార్ట్‌మెంట్ అనేక సమీక్షలు నిర్వహించినప్పటికీ ఎటువంటి ఫలితం లేదని తెలిపారు. తన ఇంటి ముందే రోడ్లు అధ్వానంగా ఉన్నాయని సోషల్ మీడియా వేదికగా విమర్శలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో సొంత నిధులతో రోడ్డుపై గుంతలు పూడుస్తానని తెలిపారు. నగరపాలక సంస్థ అధికారులు నియోజకవర్గ అభివృద్ధిలో ఫెయిల్ అయ్యారని ఆమె ఆరోపించారు.

ఖాకీ తండ్రి...కంత్రీ కొడుకు

- పోలీసు శాఖలో ఏఎస్ఐగా పనిచేస్తున్న తండ్రి
- పోలీసు రికార్డుల్లో కొడుకుపై రౌడీషీట్
- చిలకలూరిపేట జాతీయ రహదారిపై ప్రమాదం
- ఈజీ మనీ కోసం ఐదుగురి ప్రాణాలు బలిగొన్న కుమారుడు
- ఏఎస్ఐ కుమారుడి పాత్ర ఉండటంతో గోప్యంగా విచారణ
- న్యాయం చేయాలని చిలకలూరిపేటకు వచ్చిన మృతుల కుటుంబ సభ్యులు

చిలకలూరిపేట రూరల్ పోలీస్‌స్టేషన్ వద్ద పోలీసు ఉన్నతాధికారులు

సాక్షి, నరసరావుపేట: పెడదారిపడుతున్న కొడుకును మందలించి దారిలో పెట్టాల్సిన తండ్రి తనయుడి మోసాలను చూసీచూడనట్టు వదిలేశాడు. కన్న పేగు మమకారంతో తన అధికారాన్ని అడ్డు పెట్టుకొని ఇప్పటికే నమోదైన కేసుల్లో బయట పడేలా చేస్తుండటం ఆ కొడుకు మరింత రెచ్చిపోయేలా చేసింది. ఈ క్రమంలో ఈజీ మనీకి అలవాటుపడిన ఓ ఏఎస్ఐ కొడుకు చేసిన నిర్వాకానికి ఏకంగా ఐదుగురు ఇంజినీరింగ్ విద్యార్థులు మృత్యువాత పడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన చిలకలూరిపేట నేషనల్ హైవే రోడ్డు ప్రమాద ఘటనలో విస్తుపోయే వాస్తవాలు వెలుగుచూస్తున్నాయి. అక్రమ సంపాదనకు అలవాటు పడిన ముఠా జాతీయ రహదారిపై వాహనాలు ఆపి నగదు వసూలు చేసే క్రమంలో ఈ ప్రమాదం జరిగినట్టు పోలీసు విచారణలో తేలింది.

నకిలీ రవాణాశాఖ అధికారుల పేరుతో...

చిలకలూరిపేట బైపాస్ సమీపంలో జాతీయ రహదారిపై ఈనెల 4న జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఐదుగురు ఇంజినీరింగ్ విద్యార్థులు మృతి చెందారు. వినుకొండ రూరల్ మండలంలో అయ్యప్పస్వామి భజనకు హాజరుకావడానికి గుంటూరు నుంచి వెళ్తున్న కారు ట్రాక్టర్ల లోడ్‌తో వెళ్తున్న ట్రాలర్‌ను ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. ట్రాలర్‌ను ముందుగా వెళ్తున్న కారులోని వ్యక్తులు ఆపడంతో ప్రమాదం జరిగినట్టు సీసీ టీవీ ఫుటేజ్ ద్వారా వెల్లడైంది. దీనిపై కేసు నమోదు చేసిన నాదెండ్ల పోలీసులు విచారణ చేపట్టారు. అక్రమ వసూళ్లకు పాల్పడే ముఠా ట్రాలర్‌ను ఆపినట్టు నిర్ధారించారు. ఈ కేసులో నిందితులుగా భావిస్తున్న నరసరావుపేటకు చెందిన ఏఎస్ఐ కుమారుడు వెంకట్ నాయుడు, చిన్నతురకపాలేనికి చెందిన ఎస్కే బాషా, బాలయ్యనగర్‌కు చెందిన వెంకట్రావ్, నకరికల్లు మండలం నర్సింగపాడుకు చెందిన గోపి, మహేష్‌లు పోలీసుల అదుపులో ఉన్నట్టు సమాచారం. వీరికి పోలీసులు తమదైన స్టైల్‌లో విచారించగా నలుగురు తమకేమీ తెలియదని బుకాయించినప్పటికీ, ఒకరు మాత్రం నిజం ఒప్పుకున్నట్టు తెలుస్తోంది. హైవేపై వెళ్తున్న లారీలను రవాణాశాఖ అధికారుల పేరిట ఆపి నగదు వసూలు చేయడం కోసమే ఆపాం అని, అయితే అనుకోని విధంగా ప్రమాదం జరిగిందని చెప్పుకొచ్చినట్టు తెలియవచ్చింది.

పోలీసు దందాలకు నాయకుడు రౌడీషీటర్

ఐదుగురు యువకుల మరణానికి కారణమైన ఏఎస్ఐ కుమారుడిపై నరసరావుపేట రూరల్ పోలీసుస్టేషన్‌లో రౌడీషీట్ నమోదై ఉంది. పదుల సంఖ్యలో చీటింగ్, చోరీలు, హత్యాయత్నం వంటి తీవ్రమైన నేరారోపణలో కేసులు నమోదయ్యాయి. ఇటువంటి రౌడీషీటర్లను తరచూ పోలీసుస్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తుండాలి. ఈ పోలీసు కంత్రీ కుమారుడిని ఇటీవల కాలంలో స్టేషన్‌కి పిలిచి కౌన్సెలింగ్ చేపట్టిన దాఖలాలు లేవని రూరల్ పోలీసు సిబ్బంది చెబుతున్నారు. తండ్రికి ఉన్నతాధికారులతో ఉన్న సత్సంబంధాలతో రౌడీషీటర్ల కౌన్సెలింగ్‌కు వెళ్లాల్సిన పనిలేకుండా సెట్ చేశారట. గతేడాదిగా సదరు రౌడీషీటర్‌తో పోలీసు ఉన్నతాధికారులు మామూళ్ల వసూళ్లకు ఏజెంట్‌గా నియమించినట్టు తెలుస్తోంది. నెలవారీ మామూళ్లను ఈ రౌడీషీటరే తండ్రి తరపున వెళ్లి బెదిరించి మరీ వసూళ్లు చేసేవాడని పోలీసు వర్గాలే చెప్పుకొస్తున్నాయి. తమ శాఖలోని కొందరు ఉన్నతాధికారులు అండతో తండ్రీకొడుకులు రెచ్చిపోయారని, అయినా ఏం చేయలేక మిన్నుకుండిపోయామని వాపోతున్నారు. ఇంత జరుగుతున్నా సదరు ఏఎస్ఐపై చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. గతంలో కోటప్పకొండ వద్ద రూ.40 లక్షలు మోసం చేసిన ఘటనలో తండ్రీకొడుకులను శిక్షించి ఉంటే ఈ సమస్య వచ్చేంది కాదని అంటున్నారు. ఇతని బాధితులు నరసరావుపేటలో పదుల సంఖ్యలో ఉన్నా తండ్రి అధికారంతో బాధితులు బయటకు రావడానికి భయపడుతున్నారు.

వ్యక్తిత్వ నిర్మాణానికి యువజనోత్సవాలు దోహదం

- క్రీడలు, సాంస్కృతిక అంశాలు జీవితంలో భాగం కావాలి
- సృజనాత్మకశక్తిని వెలికి తీసేందుకు గొప్ప అవకాశం
- ఏఎన్‌యూ వీసీ ఆచార్య కె. గంగాధరరావు



మాట్లాడుతున్న వైస్ చాన్సలర్ గంగాధర్

ఏఎన్‌యూ(పెదకాకాని): విద్యార్థుల్లో నాయకత్వం, పరస్పర సహకారంతో పాటు స్వీయ అభివృద్ధి, వ్యక్తిత్వ నిర్మాణానికి యువజనోత్సవాలు దోహదపడతాయని వర్సిటీ వీసీ ఆచార్య కె. గంగాధరరావు అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల మూడు రోజుల యువజనోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. వర్సిటీ క్రీడా మైదానంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ఆచార్య కంచర్ల గంగాధర రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యతోపాటు క్రీడలు, సాంస్కృతిక అంశాలు ప్రతి ఒక్కరి జీవితంలో ఒక భాగం కావాలని సూచించారు. వనరులను సద్వినియోగం చేసుకొని ఆకాశమే హద్దుగా విద్యార్థులు ఎదగాలని ఆయన తెలిపారు. విశిష్ట అతిథిగా హాజరైన ప్రముఖ మిమిక్రీ కళాకారుడు కాసుల కృష్ణంరాజు విద్యార్థుల సృజనాత్మకశక్తి, ఉత్సాహాన్ని ప్రదర్శించడానికి యువజన ఉత్సవాలు కేంద్ర బిందువుగా నిలుస్తాయని పేర్కొన్నారు. వర్సిటీ రెక్టార్ ఆచార్య శివరాం ప్రసాద్ మాట్లాడుతూ క్రమశిక్షణతో, కళాత్మక నైపుణ్యంతో ముందుకు సాగాలని చెప్పారు. యువజన ఉత్సవాల కోఆర్డినేటర్ ఆచార్య ఎస్. మురళీమోహన్ మాట్లాడుతూ మూడు రోజులపాటు జరిగే ఉత్సవాల్లో మ్యూజిక్, డ్యాన్స్, లిటరరీ ఈవెంట్స్, థియేటర్, ఫైన్ ఆర్ట్స్ తదితర అంశాల్లో పోటీలు జరుగుతున్నాయని తెలిపారు. సుమారు 22 కళాశాలల నుంచి 400 మంది విద్యార్థులు హాజరయ్యారని పేర్కొన్నారు. ప్రారంభోత్సవంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ జి. సింహాచలం, పాలక మండలి సభ్యులు కే సుమంత్ కుమార్, వర్సిటీ ఆర్ట్స్ అండ్ లా కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సురేష్ కుమార్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కె. వీరయ్య, ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ పి.పి.ఎస్. పాల్ కుమార్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య తేజోమూర్తి తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో ఎన్.వి. కృష్ణారావు, ఆచార్య ఎం. త్రిమూర్తి రావు, అధ్యాపకులు, విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



నృత్య ప్రదర్శనలో విద్యార్థినులు

మిర్చి యార్డు సమాచారం
(సోమవారం ధరలు)

వచ్చిన బస్తాలు	40,522
అమ్మకాలు	37,706
నిల్వ	9,325

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,000–17,000
నంబరు–5	11,500–15,500
273	10,500–16,500

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500–16,800
నంబరు–5	11,000–15,300
341	12,000–16,500
4884	12,000–14,200

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 – 15,600
బాడిగ–355	10,500 – 16,700
దేవనూరు డీలక్స్	11,000 – 16,300
ఆర్మూర్	10,500 – 13,000
తాలుకాయలు	5,000 – 7,000

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	11,000–14,800
బాడిగ – 355	10,000–17,000
దేవనూరు డీలక్స్	10,500–16,000
తాలు	5,200 – 7,000

–కొరిటెపాడు (గుంటూరు)

మా ప్రాణాలకు గ్యారెంటీ ఏంటీ?

- ఉండవల్లి దళితవాడలోకి దొర్లుకుంటూ వచ్చిన బండరాయి
- కాలనీవాసికి త్రుటిలో తప్పిన ప్రమాదం
- స్పష్టమైన హామీ ఇచ్చి క్వారీ నిర్వహించాలని నిర్వాహకులను నిలదీసిన స్థానికులు
- తాత్కాలికంగా నిలిచిపోయిన ఉండవల్లి క్వారీ

రాయిని పరిశీలిస్తున్న గ్రామస్తులు

కొండపై నుంచి దొర్లుకుంటూ వచ్చిన బండరాయి

తాడేపల్లి రూరల్: మా ప్రాణాలకు గ్యారెంటీ ఏంటి? దుమ్ము లేవకుండా బండరాళ్లు దొర్లకుండా ఎటువంటి గ్యారెంటీ ఇస్తారు? అప్పటివరకు క్వారీ నిలిపివేయాలని ఉండవల్లి దళితవాడకు చెందిన ప్రజలు ఆదివారం రాత్రి క్వారీ నిర్వాహకులను నిలదీశారు. ఆదివారం రాత్రి సమయంలో కొండపై భారీ యంత్రాలతో తవ్వుతున్న క్రమంలో వంద అడుగుల పై నుంచి ఓ బండరాయి దొర్లుకుంటూ ఇళ్లమీదకు వచ్చింది. అక్కడే వున్న ఓ వ్యక్తి పక్క నుంచి ఆ రాయి వెళ్లింది. ఎటువంటి ప్రమాదం చోటుచేసుకోకపోవడంతో ఆ ఇంట్లో వాళ్లు, కాలనీవాసులు ఊపిరి పీల్చుకున్నారు. ఉండవల్లిలో రాత్రి పగలు తేడా లేకుండా ఎర్రమట్టి తవ్వకాలు నిర్వహించడంతో గ్రామం మొత్తం దుమ్ము ఏర్పడి ఇళ్లల్లో పేరుకుపోతోందని, వాతావరణంలో గాలి కూడా కలుషితం అవుతోందని, ఇప్పుడేమో రాళ్లు దొర్లుతున్నాయని, మా ప్రాణాలు గాలిలో కలిసిపోయే పరిస్థితి ఏర్పడిందని.. దళితవాడ వాసులు వాపోతున్నారు. ప్రభుత్వం తమ ప్రాణాలకు గ్యారెంటీ ఇవ్వాలంటూ క్వారీ కింద భాగంలో ఆందోళన చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి ఆందోళనకారులకు నచ్చజెప్పాలని చూడగా.. క్వారీలో మట్టి తవ్వకాలు నిలిపివేస్తేనే ఇక్కడి నుంచి వెళతామని చెప్పడంతో తాత్కాలికంగా క్వారీలో మట్టితవ్వకాలను నిలిపివేశారు. అనంతరం తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి జరిగిన సంఘటనపై పోలీసులకు వివరించారు. పోలీసుల నుంచి స్పష్టమైన హామీ రాలేదు.

తాత్కాలికంగా నిలిచిపోయిన క్వారీ....

గత సంవత్సరం కాలం నుంచి నిరంతరం ఉండవల్లి క్వారీలో మట్టి తవ్వకాలను నాలుగు భారీ యంత్రాలతో నిర్వహిస్తున్నారు. గ్రామంలో కొంతమంది ఆందోళన చేయడంతో కొండపై వున్న ఆ భారీ యంత్రాలను కిందకి దించివేయడంతో తాత్కాలికంగా క్వారీ నిలిచిపోయింది. నిర్వాహకులు మాత్రం తమకు అనుమతులు ఉన్నాయని చెబుతున్నారు. గ్రామస్తులు తమ ప్రాణాలకు గ్యారెంటీ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. భవిష్యత్తులో ఏం జరుగుతుందో వేచి చూడాలి.

జీఎంసీలోకి మరో 11 గ్రామాలు

- ప్రస్తుతం విలీన గ్రామాల్లోనే మౌలిక వసతులు శూన్యం
- ఈ నెల 12న కౌన్సిల్ అత్యవసర సమావేశం

నగరపాలక సంస్థ కార్యాలయం

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): గుంటూరు నగరపాలక సంస్థ గ్రేటర్ గుంటూరు దిశగా అడుగులు వేస్తుందనే చెప్పుకోవచ్చు. 2012లో నగరం చుట్టూ ఉన్న 10 గ్రామాలను విలీనం చేయగా, తాజాగా 11 గ్రామాలను విలీనం చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ఈ నెల 12వ తేదీన అత్యవసర కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి తీర్మానం చేసేందుకు పాలక, అధికార వర్గాలు ముందుకు సాగుతున్నాయి.

విలీన గ్రామాల్లో మౌలిక వసతులు కరువు

2012లో నల్లపాడు, పెదపలకలూరు, అంకిరెడ్డిపాలెం, అడవితక్కెళ్లపాడు, గోరంట్ల, పొత్తూరు, చౌడవరం, ఏటుకూరు, బుడంపాడు, రెడ్డిపాలెం గ్రామాలు విలీనం అయ్యాయి. వీటిలో సక్రమంగా తాగునీరు అందించడం, పారిశుద్ధ్య నిర్వహణలో అధికారులు విఫలం అయ్యారనే విమర్శలు ఉన్నాయి. ఇప్పుడు 11 గ్రామాలను విలీనం చేస్తే వాటికి కూడా నగరపాలక సంస్థ నుంచే తాగునీరు, ఇతర మౌలిక వసతులు కల్పించాల్సి ఉంటుంది.

11 గ్రామాలు ఇవే..

గుంటూరు నగరపాలక సంస్థను గ్రేటర్ గుంటూరుగా చేయాలని ఎప్పటి నుంచో ప్రతిపాదనలు ఉన్నాయి. ఇందులో భాగంగానే తాజాగా 11 గ్రామాలను విలీనం చేసేందుకు అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. చల్లావారిపాలెం, చినపలకలూరు, తురకపాలెం, వెంగళాయపాలెం, దాసుపాలెం, గొర్లవారిపాలెం, జొన్నలగడ్డ, లాల్‌పురం, మల్లవరం, ఓబులునాయుడుపాలెం, తోకవారిపాలెంలను విలీనం చేసేందుకు పంచాయతీ అధికారులు అంగీకరించారు. దీనికి సంబంధించిన ప్రకటనను నగరపాలక సంస్థ సిద్ధం చేశారు. 12న జరిగే అత్యవసర కౌన్సిల్ సమావేశంలో ఆమోదించనున్నారు. తరువాత జిల్లా కలెక్టర్ అనుమతితో ప్రభుత్వానికి నివేదిక వెళ్లిన తరువాత ప్రభుత్వం 11 గ్రామాలను విలీనం చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయనుంది.

క్లుప్తంగా

దుబాయి తీసుకెళతానంటూ మోసం

మంగళగిరి టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

మంగళగిరి టౌన్: దుబాయి తీసుకువెళతానని నమ్మించి మోసం చేసిన ఘటన మంగళగిరి పట్టణంలో చోటుచేసుకుంది. సేకరించిన వివరాల మేరకు.. మంగళగిరి పట్టణ పరిధిలోని పార్కురోడ్డుకు చెందిన జి.సాయి క్యాటరింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సాయికి పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన పసుపులేటి సాయికృష్ణ అనే వ్యక్తితో గత 20 సంవత్సరాలుగా పరిచయం వుంది. సాయికృష్ణ గతంలో దుబాయిలో ఉండి వచ్చాడు. దుబాయికి పంపిస్తానని, అక్కడ ఉద్యోగం ఇప్పిస్తానంటూ కొంత ఖర్చు అవుతుందని చెప్పాడు. 2023వ సంవత్సరంలో రూ.లక్ష ఇవ్వమని సాయికృష్ణ అడగడంతో సాయి తన సోదరుని ఫోన్‌నుంచి ఫోన్ పే ద్వారా రూ.లక్ష నగదును బదిలీ చేశాడు. అప్పటి నుంచి దుబాయికి ఎప్పుడు పంపిస్తావని అడిగితే అదిగో ఇదిగో అంటూ సాయికృష్ణ కాలయాపన చేశాడు. ఇచ్చిన నగదును తిరిగి ఇవ్వమని అడిగినా ఇవ్వకుండా, నీకు చేతనైనది చేసుకో.. అంటూ బెదిరింపులకు దిగాడు. ఒక పథకం ప్రకారమే దుబాయిలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి ఉద్యోగం ఇప్పించుకుండా మోసం చేసిన సాయికృష్ణపై తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం బాధితుడు జి.సాయి ఫిర్యాదు చేశాడు. దీనిపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వెనిగండ్లలో ఒకరికి స్క్రబ్ టైఫస్ లక్షణాలు

గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స

పెదకాకాని: వెనిగండ్ల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి స్క్రబ్ టైఫస్ లక్షణాలతో గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నట్లు వెనిగండ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి రామాంజిరెడ్డి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. పెదకాకాని మండలంలోని వెనిగండ్ల గ్రామానికి చెందిన షేక్ రజాక్ నెల రోజులుగా వెనిగండ్ల ముస్లింపాలెంలో నివసిస్తున్నాడు. ఇప్పటి వరకు గ్రామ శివారులోని సుందరయ్యకాలనీలో ఉంటూ క్యాటరింగ్, మండపాల డెకరేషన్ పనులకు వెళుతూ జీవనం సాగిస్తున్నాడు. అప్పుడప్పుడు నీరసం, ఆయాసంతో స్థానిక పీహెచ్‌సీకి వెళుతూ ఉండేవాడు. ఈనెల 3వ తేదీన నీరసంతో వెనిగండ్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వెళ్లగా వారి సూచన మేరకు అదేరోజు గుంటూరు జీజీహెచ్‌లో వైద్య పరీక్షలు చేసి జాయిన్ చేసుకున్నారు. ఈనెల 6వ తేదీన వచ్చిన వైద్య పరీక్షల రిపోర్ట్ ప్రకారం స్క్రబ్ టైఫస్ లక్షణాలు ఉన్నట్లు నిర్ధారించారు. 26 ఏళ్ల రజాక్ ప్రస్తుతం గుంటూరు జీజీహెచ్‌లోని ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు.

ఎస్టీయూ జిల్లా శాఖ నూతన కార్యవర్గం



గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) గుంటూరు జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా షేక్ బాజీ, వై.శ్యాంబాబు ఎన్నికయ్యారు. గుంటూరులోని రెవెన్యూ కళ్యాణ మండపంలో ఆదివారం జరిగిన సంఘ గుంటూరు జిల్లా 79వ వార్షిక కౌన్సిల్ సమావేశంలో భాగంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు నాయకులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా ఆర్థిక కార్యదర్శిగా బి.హనుమంతప్రసాద్, గౌరవాధ్యక్షుడిగా ఏవీ ప్రసాద్ బాబు, రాష్ట్ర కౌన్సిలర్లుగా డి.పెదబాబు, ఎస్.రామచంద్రయ్య, డీకే సుబ్బారెడ్డి, వి.ప్రసాదరావు, కె.జోజప్ప, జి.దేవరాజు, జి.మల్లిఖార్జునరావు, డీఏ జోసఫ్ ఎన్నికయ్యారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఏఐఎస్టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు, ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, సీపీఐ గుంటూరు జిల్లా కార్యదర్శి తోట మాల్యాద్రి నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఎన్నికల అధికారిగా వి.భిక్షమయ్య వ్యవహరించారు.

అంతర్ జిల్లా దొంగలు అరెస్ట్

- పలు జిల్లాల్లో 150కి పైగా కేసులు
- 19 గ్రాముల బంగారం, 740 గ్రాముల వెండి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ మురళీకృష్ణ

నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మురళీకృష్ణ, ముసుగులో నిందితులు

మంగళగిరి టౌన్: రాత్రిళ్లు ఇళ్లు కొల్లగొడుతున్న ముగ్గురు అంతర్‌జిల్లా దొంగలను మంగళగిరి రూరల్ పోలీసులు అరెస్ట్‌చేశారు. మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్ సర్కిల్ కార్యాలయంలో నార్త్ సబ్ డివిజన్ డీఎస్పీ మురళీకృష్ణ సోమవారం వివరాలను వెల్లడించారు. విశాఖపట్టణానికి చెందిన తోట శివకుమార్ (శివభవాని)పై రాష్ట్రంలో సుమారు 150కి పైగా చోరీ కేసులు ఉన్నాయి. విశాఖపట్టణానికి చెందిన తోట వరలక్ష్మి శివభవానికి భార్య. భార్యాభర్తలు ఇద్దరూ వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన షేక్ ఇంతియాజ్‌తో కలసి పలుచోట్ల దొంగతనాలు చేశారు. ఉదయం రెక్కీ నిర్వహించి రాత్రిళ్లు దొంతనానికి పాల్పడడంలో వీరు సిద్ధహస్తులు. అక్టోబర్‌లో తిరుపతి పోలీసులు పలు దొంగతనాల కేసులో శివకుమార్‌ను అరెస్ట్ చేసి కడప జైలుకు పంపించారు. కడప జైల్లో షేక్ ఇంతియాజ్ పరిచయమయ్యాడని, జైలు నుంచి విడుదల అయిన తరువాత దొంగతనాలు చేసేందుకు ముగ్గురు ప్రణాళికలు రచించినట్లు విచారణలో తేలింది.

- మంగళగిరి మండల పరిధిలోని యర్రబాలెంలో తాళం వేసిన ఇంటిని రాత్రి సమయంలో దొంగతనానికి పాల్పడ్డారు. ఆ ఇంట్లో బంగారం మాటీలు, చెవిదుద్దులు, 6 జతల పట్టీలతో పాటు రూ.20వేల నగదును దొంగిలించి పారిపోయారు. అదేవిధంగా దువ్వాడ, గాజువాక, అనకాపల్లి పోలీస్‌స్టేషన్ల పరిధిలో పలు దొంగతనాలకు పాల్పడినట్లు విచారణలో తేలింది. యర్రబాలెంలో జరిగిన దొంగతనంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన క్రమంలో సీసీ కెమెరా ఫుటేజ్ ఆధారంగా, ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా ముగ్గురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి సుమారు 19 గ్రాముల బంగారం, 740 గ్రాముల వెండి స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ మురళీకృష్ణ వెల్లడించారు. ముగ్గురు నిందితులను కోర్టుకు హాజరుపర్చగా మంగళగిరి న్యాయస్థానం రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు. రూరల్ సీఐ ఎ.వి.బ్రహ్మం, రూరల్ ఎస్‌ఐలు సీహెచ్ వెంకటేశ్వర్లు, బాలు నాయక్, ఏఎస్‌ఐ రత్నరాజు, కానిస్టేబుల్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా క్రాస్‌కంట్రీ ఎంపిక పోటీలు ప్రారంభం

గుంటూరు వెస్ట్ (క్రీడలు): అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో సోమవారం స్థానిక బీఆర్ స్టేడియంలో జిల్లా క్రాస్ కంట్రీ ఎంపిక పోటీలు జరిగాయి. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పి.అఫ్రోజ్ ఖాన్ ఎంపికల పోటీలను ప్రారంభించి, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపిక కావాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో పాల్గొని ప్రతిభ కనబరిచి జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. జిల్లా అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ, ఎంపికైన జట్టు కాకినాడలో ఈనెల 24వ తేదీన జరిగే రాష్ట్రస్థాయి క్రాస్ కంట్రీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. జిల్లా అథ్లెటిక్స్ సంఘం సభ్యులు ఏవీ ఆంజనేయులు, కె.అరుణ్ కుమార్, పీఈటీలు శరత్‌బాబు, చక్రి, నాగరాజు, మోహన్, శాప్ అథ్లెటిక్స్ శిక్షకులు శివారెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పోటీతత్వంతోనే ప్రతిభకు గుర్తింపు

జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక

విద్యార్థులతో డీఈఓ రేణుక తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: పోటీతత్వంతోనే ప్రతిభకు గుర్తింపు దక్కుతుందని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక పేర్కొన్నారు. సోమవారం పాత బస్టాండ్ సెంటర్లోని జిల్లా పరీక్షా భవన్‌లో కౌశల్ జిల్లాస్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతి ప్రదానోత్సవం గావించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఈఓ రేణుక మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో శాస్త్రీయ ప్రతిభను పెంపొందించేందుకు కౌశల్ పరీక్షలు దోహదపడతాయన్నారు. జిల్లా కౌశల్ కో–ఆర్డినేటర్ ఎం.సురేష్‌కుమార్ మాట్లాడుతూ క్విజ్, పోస్టర్, రీల్స్ తయారీ అనే అంశంపై ఆన్‌లైన్‌లో నిర్వహించిన పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 8,9,10 తరగతుల నుంచి పాల్గొన్న 610 మంది విద్యార్థుల్లో ఆరుగురు ప్రథమ, మరో ఆరుగురు ద్వితీయ బహుమతులు పొంది, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ప్రథమ బహుమతి రూపంలో రూ.1,500, ద్వితీయ బహుమతి రూపంలో రూ.వెయ్యి నగదు అందజేశారు. ఉప విద్యాశాఖాధికారి జి.ఏసురత్నం, డీసీఈబీ కార్యదర్శి ఎ.తిరుమలేష్, పాఠశాల కో–ఆర్డినేటర్లు శాంతిప్రియ, రామాంజనుయులు, రవీంద్రబాబు, నిర్మల, బాలకృష్ణ పాల్గొన్నారు.

- క్విజ్ విభాగంలో షేక్ రషీద్ (అంకిరెడ్డిపాలెం), సీహెచ్ మనోహ (వంగిపురం), షేక్ నస్రీన్ (మాచవరం) ప్రథమ బహుమతి, ఎ.వెంకట తనూజ (ప్రత్తిపాడు), పి.ప్రియాంక, ఎం.కీర్తన (కాకుమాను) ద్వితీయ బహుమతి సాధించారు.
- పోస్టర్ విభాగంలో బి.అమూల్య (అత్తోట), వి.విలియం బాబు (కాకుమాను) ప్రథమ బహుమతి, టి.వాసవి (ముట్లూరు), ఎం.శ్రీ విద్య (సంగం జాగర్లమూడి) ద్వితీయ బహుమతి పొందారు.
- రీల్స్ విభాగంలో సయ్యద్ ఖాసిం (వేములూరిపాడు), మహి (గోగులమూడి) ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారు.

రియల్ ఎస్టేట్ రంగంలో పారదర్శకత

ఏపీ రెరా చైర్మన్ ఆరే శివారెడ్డి

తాడికొండ: రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగంలో పారదర్శకత, బాధ్యత, వినియోగదారుల రక్షణ కోసం ఆంధ్రప్రదేశ్ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (ఏపీ రెరా) నిబద్ధతతో పనిచేస్తుందని ఏపీ రెరా చైర్మన్ ఆరే శివారెడ్డి తెలిపారు. సోమవారం రాయపూడిలోని సీఆర్డీఏ కార్యాలయం ఎదుట నాలుగో బ్లాకులో ఏపీ రెరా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో శివారెడ్డి మాట్లాడుతూ.. ప్రతి రియల్ ఎస్టేట్ ఏజెంట్, రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుల్లో స్థలాలు, అపార్ట్‌మెంట్లు లేదా భవనాల అమ్మకం, కొనుగోలు లేదా మార్కెటింగ్ వ్యాపారంలో పాల్గొనడానికి ముందు తప్పనిసరిగా ఏపీ రెరా అధికారిక వెబ్ సైట్ www.rera.ap.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. రియల్ ఎస్టేట్ (నియంత్రణ మరియు అభివృద్ధి) చట్టంపై రియల్ ఎస్టేట్ రంగంలోని స్టేక్ హోల్డర్స్‌కు విస్తృత స్థాయిలో అవగాహన కోసం ఏపీ రెరా ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన ప్రతి నెల ఒక జిల్లాలో 2025 డిసెంబర్ పది నుంచి 13 జిల్లాలలో 2026 డిసెంబర్ వరకు కార్యక్రమాలు నిర్వహించనున్నామని వివరించారు. ఈ అవగాహన కార్యక్రమం తిరుపతి జిల్లా నుంచి ప్రారంభిస్తున్నామన్నారు. ఏపీ రెరా డైరెక్టర్ కె.నాగసుందరి మాట్లాడారు. సమావేశంలో ఏపీ రెరా సభ్యులు జగన్నాథరావు, ఎం.వెంకటరత్నం, డి.శ్రీనివాసరావు, యు.ఎస్.ఎల్.ఎన్.కామేశ్వరరావు, జె.కులదీప్ పాల్గొన్నారు.

సస్పెండ్ అయిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలి

గుంటూరు మెడికల్: గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆకస్మిక తనిఖీలు చేసి సాయంత్రం 5.30 గంటల సమయంలో ఆరోగ్య కేంద్రానికి తలుపులు వేసి ఉన్న సందర్భంలో 12 మంది ఉద్యోగులను సస్పెన్షన్ చేసిన విషయంపై సోమవారం ఏపీ ఎన్జీవో నేతలు ఆరోగ్య శాఖ కమిషనర్ వీరపాండియన్‌ను కలిసి మాట్లాడారు. పనివేళలు ముగిసిన పిదప తనిఖీలకు వచ్చిన నేపథ్యంలో అనాలోచితంగా చేసిన సస్పెన్షన్ ఉత్తర్వులు రద్దు చేసి ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ డిమాండ్ చేశారు. రాత్రిళ్లు విధులు నిర్వహించే స్టాఫ్‌నర్సులకు తగిన రక్షణ కల్పించాలని, సరైన సదుపాయాలు కల్పించాలని కోరారు. రాష్ట్ర అధ్యక్షుడితోపాటు, గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, పల్నాడు జిల్లా అధ్యక్షుడు మర్లపాటి రామకృష్ణ, ఇతర నేతలు కమిషనర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

ముగిసిన గుంటూరు ఓపెన్ పికిల్ బాల్ పోటీలు



పికిల్ బాల్ విజేతలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు ఆదర్శ ఆధ్వర్యంలో స్థానిక వీవీవీ హెల్త్ హబ్‌లో గత రెండు రోజుల నుంచి జరుగుతున్న గుంటూరు ఓపెన్ పికిల్ బాల్ పోటీలు సోమవారంతో ముగిశాయి. ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కి చెందిన టి .నేహా అండర్–14 మిక్సడ్ సింగిల్స్, ఉమెన్ ఓపెన్ సింగిల్స్‌లో ప్రథమ స్థానాన్ని సాధించి డబుల్ టైటిల్ సాధించింది. ఓపెన్ డబుల్స్‌లో విన్సెంట్, నాగరాజు విజేతలుగా నిలవగా, పి.ఆనంద్ కుమార్, కె.అరుణ్ కుమార్‌లు రన్నర్ టైటిల్‌ను సాధించారు. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాస్టర్ గేమ్స్ ఇండియా సీనియర్ ఉపాధ్యక్షుడు డాక్టర్ టీవీ రావు, రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ భాస్కరరావు విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ టీవీ రావు మాట్లాడుతూ గుంటూరులో పికిల్ బాల్ క్రీడ యువతను బాగా ఆకర్షిస్తుందని తెలిపారు. రోటరీ క్లబ్ తరపున ఈ పోటీలను ప్రోత్సహించినందుకు ధన్యవాదాలు తెలిపారు. రోటరీ క్లబ్ గుంటూరు ఆదర్శ అధ్యక్షురాలు ఎం.అనురాధ, ప్రముఖ న్యాయవాది చిగురుపాటి రవీంద్రబాబు రోటరీ క్లబ్ సెంటినర్ అధ్యక్షులు డాక్టర్ వీర రాఘవరావు, గుంటూరు ఆదర్శ్ కోశాధికారి జయ శ్రీ, అశోక, జిల్లా పికిల్ బాల్ సంఘం సభ్యులు భరత్, మన్సూర్ వలి, డాక్టర్ హనుమంతరావు, జీవీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతో మర్యాదగా మెలగండి

- జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా
- పీజీఆర్ఎస్‌లో 351 అర్జీలు స్వీకరణ

గుంటూరు వెస్ట్: అర్జీల పరిష్కార సమయంలో వివిధ శాఖల మధ్య సమన్వయం ఎంతో అవసరమని అధికారులు వీటిని గుర్తించాలని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 351 అర్జీలను జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, అధికారులతో కలిసి కలెక్టర్ స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ చిన్న చిన్న సమస్యల పరిష్కారం కోసం ప్రజలను పదేపదే తిప్పుకోవద్దన్నారు. ప్రజలతో మర్యాదగా మెలగాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ కె. శ్రీనివాస రావు, డిప్యూటీ కలెక్టర్లు గంగ రాజు, లక్ష్మీకుమారి, శ్రీనివాస్, డీఆర్డీఏ పీడీ విజయ లక్ష్మి, పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు కె.వి.వి.సత్యనారాయణ, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు సత్యనారాయణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలి

పెదనందిపాడులోని నల్లమడ వాగు సమీపంలో గత 40 సంవత్సరాల నుంచి 50 పైగా కుటుంబాలు పూరి గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. అందరూ పేద కుటుంబాలకు చెందినవారే. వర్షం వచ్చిన ప్రతిసారి పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. వారికి ఇళ్లు నిర్మించడంతోపాటు మౌలిక సదుపాయాలు కల్పించాలి. దీనికి సంబంధించి టీడీపీ, జనసేన నాయకులు ఎన్నికల సమయంలో వాగ్దానాలు చేశారు. వాటిని నెరవేర్చాలి.

బాధిత కుటుంబాలు

– బాధిత కుటుంబాలు, పెదనందిపాడు

ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలి

పీజీఆర్ఎస్‌లో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ

నగరంపాలెం: జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ప్రజలు పోటెత్తారు. పీజీఆర్ఎస్‌కు వచ్చిన పలువురు బాధితుల నుంచి జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అర్జీలు స్వీకరించి, వారి విన్నపాలు ఆలకించారు. అర్జీదారుల సమస్యలపై సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. నిర్ణీత వేళల్లో అర్జీలను పరిష్కరించాలని ఆదేశించారు. మహిళలు, వృద్ధులకు సంబంధించి ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ అన్నారు. అర్జీలపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి, చట్ట ప్రకారం న్యాయం చేయాలని సూచించారు. జిల్లా ఏఎస్పీ (పరిపాలన) రమణమూర్తి, డీఎస్పీలు బెల్లం శ్రీనివాస్ (ట్రాఫిక్), శ్రీనివాసరెడ్డి (మహిళా పీఎస్), మధుసూదన్‌రావు (సీసీఎస్) కూడా అర్జీలు స్వీకరించారు.

టీడీపీ నాయకులు బెదిరిస్తున్నారు

నగరంపాలెం: టీడీపీ నాయకులు అసభ్య పదజాలంతో దూషిస్తూ, బెదిరిస్తున్నారని తాడేపల్లి మండలం వడ్డేశ్వరం గ్రామానికి చెందిన ఓ బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆమె ఫిర్యాదు చేసి, అనంతరం మీడియాతో మాట్లాడారు. స్థానిక టీడీపీ నాయకులు రాత్రిళ్లు ఇంటి తలుపులు కొట్టడం, కాల్ చేయడం వంటివి చేస్తున్నారన్నారు. తన కుమార్తెను, తనను చంపుతామని బెదిరిస్తున్నారని, వారి నుంచి రక్షణ కల్పించి న్యాయం చేయాలని కోరారు.

తక్కువ బంగారం ఇస్తూ సంతకం చేయమంటున్నారు..

గతనెల 14న పొన్నూరు నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు గుంటూరు బీఆర్ స్టేడియం వద్ద దిగాను. అక్కడ్నుంచి గుంటూరు రైల్వేస్టేషన్ వెళ్లేందుకు ఆటో ఎక్కాను. అప్పటికే ఆటోలో ప్రయాణికులు ఉన్నారు. ఆటో దిగి రైల్వేస్టేషన్‌లోకి వెళ్లాక అప్పటికే రైలు వెళ్లిపోయింది. ఈలోగా అల్పాహారం చేద్దామని రైల్వేస్టేషన్ బయటకు వచ్చాను. చేతి సంచి చూసుకోగా అందులోని 12 సవర్ల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో చోరీకి గురైనట్లు గుర్తించి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాను. అయితే 16.5 గ్రాముల బంగారం దొరికినట్లు పోలీసులు సంతకం చేయమని చెప్పారు. అందుకు నిరాకరించాను. న్యాయం చేయగలరు.

– టి.రమాదేవి, పొన్నూరు

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■ గుంటూరు సిటీకి అనుకొని ఉన్న పేరేచర్ల NRI IT కాలేజ ప్రక్కన, orrకి మధ్యలో AP CRDA ప్లాట్స్ కలవు. ప్లాట్ కొనుగోలుపై రిజిస్ట్రేషన్ ఫ్రీ..ఫ్రీ. సంప్ర॥ 7729075958, 9959127008

SERVICES

ASTROLOGY

■ తమిళనాడు వైదీశ్వరన్ కోయిల్ శ్రీ అగస్త్య నాడి జ్యోతిష్యాలయం మీ చేతి బొటనవేలు ముద్రతో మీ భవిష్యత్తు పూర్తిగా చెప్పబడును. అన్ని సమస్యలకు పరిష్కారం చెప్పబడును. GNT. 8978215913

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఆ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071

■ బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. ✆ 88024 89999

■ బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటుసంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును ✆ 8790741166

WANTED

■ గుంటూరు, కొత్తపేట ఇంటి వద్ద పని చేయుటకు వాచ్‌మెన్ కావలెను. భార్య భర్తలకు ప్రాధాన్యత. వసతి కలదు. సంప్ర॥ 9866132826, 9441121025

■ మా ఆఫీసు నందు పనిచేయుటకు టాలీ అకౌంటెంట్స్, సివిల్ డిప్లొమా ఇంజనీర్స్, కారు డ్రైవర్స్, ఆఫీస్‌బాయ్స్, ఆఫీస్‌బాయ్స్ GNTలో నివసించే వారు మాత్రమే. 9885268300, 9394107900

■ వెంటనే కావలెను. Ltd కంపెనీల్లో కం॥ ఆపరేటర్స్, రిసెప్షనిస్ట్, అకౌంటెంట్స్, టెలికాలర్స్, సూ॥ వైజర్స్, ఆఫీస్‌బాయ్స్, ఆఫీస్ ఎగ్జిక్యూటివ్స్, హెల్పర్స్ కావలెను. 10th-PG, జీ:10-25. ✆7993976590

■ గుంటూరు సిటీలోని ప్రముఖ బ్యాంక్ అనుబంధ సంస్థతో కలిసి పనిచేయుటకు విశ్రాంత ఉద్యోగులు, 10th పాస్ 50సం॥ పై వయస్సు వారు కావలెను. 9989909698

■ అబ్బినేనిగుంటపాలెంలోని కరోలి ప్లాస్టిక్ ఇండస్ట్రీస్‌లో పనిచేయుటకు లైసెన్సు డ్రైవర్ కం ఫిట్టర్స్ కావలెను. జీతం: 15,000/– సంప్ర॥ 9866201885

■ APSRTC ఆవరణలో పనిచేయుటకు యువతి యువకులు కావలెను. అర్హత: 10th–డిగ్రీ, ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సంప్ర॥ 9705263264

■ ప్రభుత్వ సంస్థలలో కాంట్రాక్ట్ & ఔట్‌సోర్సింగ్ జాబ్స్ అటెండర్స్, క్లర్క్స్, డేటా ఎంట్రీ, ఆఫీసు అసిస్టెంట్స్. Cell : 9703602687

■ 30 to 65 yrs బ్యాంకు అనుబంధ సంస్థలో జీతం + Inc 35 వేలు. టీం మేనేజర్స్, ఎగ్జిక్యూటివ్స్. Q: 10th -డిగ్రీ. రిటైర్డ్, బిజినెస్, ఇన్సూరెన్స్ ఏజెంట్స్, మ్యూచువల్ ఫండ్స్, మార్కెటింగ్ నో టార్గెట్. ✆ 90524 70111

■ GNT నారాకోడూరులో ప్రముఖ కంపెనీ నందు సెక్యూరిటీ గార్డ్స్, ఆఫీస బోయ్స్ కావలెను డ్యూ. 8గం, జీ: 10-14k. Q10th, వ20-50 ✆8520977729, 59

■ యూనిటీ హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను పిల్లలను చూసుకొనుటకు ఇంటి/వంటపనికి వర్కర్స్/నర్సులు కావలెను. ఫోన్: 8121631212, 9640016901

■ Hydలో పెద్దవారికి సేవ చేయుటకు బేబీకేర్, ఇంటి / వంట పనికి హెల్పర్స్, ఆయాలు, కేర్‌టేకర్స్ స్త్రీ / పు కా. జీ : 18,000 to 30,000/– రూం + మీల్స్ ఫ్రీ. Ph : 6300639598

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ. 475/- మాత్రమే
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
ప్రతి ప్రకటనపై G.S.T. 5% అదనం
గుంటూరు
7075167663
7075167541

గమనిక

క్లుప్తంగా

ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడుతాం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ, రూరల్ ప్రాంతాల్లోని ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడుతామని యూటీఎఫ్ నూతన అధ్యక్ష కార్యదర్శులు కె.వెంకటేశ్వరరావు, సత్యశివ నాగేశ్వరరావులు అన్నారు. తాడేపల్లి నులకపేటలోని ఎంఈఓ కార్యాలయంలో విద్యాశాఖ అధికారి డి.నాగేశ్వరరావును యూటీఎఫ్ నూతన కమిటీ సోమవారం కలిశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు అందుబాటులో ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, నాయకులు బెన్హర్, ప్రసాద్, బురాన్, ధనరాజారావు, గఫార్, వెంకట సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ ఆక్రమణ!

తాడేపల్లి రూరల్: ఒక పక్క రాజధాని ప్రాంతంలో విశాల మైన రహదారులు కావాలని ప్రభుత్వం ప్రచారం చేస్తుంటే మరో పక్క కొందరు ఆక్రమణదారులు డ్రైనేజీలను ఆక్రమించుకుని ప్రహరీ గోడలు నిర్మిస్తున్నారు. కానీ సంబంధిత అధికారులు ఏమీ పట్టనట్లు నిద్రావస్థలో ఊగుతున్నారు. పెనుమాకలోని సాయిబులపాలెంలో సోమవారం ఓ వ్యక్తి డ్రైనేజీ ఆక్రమించి చకచకా గోడ నిర్మాణాన్ని చేపట్టాడు. ఇదేంటని ప్రశ్నించిన వారిపై దౌర్జన్యానికి పాల్పడినట్లు స్థానికులు చెబుతున్నారు. డ్రైనేజీలను ఆక్రమిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే పరిశీలించి డ్రైనేజీ ఆక్రమణను నిలపాలని ప్రజలు కోరుతున్నారు.

జీవామృతంపై రైతులకు అవగాహన

దుగ్గిరాల: ప్రకృతి వ్యవసాయం పట్ల రైతులు మొగ్గుచూపాలని.. విత్తన శుద్ధి చేసిన మొక్కజొన్న విత్తనాలను రైతులకు అందించి పొలంలో నాటించామని వ్యవసాయ మండల కోఆర్డినేటర్ కె.జయ తెలిపారు. దుగ్గిరాల మండలం మంచికలపూడి గ్రామంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో విత్తన శుద్ధి, బీజామృతం తయారు చేసే విధానంపై రైతులకు వివరించారు. ఈ సందర్భంగా 5 కేజీల మొక్కజొన్న విత్తనాలను పొలంలో రైతులతో నాటించారు. కార్యక్రమంలో ఆర్.శ్రీనివాస్, ఐసీఆర్పీలు పాల్గొన్నారు.

డివిజనల్ త్రోబాల్ పోటీలకు ఎంపిక

దుగ్గిరాల: ఉపాధ్యాయుల మహిళా త్రోబాల్ టీమ్‌కి గరల్స్ హైస్కూల్ టీచర్స్ ఎంపికయినట్లు హెచ్ఎం శోభాదేవి తెలిపారు. మండల కేంద్రంలోని దుగ్గిరాల బాలికల పాఠశాలలో ఎంపికైన ఉపాధ్యాయులకు ఆమె సోమవారం అభినందనలు తెలిపారు. ఈనెల 12వ తేదీన డివిజనల్ టోర్నమెంట్ నూతక్కి గ్రామంలో నిర్వహిస్తారని శోభాదేవి పేర్కొన్నారు.

మున్సిపల్ స్థలాల పరిరక్షణకు చర్యలు

తెనాలిఅర్బన్: పట్టణంలోని మున్సిపల్ స్థలాల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు డీఎస్పీ డి.జానార్ధనరావు, మున్సిపల్ కమిషనర్ జెఆర్ అప్పలనాయుడులు పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో వీఆర్వో, ప్లానింగ్ సెక్రటరీలతో సోమవారం రాత్రి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆక్రమణకు గురైన మున్సిపల్ స్థలాలను ఖాళీ చేయాలని సూచించారు. లేని పక్షంలో బలవంతంగా ఖాళీ చేయించాల్సి వస్తుందని హెచ్చరించారు. అలాగే రోడ్లపై వ్యాపారాలు నిర్వహించే వారు కూడా మార్జిన్ దాటి తమ బళ్ళను ఏర్పాటు చేయవద్దని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా వీటిని చేపడుతున్నట్లు చెప్పారు. సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ వాణి, వన్‌టౌన్, టు టౌన్, త్రీ టౌన్ సీఐలు మల్లిఖార్జునరావు, రాములునాయక్, సాంబశివరావు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

అరెస్టులతో ఉద్యమాలను అడ్డుకోలేరు

పోలీస్ కస్టడీలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగం నాయకులు

పోలీస్ ఎస్కార్ట్ వాహనంలో విద్యార్థి నాయకులను దుగ్గిరాల నుంచి తాడేపల్లికి తరలిస్తున్న పోలీసులు

దుగ్గిరాల: విద్యార్థులు నక్సలైట్లు కాదని.. విద్యార్థుల పట్ల ప్రభుత్వం, పోలీసులు దుర్మార్గంగా ప్రవర్తించడం దారుణమని.. పెండింగ్ బకాయిలు అడిగితే జైలులో పెట్టడం సరికాదని.. వైఎస్సార్ సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగం అధ్యక్షుడు చైతన్యను వెంటనే విడుదల చేయాలని మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి డిమాండ్ చేశారు. దుగ్గిరాల పోలీస్ స్టేషన్‌లోని విద్యార్థి నాయకులను వేమారెడ్డి సోమవారం పరామర్శించి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన ఇంకా కొనసాగుతోందని.. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రశ్నించిన వారిపై పోలీసులను అడ్డుపెట్టుకుని దౌర్జన్యం చేస్తూ జైలుకు పంపడం తగదని పేర్కొన్నారు. చదువుకుంటున్న విద్యార్థులను బాధ పెట్టడం సమంజసం కాదని మండిపడ్డారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ కార్యాలయం వద్ద శాంతియుతంగా ధర్నా చేస్తున్న గుంటూరు జిల్లా విద్యార్థి విభాగ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకోవడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. పొనుగంటి చైతన్య, పేటేటి నవీన్, ఎ.రవిచంద్ర, గురుశెట్టి రవీంద్ర, మద్దిరెడ్డి నరేంద్రరెడ్డిలను పోలీసులు నిర్బంధించి దుగ్గిరాల, తాడేపల్లి స్టేషన్ల చుట్టూ తిప్పడాన్ని మండిపడ్డారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు టి.శివగోపయ్య, దసులయ్య, కోటేశ్వరరావు, జాన్సన్, గ్రామ పార్టీల అధ్యక్షులు పాల్గొన్నారు. విద్యార్థి విభాగాల నాయకులను సాయంత్రం పోలీస్ ఎస్కార్ట్ వాహనంలో దుగ్గిరాల నుంచి తాడేపల్లికి తరలించగా దుగ్గిరాల పోలీస్‌స్టేషన్‌కు విద్యార్థులు భారీగా తరలివచ్చి సంఘీభావం తెలిపారు.

మీడియాతో మాట్లాడుతున్న దొంతిరెడ్డి వేమారెడ్డి

22వ వార్డులో సంతకాలు సేకరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కొనసాగుతున్న సంతకాల సేకరణ..

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సోమవారం పార్టీ నాయకులు, కార్యకర్తలు సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. తాడేపల్లి పట్టణ పరిధిలో 1వ వార్డు, 12వ వార్డు, 13వ వార్డు, 17వ వార్డు, 22వ వార్డుల అధ్యక్షులు మహేష్ రెడ్డి, షేక్ నాగూర్, షేక్ నజీర్, గోలి నరసింహ, సూరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆయా వార్డుల్లో సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, తాడేపల్లి పట్టణ అధ్యక్షులు, పొన్నూరు నియోజకవర్గ పరిశీలకులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి ఆదేశాల మేరకు గంట వ్యవధిలో 2 వేల సంతకాలను సేకరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. సంతకాల సేకరణ కార్యక్రమంలో ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి సంతకాలు చేస్తున్నారని పేర్కొన్నారు. 1 వార్డు కార్యక్రమంలో నాయకులు భూపతి కిషోర్, అనుమోలు శెట్టి వెంకట సత్యనారాయణ, అనుమోలు శెట్టి లక్ష్మీనరసయ్య, 12వ వార్డులో నాయకులు మేడ వెంకటేశ్వరరావు(పండు), మల్లికార్జునరావు, 13 వార్డులో నాయకులు మద్ది కృష్ణారెడ్డి, కురగంటి ఉదయ రాజు, షేక్ ఆయుబ్, 17వ వార్డులో నాయకులు తొట్టెంపూడి వికాస్, గోలి నరసింహ, ఈదులమూడి పద్మకిరణ్(బన్ను), మాతంగి సంతోష్, 22వ వార్డులో నాయకులు సయ్యద్ సలాం, ఎస్.కనక సుందరి, జి.శ్రీలక్ష్మి, మహమ్మద్ జరీనా, వి.నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విత్తన చట్టాన్ని ఉపసంహరించాలి

నిరసన కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధి వడ్డేశ్వరం జాతీయ రహదారి వద్ద సోమవారం కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విత్తన చట్టాన్ని ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య మాట్లాడుతూ.. రైతు, వ్యవసాయ రంగాలకు తీవ్రనష్టం కలిగించేలా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విత్తన చట్టం 2025ను దేశవ్యాప్తంగా రైతాంగం వ్యతిరేకిస్తోందన్నారు. దేశ ప్రజా ప్రయోజనాలకు ద్రోహం చేసి, రైతులకు వ్యతిరేకంగా ఉన్న సీడ్స్ బిల్లు 2025ను తీసుకురావడాన్ని సంయుక్త కిసాన్ మోర్చా పూర్తిగా వ్యతిరేకిస్తోందన్నారు. దీని వల్ల ఉత్పత్తి ఖర్చులను పెంచడమే కాక, వ్యవసాయ సంక్షోభం తలెత్తే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి, కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పంకాయల పాటి శివనాగరాణి, రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు, ఏపీ రైతు సంఘం తాడేపల్లి మండల అధ్యక్షులు మొదుగుల శ్రీనివాసరెడ్డి, రాజధాని రైతు సంఘం నాయకులు ఈశ్వరరెడ్డి, రైతు నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లెకృష్ణ, వీరాస్వామి, బక్కిరెడ్డి, ఎస్.విజయరాజు తదితరులు పాల్గొన్నారు.

తెనాలి రోడ్డు విస్తరణ పనులు తక్షణమే ఆపాలి

గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంఘ బాధితులు

మంగళగిరి టౌన్: మంగళగిరి నగర పరిధిలోని తెనాలి రోడ్డు విస్తరణ పనులను ఆపాలని తెనాలి రోడ్డు చేనేత వ్యాపార పరిరక్షణ, విస్తరణ బాధితుల సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సంఘం బాధితులు సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ.. తెనాలి రోడ్డు ప్రజలు జీవనోపాధి కోల్పోకుండా, నిరాశ్రయులు కాకుండా రక్షించాలని కోరారు. ప్రజల అభిప్రాయం తీసుకోకుండా, తీసుకొచ్చిన గెజిట్ నంబర్ 581ను రద్దు చేసి 60 అడుగుల రోడ్డు విస్తరణను ఆపాలని డిమాండ్ చేశారు. 200 ఏళ్ల చరిత్ర కలిగిన ఖబరస్తాన్‌ను కాపాడాలని విన్నవించారు. జూన్ 20 నుంచి జూలై 19వ తేదీ వరకు ఏపీ సీఆర్డీయేతో ఎంటీఎంసీ అధికారులు జరిపిన ఉత్తర ప్రత్యుత్తర వివరాలను అందజేసి విస్తరణకు చేసిన సర్వే వివరాలు నోట్‌ఫైల్, అభివృద్ధి ప్రణాళిక, ఇతర వివరాలను సర్టిఫైడ్ కాపీ రూపంలో అందజేయాలని ఎంటీఎంసీ కమిషనర్‌ను కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

ప్రపంచ బ్యాంక్ బృందం రాజధానిలో పర్యటన

సమావేశం నిర్వహిస్తున్న ప్రపంచ బ్యాంక్ ఏడీబీ ప్రతినిధుల బృందం

తాడికొండ: రాజధాని అమరావతిలో జరుగుతున్న ప్రపంచ బ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంక్ జాయింట్ టెక్నికల్ మిషన్‌లో భాగంగా ప్రపంచ బ్యాంక్ ఏడీబీ ప్రతినిధుల బృందం సోమవారం క్షేత్రస్థాయిలో పర్యటించింది. అమరావతి ఇంటిగ్రేటెడ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(ఏఐయూడీపీ) అమలులో భాగంగా రాజధాని నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతాలలో ట్రాఫిక్ ఫ్లో నిర్వహణ, రహదారులు, బీఆర్‌టీ ప్రణాళిక తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో అమలు కావాల్సిన కార్యకలాపాలపై ఏపీ సీఆర్డీయే ప్రధాన కార్యాలయంలో చర్చలు జరిగాయి. ఉదయం సీఆర్డీయే ప్రధాన కార్యాలయంలోని ఒకటో ఫ్లోర్‌లోని సమావేశ మందిరంలో ఏఐయూడీపీ ప్రాజెక్టు అమలులో భాగంగా ప్రపంచ బ్యాంక్–ఏడీబీ ప్రతినిధుల బృందంతో ఏపీ సీఆర్డీయే ఏడీసీఎల్ అధికారులు ట్రాఫిక్ ఫ్లో నిర్వహణ, రహదారులు, బీఆర్‌టీపై ప్రణాళికపై పలు సెషన్లు నిర్వహించారు. అలానే స్టేక్‌హోల్డర్ కన్సల్టేషన్‌లో భాగంగా ఏపీ సీఆర్డీయే అధికారులు, విలేజ్ ఫెసిలిటేటర్స్ ఎన్జీవో సంస్థలతో ప్రపంచ బ్యాంక్–ఏడీబీ ప్రతినిధుల బృందం సమావేశమైంది. అమరావతిలో క్షేత్రస్థాయిలో పర్యటించిన ప్రపంచ బ్యాంక్–ఏడీబీ ప్రతినిధుల బృందం రాయపూడిలో స్థానికులతో సమావేశమై భూసమీకరణ పథకం, క్షేత్రస్థాయిలో అమలవుతున్న సంక్షేమ పథకాలతో పాటు పలు అంశాలు చర్చించారు.

రాజధానిలో సీఆర్డీయే అడిషనల్ కమిషనర్ పర్యటన

తాడికొండ: రాజధాని ప్రాంతంలోని నేలపాడు గ్రామంలో సోమవారం సీఆర్డీయే అడిషనల్ కమిషనర్ ఎ.భార్గవ తేజ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.ఎస్.భాగ్యరేఖతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా స్థానికంగా గల గ్రామకంఠాల పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించిన అదనపు కమిషనర్ 9.2 కింద మినహాయింపులు, గ్రామ భౌగోళిక పరిస్థితులు, భూసరిహద్దులు, గ్రామపరిధి సంబంధిత అంశాలను అధికారులు, గ్రామపెద్దల నుంచి వివరంగా తెలుసుకున్నారు. గ్రామకంఠాలపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిటీ సూచనల మేరకు సీఆర్డీయే తగిన చర్యలు తీసుకుంటుందని అడిషనల్ కమిషనర్ ఈ సందర్భంగా రైతులకు స్పష్టం చేశారు. గ్రామ పెద్దలు, రైతులు గ్రామకంఠాలకు సంబంధించిన వివరాలు, సరిహద్దుల వివరణ, పెండింగ్‌లో ఉన్న పలు ఇతర అంశాలను అదనపు కమిషనర్‌కు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరిబాబు, పలువురు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మాతా శిశు మరణాల నివారణే లక్ష్యం

జననిమిత్ర యాప్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కార్యక్రమంలో పాల్గొన్న ఏఎన్ఎంలు, ఆశాలు

మంగళగిరి టౌన్: రక్తహీనత, మాతా శిశు మరణాలను నివారించడమే జననిమిత్ర పైలెట్ ప్రాజెక్ట్ ప్రధాన ఉద్దేశ్యమని మెటర్నల్ హెల్త్ జేడీ డాక్టర్ సతీష్ పేర్కొన్నారు. మంగళగిరి పట్టణ పరిధిలోని గణపతి నగర్‌లోనీ యూపీహెచ్‌సీలో సోమవారం ఏఐ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన జననిమిత్ర యాప్‌పై అవగాహన కల్పించారు. పట్టణ పరిధిలోని కొప్పురావు కాలనీ, మార్కండేయ కాలనీ, ఇందిరా నగర్ యూపీహెచ్‌లలో విధులు నిర్వహిస్తున్న ఏఎన్ఎంలు, ఆశాలకు యాప్‌పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జననిమిత్ర యాప్‌లో గర్భిణీ ఆరోగ్యం, మందుల వివరాలు, గర్భిణి తీసుకున్న పోషకాహార విలువలు, ప్రభుత్వ ప్రయోజనాలు వంటి వివరాలను ఏ విధంగా నమోదు చేయాలనే విషయాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు యాప్‌ను వినియోగించడం వల్ల రోజూ వారు తీసుకునే ఆహారంతో పాటు ఆరోగ్య సంబంధ విషయాలను పరిశీలించుకునే వీలుంటుందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్, మెటర్నల్ హెల్త్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ శిరీష, డీపీఎంవో డాక్టర్ సుజాత, డీపీహెచ్ఎన్‌వో డాక్టర్ ప్రియాంక, హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనూష తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పండ్లు, బ్యాగుల పంపిణీ

విద్యార్థులకు దుస్తులు, పండ్లు, బ్యాగులు అందజేస్తున్న వీఐటీ ఏపీ అధ్యాపకులు, సిబ్బంది

తాడికొండ: వీఐటీ ఏపీ వ్యవస్థాపకుడు–ఛాన్స్‌లర్ జి.విశ్వనాథన్ 87వ జన్మదినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వర్సిటీ వీసీ, రిజిస్ట్రార్ తదితరులు దత్తత గ్రామాలను సందర్శించి పాఠశాలల విద్యార్థులకు అవసరమైన క్రీడా, విద్యా సామాగ్రి ఉచితంగా అందజేశారు. ఐనవోలు జెడ్పీ హైస్కూల్, మండల పరిషత్ ఎలిమెంటరీ, శాఖమూరు మండల పరిషత్ ఎలిమెంటరీ, వెలగపూడి మోడల్ ప్రైమరీ పాఠశాలతో పాటు పలు పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు క్రీడా, వినోద సామాగ్రి, పండ్లు, బ్యాగులు, పుస్తకాలు, కంప్యూటర్లు అందజేశారు. వీఐటీ–ఏపీ ఇన్‌చార్జి వైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ పి.అరుల్మోళి వర్మన్ మాట్లాడుతూ.. పాఠశాలల విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకొని ఉన్నతంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ జగదీష్ చంద్ర ముదిగంటి, విద్యార్థి సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఖదీర్ పాషా, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర డాక్టర్ ఎన్.రామచంద్రరావు, పలువురు అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయాలి

కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

తాడేపల్లి రూరల్: విశాఖలో ఈనెల 31 నుంచి 2026 జనవరి 4వ తేదీ వరకూ జరగనున్న సీఐటీయూ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని కొత్తూరులో నాయకులతో కలిసి ఆయన సోమవారం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కార్మికవర్గం ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తున్న సీఐటీయూను బలపరచాలని కోరారు. రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వం మోదీ విధానాలకు మద్దతు ఇవ్వడం మానుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, ఏపీ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్న శివశంకరరావు, శాఖ కార్యదర్శి మొదుగుల శ్రీనివాస్‌రెడ్డి, దొంతిరెడ్డి విజయ భాస్కర్ రెడ్డి, బొజ్జ సుబ్బారావు, డోకుపర్తి యోహాను, బుర్రముక్కు గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన కలిగి ఉండాలి



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో నిర్వాహకులు

తెనాలిఅర్బన్: పర్యావరణ పరిరక్షణ పట్ల ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ కొడాలి వీరయ్య ఎడ్యుకేషనల్ అకాడమీ కార్యదర్శి వాసిరెడ్డి ప్రియబాంధవి సూచించారు. డాక్టర్ కొడాలి వీరయ్య ఎడ్యుకేషనల్ అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం మారీస్‌పేటలోని నల్లమోతు చెంచు రామానాయుడు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థినీ విద్యార్థులకు 'పర్యావరణ పరిరక్షణ–నా బాధ్యత' అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణానికి అనర్థం చేకూర్చే ప్లాస్టిక్ వినియోగం వద్దని సూచించారు. ఇంటి వద్ద, పాఠశాలల్లోనూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. చెత్తను డస్ట్ బిన్‌లోనే వేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలన్నారు. సమాజాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దటంలో విద్యార్థుల పాత్ర ఎంతో కీలకమని అందుకే విద్యార్థిని విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ పట్ల బాధ్యత ఉండేలా వకృత్వ పోటీలు జరిపామన్నారు. ఈ పోటీల్లో విజేతలకు ఈనెల 10వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్లో నిర్వహించే నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు. విజేతలతోపాటు మరో 8 మందికి కన్సోలేషన్ బహుమతులు ఇస్తామన్నారు. కార్యక్రమంలో సి.హెచ్. వసంతలక్ష్మి, బెల్లంకొండ వెంకట్, సి.హెచ్ శ్రీదేవి, ఎన్‌మహేష్, ఎ.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా రోడ్లు.. ప్రయాణికుల పాట్లు!

గుంతలు పడిన హౌస్ గణేష్‌పాడుకు వెళ్లే రహదారి

ప్రయాణానికి అనువుగా లేని మట్టి రోడ్డు

ఫిరంగిపురం: ఫిరంగిపురం నుంచి యడ్లపాడుకు వెళ్లే దారిలో హౌస్ గణేష్‌పాడు వరకూ ఉన్న సుమారు 3 కిలోమీటర్ల రహదారి పూర్తిగా దెబ్బతింది. దీంతో ద్విచక్రవాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలకు స్థానికంగా రోడ్లు పూర్తిగా గుంతలమయంగా మారాయి. దీంతో కంకర పైకి తేలి ప్రయాణానికి ఇబ్బంది కలిగిస్తుందని వాహనచోదకులు వాపోతున్నారు. రోడ్డు పొడవునా అడుగుకో గుంత ఏర్పడి ఉండటంతో ఇటుగా ప్రయాణించాలంటే ప్రమాదాలు కొని తెచ్చుకోవడమేనని ద్విచక్రవాహనదారులు అంటున్నారు. ప్రసిద్ధ కొండవీడు కోటకు వెళ్లే మార్గం కూడా ఇదే కావడంతో సెలవు రోజుల్లో టూరిస్టులు, పాఠశాల, కళాశాలల విద్యార్థులు బస్సులు, కార్లు, ద్విచక్రవాహనాల్లో ఎక్కువగా వస్తుంటారు. రోడ్డు గుంతలమయంగా మారడం, ఎత్తు.. పల్లాలుగా రహదారి దర్శనమివ్వడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు.

చినుకు పడితే చెరువే..

ఏ కొద్దిపాటి వర్షం పడినా గుంతల్లో నీరు నిలిచిపోయి రోడ్డు మరీ అధ్వానంగా మారుతోంది. ప్రయాణానికి నానా అగచాట్లు పడాల్సి వస్తోందని వాహనదారులు ఆరోపిస్తున్నారు. రోడ్డు మార్జిన్లు సైతం పూర్తిగా దెబ్బతినడంతో ప్రమాదాల తీవ్రత పెరుగుతోంది. ఇదే మార్గంలో యడ్లపాడు మీదుగా వస్తున్న మార్గం పుట్టకోట వరకూ తారు రోడ్డు వేశారు. కానీ అక్కడి నుంచి ఫిరంగిపురం వరకూ గల సుమారు 3 కిలోమీటర్ల రహదారిని విస్మరించారు. ఉన్నతాధికారులకు తెలిపి వేస్తామంటూ చెబుతున్నారే కానీ ఆచరణలో సాధ్యం కాలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు నిర్వహించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

నేడు విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ

తెనాలి: పట్టణ బోసురోడ్డులోని శ్రీకాకుమాను శంకరుని ధర్మసత్రంలో శంకరుడి 109వ వర్ధంతి రోజైన మంగళవారం పలు వితరణ కార్యక్రమాలను చేపట్టనున్నారు. ఉదయం 10 గంటలకు ధర్మసత్రంలో పట్టణ, రూరల్ మండలానికి చెందిన 5,6,7 తరగతులు చదువుతుండే వంద మంది విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.2 వేల చొప్పున స్కాలర్ షిప్‌లను అందజేస్తామని ఆలయ ఈవో తమ్మా శివారెడ్డి, ధర్మకర్త కాకుమాను శరత్ బాబు వెల్లడించారు. అదేవిధంగా 8, 9, 10 తరగతులు చదువుతున్న 75 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.3 వేలు, వేద పాఠశాల విద్యార్థులు 25 మందికి రూ.4 వేల నగదును అందజేస్తామని చెప్పారు. మొత్తం 200 మంది విద్యార్థులకు రూ.5.25 లక్షలు, పేదలకు అన్నదానం, వస్త్రదానంతోపాటు గోవాడ గోశాలకు గోవుల సంరక్షణ నిమిత్తం రూ.3 లక్షలను విరాళంగా ఇవ్వనున్నట్టు శరత్‌బాబు వివరించారు.

అవుట్‌పోస్ట్‌కు కొత్తరూపు

తెనాలి: మారీసుపేటలో రెండు గేట్ల మధ్య నిరుపయోగంగా ఉన్న పోలీస్ అవుట్ పోస్ట్‌కు పోలీసులు మరమ్మతులు చేయించారు. సుమారు పదేళ్ల క్రితం ఇక్కడ అవుట్ పోస్ట్ ఏర్పాటు చేశారు. అప్పట్లో ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించి, రైలు గేట్లు వేసిన సందర్భంలో వాహనాలను నిలపడాన్ని క్రమబద్ధీకరించడం, నేరాలు జరిగితే వెంటనే స్పందించేలా చర్యలు తీసుకున్నారు. ఔట్ పోస్ట్ ఏర్పాటు చేసిన తొలినాళ్లలో కేటాయించిన హెడ్‌కానిస్టేబుల్ కొంతకాలానికి మృతి చెందడంతో ఇక సిబ్బందిని కేటాయించలేదు. తదనంతరం కొంత కాలం విద్యుత్ బిల్లులు చెల్లించే కార్యాలయంగానూ వినియోగించారు. కొన్నాళ్లకు అదీ తీసివేయడం, గదిని వినియోగించకపోవడంతో రూపు రేఖలు మారిపోయి అసాంఘిక చర్యలకు అడ్డాగా మారింది. ప్రస్తుతం త్రీ టౌన్ సీఐగా బాధ్యతలు చేపట్టిన సాంబశివరావు పోలీస్ అవుట్ పోస్ట్‌కు మరమ్మతులు చేయించి సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. ఇక సిబ్బందిని కేటాయించి పూర్తి స్థాయి వినియోగంలోకి తీసుకొస్తారేమో వేచి చూడాలి.

సీఐటీయూ మహాసభలు జయప్రదం చేయాలి

తెనాలి: సీఐటీయూ అఖిల భారత మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో రూరల్ మండలం నందివెలుగులో సోమవారం ఇంటింటి ప్రచారం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలను కార్మికులు, రైతులకు వివరించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విశాఖపట్నంలో ఈనెల 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు మహాసభలు జరుగుతున్నాయని తెలిపారు. జనవరి 4న జరిగే బహిరంగ సభలో కార్మికుల పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com

కర్కశ సర్కారుపై కదనం ▸ గళమెత్తిన విద్యార్థి దళం

సాక్షి,అమరావతి/తాడేపల్లి రూరల్: కర్కశ సర్కారుపై విద్యార్థి దళం గళమెత్తింది. రహదారులపై రణన్నినాదమై గర్జించింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ తక్షణం విడుదల చేయాలని కదంతొక్కింది. చంద్రబాబు ప్రభుత్వ దుర్నీతిపై కన్నెర్రచేసింది. ఖబడ్దార్ అంటూ హెచ్చరించింది. రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్పులు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులు నిర్వహించిన ఆందోళన ఉద్రిక్తంగా మారింది. విద్యార్థులు తమ సమస్యలను పరిష్కరించాలని చాలా కాలంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నా స్పందించలేదు. దీంతో సోమవారం తాడేపల్లిలోని సాంఘిక సంక్షేమ కార్యాలయ ముట్టడికి విద్యార్థులు పిలుపునిచ్చారు. పల్నాడు, గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల నుంచి భారీగా తరలివచ్చిన విద్యార్థులు తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ కార్యాలయం వద్ద నుంచి ప్లకార్డులు, బ్యానర్లు, జెండాలు చేతబట్టి ర్యాలీగా పెట్రోల్ బంక్ మీదుగా సాంఘిక సంక్షేమ కార్యాలయ రోడ్డులోకి చొచ్చుకెళ్లారు. దీంతో పోలీసులు లారీలను అడ్డుపెట్టి విద్యార్థి నేతలను, విద్యార్థులను అడ్డుకునే యత్నం చేశారు. దీంతో విద్యార్థులు రోడ్డుపై బైఠాయించారు. అనంతరం బారికేడ్లను నెట్టేసి విద్యార్థులు సాంఘిక సంక్షేమ కార్యాలయం వద్ద చేరుకుని అక్కడ ధర్నాకు దిగారు. 'ఫీజులు చెల్లించలేదని విద్యార్థులను కాలేజీ యాజమాన్యాలు గేట్ బయటకు నెట్టేయడం అన్యాయం, విద్యార్థులను వేధించటం తగదు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.5,600 కోట్లు, స్కాలర్ షిప్ బకాయిలు రూ.2,200 కోట్లు తక్షణమే చెల్లించాలి, వసతి దీవెన బకాయిలు చెల్లించాలి, లేకుంటే విద్యార్థుల సత్తా ఏమిటో సర్కారుకు చూపిస్తాం.. ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తాం'' అని హెచ్చరించారు. ప్లకార్డులు ప్రదర్శించారు. విద్యార్థుల నినాదాలతో తాడేపల్లి హోరెత్తింది. అనంతరం పోలీసులు ఐదుగురితో కూడిన విద్యార్థుల ప్రతినిధి బృందాన్ని అధికారుల వద్దకు పంపుతామనటంతో విద్యార్థినేతలు, విద్యార్థులు ఒప్పుకోలేదు. ప్రభుత్వమే దిగివచ్చి తమ సమస్యలను వెంటనే పరిష్కరించే వరకు తాము ఎక్కడికీ ఇక్కడి నుంచి కదిలేదిలేదని భీష్మించారు.

విద్యార్థి నేతలను ఈడ్చిపడేసిన పోలీసులు

ఆందోళన తీవ్రం కావటంతో పోలీసులు పెద్ద ఎత్తున మోహరించారు. వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ (జోనల్) ఎ.రవిచంద్రతో పాటు మరికొంతమంది విద్యార్థులను ఈడ్చిపడేశారు. వారిని తీసుకెళ్లి ముందే సిద్ధంగా ఉంచిన లారీలోకి ఎక్కించారు. అనంతరం వారిని తెనాలి మార్గంలోని వివిధ ప్రాంతాల్లో తిప్పారు. చివరికి దుగ్గిరాల పోలీసు స్టేషన్‌కు తరలించారు. వారి వెంట భారీగా విద్యార్థులు వాహనాల్లో తరలివెళ్లారు.

విద్యాశాఖ మంత్రి విదేశాల్లో చక్కర్లు కొడతారా?

అంతకు ముందు వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు పానుగంటి చైతన్య నేతృత్వంలో గుంటూరు నుంచి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ రవిచంద్ర నేతృత్వంలో విజయవాడ వైపు నుంచి విద్యార్థులు బైక్‌లు, ఇతర వాహనాల్లో భారీ ర్యాలీగా తాడేపల్లికి చేరుకున్నారు. అనంతరం సాంఘిక సంక్షేమ కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాను ఉద్దేశించి చైతన్య, రవిచంద్ర మాట్లాడారు. దాదాపు ఎనిమిది క్వార్టర్స్ బకాయిలు రూ.7,800 కోట్లు ప్రభుత్వం మంజూరు చేయాలని, ఇందులో ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు రూ.5,600 కోట్లు, స్కాలర్ షిప్ బకాయిలు రూ.2,200 కోట్లు చెల్లించాలని స్పష్టం చేశారు. వీటిని చెల్లించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఓవైపు రాష్ట్రంలో విద్యార్థులు కష్టాల్లో ఉంటే విద్యాశాఖ మంత్రి లోకేశ్ విదేశాల్లో విహార యాత్రలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. అనంతరం పోలీసులు పానుగంటి చైతన్య, ఎ.రవిచంద్ర, నరేందర్ రెడ్డి, బాజీ, రవి తదితరులను అరెస్టు చేసి దుగ్గిరాల పోలీస్ స్టేషన్లో నిర్బంధించారు. ధర్నాలో స్టూడెంట్ యూనియన్ నాయకులు నరేంద్రరెడ్డి, గంటి, రవి, పేటేటి నవీన్, వినోద్, కోమల సాయి, రవీంద్రారెడ్డి, సందీప్, రవి, కరీం, కిరణ్, రాజేష్, సతీష్, అజయ్, రామకృష్ణ, మస్తాన్, ప్రభు, హరి, సుభాని, బాలు, అబ్బాస్, సిరాజ్, శ్రీనివాస్, నవీన్, కోమల్ సాయి, సురేష్ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని కోరుతూ సాంఘిక సంక్షేమ కార్యాలయం ఎదుట ధర్నా చేసేందుకు వెళుతున్న విద్యార్థులు

విద్యార్థులపై కేసు నమోదు

తాడేపల్లి ఎస్ఐ ఖాజావలి విద్యార్థి సంఘ నాయకులు పానుగంటి చైతన్య, నరేంద్రరెడ్డి, అనిల్ కుమార్, రవీంద్ర, రవిచంద్ర విధులకు ఆటంకం కలిగించారని కేసు నమోదు చేశారు. వీరిని మధ్యాహ్నం 12 గంటలకు అదుపులోకి తీసుకున్న పోలీసులు సాయంత్రం 8 గంటల సమయంలో మంగళగిరి కోర్టులో హాజరుపరిచారు.

ప్రభుత్వం దిగిరాకపోతే సీఎం ఇంటిని ముట్టడిస్తాం

ప్రభుత్వం దిగిరాకపోతే సీఎం ఇంటిని ముట్టడిస్తాం. తక్షణం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు మంజూరు చేయాలి. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్ ఎప్పటికప్పుడు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించారు, స్కాలర్‌షిప్పులూ మంజూరు చేశారు. ఈ సర్కారు వచ్చాక అసలు చెల్లింపులు నిలిపేసింది. విద్యార్థులను చిత్రహింసలు పెడుతోంది. ఈ సర్కారుకు తగిన గుణపాఠం చెబుతాం.

– పానుగంటి చైతన్య, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు

పార్ట్ టైం ఉద్యోగాలకు విద్యార్థులు

చంద్రబాబు సర్కారు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇతర బకాయిలు చెల్లించకుండా తాత్సారం చేయడంతో కాలేజీల యాజమాన్యాల వేధింపులను విద్యార్థులు తట్టుకోలేకపోతున్నారు. హాల్‌టికెట్లు ఇవ్వకపోవడంతో చాలామంది పరీక్షలకు దూరమయ్యారు. దీంతో కొందరు విద్యార్థులు పార్ట్‌టైం ఉద్యోగాలుచేస్తూ ఫీజులు చెల్లించాల్సిన దుస్థితి నెలకొంది. తల్లిదండ్రులు కాలేజీల ఫీజులు చెల్లించేందుకు అప్పులుచేయాల్సి వస్తోంది.

– ఎ.రవిచంద్ర, వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్

ప్రోత్సాహకాలు ఇవ్వకపోతే ▸ ఆత్మహత్యలే

పెట్టుబడుల రాయితీల కోసం ఏపీఐఐసీ ఎదుట ఐదురోజులుగా దళిత పారిశ్రామికవేత్తల నిరసన

తక్షణం రాయితీలు ఇవ్వాలని కోరుతూ ఏపీఐఐసీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దళిత పారిశ్రామికవేత్తలు

సాక్షి, అమరావతి/మంగళగిరి టౌన్: దళిత పారిశ్రామికవేత్తలపై చంద్రబాబు సర్కారు చిన్నచూపు చూస్తోందని.. కొత్త పారిశ్రామిక విధానాల్లో దళితుల ప్రోత్సాహకాలకు కోత పెట్టిన టీడీపీ కూటమి సర్కారు ఇప్పుడు పాత ప్రోత్సాహకాలను విడుదల చేయకుండా వేధిస్తోందని.. అవి ఇవ్వకపోతే తమకు ఆత్మహత్యలే శరణ్యమని దళిత పారిశ్రామికవేత్తలు ఆవేదన వ్యక్తం చేశారు. నిండా అప్పుల్లో మునిగిపోయి పిల్లలకు కడుపు నిండా తిండిపెట్టలేకపోతున్నామంటూ ఐదు రోజులుగా గుంటూరు జిల్లా మంగళగిరి ఏపీఐసీసీ కార్యాలయం ముందు చలిలో సైతం ధర్నా చేస్తున్నా సర్కారు కనికరించడంలేదంటూ సోమవారం కారెం సత్యనారాయణమ్మ, వరుకోటి నీరజ, పార్ల నాగలక్ష్మి వాపోయారు. సబ్సిడీలు విడుదల చేయాలంటూ తాము డిసెంబరు 4 నుండి కుటుంబ సమేతంగా దీక్ష చేస్తున్నా ప్రభుత్వం స్పందించడంలేదని వీరు ఆవేదన వ్యక్తం చేశారు. వీరికి మద్దతుగా సోమవారం అన్ని జిల్లాల నుంచి ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలు ఏపీఐఐసీ కార్యాలయం వద్దకు చేరుకుని ధర్నాలో పాల్గొన్నారు. మొత్తం 8వేల మంది ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలు ఇబ్బంది పడుతుంటే ఈ ప్రభుత్వానికి చీమకుట్టినట్లుగా కూడా లేదని వారు మండిపడ్డారు. చట్టప్రకారం తమకు రావల్సిన పెట్టుబడుల రాయితీలు విడుదల చేయకపోతే ఆత్మహత్యలే శరణ్యమని.. ఆ చావేదో ఇక్కడే చస్తామంటూ వారు ఏపీఐఐసి గేట్లు మూసివేసి రోడ్డుపైనే బైఠాయించారు. అధికారంలోకి రాగానే తమ బకాయిలు చెల్లించడమే కాకుండా ఏ సంవత్సరం డబ్బులు ఆ సంవత్సరమే ఇస్తామంటూ చంద్రబాబు ఇచ్చిన వాగ్దానాన్ని విస్మరించడంపై మండిపడ్డారు. ఇప్పటికైనా సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, పరిశ్రమల శాఖ మంత్రులు టీజీ భరత్, కొండపల్లి శ్రీనివాస్, విద్యాశాఖ మంత్రి లోకేశ్, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యువరాజ్, డైరెక్టర్ శుభమన్ బన్సాల్ తక్షణం నిధులు విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

సబ్సిడీ ఇవ్వకుండా వేధిస్తున్నారు

ఈ సందర్భంగా కారెం సత్యనారాయణమ్మ మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో వైఎస్సార్ జగనన్న బడుగు వికాసం పథకం కింద రెండు బస్సులను కొనుగోలు చేసి ఏపీఎస్ఆర్టీసీలో అద్దెకు తిప్పుతున్నామని, దీనికి ప్రభుత్వం ప్రకటించిన రూ.42.63 లక్షల సబ్సిడీ ఇవ్వకుండా చంద్రబాబు సర్కారు వేధిస్తోందంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వం సబ్సిడీ ఇచ్చేవరకు ఇక్కడ నుంచి కదిలేది లేదన్నారు. ఇప్పటికే బ్యాంకులకు రెండు నెలలుగా ఈఎంఐలు కట్టలేదని, ఇప్పుడు మూడోనెల కూడా కట్టకపోతే ఎన్‌పీఏ కింద ప్రకటించి బస్సులను తీసుకుపోతారని ఆమె చెప్పారు. అలాగే, ఈనెలలో రెండు లక్షల బీమా ప్రీమియం చెల్లించాలని, కనీసం అప్పు కూడా పుట్టే పరిస్థితి లేదని ఆమె వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం రాయితీల కింద అక్టోబరులో రూ.వెయ్యి కోట్లకు పైగా నిధులు విడుదల చేసినప్పటికీ మా వర్గాలకు ఎలాంటి రాయితీలు ఇవ్వలేదని ఆమె ఆరోపించారు. ఆర్టీసీ బస్సులకు కేటాయించిన రూ.56 కోట్ల నిధులు ఏమయ్యాయని ఆమె ప్రశ్నించారు.

లిఖితపూర్వక హామీ ఇచ్చేవరకు కదిలేది లేదు

ఇక మెగా పరిశ్రమలకు రూ.వందల కోట్లు కేటాయించిన ప్రభుత్వం తమలో 90 శాతం మందికి విడుదల చేయలేదని ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలు ఆరోపించారు. తక్షణం 100 శాతం రాయితీలను విడుదల చేయాలంటూ పరిశ్రమల శాఖ అడిషనల్ డైరెక్టర్ రామలింగరాజుకు జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) వినతిపత్రం సమర్పించింది. ఎప్పటిలోగా విడుదల చేస్తారో లిఖితపూర్వకంగా చెప్పాలని.. అప్పటివరకు ఏపీఐఐసీ కార్యాలయం నుంచి కదిలేదిలేదని తేల్చిచెప్పారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ రాకపోతే ఆమరణ నిరాహారదీక్షకు వెనుకాడబోమని జేఏసీ స్పష్టంచేసింది. అయితే, ధర్నా చేస్తున్న దళిత పారిశ్రామికవేత్తలను తరలించడానికి పోలీసు బలగాలు పెద్దఎత్తున వచ్చాయి. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఈడ్పుగంటి అనార్‌బాబు, ఈరా రాజశేఖర్, పినమాల నాగకుమార్, కనపర్తి విజయరాజు, కొడాలి రాంబాబు, భక్తవత్సలం, సరిహద్దు దయాకర్ డాక్టర్ ఎం.గీత, మూడా, రమణమూర్తి నాయక్, పెద్దఎత్తున ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్‌ను హతమార్చిన మావోయిస్టులు

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో ఘటన

హతుడు అలీ

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులు ఓ రోడ్ కాంట్రాక్టర్‌ను గొంతుకోసి దారుణంగా హతమార్చారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో కేంద్రం విడుదల చేసిన నిధులతో బీజాపూర్ జిల్లాలో కొన్ని పనులను ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇంతియాజ్ అలీ (48) చేయిస్తున్నాడు. ఆదివారం ఆయన తన గుమస్తాతో కలిసి రోడ్డు పనుల పరిశీలనకు పువ్వర్తి సమీపానికి రాగా ఇద్దరినీ మావోయిస్టులు కిడ్నాప్ చేశారు. గుమస్తా తప్పించుకుని ఆరెపల్లి సీఆర్‌పీఎఫ్ క్యాంపునకు చేరుకుని ఈ విషయం చెప్పడంతో పోలీసులు సోమవారం ఆ ప్రాంతంలో గాలించగా అలీ మృతదేహం లభ్యమైంది. కాగా, కాంట్రాక్టర్‌ను తామే హతమార్చామంటూ పామేడు ఏరియా కమిటీ పేరిట మృతదేహం వద్ద మావోయిస్టులు లేఖ వదిలారు.

మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు రామ్‌ధీర్ సరెండర్

- పోలీసులకు మరో 11మంది ఆయుధాల అప్పగింత
- రామ్‌ధీర్‌పై రూ. కోటి రివార్డు

లొంగిపోయిన మావోయిస్టులు, అప్పగించిన ఆయుధాలు

దుమ్ముగూడెం: మావోయిస్టు పార్టీకి మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు రామ్‌ధీర్ మజ్జీ, మరో 11 మంది మావోయిస్టులు ఆయుధాలతో సహా పోలీసులకు లొంగిపోయారు. వీరి లొంగుబాటును మంగళవారం ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్‌సాయి సమక్షంలో అధికారికంగా ప్రకటిస్తారని సమాచారం. పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడు, మహారాష్ట్ర–మధ్యప్రదేశ్–ఛత్తీస్‌గఢ్ కమిటీ ఇన్‌చార్జి రామ్‌ధీర్ మజ్జీతో పాటు మరో 11 మంది సోమవారం అడవిని వీడి ఛత్తీస్‌గఢ్‌లోని ఖైరాగఢ్ జిల్లా బకర్‌కట్టా పోలీసులకు ఆయుధాలను అప్పగించారు. వీరిలో డివిజన్ కమిటీ సభ్యులు చందు ఉసేండి, జానకి, ప్రేమ్, లలిత, ఏరియా కమిటీ సభ్యులు రామ్ సింగ్ దాదా, సుకేశ్ పొట్టం, ప్లాటూన్ పార్టీ మెంబర్లు లక్ష్మి, శీల, సాగర్, కవిత, యోగిత ఉన్నారు. ఖైరాగఢ్ జిల్లా బకర్‌కట్టా స్టేషన్ పరిధిలోని కుమ్హీ గ్రామంలో మావోయిస్టుల లొంగుబాటు కార్యక్రమానికి ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి హాజరవుతారని తెలుస్తోంది. కాగా, రామ్‌ధీర్‌పై రూ.కోటికి పైగా రివార్డ్ ఉండగా, ఆయన పలు దాడుల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నాడని పోలీసులు వెల్లడించారు.

అక్రమ రీచ్‌పై తిరగబడ్డ తెలుగు తమ్ముళ్లు

- పీకేపాడు రీచ్ నుంచి వందల లారీల్లో ఇసుక రవాణా
- ఓవర్ లోడుతో రహదారి ధ్వంసం
- రోడ్డు దుస్థితితో నిలిచిపోయిన ఆర్టీసీ సర్వీసులు
- రీచ్ వద్ద ధర్నాకు దిగిన టీడీపీ నేతలు
- బడా నేతల ఫోన్‌తో వెనుదిరిగిన వైనం

నెల్లూరు జిల్లా పీకేపాడు ఇసుక అక్రమ రీచ్ వద్ద ఆందోళన చేస్తున్న టీడీపీ నేతలు

సోమశిల: బడా టీడీపీ నేతలు సాగిస్తున్న ఇసుక అక్రమ రవాణాతో తమ రోడ్డు ధ్వంసమవుతుందంటూ ఆ పార్టీ శ్రేణులే తిరగబడ్డారు. ఈ ఘటన శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా అనంతసాగరం మండలంలోని పడమటి కంభంపాడు పెన్నానది రీచ్ వద్ద సోమవారం జరిగింది. టీడీపీ అధికారంలోకి వచ్చాక ఇసుక అక్రమ రవాణాపై దృష్టి సారించిన ఆ పార్టీ బడా నేతలు కొందరు స్థానిక ఎమ్మెల్యే, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అండతో ఎక్కడికక్కడ అనధికారికంగా రీచ్‌లు ఏర్పాటు చేసుకున్నారు. పెన్నానదిలో మండల పరిధిలోని పడమటి కంభంపాడు రీచ్ ద్వారా నిత్యం వందల టర్బో లారీలు, టిప్పర్లతో ఇసుకను తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు అక్రమ రవాణా చేస్తున్నారు. వాహనాల్లో సామర్థ్యానికి మించి అధిక లోడ్లతో రవాణా చేస్తున్నందున సోమశిల–ఉప్పలపాడు వరకు సుమారు 8 కిలోమీటర్ల ప్రధాన రహదారి అడుగడుగునా భారీ లోతులో గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ఈ మార్గంలో సాఫీగా నడిచిపోయే పరిస్థితి లేదు. దీంతో స్థానికంగా ఉన్న టీడీపీ నేతలు ఇసుక అక్రమ రవాణాదారులకు చెబితే.. పూడుస్తామంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతూ వచ్చారు. ఈ క్రమంలో ఇటీవల వచ్చిన మోంథా, దిత్వా తుఫాన్లతో కురిసిన భారీ వర్షాలకు రహదారి అంతా చెరువును తలపించింది. ఇప్పటికే ఆర్టీసీ బస్సులు సైతం సోమశిలకు వెళ్లకుండా ఉప్పలపాడు వద్ద నుంచి మళ్లించుకుని వెళ్లిపోతున్నాయి. పర్యాటక కేంద్రం సోమశిలకు ప్రయాణికుల రాకపోకలు స్తంభిస్తున్నాయి. ఈ అనధికార రీచ్ మంత్రి ఆనం ఇలాకాలో జరుగుతున్న కారణంగా ధైర్యం చేసి ప్రశ్నించేవారు లేకుండా పోయింది. ఈ క్రమంలో టీడీపీ నేతలు భారీగా తరలివచ్చి రీచ్ వద్ద ధర్నాకు దిగారు. దెబ్బతిన్న రహదారి గుంతలను పూడ్చండి, లేదంటే రవాణా నిలిపివేయండని నిర్వాహకులను టీడీపీ మండల ఉపాధ్యక్షుడు ఉప్పల విజయకుమార్ హెచ్చరించారు. ఇసుక వాహనాలను కదలనీయకుండా అడ్డుకున్నారు. ఇసుక తవ్వే జేసీబీలను నిలువరించారు. దీంతో అక్కడ ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో కొద్ది సేపటికే పార్టీ ముఖ్య నేతల నుంచి ఒత్తిడి రావడంతో మారు మాట్లాడకుండా ఆందోళనకారులు మౌనంగా వెనుదిరిగారు.

ఏఎన్‌ఎంల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్యం

- ఏఎన్‌ఎంలు, ఎన్‌హెచ్‌ఎంలకు హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలి
- కాంట్రాక్ట్ రెండో ఏఎన్‌ఎం యూనియన్

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న రెండో ఏఎన్ఎంల సమస్యల పరిష్కారంలో చంద్రబాబు ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఏపీ గవర్నమెంట్ కాంట్రాక్ట్ రెండో ఏఎన్ఎంల సంఘం గౌరవాధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. ఏఎన్ఎంల సమస్యల పరిష్కారం కోరుతూ విజయవాడ అలంకార్ సెంటర్‌లోని ధర్నా చౌక్‌లో సోమవారం రిలే నిరాహార దీక్ష జరిగింది. దీక్షకు నాగేశ్వరరావు, నేషనల్ హెల్త్ మిషన్ జేఏసీ చైర్మన్ దయామణి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రెండో ఏఎన్ఎంలు 20 ఏళ్లుగా సేవలందిస్తున్నారన్నారు. కరోనా కష్టం కాలంలోనూ పనిచేసిన ఏఎన్ఎంలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఏఎన్ఎంలు, ఎన్‌హెచ్ఎం ఉద్యోగులకు మినిమం టైమ్ స్కేల్, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్న రెండో ఏఎన్ఎంలను వర్క్ ఎడ్జస్ట్‌మెంట్ పేరుతో సుదూర ప్రాంతాలకు, కొత్తగా ఏర్పడే జిల్లాలకు బదిలీ చేయడం దుర్మార్గమన్నారు. దీనివల్ల వారంతా మానసికంగా, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కుటుంబాలకు దూరంగా బతుకుతున్నారని, వీరి పరిస్థితిని ప్రభుత్వం మానవతా దృష్టితో ఆలోచించి వారి ప్రాంతాలకు పంపాలన్నారు. యాప్‌ల పేరుతో మోపిన పనిభారం తగ్గించాలని, గతంలో మాదిరిగా యూనిఫాం అలవెన్స్ చెల్లించాలన్నారు. వేతనాల్లో కోత విధించడాన్ని నిలిపివేయాలన్నారు. ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలని, 180 రోజుల చైల్డ్ కేర్, హెల్త్ ఇన్సూరెన్స్, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలన్నారు. దీక్షలో యూనియన్ అధ్యక్షురాలు ఎం.స్వాతి, ప్రధాన కార్యదర్శి రవీనజ్యోతి, కోశాధికారి నారాయణమ్మ, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

బాబు దుర్మార్గ చర్యకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ

- పాలకులకు నిబద్ధత ఉండాలి
- వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్, శాసనమండలిలో ప్రతిపక్ష నేత బొత్స

మీడియాతో మాట్లాడుతున్న బొత్స, తదితరులు

రావులపాలెం: గత ప్రభుత్వంలో పెట్టిన అన్ని మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేద్దామన్న చంద్రబాబు ప్రభుత్వ దుర్మార్గ చర్యను వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టినట్టు వైఎస్సార్ సీపీ ఉభయగోదావరి జిల్లాల రీజినల్ కో–ఆర్డినేటర్, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంలో సోమవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అధ్యక్షతన జిల్లా పార్టీ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బొత్స ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక సీఆర్‌సీ ఫంక్షన్ హాల్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యం ప్రభుత్వ ఆధీనంలోనే నడవాలి కానీ దురదృష్టవశాత్తూ చంద్రబాబు ప్రభుత్వ ఆధ్వర్యంలో ఆ పరిస్థితి మారుతోందన్నారు. కోవిడ్ సమయంలో నెలకొన్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని గత ప్రభుత్వం అన్ని జిల్లాల్లో మెడికల్ కాలేజీలు ఉండాలని నిర్ణయించిందన్నారు. కొత్తగా ఏర్పడిన జిల్లాలో మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేసిందన్నారు. రానున్న కాలంలో వైద్యం ప్రైవేటు చేతుల్లోకి పూర్తిగా వెళితే సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పాలవుతారన్నారు. ఈ ప్రభుత్వం ప్రజల గురించి ఆలోచన చేయడం లేదన్నారు. కేవలం వారి స్వార్థం కోసం, అవినీతి కోసం, దోపిడీ కోసమే ఆలోచన చేసి ఇటువంటి కార్యక్రమాలు చేస్తోందన్నారు. గడచిన 18 నెలల్లో ప్రభుత్వం ఏ రంగంలోనూ వృద్ధి సాధించలేదన్నారు. ఈ ప్రభుత్వం వచ్చాక ఎన్ఆర్ఈజీఎస్‌లో సుమారు ఏడు కోట్ల పని దినాలను తగ్గించిందన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా పేదలకు పని దినాలు కల్పించలేని ప్రభుత్వం అద్భుతమైన ఉద్యోగాలు కల్పిస్తామని ఎలా హామీ ఇస్తుందని బొత్స ధ్వజమెత్తారు.

ఏ పంటకూ గిట్టుబాటు ధర లేదు

ప్రస్తుతం పేరెంట్స్ టీచర్స్ మీటింగులు జరిగిన పాఠశాలలు ఐదేళ్ల క్రితం ఎలా ఉన్నాయో ఇప్పుడు ఎలా ఉన్నాయో చంద్రబాబు గమనించారా అని బొత్స ప్రశ్నించారు. పాలకులకు నిబద్ధత ఉండాలన్నారు. 'ఎన్నుకున్న ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించేలా పాలన చేయాలి, రైతులకు గిట్టుబాటు ధర, పేద ప్రజలకు విద్య, వైద్యంలాంటి సౌకర్యాలు కల్పించాలి. అవి ఉన్నాయా' అని బొత్స ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో గిట్టుబాటు ధర కల్పించేలా రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో సాగయ్యే ఏ పంటకూ కనీస మద్దతు ధర లేదన్నారు. రైతులు, విద్యార్థులతోపాటు అన్ని వర్గాలు ఈ ప్రభుత్వంలో సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. రాష్ట్రంలో క్రైమ్ రేట్ విపరీతంగా పెరిగిపోయిందని, హత్యలు, లైంగిక దాడులు, చిన్నారులపై అఘాయిత్యాలు ఎక్కువైపోయాయన్నారు. వీటన్నింటిపై ప్రజల తరఫున పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

కేంద్రమంత్రి వల్లే ఇండిగో సంక్షోభం

ఇండిగో సంక్షోభంతో దేశం పరువు తీశారని, కేవలం ఒక వ్యక్తి తప్పిదం వల్లే ఈ సంక్షోభం ఏర్పడిందని బొత్స విమర్శించారు. రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రి అసమర్థత వల్లే ఇలా జరిగిందన్నారు. ఆ వ్యక్తి తెలుగువాడే కావటం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ బలోపేతానికి క్షేత్రస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకూ కమిటీలను పూర్తి చేశామన్నారు. కోటి సంతకాల కార్యక్రమాన్ని విజయవంతం చేశామని, నియోజకవర్గ స్థాయిలో ఈ నెల 10వ తేదీన సేకరించిన వాటిని జిల్లా కేంద్రాలకు తరలిస్తామన్నారు. అక్కడి నుంచి 15న పార్టీ కేంద్ర కార్యాలయానికి తరలిస్తామన్నారు. సమావేశంలో పార్టీ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులు, కుడుపూడి సూర్యనారాయణ, బొమ్మి ఇజ్రాయిల్, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్, మాజీమంత్రి పినిపే విశ్వరూప్, అమలాపురం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, పార్టీ రాష్ట్ర యూత్ వింగ్ ప్రెసిడెంట్ జక్కంపూడి రాజా, నియోజకవర్గ ఇన్‌చార్జులు పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, గొల్లపల్లి సూర్యారావు, పిల్లి సూర్యప్రకాష్, గన్నవరపు శ్రీనివాసరావు, పినిపే శ్రీకాంత్, చింతా అనురాధ, పాముల రాజేశ్వరి, పితాని బాలకృష్ణ, పాల్గొన్నారు.

నిరుపేదల పొట్ట కొడతారా?

- తక్షణం రూ. 381 కోట్ల బకాయిలు పేదలకు చెల్లించాలి
- నిరుపేదల వేతనాలు ఇప్పించే బాధ్యత పవన్‌కు లేదా?
- వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షులు వెన్నపూస రవీంద్రారెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 18.63 లక్షల నిరుపేద ఉపాధి హామీ కూలీల జాబ్ కార్డులు తొలగించిన చంద్రబాబు కూటమి ప్రభుత్వం, ఆరు నెలలుగా వేతనాలు ఇవ్వకుండా వారి పొట్ట కొడుతోందని వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది జూలై 27 నుంచి డిసెంబర్ వరకు పెండింగ్ ఉపాధి కూలీల వేతన బకాయిలు రూ.381 కోట్లు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. 18.63 లక్షల జాబ్ కార్డుల తొలగింపుపై పంచాయతీరాజ్ మంత్రి, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎంపీడీవోలకు డీడీఎల్‌వోలుగా మాజీ సీఎం వైఎస్ జగన్ పదోన్నతి కల్పించి వారికి ప్రత్యేక ఆఫీసులు ఏర్పాటు చేస్తే, ఆ పేరుని డీడీవోలుగా మార్చి తానే ప్రమోషన్ ఇచ్చినట్టు పవన్ చెప్పుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. పవన్ కూడా చంద్రబాబు నుంచి క్రెడిట్ చోరీ నేర్చుకున్నారని ఎద్దేవా చేశారు. రైతులకు యూరియా కూడా సరఫరా చేయకుండా వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసిన చంద్రబాబు ప్రభుత్వం.. చివరికి ఉపాధి హామీ కూలీలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే వేతనాలు కూడా ఇవ్వకుండా వేధిస్తోందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పల్లెల్లో బెదిరింపుల పర్వానికి తెరదీసిందని, అందులో భాగంగానే టీడీపీ మద్దతుదారులకే జాబ్ కార్డులు ఉంచి మిగతా వారి కార్డులను రకరకాల కారణాలతో ఏరివేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో పేదలకు అడిగినంత పని కల్పించగా.. చంద్రబాబు ప్రభుత్వం ఉపాధి పని దినాలు కల్పించడంలోనూ విఫలమైందన్నారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉండగా 2023–24లో రాష్ట్రంలో ఏప్రిల్ – నవంబరు మధ్య 21.37 కోట్ల పనిదినాలు కల్పించగా, చంద్రబాబు సర్కారు 2025–26 ఏప్రిల్ నుంచి డిసెంబరు 7వతేదీ నాటికి కేవలం 15.94 కోట్ల పనిదినాలను మాత్రమే కల్పించిందన్నారు.

సినిమా టికెట్ రేట్ల మీద ఉన్న శ్రద్ధ పేదల మీద ఏదీ?

ఒకపక్క 7.4 లక్షల కుటుంబాలకు 18.63 జాబ్ కార్డుల తొలగింపు.. మరోవైపు ఐదున్నర కోట్ల పనిదినాల కోత.. ఇంకోవైపు ఉపాధి పనులనే నమ్ముకున్న గ్రామీణ నిరుపేదలకు వేతనాలు చెల్లించకుండా చంద్రబాబు ప్రభుత్వం వేధిస్తున్నా డిప్యూటీ సీఎం పవన్ నోరు మెదపడంలేదని దుయ్యబట్టారు. తన సినిమా టికెట్ల రేట్లు పెంచుకోవడంలో ఉన్న శ్రద్ధ ఉపాధి హామీ కూలీలపై పెట్టడం లేదన్నారు. ఉపాధి కూలీలు అని పిలవొద్దని కల్లబొల్లి మాటలతో పవన్ సరిపుచ్చుతున్నారని విమర్శించారు.

'సహజ ప్రతిభ', 'పుట్టుకతోనే మేధావి'లాంటి అభిప్రాయాలను జపనీస్ మెథడ్ 'గీడో' నిరాకరిస్తుంది. నైపుణ్యం, ప్రతిభ అనేవి పుట్టుకతో వచ్చేవి కాదు, లోతైన క్రమశిక్షణ, అంకితభావం ద్వారా వాటిని సొంతం చేసుకోవచ్చు అని చెబుతుంది ఏడు వందల సంవత్సరాల 'గీడో' మెథడ్.

న్యూస్‌మేకర్

ప్రతీకాత్మక చిత్రం

తీర్పు ఏదైనా... పోరుకు ప్రశంస

శక్తిమంతులతో పోరాడే సమయంలో పోరాటమే విజయంతో సమానం. ఆ తర్వాత దక్కిన న్యాయం సంతృప్తిని ఇవ్వొచ్చు ఇవ్వకపోవచ్చు. కేరళ సూపర్‌స్టార్ దిలీప్ తనపై అత్యాచారం చేసేందుకు ఒక గ్యాంగ్‌తో కుట్ర పన్నాడని ఆరోపించి సుదీర్ఘకాలం పోరాడిన నటి (తెలుగులో కూడా నటించింది) చివరకు డిసెంబర్ 8న జడ్జిమెంట్ వినగలిగింది. మొత్తం 15 మంది నిందితులున్న ఈ కేసులో 1 నుంచి 6 వరకు ఉన్న నిందితులను కోర్టు దోషులుగా ఖరారు చేసి 8వ నిందితుడైన దిలీప్‌ను నిర్దోషిగా విడుదల చేసింది. దీనిపై వ్యాఖ్యలు వినిపిస్తున్నా కేరళను కంపింప చేసి ఎన్నో సవాళ్లు తట్టుకుని పోరాడిన నటిని ముందు ప్రశంసించాల్సి ఉంది.

తాను పని చేసే రంగంలో అత్యంత శక్తిమంతుడైన వ్యక్తి వల్ల తనకు అన్యాయం జరిగిందని ఒక బాధితురాలు విశ్వసిస్తే ఆమె చేసే పోరాటానికి ఎన్ని అవరోధాలు ఉంటాయి? మలయాళ సూపర్‌స్టార్ దిలీప్ పన్నిన కుట్ర వల్లే తన మీద అత్యాచారం జరిగిందని న్యాయపోరాటానికి దిగిన మలయాళ నటి ఎన్నో కష్టనష్టాలు ఎదుర్కొని చివరకు 'తీర్పు'ను సాధించింది. అయితే ఆ తీర్పులో తనకు దక్కిన న్యాయం పాక్షికమా? సంపూర్ణమా అనేది చర్చే అయినా... ఇంతవరకూ ఆమె వెరవక నిలబడటం చాలా గొప్ప సంగతి. స్ఫూర్తిదాయకమైన పోరాటం.

అసలేం జరిగింది?

మలయాళ నటి 'ఎం' (కథనం కోసం పెట్టిన పేరు) ఫిబ్రవరి 17, 2017న త్రిషూర్‌లోని తన ఇంటి నుంచి కొచ్చి వెళుతున్నప్పుడు రాత్రి వేళ ఆమె ప్రయాణిస్తున్న వాహనాన్ని మరో వాహనంతో ఢీకొట్టిన కొంతమంది ఆమె వాహనంలోకి జొరపడ్డారు. ఆ తర్వాత కొచ్చి అంతా తిప్పుతూ 'ఎం'ను దుర్భాషలాడారు. వారిలో పల్సన్ సుని అనే పాత నేరస్తుడు ఆమె మీద అత్యాచారం చేయడమే కాదు అదంతా వీడియో తీశాడు. ఆ తర్వాత ఒక దర్శకుడి ఇంటి ముందు ఆమెను పడేసి ఉడాయించాడు. దర్శకుడి సహాయంతో అదే రోజు 'ఎం' కేసు నమోదు చేసింది.

తర్వాత ఏం జరిగింది?

మొదట పోలీసులు ఇదో బ్లాక్‌మెయిల్ దందా చేసే వారి పని అని భావించారు. అయితే అత్యాచార సమయంలో పల్సర్ సుని 'ఎం'తో 'నేను కొటేషన్ అందుకోవడం వల్లే ఈ పని చేస్తున్నాను' అన్నాడు. కొటేషన్ అంటే సుపారీ. అయితే ఈ సుపారీ సంగతి వెంటనే పోలీసుల దృష్టికి రాలేదు. బాధితురాలు ఇది కీలకమైన కామెంట్‌గా గమనించలేదు.

అరెస్టులు

పోలీసులు వరుసగా అరెస్టులు చేశారు. వీరిలో పల్సర్ సునితో పాటు 'ఎం' వాహన డ్రైవర్ ఇంకా ఆరు గురు ఉన్నారు. మే 1, 2017 నాటికి 'ది విమెన్ ఇన్ సినిమా కలెక్టివ్' పేరుతో మలయాళ నటీమణులు ఒక బృందంగా ఏర్పడి ముఖ్యమంత్రిని కలిసి మలయాళ పరిశ్రమలో సెక్సువల్ హరాస్‌మెంట్ గురించి చర్యలు తీసుకోవలసిందిగా కోరారు. జూన్, 2017 నాటికి విష్ణు అనే వ్యక్తి తాను పల్సర్ సునీ జైల్‌మేట్‌నని జైలులో అతడు ఈ కేసు వెనుక నటుడు దిలీప్ ఉన్నాడన్న సంగతి చెప్పాడని బయటకు వెల్లడి చేయడంతో గగ్గోలు మొదలైంది. మరోవైపు 'కొటేషన్ డబ్బు బేలెన్స్ చెల్లించమని' పల్సర్ సుని రాసిన ట్టుగా చెప్పే లెటర్ బయటకు 'లీక్ అయ్యింది'. దాంతో ఈ అత్యాచారం కుట్రలో దిలీప్ ఉన్నాడన్న విషయం బయటకు వచ్చి కేరళలో కంపనలు పుట్టాయి. జనం రెండుగా చీలి వాదులాడుకున్నారు. 'ఎం'ను దుర్భాషలాడారు. జూన్ 24, 2017న దిలీప్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

దిలీప్‌పై ఆరోపణ ఎందుకు?

నటుడు దిలీప్, నటి మంజు వారియర్ 2012లో వివాహం చేసుకున్నారు. అయితే దిలీప్‌కు మరో నటి కావ్య మాధవన్‌తో సంబంధం ఉన్నట్టు మంజుకు అనుమానం వచ్చింది. కాని ఏ ఆధారం దొరకలేదు. అయితే దిలీప్‌కు, కావ్యా మాధవన్‌కు ఉమ్మడి స్నేహితురాలైన 'ఎం'కు ఈ విషయం తెలిసి ఉండొచ్చనే ఉద్దేశంతో మంజు 'ఎం'ను నిలదీసింది. 'ఎం' ఆ సంబంధాన్ని బయట పెట్టిందని సమాచారం. తనకు స్నేహితురాలిగా ఉంటూ తన పెళ్లిలో చిచ్చు పెట్టిన 'ఎం' మీద ఆనాటి నుంచి కోపం పెట్టుకున్న దిలీప్ సమయం కోసం ఎదురు చూశాడని ఆరోపణ. ఈలోపు 2015లో మంజు, దిలీప్‌లు విడాకులు తీసుకున్నారు. 2016లో దిలీప్, కావ్య వివాహం చేసుకున్నారు. 2017లో 'ఎం' మరికొన్ని రోజుల్లో ఎంగేజ్‌మెంట్ చేసుకోనున్నదనగా ఈ ఘటన జరిగింది. ఈ పూర్వరంగం అంతా 'ఎం'ను దిలీప్ దీని వెనుక ఉన్నాడని విశ్వసించేలా చేసింది. అయితే దిలీప్ ముందు నుంచీ ఇదంతా తన ప్రతిష్టను తట్టుకోలేని శక్తులు చేసిన కుట్రగా కొట్టేస్తూ వచ్చాడు. 84 రోజులు జైలులో ఉండి బయటకు వచ్చిన దిలీప్ తనే ఈ కేసులో సి.బి.ఐ. విచారణ జరిపించాలని సుప్రీం కోర్టు వరకూ వెళ్లాడు.

2018లో విచారణ మొదలు

ఎర్నాకుళం ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టులో హనీ ఎం.వర్గీస్ అనే మహిళా న్యాయమూర్తి నేతృత్వంలో 2018లో విచారణ మొదలైంది. అయితే ఈ జడ్జి మీద తనకు విశ్వాసం లేదని బాధిత నటి కేరళ హైకోర్టుకూ, సుప్రీంకోర్టుకూ వెళ్లి న్యాయమూర్తిని మార్చమని అభ్యర్థించింది. అయితే న్యాయమూర్తి మార్పు జరగలేదు. విచారణలో స్వచ్ఛతపై అసంతృప్తితో 2022 నాటికి ఇద్దరు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఒకరి తర్వాత ఒకరుగా కేసు నుంచి తప్పుకున్నారు. చాలా మంది సాక్షులు మొదట బాధితురాలి పక్షాన స్టేట్‌మెంట్స్ ఇచ్చి కాలక్రమంలో అడ్డం తిరిగారు. సత్వర విచారణ జరగాల్సిన కేసు వాయిదాల మీద వాయిదాలు పడుతూ వెళ్లింది. దిలీప్ ఉపయోగించిన ఫోన్లు, ఇతర ఫోన్లు 'టాంపర్' అయ్యాయన్న ఆరోపణలు వచ్చాయి. అత్యాచార దృశ్యాలు చిత్రీకరించిన ఫోను 'మాయమైంది'. వీటన్నింటి మధ్య కేసు నత్తనడక నడవగా స్వయంగా సుప్రీం కోర్టు రంగంలో దిగి కేసును తొందరగా ముగించమని హెచ్చరించాల్సి వచ్చింది. చివరకు 2022లో 'ఎం' తనకు తానే బయటకు వచ్చి మీడియాకు ఇంటర్వ్యూలు ఇచ్చి జరిగిన అన్యాయాన్ని మొరపెట్టుకుంది. కేరళ ప్రభుత్వం విధించిన హేమ కమిటీ మలయాళ పరిశ్రమలో స్త్రీలపై జరుగుతున్న దౌర్జన్యాలను బయటకు వెల్లడి చేయడంతో మరో దుమారం లేచింది. ఇవన్నీ అయ్యాక తుదకు డిసెంబర్ 8, 2025న తీర్పు వెలువడింది. ఇందులో ఆరుగురు నిందితులను దోషులుగా కోర్టు తేల్చింది. 7 నుంచి 15 వరకూ ఉన్న నిందితులను వదిలిపెట్టింది. 8వ నిందితుడైన దిలీప్‌కు ప్రస్తుతానికి విముక్తి దొరికింది.

అయితే దీని మీద విస్తృతంగా వ్యాఖ్యలు, విమర్శలు వినపడుతున్నాయి. కేరళ ప్రభుత్వం ఈ తీర్పును చాలెంజ్ చేస్తామని చెప్పింది. బాధిత 'ఎం' కూడా పై కోర్టుకు వెళ్లవచ్చు. తదుపరి పరిణామాలు ఎలా ఉన్నా బలవంతులపై బాధిత మహిళల పోరాటం ఆగవలసిన అవసరం లేదని 'ఎం' నిరూపించింది. ఆమె స్థైర్యం వల్లే ఇంతవరకైనా వచ్చింది. ఇక మీదట ఆమె చేయబోయే పోరాటం మరో తీర్పును ప్రసాదించవచ్చు. వేచి చూద్దాం.

● డిజిటల్ వరల్డ్

ఏఐ స్లాప్... ఎంత మంచిది?

'డిజిటల్ న్యూసెన్స్' అనేది యువతరాన్ని మాత్రమే కాదు 'ఏఐ స్లాప్' రూపంలో రెండు సంవత్సరాల కంటే తక్కువ వయసు ఉన్న పిల్లలను కూడా వెంబడిస్తోంది. 'ఏఐ స్లాప్' అంటే జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా చేసే నాసిరకం డిజిటల్ కంటెంట్. యూట్యూబ్ టార్గెట్ ఆడియెన్స్‌లో చిన్నపిల్లలు కూడా ఉన్నారు. రెండు నుంచి పన్నెండు సంవత్సరాల పిల్లల కోసం యూట్యూబ్ 'యూట్యూబ్ కిడ్స్' ప్రారంభించింది.

'ప్యూ' రీసెర్చ్ ప్రకారం, రెండు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలలో దాదాపు 60 శాతం మంది పిల్లలు యూట్యూబ్ చూస్తున్నారు. వారు చూసే వాటిలో 'ఏఐ స్లాప్' వీడియోలు ఎక్కువగా ఉంటున్నాయి. ఆదరణ సంగతి ఎలా ఉన్నా, ఇవి పిల్లలపై దీర్ఘకాలిక ప్రతికూల ప్రభావాలను చూపుతాయి' అంటున్నారు నిపుణులు. వేగంగా డబ్బు సంపాదించుకోవాలనుకునే యూట్యూబర్‌లకు 'ఏఐ స్లాప్' అనేది సులువైన మార్గం అయింది. తక్కువ శ్రమతో పిల్లలను ఆకట్టుకునే 'ఏఐ స్లాప్' వీడియోలను ఎలా క్రియేట్ చేయాలో చెప్పడానికి ఆన్‌లైన్ ట్యుటోరియల్స్ కూడా మొదలయ్యాయి. 'ఇది బ్యాడ్ కంటెంట్ కాదు. ప్రమాదకరమైన కంటెంట్ కూడా' అంటున్నారు 'ఏఐ స్లాప్' వీడియోల గురించి నిపుణులు.

● ఉమెన్ పవర్

ఆర్డర్లు కాదు ఇన్‌స్పిరేషన్ డెలివరీ చేస్తోంది!

'నీ దగ్గర ఏమీ లేకపోయినా సరే, ధైర్యం ఉండాలి. జీవనోత్సాహం ఉండాలి. అవి రెండూ ఉంటే అన్నీ వస్తాయి' అంటారు.

52 సంవత్సరాల వీణాదేవి దగ్గర అవి ఉన్నాయి. వీణ 50 శాతం శారీరక వైకల్యం ఉన్న మహిళ. ఆమె తన వైకల్యం గురించి బాధపడుతూ కూర్చోలేదు.

'ఇంట్లో ఖాళీగా కూర్చోకూడదు. ఏదో ఒక పని చేయాలి' అని గట్టిగా అనుకుంది. గత కొన్ని నెలల నుంచి జెప్టో డెలివరీ ఏజెంట్‌గా పనిచేస్తోంది.

'కష్టం అనిపించడం లేదా?' అని ఎవరైనా అడిగితే... 'ఖాళీగా కూర్చుంటేనే నాకు చాలా కష్టం' అని నవ్వుతూ చెబుతుంది. నటి, మోడల్ మలైకా అరోరా ఈ వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. వీడియోలో అరోరా వీణతో మాట్లాడుతూ కనిపిస్తుంది.

'ఇలాంటి మహిళను చూడడం నాకు ఇదే మొదటిసారి. చిన్న చిన్న విషయాలకే తెగ బాధపడిపోతుంటాం. వద్దు. గయ్స్... జీవితం చాలా విలువైనది. ఆమె కస్టమర్‌ల ఆర్డర్‌ను డెలివరీ చేయడం లేదు. ఇన్‌స్పిరేషన్‌ను డెలివరీ చేస్తోంది' అని రాసింది అరోరా.

'ప్రౌడ్ ఆఫ్ హర్': 'మహిళలు సంకల్పిస్తే ఎన్ని అడ్డంకులు ఉన్నా అధిగమించి తాము అనుకున్నది సాధించగలరు' ఇలాంటి మాటలతో కామెంట్ సెక్షన్ ప్రశంసలతో నిండిపోయింది.

బులియన్ (బంగారం 10 గ్రా.; వెండి కిలో) డిసెంబర్ 8న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,28,110	1,32,650	1,30,420	1,32,650	1,27,750	1,31,340
బంగారం (22 క్యారెట్లు)	1,17,320	1,19,550	1,19,550	1,23,240	1,17,530	1,20,400
వెండి	1,78,500	1,83,000	1,98,000	1,83,000	1,78,000	1,98,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

సాగుబడి
జ్యేష్ఠ కార్తె: డిసెంబర్ 3 నుంచి

రైతమ్మల శ్రమకు జేజేలు!

వ్యవసాయం, ఆహార రంగ శ్రామికుల్లో **41%** మంది మహిళలు	మహిళలు, బాలికల వేతనం లేని సంరక్షణ పని విలువ ఏటా **10.8** లక్షల కోట్ల డాలర్లు	లింగ వివక్షను రూపుమాపితే ప్రపంచ జీడీపీ ఏటా **1 లక్ష కోట్ల** డాలర్లు పెరుగుతుంది	**4.5 కోట్ల** మందిలో ఆహార అభద్రతను తగ్గించ వచ్చంటున్న ఎఫ్ఏఓ

2026ను 'అంతర్జాతీయ మహిళా రైతుల సంవత్సరం'గా ప్రకటించిన ఐక్యరాజ్యసమితి

INTERNATIONAL YEAR OF THE WOMAN FARMER 2026

వ్యవసాయం, ఆహారోత్పత్తుల తయారీ, పంపిణీ రంగాల్లో మహిళలు అత్యంత కీలకపాత్ర పోషిస్తున్నారు. మహిళా శ్రమ తోడు లేకుండా వ్యవసాయం ఒక్క పూట కూడా ముందుకు సాగదు. ఆమె బహుపాత్రాభినయం చెయ్యకపోతే కుటుంబమూ వర్ధిల్లదు. పొలాల్లో వ్యవసాయ పనులు, ఇంటి దగ్గర పశుపోషణతో పాటు అదనంగా వంట పనులు, ఇంటి పనులు, పెద్దల సంరక్షణ పనులను భుజాన వేసుకొని మోస్తున్న మహిళా రైతులు కొవ్వొత్తుల్లా కరుగుతూ సమాజ అభ్యున్నతికి దోహదపడుతున్నారు. మహిళా రైతులు ప్రత్యక్షంగా, పరోక్షంగా లింగపరమైన ప్రతిబంధకాలను, వివక్షలను, అసౌకర్యాలను ఎదుర్కొంటున్నారు. ఈ లింగ అంతరాలను గుర్తించి, పరిష్కరిస్తే ఆర్థికాభివృద్ధి పరుగులు పెడుతుంది. ఆహార అభ్రదత గణనీయంగా తగ్గుతుందని అధ్యయన నివేదికలు చెబుతున్నాయి. ఈ కొత్త సంవత్సరంలో ఆ దిశగా మీ ఆలోచనలు, ఆచరణకు పదును పెట్టండి అని ఐక్యరాజ్యసమితి ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చింది. 2026ను అంతర్జాతీయ మహిళా రైతు సంవత్సరం (ఐవైడబ్ల్యూఎఫ్ 2026)గా ప్రకటించింది.

ఆహార భద్రతను అందించటంలో మహిళలు – రైతుగా, రైతు కూలీగా, ఆహార పరిశ్రమదారుగా, ఉద్యోగిగా, అమ్మగా, కుటుంబ సభ్యుల సంరక్షకురాలిగా– బహుముఖ సేవలందిస్తున్నారు. ప్రపంచ వ్యవసాయ శ్రామిక శక్తిలో మహిళలకు గణనీయమైన భాగస్వామ్యం ఉంది. వ్యవసాయ, ఆహార విలువ గొలుసులో వీరి పాత్ర అత్యంత కీలకం. వ్యవసాయంలో, వ్యవసాయానుబంధ రంగాల్లో ఆహారోత్పత్తి, ప్రాసెసింగ్ పనుల నుంచి పంపిణీ, వాణిజ్య కార్యకలాపాల వరకు వ్యవసాయ, ఆహార విలువ గొలుసు పరిధిలోకి వస్తాయి. ఇంటి ఆహార భద్రత, పోషకాహారం సమకూర్చటంలోనూ కీలక పాత్ర పోషిస్తున్నారు. 2021లో వ్యవసాయ ఆహార

రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా శ్రమిస్తున్న వారిలో 41% మహిళలైనప్పటికీ, మహిళల శ్రమ విలువను తక్కువగా చూస్తున్నారు. నడుములు పడిపోయే శ్రమతో కూడుకున్న పనులు చేయిస్తారు. కానీ, తక్కువ జీతం. భూమి, ఆర్థిక, సాంకేతికత, విద్య, విస్తరణ సేవలు తదితర అన్ని స్థాయిల్లో నిర్ణయాలు తీసుకునే విషయంలో వ్యవస్థాగత అడ్డంకులను మహిళా రైతులు ఎదుర్కొంటున్నారు.

మహిళా రైతుల జీవన వాస్తవాలను వెలుగులోకి తీసుకురావటానికి, లింగ సమానత్వాన్ని పెంపొందించడానికి, మహిళలను శక్తివంతం చేయడానికి.. తద్వారా వ్యవసాయాన్ని ఆహారోత్పత్తి రంగాలను మరింతగా ఒడిదుడుకుల్ని తట్టుకునేలా పటిష్టంగా నిర్మించడానికి అనుగుణంగా విధాన సంస్కరణలు, పెట్టుబడులను ప్రోత్సహించాలని ఐక్యరాజ్యసమితి లక్ష్యంగా పెట్టుకుంది. ఎఫ్ఏఓతో పాటు ఐరాస అనుబంధ సంస్థలైన ఇంటర్నేషనల్ ఫండ్ ఫర్ అగ్రికల్చరల్ డెవలప్‌మెంట్ (ఐఎఫ్ఏడీ), వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్ (డబ్ల్యూఎఫ్‌పీ)లు వచ్చే ఏడాదంతా మహిళా రైతులను బలోపేతం చేసే కార్యకలాపాలను సమన్వయం చేస్తాయి.

'మహిళా రైతు'లంటే ఎవరు?

వ్యవసాయ, ఆహార రంగాల్లో విభిన్న పాత్రల్లో పని చేస్తున్న మహిళలందరూ మహిళా రైతులే. చిన్న/పెద్ద సొంత భూముల్లో పంటలు సాగు చేసే మహిళలు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు, చేపలు/రొయ్యల రైతులు, మత్స్యకారులు, చేపల కార్మికులు, తేనెటీగల పెంపకందారులు, పశువులు/కోళ్ల పెంపకందారులు, ప్రాసెసర్లు, వ్యాపారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, గ్రామీణ వ్యవస్థాపకులు, సాంప్రదాయ విజ్ఞానవంతులు.. అధికారిక లేదా అనధికారిక పనిలో నిమగ్నమయ్యే మహిళలు.. భూమి యాజమాన్య హక్కులు ఉన్నా లేకున్నా సరే.. వీరంతా మహిళా రైతులే. వీరిలో యువతులు, వృద్ధులు, పేద, ఆదివాసీ మహిళలు, వైకల్యాలున్న మహిళలు, శరణార్థులు, వలస వచ్చి వ్యవసాయ, ఆహార శుద్ధి పనులతో పొట్టపోసుకుంటున్న మహిళలు కూడా ఈ కోవలోని వారే.

వ్యవసాయ, ఆహార రంగాల్లో మహిళల స్థితిగతులు, లింగ అసమానతల స్థాయి, పర్యావరణ విపత్తుల నేపథ్యంలో మహిళలు ఎదుర్కొంటున్న అసమానతల వల్ల కలుగుతున్న ప్రమాదాలను ఎఫ్ఏఓ నివేదికలు నొక్కి చెబుతున్నాయి.

మీకు తెలుసా?

- ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయం, వ్యవసాయానుబంధ రంగాలు, ఆహార పరిశ్రమల్లో 2021లో పనిచేసే కార్మికుల్లో మహిళలు 41% ఉన్నారు. అయినప్పటికీ గ్రామీణ మహిళలు అసమానతను ఎదుర్కొంటున్నారు.
- మగ రైతులతో పోల్చితే చాలా మంది మహిళా రైతులు చిన్న కమతాల్లోనే సేద్యం చేస్తున్నారు.
- వ్యవసాయం, అనుబంధ రంగాలు, ఆహార పరిశ్రమల్లో పనిచేసే మహిళల సంపాదన పురుషుల కన్నా 22% తక్కువ.
- మహిళా రైతులపై పొలం పనులతో పాటు ఇంటి సంరక్షణ పని భారం అధికంగా ఉంటుంది. ఇంటి పనులకు ప్రత్యేక ఆదాయం ఉండదు. అసలు ఆ శ్రమ విలువ లెక్కలోకి రాదు. పని చేసినా ఆర్థిక సాధికారత రాదు. వారి శారీరక, మానసిక శ్రేయస్సును ఈ వేతనం లేని పని భారం దెబ్బతీస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా మహిళలు, బాలికలు తమ కుటుంబ సభ్యుల కోసం చేసే వేతనం లేని సంరక్షణ పని విలువ ఏటా కనీసం 10.8 లక్షల కోట్ల డాలర్లని ఎఫ్ఏఓ లెక్కగట్టింది.
- ప్రణాళికాబద్ధమైన పథకాల ద్వారా గ్రామీణ మహిళలను సాధికారపరిస్తే 5.8 కోట్ల మంది ఆదాయం పెరుగుతుంది. 23.5 కోట్ల మందికి ఒడిదుడుకుల్ని తట్టుకునే శక్తి పెరుగుతుంది. అయినప్పటికీ ఈ దిశగా కృషి జరగటం లేదు.
- తీవ్రమైన వేడి, కరువుల నేపథ్యంలో పురుషుల కంటే మహిళలపై ఎక్కువ పని భారం పడుతుంది.
- లింగపరమైన అంతరాలను రూపుమాపితే ప్రపంచ స్థూల దేశీయోత్పత్తి ఏటా లక్ష కోట్ల డాలర్ల మేరకు పెరుగుతుంది. 4.5 కోట్ల మంది ఎదుర్కొంటున్న ఆహార అభద్రతను తగ్గించవచ్చు.
- ఆహార అభద్రత బాధితుల్లో మహిళల సంఖ్యే ఎక్కువ. ఉపాధి, విద్యావకాశాలు, ఆదాయంలో లింగపరమైన అంతరం తగ్గించగలిగితే మహిళల్లో ఆహార అభద్రతను 52% తొలగించవచ్చని ఎఫ్ఏఓ నివేదిక తెలిపింది.
- మహిళలకు భూమి హక్కులు కల్పిస్తే వ్యవసాయ, ఆహార వ్యవస్థలు, గ్రామీణాభివృద్ధికి.. మొత్తంగా సమాజాభివృద్ధికి సహాయపడుతుంది. భూమి యాజమాన్య హక్కు విషయాల్లో లింగ వివక్ష రాజ్యం ఏలుతోంది. సాగు భూమిపై మహిళలకు మరింతగా హక్కులు కల్పిస్తే వారి సాధికారత, పెట్టుబడి సామర్థ్యం, స్థిరత్వం, సమస్యలను ఎదుర్కొనే శక్తి పెరుగుతుంది. భూమి హక్కున్న మహిళా రైతుకు సేవల లభ్యత మెరుగవుతుంది. లింగ ఆధారిత హింస తగ్గుతుందని ఎఫ్ఏఓ సూచిస్తోంది.

గడ్డిభూముల సంవత్సరం కూడా!

2026ను మహిళా రైతుల సంవత్సరంతో పాటు గడ్డి భూములు, సంచార పశుకాపరుల సంవత్సరంగానూ ఉమ్మడిగా జరుపుకోవాలని ఐక్యరాజ్యసమితి పిలుపునిచ్చింది. గడ్డి భూములు, సవన్నాలు, పొదలతో నిండిన బంజర్లు, ఎడారులు, చిత్తడి భూములు, కొండలు గుట్టలున్న ప్రాంతాల విస్తీర్ణం భూతలమ్మీద సగానికి సగం ఉంటుంది. ఈ ప్రాంతాలను పర్యావరణ హితమైన రీతిలో నిర్వహించటం జీవవైవిధ్యం, పచ్చదనం పరిరక్షణకు, కర్బన నిల్వలు, నీటి చక్రం నిర్వహణకు అవసరం. గొర్రెలు, మేకలు, ఆవులు, గేదెలు వంటి సుమారు 100 కోట్ల పశువులను బంజరు భూములు, పచ్చికబయళ్లలో మేపుకుంటూ ఎంతో మంది సంచార పశుకాపరులు తరతరాలుగా జీవనం సాగిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా భూముల్లో దాగి ఉన్న కర్బన నిల్వల్లో 30% ఈ భూముల్లోనే ఉంది. భూతాపం పెరగటం వల్ల ఈ భూముల్లోని సగం కర్బనం వాతావరణంలో కలిసినట్లు అంచనాలు ఉన్నాయి. ఫలితంగా ఈ భూములపై ఆధారపడి ఉన్న ప్రజల జీవనోపాధులు ప్రమాదంలో పడుతున్నాయి. గడ్డి భూములు, చిత్తడి నేలల పరిరక్షణకు పాలకులు శ్రద్ధ తీసుకొని పెట్టుబడులు పెట్టాలని ఎఫ్ఏఓ పిలుపునిచ్చింది. ఈ భూములను పరిరక్షించటం ద్వారా పంట పొలాలకూ మేలు జరుగుతుంది.



చికిత 'పసిడి' గురి

తైపీ ఓపెన్ వరల్డ్ సిరీస్ ఇండోర్ ఆర్చరీ టోర్నమెంట్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన తెలంగాణ అమ్మాయి తానిపర్తి చికిత స్వర్ణ పతకాన్ని సాధించింది. మహిళల అండర్–21 కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో పెద్దపల్లి జిల్లాకు చెందిన 20 ఏళ్ల చికిత చాంపియన్‌గా అవతరించింది. చైనీస్ తైపీలోని తావోయువాన్ సిటీలో జరిగిన ఈ టోర్నీలో చికిత ఫైనల్లో 148–141 పాయింట్ల తేడాతో జిట్‌మున్ ఖెమనిత్ (థాయ్‌లాండ్)పై గెలుపొందింది. సెమీఫైనల్లో చికిత 147–145తో యోన్‌సియో కాంగ్ (దక్షిణ కొరియా)పై, క్వార్టర్ ఫైనల్లో 149–138తో సియో యాన్ కాంగ్ (దక్షిణ కొరియా)పై విజయం సాధించింది. మరోవైపు మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో భారత స్టార్, ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణి వెన్నం జ్యోతి సురేఖ కాంస్య పతకాన్ని దక్కించుకుంది. కాంస్య పతక మ్యాచ్‌లో జ్యోతి సురేఖ 149–143తో సో చేవన్ (దక్షిణ కొరియా)పై నెగ్గింది. పురుషుల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో అభిషేక్ వర్మ కూడా కాంస్యం కైవసం చేసుకున్నాడు. కాంస్య పతక మ్యాచ్‌లో అభిషేక్ వర్మ 148–146తో మార్కో బ్రునో (ఇటలీ)పై గెలిచాడు. మహిళల రికర్వ్ అండర్–21 కాంస్య పతక మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ కొండపావులూరి యుక్తశ్రీ 5–6తో షు యాన్ లిన్ (చైనీస్ తైపీ) చేతిలో ఓడిపోయింది.

గిల్, అభిషేక్ శర్మ, సూర్యకుమార్, తిలక్ వర్మ, అక్షర్ పటేల్, బుమ్రా

టి20 ప్రపంచకప్‌లో విజేతగా నిలిచిన భారత్ ఆ తర్వాత ఇప్పటి వరకు 32 టి20లు ఆడితే 26 గెలిచి, 4 మాత్రమే ఓడిపోయింది. ఇలాంటి అద్భుత ఫామ్ మాత్రమే కాదు జట్టులో అనూహ్య మార్పులేమీ లేకుండా చాలా కాలంగా ఒకే పటిష్టమైన బృందంతో సాగుతోంది. మరోవైపు భారత్ చేతిలో టి20 వరల్డ్‌కప్ ఫైనల్లో ఓడిపోయిన తర్వాత దక్షిణాఫ్రికా 9, గెలిచి 16 ఓడిపోయింది. పైగా నిలకడ లేని టీమ్‌తో పదే పదే మార్పులు జరుగుతూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇరు జట్ల ఐదు మ్యాచ్‌ల సిరీస్‌కు రంగం సిద్ధమైంది. సొంతగడ్డపై తమ స్థాయిని ప్రదర్శించేందుకు టీమిండియా సిద్ధం కాగా... వచ్చే టి20 వరల్డ్ కప్‌కు ముందు ఇక్కడ ఐదు మ్యాచ్‌లు ఆడటం సన్నాహకంగా ఉపయోగపడుతుందని సఫారీలు భావిస్తున్నారు.

ఇక ధనాధన్ షురూ...

నేడు భారత్, దక్షిణాఫ్రికా మధ్య తొలి టి20

జోరు మీదున్న సూర్య కుమార్ బృందం ● ఫామ్‌లేమితో సఫారీల సమస్య

రాత్రి 7 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లలో ప్రత్యక్ష ప్రసారం

కటక్: భారత గడ్డపై చాలా కాలం తర్వాత ఒకే పర్యటనలో మూడు ఫార్మాట్‌లలో కూడా సిరీస్‌లు జరుగుతుండగా... టెస్టుల్లో దక్షిణాఫ్రికా పైచేయి సాధించింది. వన్డే సిరీస్ నెగ్గిన టీమిండియా ఇప్పుడు టి20 సిరీస్ విజయంపై గురి పెట్టింది. డిఫెండింగ్ చాంపియన్‌గా వరల్డ్ కప్ బరిలోకి దిగడానికి ముందు భారత్ 10 మ్యాచ్‌లు ఆడనుంది. ఈ సిరీస్ తర్వాత న్యూజిలాండ్‌తో కూడా ఐదు టి20 మ్యాచ్‌లు ఉన్నాయి. ఇప్పటికే సిద్ధమైన జట్టును అన్ని రకాలుగా పరీక్షించుకోవడంతో పాటు స్వల్ప లోపాలేమైనా ఉంటే సరిదిద్దుకునేందుకు ఈ మ్యాచ్‌లు అవకాశం కల్పిస్తాయి. మరోవైపు దక్షిణాఫ్రికా సిరీస్ ఫలితంకంటే కూడా తమ జట్టును పునర్నిర్మించుకోవటంపై దృష్టి పెట్టింది. ఇలాంటి సమీకరణాల మధ్య బారాబతి స్టేడియంలో నేడు తొలి టి20 మ్యాచ్ జరుగుతుంది.

గిల్, పాండ్యా సిద్ధం...

ఆస్ట్రేలియా గడ్డపై టి20 సిరీస్ గెలిచిన తర్వాత భారత్ ఇప్పుడు మళ్లీ బరిలోకి దిగుతోంది. సంచలన ఎంపికలు ఏమీ లేవు కాబట్టి తుది కూర్పుపై కూడా స్పష్టత ఉంది. గాయాల నుంచి కోలుకున్న వైస్ కెప్టెన్ గిల్, హార్దిక్ పాండ్యా పూర్తి ఫిట్‌గా, ఆరోగ్యంగా ఉన్నారని కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ స్పష్టం చేశాడు. కాబట్టి వీరిద్దరు ఆడటం ఖాయం. అభిషేక్ శర్మతో పాటు గిల్ ఓపెనింగ్ చేయనుండగా సూర్య, తిలక్ వర్మ స్థానాలపై ఎలాంటి సందేహం లేదు. వికెట్ కీపర్‌గా సంజూ సామ్సన్, జితేశ్ శర్మలలో ఎవరికి అవకాశం ఇస్తారనేది చూడాలి. రెగ్యులర్ స్పిన్నర్లు కుల్దీప్, వరుణ్ చక్రవర్తి ఉంటారు. అక్షర్ పటేల్‌తో పాటు ఆల్‌రౌండర్‌గా వాషింగ్టన్ సుందర్ పోటీలో ఉన్నాడు. పేస్ ఆల్‌రౌండర్ కావాలంటే హర్షిత్ రాణాకు కూడా అవకాశం దక్కవచ్చు. అయితే కెప్టెన్ సూర్యకుమార్ ఫామ్ మాత్రమే కాస్త ఆందోళన కలిగిస్తోంది. పూర్తి స్థాయిలో కెప్టెన్‌గా బాధ్యతలు తీసుకున్న తర్వాతి నుంచి సూర్య ఆడిన 15 ఇన్నింగ్స్‌లలో 15.33 సగటుతో కేవలం 184 పరుగులే చేశాడు. అంతకు ముందు నుంచి కలిపి చూస్తే గత 20 ఇన్నింగ్స్‌లలో ఒక్క అర్ధ సెంచరీ కూడా లేదు. ముస్తాక్ అలీ ట్రోఫీలో కూడా ఐదు ఇన్నింగ్స్‌లలో ఒక్క హాఫ్ సెంచరీ చేయకుండా పూర్తిగా విఫలయ్యాడు. ప్రస్తుత స్థితిలో అతని స్థానానికి వచ్చిన ముప్పేమీ లేకున్నా... ఈ సిరీస్‌లోనైనా స్థాయికి తగినట్లుగా చెలరేగాలని మేనేజ్‌మెంట్ కోరుకుంటోంది.

మిల్లర్, మార్క్‌రమ్

బ్రెవిస్‌పై దృష్టి...

దక్షిణాఫ్రికా టీమ్ పరిస్థితి ఇటీవల అంతంత మాత్రంగానే ఉంది. ఆస్ట్రేలియా, పాకిస్తాన్‌ల చేతిలో సిరీస్‌లు ఓడటంతో పాటు నమీబియా చేతిలో మ్యాచ్ కూడా కోల్పోయింది. పైగా ఇంగ్లండ్‌తో జరిగిన టి20లో 300కు పైగా పరుగులిచ్చి ఇలాంటి చెత్త రికార్డు నమోదు చేసిన పెద్ద జట్టుగా నిలిచింది. దూకుడైన ఆటగాడు డేవిడ్ మిల్లర్, పేసర్ నోర్జే గాయాల నుంచి కోలుకొని పునరాగమనం చేయడం సానుకూలాంశం కాగా కెప్టెన్‌గా మళ్లీ బాధ్యతలు తీసుకున్న మార్క్‌రమ్ మెరుగైన ఫామ్‌లో ఉండటం కలిసి రావచ్చు. ఇప్పటికీ తుది జట్టు విషయంలో టీమ్‌లో గందరగోళమే ఉంది. అయితే ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని శాసించగల డెవాల్డ్ బ్రెవిస్‌పై మాత్రం అందరి దృష్టీ ఉంది. ఐపీఎల్‌తో పాటు ఇటీవల వన్డేల్లో కూడా అతని దూకుడు కనిపించింది. బ్రెవిస్ చెలరేగితే సఫారీలకు మంచి గెలుపు అవకాశం ఉంటుంది. యాన్సెన్ ఆల్‌రౌండ్ నైపుణ్యం గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

3 కటక్‌లోని బారాబతి స్టేడియంలో భారత్ ఆడిన టి20 మ్యాచ్‌లు. శ్రీలంకపై ఒక మ్యాచ్‌లో గెలిచిన భారత్... దక్షిణాఫ్రికాతో ఈ మైదానంలో ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఓడిపోయింది.

259 ఇప్పటి వరకు భారత్ ఆడిన అంతర్జాతీయ టి20 మ్యాచ్‌లు. ఇందులో 172 మ్యాచ్‌ల్లో గెలిచిన భారత్... 72 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. 7 మ్యాచ్‌లు 'టై' అయ్యాయి. 8 మ్యాచ్‌లు రద్దయ్యాయి.

31 భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య ఇప్పటి వరకు జరిగిన టి20 మ్యాచ్‌లు. 18 మ్యాచ్‌ల్లో భారత్, 12 మ్యాచ్‌ల్లో దక్షిణాఫ్రికా విజయం సాధించాయి. ఒక మ్యాచ్ రద్దయింది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

పిచ్, వాతావరణం

అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్‌కు సమంగా అనుకూలించే అవకాశం ఉన్న స్పోర్టింగ్ పిచ్. ప్రతీ ఆటగాడు సత్తా చూపించేందుకు సరైంది. అయితే ఇక్కడా మంచు ప్రభావం చాలా ఉంది కాబట్టి టాస్ గెలవగానే ఫీల్డింగ్ ఎంచుకోవడం ఖాయం. వర్ష సూచన ఉన్నా మ్యాచ్‌కు ఇబ్బంది లేకపోవచ్చు.

తుది జట్ల వివరాలు (అంచనా)

భారత్: సూర్యకుమార్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, గిల్, తిలక్, జితేశ్ శర్మ/సామ్సన్, పాండ్యా, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి, బుమ్రా, హర్షిత్/సుందర్.

దక్షిణాఫ్రికా: మార్క్‌రమ్ (కెప్టెన్), డికాక్, హెన్‌డ్రిక్స్, బ్రెవిస్, మిల్లర్, స్టబ్స్, బాష్/లిండే, యాన్సెన్, మహరాజ్, ఎన్‌గిడి, మహరాజ్.

భారత జట్టుకు జరిమానా

దుబాయ్: దక్షిణాఫ్రికాతో విశాఖపట్నంలో జరిగిన మూడో వన్డేలో భారత జట్టుపై ఓవర్‌రేట్ శిక్ష పడింది. నిర్ణీత సమయంలో అనుమతించిన ఓవర్లు పూర్తి చేయలేకపోవడంతో భారత జట్టు మ్యాచ్ ఫీజులో 10 శాతం జరిమానా విధిస్తున్నట్లు అంతర్జాతీయ క్రికెట్ మండలి ప్రకటించింది. అనుమతించిన సమయం తర్వాత భారత్ 2 ఓవర్లు ఆలస్యంగా వేసింది. దాంతో మ్యాచ్ రిఫరీ రిచీ రిచర్డ్సన్ ఈ చర్య తీసుకున్నారు.

సూపర్ లీగ్‌కు హైదరాబాద్, ఆంధ్ర

చివరి మ్యాచ్‌ల్లో ఓడినా ముందంజ
ముస్తాక్ అలీ టి20 ట్రోఫీ

కోల్‌కతా: దేశవాళీ టి20 టోర్నీ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో హైదరాబాద్, ఆంధ్ర జట్లు సూపర్ లీగ్ దశకు అర్హత సాధించాయి. తమ చివరి లీగ్ మ్యాచ్‌లలో ఓడినా... ఈ రెండు టీమ్‌లు ముందంజ వేయడంలో సఫలమయ్యాయి. గ్రూప్ 'బి'లో ఆడిన 7 మ్యాచ్‌లలో 5 గెలిచి, 2 ఓడిన హైదరాబాద్ మొత్తం 20 పాయింట్లతో అగ్ర స్థానం సాధించగా, గ్రూప్ 'ఎ'లో ఆడిన 7 మ్యాచ్‌లలో 5 గెలిచి, 2 ఓడిన ఆంధ్ర 20 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి క్వాలిఫై అయ్యాయి. సోమవారం జరిగిన చివరి లీగ్‌లో హైదరాబాద్ 4 వికెట్ల తేడాతో చండీగఢ్ చేతిలో పరాజయం పాలైంది. ముందుగా హైదరాబాద్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 146 పరుగులు చేసింది. ప్రజ్ఞయ్ రెడ్డి (43; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), అమన్ రావు (33; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), తనయ్ త్యాగరాజన్ (27; 2 సిక్స్‌లు) రాణించారు. అనంతరం చండీగఢ్ 19.5 ఓవర్లలో 6 వికెట్లకు 147 పరుగులు సాధించింది.

సత్యనారాయణ రాజుకు 4 వికెట్లు

విదర్భతో లక్నోలో జరిగిన మ్యాచ్‌లో ఆంధ్ర 19 పరుగుల తేడాతో ఓడింది. ముందుగా విదర్భ 20 ఓవర్లలో 8 వికెట్లకు 154 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అమన్ మోఖడే (35 బంతుల్లో 50; 7 ఫోర్లు), అక్షయ్ వాడ్కర్ (41; 2 సిక్స్‌లు) రాణించగా... ఆంధ్ర బౌలర్ సత్యనారాయణ రాజు 4 వికెట్లు పడగొట్టాడు. అనంతరం ఆంధ్ర 20 ఓవర్లలో 9 వికెట్లకు 135 పరుగులే చేయగలిగింది. పైలా అవినాశ్ (44; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), రికీ భుయ్ (26; 2 సిక్స్‌లు) మినహా అంతా విఫలమయ్యారు. యశ్ ఠాకూర్ 4 వికెట్లతో ఆంధ్రను దెబ్బ తీశాడు.

పుణేలో 'సూపర్ లీగ్' మ్యాచ్‌లు

టోర్నీలో భాగంగా 'సూపర్ లీగ్' దశకు చేరిన 8 జట్లను 2 గ్రూప్‌లుగా విభజించారు. గ్రూప్ 'ఎ'లో మధ్యప్రదేశ్, పంజాబ్, జార్ఖండ్‌లతో ఆంధ్ర తలపడనుండగా... గ్రూప్ 'బి'లో ముంబై, రాజస్తాన్, హరియాణాలతో హైదరాబాద్ తలపడుతుంది. ఈ మూడు మ్యాచ్‌లు వరుసగా ఈ నెల 12, 14, 16 తేదీల్లో జరుగుతాయి. రెండు గ్రూప్‌ల్లో అగ్రస్థానంలో నిలిచిన జట్లు 18న ఫైనల్లో తలపడతాయి. 'సూపర్ లీగ్' మ్యాచ్‌లు పుణేలో నిర్వహిస్తారు.

సాక్షి సినిమా

ఇడియట్స్ మళ్లీ కలిస్తే?

● ఆమిర్‌ఖాన్

ఆమిర్‌ఖాన్ హీరోగా నటించిన '3 ఇడియట్స్' మూవీ సీక్వెల్‌కి సన్నాహాలు మొదలయ్యాయని బాలీవుడ్ టాక్. రాజ్‌కుమార్ హిరాణి దర్శకత్వంలో ఆమిర్‌ఖాన్ హీరోగా, ఆర్. మాధవన్, శర్మన్ జోషి, కరీనా కపూర్, బొమన్ ఇరానీ ప్రధాన పాత్రల్లో నటించిన హిందీ సినిమా '3 ఇడియట్స్'. విధు వినోద్ చోప్రా నిర్మించిన ఈ చిత్రం 2009లో విడుదలై, బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. '3 ఇడియట్స్' సినిమాకు సీక్వెల్‌ను రూపొందించే పనిలో ఉన్నారట రాజ్‌కుమార్ హిరాణి. ప్రస్తుతం స్క్రిప్ట్ వర్క్ జరుగుతోందని, కథ పూర్తయిన తర్వాత ఈ చిత్రంపై అధికారిక ప్రకటన రావొచ్చనే టాక్ బాలీవుడ్‌లో తెరపైకి వచ్చింది. '3 ఇడియట్స్' చిత్రం తొలిపార్టులో నటించిన ప్రధాన తారాగణమంతా సీక్వెల్‌లోనూ నటిస్తారట. అంతేకాదు.. ఈ సినిమాలోని ప్రధాన పాత్రధారులు 15 సంవత్సరాల తర్వాత కలుసుకుంటే ఏం జరుగుతుంది? అనే కోణంలో '3 ఇడియట్స్' కథనం సాగుతుందని బాలీవుడ్ భోగట్టా. ఈ సంగతి ఇలా ఉంచితే.. ఆమిర్‌ఖాన్, రాజ్‌కుమార్ హిరాణి కాంబినేషన్‌లో 'దాదా సాహెబ్ ఫాల్కే' బయోపిక్ రానుందని ఓ ప్రకటన వచ్చింది. మరి.. '3 ఇడియట్స్' సీక్వెల్ ముందు సెట్స్‌కి వెళుతుందా? లేక దాదా సాహెబ్ ఫాల్కే బయోపిక్ మొదలవుతుందా? అనేది తెలియాల్సి ఉంది.

అబద్ధం చెప్పలేనే...

● రవితేజ, డింపుల్ హయతి

''హోయ్.. అద్దం ముందు నిలబడి అబద్ధం చెప్పలేనే.. నా అద్దం అంటే నువ్వే మరి... నిజం దాచలేనే...' అంటూ సాగే ఈ పాట 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' చిత్రంలోనిది. రవితేజ హీరోగా, డింపుల్ హయతి, ఆషికా రంగనాథ్ హీరోయిన్లుగా నటించిన చిత్రమిది. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించిన ఈ సినిమాలోని 'అద్దం ముందు..' పాట ప్రోమోను విడుదల చేశారు మేకర్స్. ఈ పాట పూర్తి లిరికల్ వీడియో ఈ నెల 10న విడుదల కానుంది. చంద్రబోస్ సాహిత్యం అందించిన ఈ పాటను శ్రేయా ఘోషల్, కపిల్ కపిలన్ పాడారు. జీ స్టూడియోస్ సమర్పణలో కిశోర్ తిరుమల దర్శకత్వంలో ఎస్ఎల్‌వీ సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మించిన ఈ చిత్రం సంక్రాంతి కానుకగా థియేటర్స్‌లో రిలీజ్ కానుంది.

నా ప్రతి ప్రయాణంలో వాళ్లు ఉన్నారు

- రానా దగ్గుబాటి

● రానా, అనురాగ్, శరత్, రవిశంకర్

''నేను, శరత్, అనురాగ్ కలిసి టీవీ షోలు, స్టేజ్ ఈవెంట్స్, మూవీ మార్కెటింగ్... ఎన్నో చేశాం. నా ప్రతి ప్రయాణంలో వాళ్లు ఉన్నారు. వారు కొత్తగా ప్రారంభిస్తున్న 'చాయ్ షాట్స్' ప్రయాణంలో నేను కూడా ఒక చిన్న భాగం కావడం చాలా ఆనందంగా ఉంది'' అని హీరో రానా దగ్గుబాటి తెలిపారు. తెలుగు డిజిటల్ ఎంటర్‌టైన్‌మెంట్‌లో గత పదేళ్లుగా తన ప్రత్యేకతను చాటుకుంటున్న చాయ్ బిస్కెట్ సంస్థ తొలి రీజినల్ షార్ట్ సిరీస్ ఓటీటీ ప్లాట్‌ఫారం 'చాయ్ షాట్స్' ను నెలకొల్పింది. హైదరాబాద్‌లో నిర్వహించిన 'చాయ్ షాట్స్' గ్రాండ్ లాంచ్ ఈవెంట్‌లో నిర్మాత రవి శంకర్ మాట్లాడుతూ– ''చాయ్ షాట్స్' ఆలోచన చూస్తుంటే మేము కూడా వాళ్లతో భాగం కావాలని ఉంది. ఇందులోని క్రియేటర్స్, యాక్టర్స్ త్వరలో బిగ్ స్క్రీన్‌కి రావాలని కోరుకుంటున్నాను'' అని చెప్పారు. ''చాయ్ షాట్స్' ని మేము రెండు నెలల క్రితమే లాంచ్ చేశాం. ఆడియన్స్ నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. స్మార్ట్‌ఫోన్ ప్రేక్షకుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన 'చాయ్ షాట్స్'లో 2 నిమిషాల లోపు ఉండే ప్రీమియం, వెర్టికల్, స్క్రిప్టెడ్ ఎపిసోడ్లు ఉంటాయి'' అని చాయ్ బిస్కెట్ శరత్ చంద్ర, అనురాగ్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీటీవో కృష్ణ, ర్యాపిడో సహ వ్యవస్థాపకుడు రిషికేశ్, రెడ్ బస్ వ్యవస్థాపకుడు ఫణీంద్ర, డార్విన్‌బాక్స్ సహ వ్యవస్థాపకుడు రోహిత్ చెన్నమనేని, సెంట్రల్ క్యాటలిస్ట్ రాహుల్ హుమాయున్ తదితరులు మాట్లాడారు.

అప్పుడు చాలా బాధపడ్డాను

- కృతీశెట్టి

''నాది చాలా సున్నితమైన మనసు. టీనేజ్‌లోనే సినిమాల్లోకి వచ్చాను. నా తొలి చిత్రం 'ఉప్పెన' బ్లాక్‌బస్టర్ కావటంతో కెరీర్ అంతా బాగుంటుందనుకున్నాను. కానీ, ఆ తర్వాత సోషల్ మీడియాలో నాపై ట్రోలింగ్, ద్వేషం చూసి చాలా బాధపడ్డాను. సినిమాల పరంగా నా వంతు వందశాతం కష్టపడుతున్నా, బెస్ట్ ఇస్తున్నప్పటికీ ఏదో ఒక కారణంతో నన్ను టార్గెట్ చేయడం మానసికంగా నన్ను చాలా కుంగదీశాయి. ఆ సమయంలో మా అమ్మ, స్నేహితులు ఇచ్చిన సపోర్ట్ వల్లే ఇండస్ట్రీలో నిలబడగలిగాను'' అని హీరోయిన్ కృతీశెట్టి తెలిపారు.

వైష్ణవ్ తేజ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వం వహించిన 'ఉప్పెన'(2021) సినిమాతో తెలుగులో హీరోయిన్‌గా పరిచయం అయ్యారు కృతీశెట్టి. ఆ చిత్రం బ్లాక్‌బస్టర్ కావడంతో ఓవర్ నైట్ స్టార్‌డమ్ తెచ్చుకున్న కృతి.. ఆ తర్వాత వరుస అవకాశాలు అందుకుంటూ దూసుకెళ్లారు. అయితే ఆ సినిమాలు ఆమె కెరీర్‌లో ఆశించిన స్థాయిలో విజయాలు అందించలేకపోయాయి. ఈ కారణంగా ఆమెపై సోషల్ మీడియాలో ట్రోల్స్, నెగిటివ్ కామెంట్స్ వచ్చాయి. దీనిపై తాజాగా ఓ ఇంటర్వ్యూలో స్పందిస్తూ.. భావోద్వేగానికి గురయ్యారు కృతీశెట్టి. ''ఉప్పెన' నా జీవితాన్ని మార్చేసింది. ఒక నటిగా సినిమా విషయంలో నాకు కొన్ని అంచనాలు ఉన్నాయి. దాంతో ఒత్తిడి ఉండేది. ఎందుకంటే నా తల్లిదండ్రులకు కానీ, నాకు కానీ సినిమా గురించి పెద్దగా తెలియదు. నా ఒత్తిడి విషయం అమ్మానాన్నలకు తెలియడంతో.. 'కష్టంగా ఉంటే సినిమాల్లో నటించొద్దు' అన్నారు. అప్పటికి నాకూ అంత అనుభవం లేకపోవడంతో సినిమాలు మానేద్దాం అనుకున్నాను. అయితే 'ఉప్పెన' పై ప్రేక్షకులు చూపిన ప్రేమ వల్ల నటించాలని నిర్ణయించుకున్నాను'' అని కృతీశెట్టి పేర్కొన్నారు. ఇదిలా ఉంటే.. కృతీశెట్టి నటించిన తాజా చిత్రం 'అన్నగారు వస్తారు'. కార్తీ హీరోగా నటించిన ఈ సినిమా ఈ నెల 12న విడుదల కానుంది.

ఓం శాంతి..ప్రేమతో చేశాం

- తరుణ్ భాస్కర్

● తరుణ్ భాస్కర్, ఈషా రెబ్బా

తరుణ్ భాస్కర్, ఈషా రెబ్బా జంటగా నటించిన సినిమా 'ఓం శాంతి శాంతి శాంతి:'. మలయాళ సినిమా 'జయ జయ జయ జయహే' చిత్రానికి తెలుగు రీమేక్‌గా ఈ చిత్రం రూపుదిద్దుకుంది. ఏఆర్ సజీవ్ దర్శకత్వంలో సృజన్ యరబోలు, ఆదిత్య పిట్టీ, వివేక్ కృష్ణని, అనుప్ చంద్ర శేఖరన్, సాధిక్ షేక్ ,నవీన్ సనివరపు నిర్మించిన ఈ చిత్రం జనవరి 23న విడుదల కానుంది. హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా టీజర్ లాంచ్‌లో తరుణ్ భాస్కర్ మాట్లాడుతూ–'' ఓం శాంతి శాంతి శాంతి:' చిత్రం రీమేక్ అయినప్పటికీ మా నిజాయితీ మీకు కనిపిస్తుంది. అది కనిపించకపోతే మా సినిమాను చూడవద్దని మరో నలుగురికి చెప్పండి. గోదావరి యాస, కల్చర్‌కి ఒక సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చిన సినిమా ఇది. ప్యాషన్‌తో ఈ పాత్ర చేశాను. యూనిట్ అంతా చాలా ప్రేమతో ఈ సినిమా చేశాం'' అని చెప్పారు. ''ఈ సినిమా చూసిన తర్వాత ఆడియన్స్‌కు ఫుల్ ఎంటర్‌టైన్మెంట్ దొరుకుతుంది'' అని మాట్లాడారు ఏఆర్ సజీవ్. ''మంచి ఫ్యామిలీ సినిమా ఇది'' అని చెప్పారు సృజన్. ''తరుణ్ భాస్కర్‌తో నటించే అవకాశం లభించినందుకు సంతోషంగా ఉంది'' అని అన్నారు ఈషా రెబ్బా. నటుడు బ్రహ్మాజీ, డైలాగ్ రైటర్ నందకిశోర్ మాట్లాడారు.

జవాన్‌లపై పాట అభినందనీయం

- సుమన్

● ప్రతాని రామకృష్ణ, సుమన్

''దేశం కోసం దేనికైనా సిద్ధమైన జవాన్‌లపై 'దీక్ష' చిత్రంలో ఒక పాట పెట్టడం అభినందనీయం. మనం క్షేమంగా ఉన్నామంటే దానికి కారణం దేశ జవాన్లే. నిర్మాతలు తమ సినిమాల్లో జవాన్‌లను సపోర్ట్ చేస్తూ చూపించాలి'' అని నటుడు సుమన్ తెలిపారు. కిరణ్ హీరోగా, అలేఖ్య రెడ్డి, ఆక్సా ఖాన్ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'దీక్ష'. డీఎస్ రెడ్డి సమర్పణలో ప్రతాని రామకృష్ణ గౌడ్ స్వీయ దర్శకత్వంలో పి.అశోక్ కుమార్ నిర్మించారు. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి సుమన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ–''దేశం కోసం ప్రాణాలర్పించిన మురళి నాయక్‌కు ఒక పాటని మా సినిమా ద్వారా అంకితం చేశాం'' అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఫిలిం చాంబర్ ప్రెసిడెంట్ భరత్ భూషణ్, నిర్మాతలు తుమ్మల ప్రసన్నకుమార్, డీఎస్ రెడ్డి, సి. కల్యాణ్, నటీనటులు ఆక్సా ఖాన్, మౌనిక రెడ్డి, కిరణ్, తెలంగాణ ఫిల్మ్ చాంబర్ వైస్ చైర్మన్ ఎత్తరి గురురాజ్, జనరల్ సెక్రటరీ స్నిగ్ధ రెడ్డి పాల్గొన్నారు.

ఫెయిల్యూర్ బాయ్స్ వస్తున్నారు

● అవితేజ్, కోయిల్ దాస్

అవితేజ్, క్రాంతి, ప్రదీప్, సుపర్ణ, పవని, కోయిల్ దాస్ లీడ్ రోల్స్‌లో నటించిన సినిమా 'ఫెయిల్యూర్ బాయ్స్'. వెంకట్ త్రినాథ రెడ్డి ఉసిరిక దర్శకత్వంలో వీఎస్ఎస్ కుమార్, ధన శ్రీనివాస్ జమ్మి, లక్ష్మి వెంకట్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 12న విడుదల కానుంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు నటుడు బాబు మోహన్ ముఖ్య అతిథిగా విచ్చేసి, సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు. అవితేజ్ మాట్లాడుతూ–''నా మిత్రుడు ప్రదీప్ మంచి నటుడు. తనను తాను వెండితెరపై చూసుకోవాలని ఎన్నో కలలు కన్నాడు. కానీ, ఈ రోజు తను మనమధ్య లేడు. జీవితంలో జరిగే సంఘటనలకు ఎవరూ తొందరపడి నిర్ణయాలు తీసుకోవద్దు'' అని చెప్పారు. ''ప్రేక్షకులు కుటుంబ సమేతంగా వచ్చి మా సినిమా చూడొచ్చు'' అని వెంకట త్రినాథ రెడ్డి, వీఎస్ఎస్ కుమార్, శ్రీనివాస్ జమ్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో నటి కోయిల్ దాస్, డైరెక్టర్ తెలుగు శ్రీను, నటులు పింగ్ పాంగ్, అంజి శ్రీను మాట్లాడారు.

పైసా డుమ్ డుమ్!

● ఫరియా, నరేష్ అగస్త్య

నరేష్ అగస్త్య, ఫరియా అబ్దుల్లా జంటగా మురళీ మనోహర్ దర్శకత్వం వహించిన చిత్రం 'గుర్రం పాపిరెడ్డి'. బ్రహ్మానందం, యోగి బాబు, ప్రభాస్ శ్రీను ఇతర పాత్రలు పోషించారు. డా.సంధ్య గోలీ సమర్పణలో వేణు సద్ది, అమర్ బుర్రా, జయకాంత్ (బాబీ) నిర్మించిన ఈ మూవీ ఈ నెల 19న రిలీజ్ కానుంది. కృష్ణ సౌరభ్ సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'పైసా డుమ్ డుమ్....' అంటూ సాగే పాట విడుదల వేడుకని నిర్వహించారు. మురళీ మనోహర్ మాట్లాడుతూ– ''డార్క్ కామెడీ జానర్‌లో సరికొత్తగా మా సినిమా తీశాం. 'గుర్రం పాపిరెడ్డి' ప్రేక్షకులను నిరాశపరచదు'' అని తెలిపారు. ''ఈ మూవీని నాతో పాటు సంధ్య, వేణు, అమర్ ప్రొడ్యూస్ చేశారు. వారు అమెరికాలో ఉండటం వల్ల రాలేకపోయారు'' అన్నారు జయకాంత్ (బాబీ). ''కామెడీలోనే కొత్తగా కంటెంట్ క్రియేట్ చేయొచ్చు అని ఈ చిత్రంలో నటించిన తర్వాత అనిపించింది'' అని ఫరియా అబ్దుల్లా పేర్కొన్నారు. నరేష్ అగస్త్య మాట్లాడుతూ– ''ఈ సినిమాలో నా ఇంటిపేరు గుర్రం. నా పేరు పాపిరెడ్డి. అందుకే 'గుర్రం పాపిరెడ్డి' టైటిల్ పెట్టాం'' అన్నారు. నటులు జీవన్ కుమార్, రాజ్‌కుమార్ కాసిరెడ్డి పాల్గొన్నారు.

స్టాక్ మార్కెట్లు

(తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
610	226
85,103	25,961

విదేశీ సూచీలు

నాస్‌డాక్	23,504	▽	74
డోజోన్స్	47,717	▽	238
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,642	▽	25
డాక్స్	24,041	△	13
షాంఘై	3,924	△	21
నికాయ్	50,582	△	90

అమెరికా · బ్రిటన్ · జర్మనీ · చైనా · జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	89.65	90.67
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	118.80	121.76
€	యూరో	ఎస్‌బీఐ	103.70	106.47
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	47.00	59.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	57.75	60.90
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	67.46	70.58
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	23.14	24.64
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.66	24.86
¥	చైనా యువాన్	థామస్‌కుక్	12.06	13.50

పసిడి రుణాలకు భలే గిరాకీ

వేగంగా విస్తరిస్తున్న మార్కెట్
- రిటైల్ రుణాల్లో పావు వంతుకు చేరిక
- 2026 మార్చి నాటికి రూ.15 లక్షల కోట్లు

ఒకప్పుడు బంగారాన్ని తాకట్టు పెట్టి రుణం తీసుకోవడం అన్నది చాలా తక్కువగానే ఉండేది. అది కూడా ఎక్కువగా అసంఘటిత రంగంలోనే. కానీ, ఇప్పుడు బంగారాన్ని కుదువ పెట్టి అప్పు తీసుకోవడం అన్నది వేగంగా విస్తరిస్తోంది. అది కూడా సంఘటిత రంగంలో బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీల వద్ద రుణం తీసుకునేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపిస్తున్నారు. నిమిషాల వ్యవధిలోనే రుణం లభించడం, వడ్డీ తక్కువగా ఉండడం చాలా మందిని ఆకర్షిస్తోంది. రుణాన్ని తిరిగి చెల్లించడంలోనూ వెసులుబాటు ఈ మార్కెట్ విస్తరణకు దోహదం చేస్తోంది. పెద్ద ఎత్తున డిమాండ్‌ను సొంతం చేసుకునేందుకు బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు (ఎన్‌బీఎఫ్‌సీలు) పెద్ద సంఖ్యలో కొత్త శాఖలు ప్రారంభించేందుకు ప్రణాళికలు వేసుకుంటుంటే, బ్యాంక్‌లు సైతం సెక్యూర్డ్ విభాగమైన పసిడి రుణాల్లో వాటాను పెంచుకోవడంపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నాయి.

ఏడు నెలల్లో 63.6 శాతం వృద్ధి..

2025 అక్టోబర్ చివరికి బంగారం రుణాల **అవుట్‌స్టాండింగ్ (నికరంగా తిరిగి రావాల్సిన మొత్తం) రూ.3.38 లక్షల కోట్లుగా ఉన్నట్టు డేటా తెలియజేస్తోంది. ఏడాది కాలంలో ఇది ఏకంగా** 128.5 శాతం పెరగ్గా, ఈ ఏడాది మార్చి చివరి నుంచి చూస్తే 63.6 శాతం వృద్ధి చెందింది. గడిచిన ఏడాది కాలంలో జారీ అయిన వ్యక్తిగత రుణాల్లో పసిడి రుణాలు పావు శాతానికి చేరాయి. 2025 మార్చి నాటికి మొత్తం బంగారం రుణాల మార్కెట్ విలువ రూ.14.5 లక్షల కోట్లకు చేరగా, 2026 మార్చి నాటికి రూ.15 లక్షల కోట్లకు విస్తరిస్తుందన్న అంచనాలు నెలకొన్నాయి. ఎన్‌బీఎఫ్‌సీలు వచ్చే ఏడాది కాలంలో 3,000 కొత్త శాఖలను ప్రత్యేకంగా బంగారం రుణాల కోసమే ప్రారంభించే సన్నాహాల్లో ఉన్నాయి. సూక్ష్మ రుణ సంస్థలు (ఎంఎఫ్‌ఐలు) ఎగవేతలు పెరగడంతో రుణ నిబంధనలను కఠినతరం చేశాయి. దీంతో గతంలో మాదిరి సులభంగా అన్‌సెక్యూర్డ్ రుణాలు లభించని పరిస్థితులు నెలకొన్నాయి. ఫలితంగా రైతులు, చిన్న వర్తకులు, స్వయం ఉపాధిపై ఉన్నవారు బంగారంపై రుణాలను ఆశ్రయిస్తుండడం కూడా ఈ మార్కెట్ విస్తరణకు దోహదం చేస్తోంది. బంగారం ధరలు ఇటీవలి కాలంలో గణనీయంగా పెరగడంతో మరింత అధిక మొత్తంలో రుణం, అది కూడా సులభంగా లభిస్తుండడంతో రుణగ్రహీతలు అటువైపు మొగ్గుచూపిస్తున్నట్టు పరిశ్రమ వర్గాలు తెలిపాయి.

సాగు, వ్యాపార అవసరాలకే అధికం..

బంగారాన్ని కుదువపెట్టి రుణాలు తీసుకుంటున్న **వారిలో 70 శాతం మంది వ్యవసాయం, వ్యాపార అవసరాలకు వినియోగిస్తున్నారు. మిగిలిన 30 శాతం మంది గృహ నవీకరణ, వివాహాలు, ఇతర** వ్యక్తిగత అవసరాలకు వినియోగిస్తున్నట్టు డేటా తెలియజేస్తోంది. వేతన జీవులు స్వల్పకాల అవసరాలకు సైతం పసిడి రుణాలను తీసుకుంటున్నారు. రుణాలను వేగంగా ప్రాసెస్ చేస్తుండడం, వడ్డీ రేట్లలో పారదర్శకత ఈ మార్కెట్ విస్తరణకు మద్దతునిస్తున్నాయి.

విస్తరణకు భారీ అవకాశాలు

బంగారం మార్కెట్ మరింత విస్తరణకు అవకాశాలున్నట్టు పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. ఎందుకంటే భారతీయ గృహాల్లో ఉన్న బంగారంలో కేవలం 5.6 శాతాన్ని ఇప్పటికి పసిడి రుణాల కోసం వినియోగించుకుంటున్న పరిస్థితి నెలకొంది. ఇక బంగారం రుణాల్లో సంఘటిత రంగం వాటా 37 శాతంగానే ఉంది. ఇప్పటికీ 63 శాతం అసంఘటిత రంగంలో (పాన్ బ్రోకర్లు, స్థానిక వడ్డీ వ్యాపారులు)నే బంగారంపై రుణాలు తీసుకుంటున్నారు. ఈ పరిస్థితులను గమనించిన ఎన్‌బీఎఫ్‌సీలు ప్రత్యేకంగా చిన్న పట్టణా**ల్లోనూ కొత్త శాఖల ద్వారా మరింత మందికి చేరువ అయ్యేందుకు ప్రయత్నిస్తున్నాయి. డిజిటల్ సాధనాలు, ఫిన్‌టెక్‌లతో భాగస్వామ్యాల ద్వారా కొత్త కస్ట**మర్లను చేరుకునేందుకు వ్యూహాలు అమలు చేస్తున్నాయి. బంగారం రుణాల్లో 80 శాతం మార్కెట్ దక్షిణాది రాష్ట్రాల్లోనే ఉండగా, మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్ తదితర ప్రాంతాల్లో విస్తరణపై ఎన్‌బీఎఫ్‌సీలు తాజాగా దృష్టి సారించాయి.

సాక్షి, బిజినెస్ డెస్క్

ఐసీఐసీఐ ఏఎంసీ @ రూ. 2,061-2,165

- ఈ నెల 12–16 మధ్య ఐపీవో
- రూ. 10,602 కోట్ల సమీకరణ

న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ సంస్థ ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ(ఏఎంసీ) పబ్లిక్ ఇష్యూకి రూ. 2,061–2,165 ధరల శ్రేణి ప్రకటించింది. ఇష్యూ ఈ నెల 12న ప్రారంభమై 16న ముగియనుంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 11న షేర్లను ఆఫర్ చేయనుంది. ఇష్యూలో భాగంగా ప్రమోటర్ సంస్థ ప్రుడెన్షియల్ కార్పొరేషన్ హోల్డింగ్స్(యూకే) 4.89 కోట్లకుపైగా ఈక్విటీ షేర్లను విక్రయానికి ఉంచనుంది. తద్వారా రూ. 10,602 కోట్లు సమకూర్చుకునే యోచనలో ఉంది. ఈ నెల 19న లిస్టింగ్‌కానున్న కంపెనీ విలువ రూ. 1.07 లక్షల కోట్లుగా నమోదయ్యే వీలుంది. ప్రస్తుతం ఏఎంసీలో ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఐసీఐసీఐకు 51 శాతం వాటా ఉంది. మిగిలిన 49 శాతం భాగస్వామ్య కంపెనీ ప్రుడెన్షియల్ హోల్డింగ్స్ కలిగి ఉంది. కాగా.. ఇప్పటికే ఈ విభాగంలో నాలుగు సంస్థలు హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ, యూటీఐ ఏఎంసీ, ఆదిత్య బిర్లా సన్ లైఫ్ ఏఎంసీ, శ్రీరామ్ ఏఎంసీ, నిప్పన్ లైఫ్ ఇండియా అసెట్ మేనేజ్‌మెంట్ దేశీయంగా లిస్టయ్యాయి. ఈ బాటలో ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ ఐదో కంపెనీగా స్టాక్ ఎక్స్ఛేంజీలలో అడుగుపెట్టనుంది. అంతేకాకుండా ఐసీఐసీఐ గ్రూప్ నుంచి ఐదో లిస్టెడ్ కంపెనీగా నమోదుకానుంది. ఇప్పటికే ఐసీఐసీఐ బ్యాంక్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ, ఐసీఐసీఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ, ఐసీఐసీఐ సెక్యూరిటీస్ స్టాక్ మార్కెట్లలో ట్రేడవుతున్న సంగతి తెలిసిందే. ఐపీవో ద్వారా ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ(జేవీ)లో భాగస్వామ్య సంస్థ వాటా విక్రయించినప్పటికీ తాము మెజారిటీ వాటాను కొనసాగించనున్నట్లు ఈ ఏడాది ఫిబ్రవరిలో ఐసీఐసీఐ బ్యాంక్ పేర్కొన్న విషయం గమనార్హం!

మీడియా ప్రచారంలో రిలయన్స్ టాప్

- తర్వాతి స్థానాల్లో ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్
- జొమాటో, స్విగ్గీ, పేటీఎంకూ చోటు

న్యూఢిల్లీ: మీడియా ప్రచారంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ రారాజుగా నిలుస్తోంది. దేశీ మీడియాలో ఎక్కువగా కనిపించే లిస్టెడ్ కంపెనీగా విజికీ న్యూస్‌మేకర్ ఇండెక్స్‌లో వరుసగా ఆరో ఏడాది అగ్రస్థానాన్ని సొంతం చేసుకుంది. ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తర్వాతి రెండు స్థానాల్లో ఉన్నట్టు విజికీ న్యూస్‌మేకర్ ర్యాంకింగ్స్ 2025 ప్రకటించింది. సూచీలో రిలయన్స్ ఇండస్ట్రీస్ వార్తల స్కోరు 2021లో 84.9గా ఉంటే, 2022లో 92.56, 2023లో 96.46, 2024లో 97.43, 2025లో 97.83కు క్రమంగా పెరుగుతూ వచ్చింది. అంటే మీడియా ప్రచారంలో రిలయన్స్ క్రమంగా తన స్థానాన్ని బలోపేతం చేసుకుంటున్నట్టు ఈ డేటా తెలియజేస్తోంది. ఏఐ, మెషీన్ లెర్నింగ్, బిగ్ డేటా, మీడియా అనలైటిక్స్ ద్వారా 4 లక్షలకు పైగా ప్రచురణల్లో బ్రాండ్‌కు ఉన్న ప్రచారం, గుర్తింపును విజికీ న్యూస్‌మేకర్ ర్యాంకింగ్స్ విశ్లేషిస్తుంటుంది. ప్రభుత్వరంగ అగ్రగామి బ్యాంక్ ఎస్‌బీఐ 92.81 స్కోరుతో రెండో స్థానంలో ఉంటే, 88.41 స్కోరుతో హెచ్‌డీఎఫ్‌సీ మూడో స్థానంలో నిలిచింది. భారతీ ఎయిర్‌టెల్, టాటా మోటార్స్, టీసీఎస్, ఐసీఐసీఐ బ్యాంక్, ఇన్ఫోసిస్, మారుతి సుజుకీ, ఐటీసీ టాప్–10లో ఉన్నాయి. జొమాటో 11, స్విగ్గీ 12, వన్97 కమ్యూనికేషన్స్ (పేటీఎం) 13వ ర్యాంక్ దక్కించుకున్నాయి. బ్రాండ్ వారీ వార్తల పరిమాణం, ప్రముఖ వార్తల్లో వాటికి దక్కిన స్థానం, ఆయా ప్రచురణలకు ఉన్న విస్తరణ, రీడర్లు ఆధారంగా 0 నుంచి 100 వరకు స్కోర్‌ను విజికీ న్యూస్‌మేకర్స్ ర్యాంకింగ్స్ కేటాయించింది. నాలుగు లక్షలకు పైగా ప్రచురణల్లో ఒక్కో బ్రాండ్‌కు సంబంధించి ఎన్ని వార్తలు వచ్చాయి, ఏ బ్రాండ్‌కు తరచూ ప్రచారం లభిస్తోందన్న అంశాలనూ పరిగణనలోకి తీసుకుంది.

సెన్సెక్స్ 610 పాయింట్లు మైనస్

- మళ్లీ 26,000 దిగువకు నిఫ్టీ
- ఫెడరల్ రిజర్వ్ సమావేశానికి ముందు అప్రమత్తత

ముంబై: విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. ఫలితంగా దేశీయ స్టాక్ మార్కెట్ సోమవారం దాదాపు 1% నష్టపోయింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ ద్రవ్య పాలసీ కమిటీ సమావేశం(మంగళ, బుధ) నేపథ్యంలో అప్రమత్తత నెలకొంది. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి బలహీనత ప్రతికూల ప్రభావాన్ని చూపింది. సెన్సెక్స్ 610 పాయింట్లు క్షీణించి 85,103 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 226 పాయింట్లు కోల్పోయి 25,961 వద్ద నిలిచింది. దీంతో సూచీల రెండురోజుల లాభాలకు బ్రేక్ పడింది. ఉదయం బలహీనంగా మొదలైన సూచీలు రోజంతా నష్టాల్లోనే ట్రేడయ్యాయి. అన్ని రంగాల షేర్లలో విక్రయాలు వెల్లువెత్తాయి. ముఖ్యంగా చిన్న, మధ్య తరహా షేర్లు భారీగా అమ్మకాల ఒత్తిడికిలోనయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 837 పాయింట్లు క్షీణించి 84,876 వద్ద, నిఫ్టీ 294 పాయింట్లు పతనమై 25,892 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకాయి.

➤ బీఎస్‌ఈలో రంగాల **వారీ ఇండెక్సుల్లో** సర్వీసెస్ **4%, రియల్టీ** 3.50%, క్యాపిటల్ **గూడ్స్ 3%,** టెలికమ్యూనికేషన్ **2.50%, ఇండస్ట్రియల్స్, యుటిలిటీస్,** మెటల్, విద్యుత్ **సూచీలు 2%** పతనయ్యాయి. స్మాల్ సూచీ 2.20%, మిడ్‌క్యాప్ **ఇండెక్స్** 1.73 శాతం నష్టపోయాయి.

➤ స్టాక్ మార్కెట్ 1% **మేర పతనంతో** రూ.7.12 లక్షల కోట్ల సంపద ఆవిరైంది. **దీంతో** ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈ లిస్టెడ్ కం**పెనీల** మొత్తం మార్కెట్ విలువ రూ.471.13 లక్షల కోట్ల **నుంచి** రూ.464.19 లక్షల కోట్లకు దిగివచ్చింది.

➤ రూపాయి పతనం ఆగడం లేదు. డాలర్ మారకం**లో** 10 పైసలు బలహీనపడి 90.05 వద్ద స్థిరపడింది.

➤ ఇండిగో (ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్) షేరు 8% పతనమై రూ.4,907.50 వద్ద స్థిరపడింది.

రూ.6.15 లక్షల కోట్ల రుణాల మాఫీ

- ఐదున్నరేళ్లలో పీఎస్‌బీలు చేసిన పని
- లోక్‌సభకు వెల్లడించిన కేంద్రం



న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ బ్యాంకులు (పీఎస్‌బీలు) గడిచిన ఐదున్నరేళ్ల కాలంలో రూ.6.15 లక్షల కోట్ల విలువైన రుణాలను మాఫీ చేశాయి. ఓ సభ్యుడి ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి దీనిపై లోక్‌సభకు లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. ''ఆర్‌బీఐ డేటా ప్రకారం.. గత ఐదు ఆర్థిక సంవత్సరాలతోపాటు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సెప్టెంబర్ 30 వరకు ప్రభుత్వరంగ బ్యాంకులు రూ.6,15,647 కోట్ల మేర రుణాలను మాఫీ చేశాయి''అని వెల్లడించారు. వసూలు కాని మొండి రుణాలను (ఎన్‌పీఏలు) బ్యాంక్‌లు నిబంధనల మేరకు మాఫీ చేస్తాయని వివరించారు. అయినప్పటికీ అలా మాఫీ చేసిన రుణాల వసూలుకు అవి చర్యలు కొనసాగిస్తాయని చెప్పారు. ఆదాయపన్ను చట్టం, 2025 కింద కొత్త పన్ను రిటర్నుల పత్రాలను (ఐటీఆర్) 2027–28 ఆర్థిక సంవత్సరం ప్రారంభానికి ముందే నోటిఫై చేయనున్నట్టు మరో ప్రశ్నకు సమాధానంగా లోక్‌సభకు వెల్లడించారు.

భవిత

స్పర్థయా వర్ధతే విద్య

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం: ఇండియన్ పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం: టీచింగ్ ఆప్టిట్యూడ్
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం: తెలంగాణ హిస్టరీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం: మార్కెటింగ్ అవేర్‌నెస్

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో సమ్మర్ ప్లేస్‌మెంట్ ఆఫర్స్ హవా నడుస్తోంది. 2025- 27 బ్యాచ్ విద్యార్థులకు ఐఐఎం క్యాంపస్‌లలో భారీగా సమ్మర్ ప్లేస్‌మెంట్ ఆఫర్స్ లభించాయి. రెండు నెలల వ్యవధికి సగటున రూ.2 లక్షల స్టయిఫండ్ లభించడం విశేషం. అంతేకాకుండా యాపిల్, మైక్రోసాఫ్ట్ వంటి ప్రముఖ కంపెనీలు ఈ సమ్మర్ ప్లేస్‌మెంట్ డ్రైవ్స్‌లో పాల్గొని విద్యార్థులకు ఆఫర్లు ఇచ్చాయి. ఈ నేపథ్యంలో.. ఐఐఎం క్యాంపస్‌లలో ఈ ఏడాది సమ్మర్ ప్లేస్‌మెంట్ ప్రక్రియ వివరాలు..

ఐఐఎంల్లో.. సమ్మర్ ప్లేస్‌మెంట్స్ హవా!

» భారీగా ఇంటర్న్‌షిప్ అవకాశాలు
» సగటున రూ.2 లక్షల స్టయిఫండ్
» ఐఐఎం కోల్‌కతలో అత్యధికంగా రూ.4.5 లక్షలు
» ముందంజలో ఫైనాన్స్, కన్సల్టింగ్ రంగాలు

సమ్మర్ ప్లేస్‌మెంట్ అంటే

విద్యార్థులు క్షేత్ర స్థాయి నైపుణ్యాలు పొందడానికి ఏదైనా సంస్థలో ఇంటర్న్‌షిప్ చేయడం తెలిసిందే. ఐఐఎం క్యాంపస్‌లలో మేనేజ్‌మెంట్ పీజీ చదువుతున్న మొదటి సంవత్సరం విద్యార్థులకు.. రెండో సంవత్సరంలోకి అడుగు పెట్టేముందు లభించే సెమిస్టర్ సెలవుల్లో.. కంపెనీల్లో నెల రోజుల నుంచి రెండు నెలల పాటు ఇంటర్న్‌షిప్ చేసే అవకాశమే సమ్మర్ ప్లేస్‌మెంట్స్. అందులో ఎంపికైన వారికి ఇచ్చే ఆఫర్స్‌నే సమ్మర్ ప్లేస్‌మెంట్ ఆఫర్స్‌గా పిలుస్తారు.

ఎప్పటి మాదిరిగానే

ఐఐఎంల ఎస్‌పీఓ తాజా గణాంకాలను పరిశీలిస్తే.. కార్పొరేట్ సంస్థలకు ఐఐఎం విద్యార్థులు హాట్ కేక్స్‌గా మారుతున్నట్లు మరోసారి రుజువైంది. అంతేకాకుండా.. అంతర్జాతీయంగా పలు సంస్థలు వ్యాపార విస్తరణ దిశగా అడుగులు వేయడం.. భవిష్యత్తు నిపుణులను అంచనా వేసేందుకు మార్గంగా ఇంటర్న్‌షిప్స్‌ను ఎంచుకోవడం కూడా ఇందుకు మరో కారణంగా పేర్కొనచ్చు.

భారీగా ఆర్థిక ప్రోత్సాహకాలు

ఐఐఎంల్లో పీజీ ప్రోగ్రామ్ విద్యార్థులకు మొదటి సంవత్సరం ముగిసిన తర్వాత లభించే సెలవు రోజుల్లో..ఇంటర్న్ ట్రైనీగా విధులు నిర్వహించేందుకు ప్రముఖ కంపెనీలు అవకాశం కల్పిస్తున్నాయి. ఈ సమ్మర్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో నెగ్గి ఇంటర్న్ ట్రైనీగా ఎంపికైన వారికి స్టయిపెండ్ పేరుతో భారీ మొత్తంలో ఆర్థిక ప్రోత్సహకాలు కూడా అందిస్తాయి. సగటున రూ.2లక్షల వరకూ స్టయిపెండ్ లభిస్తోంది.

ఎందుకంత క్రేజ్

కేవలం రెండు నెలల స్వల్ప వ్యవధికి రూ.లక్షల్లో స్టయిపండ్ ఇవ్వడానికి కారణం ఏంటి? అంటే వినిపిస్తున్న సమాధానం.. ఈ ఇన్‌స్టిట్యూట్‌లలో అభ్యసించిన విద్యార్థులకు రియల్ టైమ్ నైపుణ్యాలు, అప్‌డేటెడ్ నాలెడ్జ్ ఉంటుందని ఆయా సంస్థలు భావించడమే అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇక్కడ బోధన విధానాలు కార్పొరేట్ లీడర్లను తీర్చిదిద్దే విధంగా ఉండడం మరో కారణంగా చెబుతున్నారు.

ఈ ఏడాది ఆఫర్స్ వెల్లువ

- ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా సమ్మర్ ప్లేస్‌మెంట్స్‌లో ఐఐఎంల హవా మరోసారి రుజువైంది. తొలి తరం ఐఐఎంలుగా పేర్కొనే ఐఐఎం-లక్నో, అహ్మదాబాద్, బెంగళూరు సహా అన్నింటిలోనూ.. 2025–27 బ్యాచ్ విద్యార్థులకు సమ్మర్ ప్లేస్‌మెంట్ ఆఫర్స్ వెల్లువెత్తుతున్నాయి.
- ఐఐఎం–లక్నోలో మొత్తం 580 మంది విద్యార్థులకు సమ్మర్ ప్లేస్‌మెంట్ ఆఫర్స్ లభించాయి. వీరికి సగటు స్టయిఫండ్ నెలకు రూ 1.67 లక్షలుగా.. అత్యధిక స్టయిఫండ్ రూ. 3.95 లక్షలుగా నమోదైంది.
- ఐఐఎం–కోల్‌కతలో 470 మంది విద్యార్థులకుగాను అందరికీ సమ్మర్ ప్లేస్‌మెంట్స్ లభించాయి. సగటు స్టయిఫండ్ రూ.1.85 లక్షలుగా, గరిష్ట స్టయిఫండ్ రూ.4.5 లక్షలుగా ఉండటం విశేషం.
- ఐఐఎం–బెంగళూరు క్యాంపస్‌లో 601 మంది విద్యార్థులకు సమ్మర్ ప్లేస్‌మెంట్స్ ఆఫర్స్ లభించగా.. సగటు స్టయిఫండ్ రూ.2 లక్షలుగా నమోదైంది.
- ఐఐఎం–అహ్మదాబాద్‌లో మొత్తం 394 మంది విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ఆఫర్లు లభించగా.. సగటు స్టయిఫండ్ రూ.3 లక్షలుగా ఉంది.
- నవతరం ఐఐఎంల్లో.. ఐఐఎం–నాగపూర్‌లోనూ నూటికి నూరు శాతం విద్యార్థులకు సమ్మర్ ప్లేస్‌మెంట్స్ లభించాయి. సగటు స్టయిఫండ్ రూ.80 వేలుగా ఉండడం గమనార్హం.

బీఎఫ్‌ఎస్‌ఐ, కన్సల్టింగ్, ఫైనాన్స్

ఐఐఎంల సమ్మర్ ప్లేస్‌మెంట్స్ ఆఫర్స్‌లో.. కన్సల్టింగ్, ఫైనాన్స్ రంగాల హవా కనిపించింది. ఇప్పటి వరకు లభించిన ఎస్‌పీఓల్లో 40 శాతం మేర కన్సల్టింగ్, ఫైనాన్స్ రంగాలకు చెందిన సంస్థలే ఉండటం విశేషం. బీసీజీ,బెయిన్ అండ్ కో,యాక్సెంచర్ స్ట్రాటజీ, పీడబ్ల్యూసీ,డెలాయిట్,కేపీఎంజీ, సినర్జీ కన్సల్టింగ్ సంస్థలు టాప్ రిక్రూటర్స్‌గా నిలిచాయి.

ఐటీ, ఈ-కామర్స్

ఇప్పటి వరకు లభించిన ఆఫర్లను పరిశీలిస్తే.. కన్సల్టింగ్, ఫైనాన్స్ రంగాల తర్వాత ఐటీ, ఈ–కామర్స్ సంస్థలు టాప్ రిక్రూటర్స్‌గా నిలిచాయి. ఈ రంగాల్లో డేటా మేనేజ్‌మెంట్, ఫైనాన్స్, మార్కెటింగ్ విభాగాల్లో ఇంటర్న్‌షిప్ చేసే విధంగా ఆఫర్లు లభించాయి. అదే విధంగా గూగుల్, ఫేస్‌బుక్ సంస్థలు కూడా ఎస్‌పీఓ ఆఫర్లు కల్పించాయి.

సేల్స్, అండ్ మార్కెటింగ్‌లోనూ

సేల్స్ అండ్ మార్కెటింగ్ ప్రొఫైల్స్‌లోనూ గత ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా జోరు కొనసాగింది. ముఖ్యంగా ప్రొడక్ట్ రీసెర్చ్, మార్కెట్ అనాలిసిస్ విభాగాల్లో విధులు నిర్వర్తించే విధంగా ఈ ఆఫర్స్ లభించాయి. అదే సమయంలో జనరల్ మేనేజ్‌మెంట్ విభాగంలోనూ సమ్మర్ ప్లేస్‌మెంట్ ఆఫర్స్ పంథా కొనసాగింది. సంస్థలు విశ్లేషణాత్మక దృక్పథం, మార్కెట్ పరిస్థితులపై విద్యార్థులకున్న అవగాహనను క్షుణ్నంగా పరిశీలించి ఆఫర్స్ ఇచ్చినట్లు ఐఐఎంల వర్గాలు పేర్కొన్నాయి.

ఈ ప్రొఫైల్స్‌లో అధికంగా

ఈ ఏడాది సమ్మర్ ప్లేస్‌మెంట్ ఆఫర్స్‌లో.. డేటా మేనేజ్‌మెంట్, ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ ,జనరల్ అడ్మినిస్ట్రేషన్, సేల్స్ అండ్ మార్కెటింగ్, డేటా అనలిటిక్స్, బిజినెస్ స్ట్రాటజీస్ జాబ్ ప్రొఫైల్స్ ముందంజలో ఉంటున్నాయి.

శాశ్వత కొలువుకు మార్గం

ఎస్‌పీఓల పేరిట లభించే ఇంటర్న్‌షిప్ ట్రైనీ అవకాశం విద్యార్థులకు కెరీర్ కోణంలో అత్యంత ప్రయోజనకరంగా నిలుస్తోంది.ఈ ట్రైనింగ్ సమయంలో వారు చూపే పనితీరు ఆయా సంస్థల్లో శాశ్వత కొలువులకు మార్గంగా నిలుస్తుంది. ఎందుకంటే ఎస్‌పీఓ పొందిన అభ్యర్థులు ఇంటర్న్ ట్రైనీగా ప్రతిభ చూపితే.. కోర్సు పూర్తయ్యాక అదే సంస్థలో శాశ్వత నియామకం సైతం ముందుగానే ఖరారు చేసుకునే అవకాశం ఉంటుంది. ఇంటర్న్‌షిప్ చేసిన సమయంలో అభ్యర్థులు మెరుగ్గా రాణించినట్లు భావిస్తే..కంపెనీలు తమ సంస్థలో శాశ్వత ఉద్యోగిగా పని చేసే ఆసక్తి ఉందో? లేదో? తెలుసుకుంటాయి. ఆసక్తి ఉందని తెలిపిన విద్యార్థులకు ఫైనల్ ప్లేస్‌మెంట్ ఆఫర్ దాదాపు ఖరారైనట్లే. ఇలాంటి అభ్యర్థులు ద్వితీయ సంవత్సరం చివర్లో నిర్వహించే ఫైనల్ ప్లేస్‌మెంట్ ఆఫర్‌లో ఎలాంటి నియామక ప్రక్రియల్లో పాల్గొనకుండానే ఆఫర్ లభిస్తుంది.

ఇతర బి-స్కూల్స్‌లోనూ

మేనేజ్‌మెంట్ విద్య.. బి–స్కూల్స్ అనగానే గుర్తొచ్చే ఐఐఎంలతోపాటు దేశంలోని ఇతర ప్రముఖ బి–స్కూల్స్‌లోనూ ఈ ఏడాది సమ్మర్ ప్లేస్‌మెంట్ డ్రైవ్స్ ఆశాజనకరంగా ఉండనున్నాయి. ఢిల్లీ యూనివర్సిటీ ఫ్యాకల్టీ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగంలోనూ పూర్వ పరిస్థితులు కనిపిస్తాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దేశంలో ప్రఖ్యాతి గడించి మరో ప్రముఖ బి–స్కూల్ ఎక్స్‌ఎల్‌ఆర్‌ఐ–జెంషెడ్‌పూర్‌లోనూ వంద శాతం ఇంటర్న్‌షిప్ ఆఫర్లు లభించాయి. అంతేకాకుండా రెండు నెలల వ్యవధికి ఇచ్చే స్టయిపండ్ కూడా గరిష్టంగా రూ. 3.5 లక్షలుగా నమోదవడం విశేషం.

విద్య, ఉద్యోగ సమాచారం

ఓఐసీఎల్, న్యూఢిల్లీలో 300 ఏవో పోస్టులు

న్యూఢిల్లీలోని ది ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్(ఓఐసీఎల్).. వివిధ విభాగాల్లో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(ఏవో) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం పోస్టుల సంఖ్య:** 300.
» **పోస్టుల వివరాలు:** జర్నలిస్ట్ ఆఫీసర్–285, హిందీ ఆఫీసర్–15.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి కనీసం 60 శాతం మార్కులతో డిగ్రీ, పీజీలో ఉత్తీర్ణులై ఉండాలి. » **వయసు:** 30.11.2025 నాటికి 30 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.85,000.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 01.12.2025.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.12.2025
» **ఆన్‌లైన్ పరీక్ష ప్రిలిమినరీ(టైర్–1):**10.01.2026
» **ఆన్‌లైన్ పరీక్ష మెయిన్స్(టైర్–2):** 28.02.2026
» **వెబ్‌సైట్:** https://orientalinsurance.org.in

ఇండియన్ ఆర్మీలో హవల్దార్, నాయబ్ సుబేదార్ పోస్టులు

ఇండియన్ ఆర్మీ క్రీడా కోటా ఎంట్రీ కింద డైరెక్ట్ ఎంట్రీ(ఇంటేక్ 05/2025) ద్వారా హవల్దార్, నాయబ్ సుబేదార్(స్పోర్ట్స్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. 2023 అక్టోబర్1 నుంచి లేదా ఆ తర్వాత అంతర్జాతీయ/జూనియర్ లేదా సీనియర్ జాతీయ ఛాంపియన్‌షిప్/ఖేలో ఇండియా గేమ్స్/యూత్ గేమ్స్/ఖేలో ఇండియా యూనివర్శిటీ గేమ్స్‌లో పాల్గొన్న అత్యుత్తమ క్రీడాకారుల నియామక ట్రయల్స్ కోసం అవివాహిత భారతీయ పురుష, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.
» **క్రీడలు:** అథ్లెటిక్స్, ఆర్చరీ, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, డైవింగ్, ఫుట్‌బాల్, ఫెన్సింగ్, జిమ్నాస్టిక్స్, హాకీ, హ్యాండ్‌బాల్, కబడ్డీ, రెజ్లింగ్, వెయిట్ లిఫ్టింగ్ తదితరాలు.
» **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి. దీనితోపాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు ఉండాలి. అంతర్జాతీయ/జూనియర్ లేదా సీనియర్ నేషనల్ ఛాంపియన్‌షిప్/ఖేలో ఇండియా గేమ్స్/యూత్ గేమ్స్‌లో పాల్గొన్న అత్యుత్తమ క్రీడాకారులై ఉండాలి.
» **వయసు:** 17 1/2 సంవత్సరాల నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి. 31.03.2001 నుంచి 01.04.2008 ఏళ్ల మధ్య జన్మించి ఉండాలి.
» **ఎంపిక విధానం:** స్పోర్ట్స్ ట్రయల్స్, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్స్ టెస్ట్, స్కిల్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, సర్టిఫికేట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును డైరెక్టరేట్ ఆఫ్ పీటీ అండ్ స్పోర్ట్స్, జనరల్ స్టాఫ్ బ్రాంచ్, ఐహెచ్‌క్యూ(ఆర్మీ), రూమ్ నెం.747.'ఎ' వింగ్, సేనా భవన్, న్యూఢిల్లీ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 15.12.2025.
» **వెబ్‌సైట్:** https://joinindianarmy.nic.in

సీఐటీడీ హైదరాబాద్‌లో పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు

హైదరాబాద్‌లోని ఎంఎస్‌ఎంఈ టూల్ రూమ్, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (సీఐటీడీ)–2026 జనవరి బ్యాచ్‌కు సంబంధించి పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం సీట్ల సంఖ్య:** 60.
» **కోర్సులు:** పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ టూల్ డిజైన్ అండ్ సీఏడీ /సీఏఎం(పీజీడీటీడీ అండ్ సీసీ) (సీనియర్ టూల్ డిజైనర్ సీఏడీ/సీఏఎం).
» **కోర్సు వ్యవధి:** ఏడాది(రెండు సెమిస్టర్లు).
» **అర్హత:** బీఈ/బీటెక్(మెకానికల్) లేదా తత్సమాన విద్యార్హత కలిగి ఉండాలి.
» **వయసు:** 45 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** మెరిట్ జాబితా ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 17.11.2025.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.12.2025
» **అడ్మిషన్ కౌన్సిలింగ్ తేది:** 22.12.2025.
» **వెబ్‌సైట్:** https://citd.in

బెల్‌లో 14 పోస్టులు

భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ కోట ద్వారా యూనిట్‌లో శాశ్వత ప్రాతిపదికన ఇంజనీరింగ్ అసిస్టెంట్ ట్రెయినీ, టెక్నీషియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం పోస్టుల సంఖ్య:** 14.
» **పోస్టుల వివరాలు:** ఇంజనీరింగ్ అసిస్టెంట్ ట్రెయినీ–10, టెక్నీషియన్ సి–04.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పదో తరగతి, ఐటీఐ, డిప్లొమాలో ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:**01.12.2025నాటికి 28ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు ఇంజనీరింగ్ అసిస్టెంట్ ట్రెయినీకి రూ.24,500 నుంచి రూ.90,000, టెక్నీషియన్–సికి రూ.21,500 నుంచి రూ.82,000.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 02.12.2025.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 23.12.2025
» **వెబ్‌సైట్:** https://bel-india.in

క్లుప్తంగా...

ఇంటర్ నాన్ టీచింగ్ సిబ్బందికి పదోన్నతులు!

కార్యాచరణ చేపట్టిన అధికారులు

సాక్షి, అమరావతి: ఇంటర్మీడియట్ విద్యాశాఖలో బోధనేతర సిబ్బందికి జూనియర్ లెక్చరర్లుగా పదోన్నతులు కల్పించేందుకు కార్యాచరణ చేపట్టారు. ఇందులో భాగంగా వివిధ విభాగాల్లో అర్హత గల సిబ్బంది, ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలను సేకరిస్తున్నారు. పూర్తి నివేదిక అందగానే జూనియర్ లెక్చరర్లుగా పదోన్నతులు ఇవ్వనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. మొత్తం జూనియర్ లెక్చరర్ల పోస్టుల్లో 10 శాతం నాన్ టీచింగ్ స్టాఫ్‌కు ఇవ్వాలని గతంలో ఇచ్చిన ఉత్తర్వుల ఆధారంగా ఈ ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలుస్తోంది.

రేపటి వరకు డిగ్రీ, పీజీ స్పాట్ అడ్మిషన్లకు రిజిస్ట్రేషన్

సాక్షి, అమరావతి: డిగ్రీ, పీజీ కోర్సుల్లో స్పాట్, మేనేజ్‌మెంట్ కోటా సీట్ల భర్తీ కోసం రిజిస్ట్రేషన్‌కు గడువును ఈ నెల 10వ తేదీ వరకు ఉన్నత విద్యా మండలి పొడిగించింది. విద్యార్థులు, కళాశాలల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉన్నత విద్యా మండలి కార్యదర్శి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ సెట్‌లో యథావిధిగా స్పాట్, కేటగిరీ–బీ అడ్మిషన్లు కొనసాగుతాయని పేర్కొన్నారు.

బీడీఎస్ కన్వీనర్ సీట్ల కేటాయింపు

సాక్షి, అమరావతి: మూడో విడత బీడీఎస్ కన్వీనర్ సీట్ల కేటాయింపు ప్రొవిజనల్ లిస్టును సోమవారం ఆరోగ్య విశ్వవిద్యాలయం ప్రకటించింది. అభ్యంతరాలుంటే మంగళవారం మధ్యాహ్నం 2 గంటల్లోపు తెలియజేయడానికి అవకాశం ఇచ్చింది.

సిద్ధరామయ్యకు సుప్రీంకోర్టు నోటీసులు

శివాజీనగర: కర్ణాటక సీఎం సిద్ధరామయ్య 2023 అసెంబ్లీ ఎన్నికల్లో వరుణ నియోజకవర్గం నుంచి ఎన్నికవడం చట్ట విరుద్ధమంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం విచారణ జరిపింది. దీనిపై వివరణ ఇవ్వాలని సిద్ధరామయ్యకు సర్వోన్నత న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. సిద్ధరామయ్య ప్రజాప్రతినిధుల చట్టం–1951ని ఉల్లంఘించి ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ శంకర్ అనే వ్యక్తి గతంలో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, కొట్టివేసింది. దీంతో అతను సుప్రీంకోర్టును ఆశ్రయించారు. 'ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఐదు గ్యారెంటీలను ప్రకటించింది. మహిళలకు ఉచిత బస్సు పథకం రాజ్యాంగ విరుద్ధం. ఇది పురుషుల పట్ల వివక్ష చూపిట్లే. కాబట్టి సిద్ధరామయ్య ఎన్నిక చెల్లదు. ఆయనపై అనర్హత వేటు వేసి ఆరేళ్లపాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధించాలి' అని పిటిషన్‌లో కోరాడు.

సీఎంగా మా నాన్నే కొనసాగుతారు

సీఎం సిద్ధరామయ్య కుమారుడు యతీంద్ర

శివాజీనగర: కర్ణాటక ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ కాంగ్రెస్ హైకమాండ్‌ను కోరారు. అయితే.. సీఎంను మార్చే పరిస్థితి లేదని హైకమాండ్ చెప్పిందని సీఎం సిద్ధరామయ్య తనయుడు, కాంగ్రెస్ ఎమ్మెల్సీ యతీంద్ర అన్నారు. సోమవారం బెళగావిలో అసెంబ్లీ సమావేశాలకు హాజరైన ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్‌లో అధికారం కోసం రగడ జరగలేదని, ఇదంతా ప్రతిపక్షం సృష్టి అన్నారు. కర్ణాటకలో ముఖ్యమంత్రిని మార్చే పరిస్థితి లేదని హైకమాండ్ ప్రకటించిందన్నారు. సీఎం మార్పు జరుగుతుందనుకునే వారు కలలు కంటూ ఉండాలని ఎద్దేవా చేశారు. సిద్ధరామయ్య ఐదేళ్లూ పదవిలో ఉంటారనే నమ్మకం తనకుందన్నారు. సీఎం, డిప్యూటీ సీఎం ఇటీవల ఢిల్లీ వెళ్లారని.. అక్కడ కూడా కర్ణాటకలో సీఎం కుర్చీ మార్పుపై ఎలాంటి చర్చలు జరగలేదని అన్నారు.

జైలులో నటుడు దర్శన్ గొడవలు

తోటి ఖైదీలకు వేధింపులు

యశవంతపుర: చిత్రదుర్గ రేణుకాస్వామి హత్య కేసులో బెంగళూరు పరప్పన అగ్రహార సెంట్రల్ జైలులో ఉన్న ప్రముఖ నటుడు దర్శన్ తోటి ఖైదీలతో గొడవలు పడుతున్నట్టు తెలిసింది. తన సెల్‌లో ఉంటున్న ఇతర ఖైదీలను వేధిస్తున్నట్టు సమాచారం. దర్శన్ రెండోదఫా బెయిలు రద్దయి జైలుకు వచ్చాక నిబంధనలను కట్టుదిట్టం చేశారు. దీంతో దర్శన్‌లో అసహనం పెరిగిపోయినట్టు జైలు వర్గాలు చెబుతున్నాయి. దర్శన్ ఇతర ఖైదీలను దూషిస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. గతంలో దర్శన్‌కు తోటి ఖైదీ భోజనం తెచ్చి పెట్టేవారు. ఇటీవల కొందరు ఖైదీలు జల్సాలు చేసిన వీడియోలు రావడంతో ప్రభుత్వం కట్టుదిట్టం చేసింది. ఐపీఎస్ అంశుకుమార్‌ను జైలు అధికారిగా నియమించింది.

మూకుమ్మడిగా వెళుతున్న మహిళలు. (ఇన్‌సెట్‌లో)రోడ్డుపై పడేసిన మద్యం సీసాలు

అపర కాళికలై అ'సుర' సంహారం

బెల్టు షాపులపై మహిళల దాడి

జె.పంగులూరు: మద్యం మహమ్మారిపై మహిళలు ధ్వజమెత్తారు. అసురపాలనపై అపర కాళికలై దునుమాడారు. బెల్టుషాపులపై దాడి చేసి అక్రమంగా దాచిన మద్యాన్ని తీసుకొచ్చి నడివీధిలో తగలెట్టారు. ఇకపై మద్యం అమ్మితే ఖబడ్దార్ అని హెచ్చరించారు. బాపట్ల జిల్లా జె పంగులూరు మండలం కోటపాడు గ్రామంలో సోమవారం రాత్రి జరిగిన ఈ ఘటన సంచలనం రేకెత్తించింది. మహిళామూర్తుల ధర్మాగ్రహానికి గ్రామస్తులంతా సంఘీభావం పలికారు. కోటపాడులో ఏడు బెల్టుషాపులు నడుస్తున్నాయి. వీటి వల్ల కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయి. భార్యాభర్తల మధ్య కలహాలు రేగుతున్నాయి. పచ్చని సంసారాల్లో చిచ్చురేగుతోంది. దీంతో పిల్లల భవిష్యత్తు నాశనమవుతోంది. ఈ దాష్టీకాలను భరించలేని మహిళలంతా సోమవారం రాత్రి నడుంబిగించారు. ఊళ్లో బెల్టుషాపులు ఉండడానికి వీల్లేదని నిర్ణయించుకున్నారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి.రమాదేవి ఆధ్వర్యంలో దళితకాలనీలో సమావేశమై ఉద్యమానికి ఉద్యుక్తులయ్యారు. సమీపంలో ఉన్న బెల్టుషాపులపైకి దూసుకెళ్లారు. దాచి ఉంచిన మద్యం సీసాలను తీసుకొచ్చి నడివీధిలో తగలబెట్టారు. వీరి ధర్మాగ్రహానికి గ్రామస్తులు సంఘీభావం తెలిపారు. ఇకపై గ్రామంలో మద్యం అమ్మడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నేత రమాదేవి మాట్లాడుతూ బీచ్‌లలో ఆడ, మగ మద్యం తాగితే అప్పుడు పర్యాటకుల సంఖ్య పెరుగుతుందని శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు వ్యాఖ్యానించడాన్ని తప్పుబట్టారు. ప్రజల చేత మద్యం తాగించేందుకు ప్రభుత్వ పెద్దలే ముందుంటే ఎలా అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సాక్షి ఎడిటర్‌పై సర్కార్ దాష్టీకం

ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డికి తాజాగా విచారణ నోటీసులు

హైదరాబాద్‌లోని పత్రిక ప్రధాన కార్యాలయానికి కర్నూలు పోలీసులు

సాక్షి, అమరావతి: పాలనా వైఫల్యాలను ప్రశ్నిస్తున్నందుకు సీఎం చంద్రబాబు ప్రభుత్వం 'సాక్షి' పత్రికపై కక్షసాధింపును మరింత విస్తృతం చేస్తోంది. అవినీతి, అక్రమాలను వెలుగులోకి తెస్తూ ప్రజల గొంతుకగా నిలుస్తున్నందుకు అక్రమ కేసులతో బరితెగిస్తోంది. పత్రికా స్వేచ్ఛ, భావ ప్రకటనా హక్కును కాలరాస్తూ కుతంత్రాలకు తెగబడుతోంది. కర్నూలులో రూ.4 వేల కోట్ల ప్రభుత్వ భూములను కొల్లగొట్టేందుకు అధికార టీడీపీ నేతలు పన్నిన కుట్రలను బట్టబయలు చేయడం, ఆ ప్రాంతంలో దశాబ్దాలుగా నివసిస్తున్నవారి ఆందోళనకు మద్దతుగా నిలిచినందుకు 'సాక్షి' పత్రికపై అక్రమ కేసులు నమోదు చేసింది చంద్రబాబు ప్రభుత్వం. ఈ మేరకు విచారణ పేరుతో సోమవారం కర్నూలు పోలీసులు హైదరాబాద్‌లోని 'సాక్షి' ప్రధాన కార్యాలయంలో హల్‌చల్ చేశారు. పత్రిక **ఎడిటర్** ఆర్.ధనంజయ్‌రెడ్డికి 35 బీఎన్ఎస్ఎస్ కింద నోటీసులిచ్చారు.

ఆధారాలతో కథనాలు.. వేధింపులే లక్ష్యంగా ప్రభుత్వం

బాబు సర్కారులో... సాక్షి ప్రధాన కార్యాలయం, ఎడిటర్ ఆర్.ధనంజయ్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసుల నమోదు, నోటీసులు, విచారణ పేరుతో వేధించడాన్ని పోలీసులు వారి విధానంగా మలుచుకున్నట్లు స్పష్టమవుతోంది. సాక్షి పత్రిక, ఎడిటర్‌పై 19 అక్రమ కేసులు నమోదు చేయడం ప్రభుత్వ దాష్టీకానికి నిదర్శనం. అక్రమ కేసులకు కారణమైన కథనాల్లో ఒక్కదాంట్లోనూ 'సాక్షి' అవాస్తవాలను ప్రచురించలేదు. పూర్తి ఆధారాలతో ఇస్తూ బాధితులు చెప్పిందే పేర్కొన్నది తప్ప సొంత భాష్యం ఇవ్వలేదు. వాస్తవాలను వక్రీకరించలేదు. అయినా, బాబు ప్రభుత్వ డైరెక్షన్‌లో పోలీసులు అక్రమ కేసులకు తెగబడుతున్నారు. పోలీసు ఉన్నతాధికారులు అత్యుత్సాహంతో కొన్ని నమోదు చేయిస్తుండగా... ప్రభుత్వ పెద్దలు ప్రత్యేకంగా ఆదేశించి మరీ మరికొన్ని నమోదు చేయిస్తున్నారు. పత్రికల్లో వచ్చే వ్యతిరేక కథనాలపై అభ్యంతరం ఉంటే అధికారికంగా వివరణ (రిజాయిండర్) పంపొచ్చు. పరువు నష్టం దావా వేయొచ్చు. కానీ, బాబు సర్కారు మాత్రం రాజ్యాంగ నిబంధనలను పాటించాలన్న ఆలోచనే లేనట్లు కక్షసాధింపునకు దిగుతోంది.

బాధితుల పక్షాన నిలిచినందుకే...

- ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎలుగెత్తడం, బాధితుల ఆవేదనను వెలుగులోకి తేవడమే 'సాక్షి' చేసిన నేరం అన్నట్లు చంద్రబాబు సర్కారు వ్యవహరిస్తోంది. ఈ క్రమంలో ప్రభుత్వ పెద్దల కుట్రపై కర్నూలు జిల్లా పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. 19 అక్రమ కేసుల్లో 5 ఈ జిల్లాలోనే నమోదవడం దీనికి నిదర్శనం. ఇక ఇటీవల నమోదు చేసిన కేసు మరీ విడ్డూరంగా ఉంది. కర్నూలులోని ఏ, బీ, సీ క్యాంప్ క్వార్టర్లను ఖాళీ చేయించాలని మంత్రి భరత్ ఆదేశించారు. ఆ భూముల్లో స్టేడియం నిర్మిస్తామని ఓసారి, హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని మరోసారి చెప్పారు. వీటిలో ఏ నిర్మాణానికీ ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేయలేదు. అయినాసరే, అక్కడివారిని బలవంతంగా ఖాళీ చేయించేందుకు మంత్రి భరత్ సంసిద్ధులయ్యారు. కర్రపట్టుకుని మరీ ఖాళీ చేయిస్తామని బహిరంగంగా హెచ్చరించారు. దాంతో దశాబ్దాలుగా ఉంటున్న కుటుంబాలు తీవ్ర నిరసన తెలిపాయి. 'సాక్షి' దీన్ని ప్రచురించింది. ఆగ్రహించిన మంత్రి భరత్... సాక్షిపై అక్రమ కేసు నమోదు చేయాలని హుకుం జారీ చేశారు. పోలీసులు జీహుజూర్ అన్నారు. అంతేకాదు సోమవారం ఏకంగా సాక్షి ప్రధాన కార్యాలయానికి వచ్చి ఎడిటర్‌కు నోటీసులిచ్చారు.
- ఒకే కథనంపై కర్నూలు త్రీ టౌన్, టూ టౌన్ పోలీస్ స్టేషన్లలో మూడు వేర్వేరు కేసులు నమోదు చేయడం గమనార్హం. భూ వివాదాన్ని సెటిల్ చేసేందుకు ఓ ఉపాధ్యాయుడిని పోలీసులే ఎత్తుకెళ్లారు. దీన్ని వెలుగులోకి తెచ్చిన 'సాక్షి'పై అక్రమ కేసు నమోదు చేశారు. రాయలసీమలో భారీ దందాకు పాల్పడుతున్న అవినీతి అనకొండ ఐపీఎస్ అధికారి బాగోతాన్ని బయటపెట్టినందుకు మరో అక్రమ కేసు పెట్టారు. ఇక టెండర్లలో ఎవరూ పాల్గొనవద్దని మంత్రి భరత్ అనుచరులు వాట్సాప్ మెసేజులతో బెదిరించారు. ఈ విషయాన్ని ప్రచురించినందుకు సాక్షిపై అక్రమ కేసు నమోదు చేశారు.
- పార్వతీపురం మన్యం జిల్లాలో మంత్రి సంధ్యారాణి ప్రైవేట్ పీఏ సతీశ్ ఒంటరి ఉద్యోగినిని లైంగికంగా వేధించాడు. ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీన్ని ప్రచురించిన సాక్షిపై సాలూరు పోలీసులు అక్రమ కేసు నమోదు చేశారు. బాధితురాలికి అండగా ఉండాల్సిన మంత్రి, పోలీసులు కేసు వెనక్కు తీసుకోవాలని ఆమెను వేధించారు.
- పోలీసు శాఖలో అర్హులైన డీఎస్పీలకు అదనపు ఎస్పీలుగా పదోన్నతుల్లో అన్యాయం జరగడాన్ని సాక్షి వెలుగులోకి తెచ్చింది. వాట్సాప్ గ్రూప్‌లలో నిరసన వ్యక్తం చేసిన డీఎస్పీల ఆవేదననే ప్రచురించింది. పోలీసు అధికారులకు న్యాయం జరగాలని తపించిన సాక్షిపై గుంటూరు జిల్లా తాడేపల్లి పోలీసులే అక్రమ కేసు నమోదు చేయడం గమనార్హం. ఈ అక్రమ కేసులో సాక్షి ఎడిటర్ ఆర్.ధనంజయ్‌రెడ్డి, ఇద్దరు పాత్రికేయులు తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో విచారణకు కూడా హాజరయ్యారు.
- ఇటీవలి భారీ వర్షాలకు రాజధాని అమరావతి ప్రాంతం ముంపునకు గురైందని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత అంబటి మురళీకృష్ణ విలేకరుల సమావేశంలో విమర్శించారు. సంబంధిత ఫొటోలను ప్రదర్శించారు. దీన్ని ప్రచురించిన సాక్షిపై పోలీసులు అక్రమ కేసు నమోదు చేశారు.
- రాష్ట్రంలో టీడీపీ నేతల నకిలీ మద్యం దందా బట్టబయలవడంతో ప్రభుత్వం కంగారుపడింది. నకిలీ మద్యం బాగోతాన్ని వెలుగులోకి తెస్తున్న సాక్షి గొంతు నొక్కేందుకు అక్రమ కేసులకు తెగించింది. కల్తీ మద్యం తాగి ఎస్పీఎస్ఆర్ నెల్లూరు, ప్రకాశం, పల్నాడు జిల్లాల్లో సందేహాస్పద రీతిలో నలుగురు మృతి చెందడం తీవ్ర కలకలం సృష్టించింది. ఆ వాస్తవాన్ని సాక్షి ప్రచురించగా బాబు సర్కారు తట్టుకోలేపోయింది. నకిలీ మద్యం దందాను అరికట్టడంపై కాక దానిని వెలుగులోకి తెస్తున్న సాక్షిపై కక్షసాధింపునకు దిగారు. ప్రభుత్వం ఆదేశాలతో ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాలోని నెల్లూరు రూరల్, కలిగిరి, పల్నాడు జిల్లా నరసరావుపేటలో అక్రమంగా క్రిమినల్ కేసులు పెట్టారు. అర్ధరాత్రి వేళ హైదరాబాద్, విజయవాడ సాక్షి కార్యాలయాలు, సాక్షి పాత్రికేయుల నివాసాలకు వెళ్లి నోటీసుల పేరుతో వేధించారు. ఎడిటర్ ఆర్.ధనంజయ్‌రెడ్డికి వాట్సాప్‌లో ముందుగా నోటీసులు పంపారు. వాట్సాప్‌లో నోటీసులు షేరింగ్ వద్దని సుప్రీంకోర్టు స్పష్టంగా ఆదేశించినా దాన్ని ఉల్లంఘించారు. అనంతరం విచారణ పేరుతో పేరుతో ఎడిటర్ ధనుంజయ్‌రెడ్డికి ఏకంగా 85 ప్రశ్నలతో బుక్‌లెట్ ఇచ్చారు. పత్రికలు, మీడియా ఎలా విధులు నిర్వర్తిస్తాయనే కనీస అవగాహన లేకుండా ఈ ప్రశ్నావళి ఉంది. న్యూస్ సోర్స్, బాధితుల వివరాలను వెల్లడించాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు గతంలోనే విస్పష్టంగా ప్రకటించింది. కానీ, సాక్షి వద్ద ఆవేదన వెళ్లగక్కిన బాధితుల వివరాలు చెప్పాలని, న్యూస్ సోర్స్ వెల్లడించాలని ఏపీ పోలీసులు ప్రశ్నించడం విస్మయపరిచింది.

'రయ్'లు

- 2027 ఆగస్టులో తొలి హైస్పీడ్ బుల్లెట్ ట్రైన్ ట్రయల్ రన్
- అధునాతన సౌకర్యాలతో సబర్మతిలో మల్టీ మోడల్ ట్రాన్స్‌పోర్టు హబ్

నిర్మాణంలో ఉన్న బుల్లెట్ రైలు స్టేషన్

గుజరాత్ నుంచి సాక్షి ప్రతినిధి: అహ్మదాబాద్–ముంబై మధ్య భారతదేశంలో మొదటి హైస్పీడ్ రైల్ (బుల్లెట్ ట్రైన్) ప్రాజెక్టు పనులు వేగంగా సాగుతున్నాయి. మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల మధ్య 508 కిలోమీటర్ల (మహారాష్ట్రలో 156 కి.మీ, గుజరాత్‌లో 352 కి.మీ) దూరాన్ని కేవలం 2 గంటల్లో పూర్తి చేయడానికి ఈ ప్రాజెక్టును రూపొందించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి 2027 ఆగస్టులో కీలక ఘట్టం ఆవిష్కృతం కానుంది. గుజరాత్ రాష్ట్రంలోని సూరత్ – బిలిమోరా మధ్య సుమారు 50 కి.మీ దూరంలో ఈ రైలుకు ట్రయల్ రన్ చేపట్టనున్నట్టు నేషనల్ హై–స్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ అహ్మదాబాద్ ప్రిన్సిపల్ చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ రాజేష్ అగర్వాల్ సోమవారం 'సాక్షి'కి వివరించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. 2017 సెప్టెంబర్ 14న ప్రధాని మోదీ, జపాన్ ప్రధాని షింజో అబేలు బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టుకు భూమి పూజ చేశారు. ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.1.08 లక్షల కోట్లు. డిజైన్ స్పీడ్ గంటకు 350 కి.మీ కాగా ఆపరేటింగ్ స్పీడ్ గంటకు 320 కి.మీ ఉంటుంది. ఆధునిక డిజైన్, మల్టీ–మోడల్ ఇంటిగ్రేషన్ (మెట్రో, బస్సు, రైలు, బుల్లెట్ రైలు ప్రయాణాలను అనుసంధానించే) అధునాతన వసతులతో 12 స్టేషన్లు నిర్మిస్తున్నారు. సబర్మతిలో మల్టీ మోడల్ ట్రాన్స్‌పోర్ట్ హబ్‌ను భారీ ఎత్తున నిర్మించారు. వచ్చే ఏడాది ఇక్కడ వాణిజ్య కార్యకలాపాలు ఊపందుకోనున్నాయి. తొమ్మిది అంతస్తుల్లో నిర్మించిన ఈ హబ్‌లో షాపింగ్ కాంప్లెక్స్, వివిధ ఆఫీసులతో ప్రయాణికులకు విందు, వినోదాలకు సకల వసతులు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే ఈ హబ్ నిర్మాణం పూర్తయింది. హెరిటేజ్ సిటీ అహ్మదాబాద్ సంస్కృతి, దేశ చారిత్రక వారసత్వాన్ని ప్రతిబింబించేలా హబ్‌ను డిజైన్ చేశారు.

ఏపీ ఇన్ పార్లమెంట్

లోక్‌సభ

పెట్రోల్, డీజిల్, మద్యం జీఎస్టీ పరిధిలోకి రావు

లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ పక్షనేత, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ప్రశ్నకు కేంద్రం జవాబు

సాక్షి, న్యూఢిల్లీ: పెట్రోల్, డీజిల్, మద్యం.. ఈ మూడు జీఎస్టీ పరిధిలోకి రావని కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్ చౌదరి చెప్పారు. పెట్రోల్, డీజిల్, క్రూడ్ ఆయిల్, నేచురల్ గ్యాస్, ఏటీఎఫ్, మద్యం ఇప్పటికీ జీఎస్టీ పరిధిలోకి రాలేదన్నారు. లోక్‌సభలో సోమవారం వైఎస్సార్‌సీపీ లోక్‌సభ పక్షనేత, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. రాజ్యాంగంలోని 7వ షెడ్యూల్ స్టేట్ లిస్ట్ ఎంట్రీ 51 ప్రకారం మద్యంపై ఎక్సైజ్ డ్యూటీ విధించే అధికారం రాష్ట్రాలదేనని చెప్పారు. కేంద్రం విధించే ఎక్సైజ్ డ్యూటీ, రాష్ట్రాలు వేసే వ్యాట్, స్థానిక పన్నుల వల్లే రాష్ట్రాల మధ్య ధరల్లో తేడాలు ఏర్పడుతున్నట్లు తెలిపారు.

74,427 మంది ప్రత్యేక అవసరాల పిల్లలకు నాణ్యమైన విద్య

ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు నాణ్యమైన, సమ్మిళిత విద్య అందించేందుకు సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా అనేక చర్యలు అమలవుతున్నట్లు కేంద్ర విద్యాశాఖ సహాయమంత్రి జయంత్ చౌదరి చెప్పారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. ఏపీలో 45,724 పాఠశాలల్లో 74,427 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లల హాజరు నమోదైయినట్లు తెలిపారు.

జాతీయ విద్యావిధానంలో ప్రగతి

జాతీయ విద్యావిధానం–2020 అమలులో ప్రగతి సాధించినట్లు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజారాణి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. ఈ విద్యావిధానం కింద అనేక సంస్కరణలు అమలు చేస్తున్నట్లు తెలిపారు.

సంస్కృత వర్సిటీలో లైంగిక వేధింపులపై వాయిదా తీర్మానానికి నోటీసు

లోక్‌సభలో నోటీసు ఇచ్చిన వైఎస్సార్‌సీపీ ఎంపీ గురుమూర్తి

తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో లైంగిక వేధింపులు, బ్లాక్‌మెయిల్ ఘటనలు జరుగుతున్నాయని వైఎస్సార్‌సీపీ ఎంపీ డాక్టర్ గురుమూర్తి చెప్పారు. ఈ ఘటనను కేంద్రం దృష్టికి తీసుకెళ్లేందుకు ఆయన సోమవారం లోక్‌సభలో వాయిదా తీర్మానానికి నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ విశ్వవిద్యాలయంలో బీఈడీ మొదటి సంవత్సరం చదువుతున్న దళిత విద్యార్థినిని అదే వర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ లైంగికంగా వేధించడం, వ్యక్తిగత ఫోటోలు, వీడియోలను అడ్డుపెట్టుకుని బెదిరించడం అత్యంత హేయమని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు మార్గనిర్దేశం చేయాల్సిన గురువులే ఇలాంటి అనైతిక చర్యలకు పాల్పడటం తిరుపతి ప్రతిష్టను దెబ్బతీస్తోందని చెప్పారు. వర్సిటీ హాస్టల్ తనిఖీల్లో 20 గంజాయి ప్యాకెట్లు బయటపడటం క్యాంపస్ భద్రతా వైఫల్యాలను బయటపెడుతోందన్నారు. సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థులు మాదకద్రవ్యాలకి లోనవడం అత్యంత ఆందోళనకరమని, దీనివల్ల విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనలపై వెంటనే ఉన్నతస్థాయి విచారణ జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, క్యాంపస్ భద్రతను బలోపేతం చేసి డ్రగ్–ఫ్రీ వాతావరణాన్ని ఏర్పరచాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ వాయిదా తీర్మానానికి నోటీసు ఇచ్చారు.

కాంతి కాలుష్యం నియంత్రణకు జరిమానాల్లేవు

రోడ్డు, రవాణా, రహదారులశాఖ 2017లో తీసుకొచ్చిన మోటర్ వెహికల్ రెగ్యులేషన్స్ ప్రకారం.. హై–బీమ్‌ను అనవసరంగా, ఎక్కువసేపు లేదా బాగా లైటింగ్ ఉన్న రోడ్లపై వాడరాదని పర్యావరణశాఖ సహాయమంత్రి కీర్తివర్ధన్ సింగ్ చెప్పారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. ప్రస్తుతం కాంతి కాలుష్యం నియంత్రణకు ప్రత్యేకమైన జాతీయ చట్టం లేదా జరిమానాలు లేవని తెలిపారు.

రాజ్యసభ

డిమాండ్ పెరిగితే మరిన్ని విమాన సర్వీసులు

రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ మేడ రఘునాథరెడ్డి ప్రశ్నకు కేంద్రం జవాబు

సాక్షి, న్యూఢిల్లీ: రాయలసీమ ప్రాంతానికి విమాన కనెక్టివిటీ మెరుగుపరిచేందుకు కడప విమానాశ్రయాన్ని ఉడాన్ పథకం కింద అభివృద్ధి చేసినట్లు కేంద్ర పౌరవిమానయానశాఖ సహాయ మంత్రి మురళీధర్ మోహల్ తెలిపారు. రాజ్యసభలో సోమవారం వైఎస్సార్‌సీపీ ఎంపీ మేడా రఘునాథరెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. ఇండిగో ఎయిర్‌లైన్స్ ఆపరేట్ చేస్తున్న సర్వీసుల్లో కడప నుంచి చెన్నై, విజయవాడ, హైదరాబాద్‌కు నేరుగా కనెక్టింగ్ ఫ్లైట్స్ ఉన్నాయన్నారు. రాయలసీమలో మరిన్ని విమాన సర్వీసులు రావాలంటే ప్రయాణికుల డిమాండ్ పెరగాలని, ఎయిర్‌లైన్స్ లాభదాయకంగా భావించడం కీలకమని చెప్పారు.

అఫోర్డబుల్ రెంటల్ హౌజింగ్ కాంప్లెక్స్ మంజూరు

పట్టణాల్లో నివసించే పేదలు, వలస కార్మికుల కోసం 2020లో ప్రారంభమైన అఫోర్డబుల్ రెంటల్ హౌజింగ్ కాంప్లెక్స్ (ఏఆర్‌హెచ్‌సీ) పథకం కింద దేశంలో ఇప్పటివరకు 83,298 యూనిట్లు మంజూరు చేసినట్లు కేంద్ర పట్టణాభివృద్ధి, గృహనిర్మాణశాఖ సహాయమంత్రి టోకాన్ సాహు.. వైఎస్సార్‌సీపీ ఎంపీ ఎస్.నిరంజన్‌రెడ్డి ప్రశ్నకు జవాబిచ్చారు.

అధ్యయనాలకు నిధులు

గంగా డిజిటల్ ట్విన్ నిర్వహణ, మహానంద ఎస్‌టీపీ పీపీపీ మోడల్, హిమానీనదాల అధ్యయనం కోసం నిధులు కేటాయించినట్లు కేంద్ర జల్‌శక్తిశాఖ సహాయమంత్రి రాజ్‌భూషణ్ చౌదరి.. వైఎస్సార్‌సీపీ ఎంపీ అయోధ్యరామిరెడ్డి ప్రశ్నకు సమాధానమిచ్చారు.

ఏపీలో ప్రభుత్వ వైద్యకళాశాలల ప్రైవేటీకరణతో పేదలకు అన్యాయం

రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ గొల్ల బాబూరావు



ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా మంజూరైన ప్రభుత్వ వైద్యకళాశాలలను ప్రైవేటుపరం చేయడంపై వైఎస్సార్‌సీపీ ఎంపీ గొల్ల బాబూరావు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యసభలో సోమవారం 'ద హెల్త్ సెక్యూరిటీ సెస్, నేషనల్ సెక్యూరిటీ సెస్ బిల్లు–2025'పై జరిగిన చర్చలో పాల్గొన్న ఆయన.. బిల్లుకు మద్దతు తెలుపుతూనే, ఏపీలోని చంద్రబాబు ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజావ్యతిరేక నిర్ణయాలను ఎండగట్టారు. ఏపీలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 10 ప్రభుత్వ వైద్యకళాశాలలకు నేషనల్ మెడికల్ కమిషన్ నుంచి అనుమతులు సాధించినట్లు గుర్తుచేశారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఆ కళాశాలలను పీపీపీ పద్ధతిలో ప్రైవేటుపరం చేయడానికి ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటుకు కట్టబెట్టడం దారుణమని, దీనివల్ల వైద్యవిద్యను అభ్యసించాలనుకునే పేద, మధ్య తరగతి విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కాలేజీల్లో చదివే వైద్యులు గ్రామీణ ప్రాంతాల్లో సేవలందిస్తారని, ప్రైవేటీకరణ వల్ల ఆ అవకాశం లేకుండా పోతుందని, పేదలకు అన్యాయం జరుగుతుందని సభ దృష్టికి తెచ్చారు. పాన్ మసాలా, ఇతర ఉత్పత్తులపై సెస్ విధించడాన్ని స్వాగతిస్తూనే.. ఆ నిధుల వినియోగంపై కేంద్రం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ఐదేళ్లలో కేంద్రం సుమారు రూ.19.4 లక్షల కోట్లను సెస్ రూపంలో వసూలు చేసిందని చెప్పారు. సెస్, సర్‌చార్జీల ద్వారా వచ్చే ఆదాయాన్ని రాష్ట్రాలతో పంచుకోవడంలేదని గుర్తుచేశారు. ఆరోగ్యం అనేది రాష్ట్ర పరిధిలోని అంశం కాబట్టి, హెల్త్ సెక్యూరిటీ సెస్ ద్వారా వచ్చే ఆదాయంలో రాష్ట్రాలకు వాటా ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

48 గంటల్లో ఫుల్ రీఫండ్

ప్రయాణికులకు ఊరట కలిగించే విధంగా విమాన టికెట్ రద్దు రీఫండ్ నియమాలను డీజీసీఏ పూర్తిగా సవరిస్తున్నట్లు కేంద్ర పౌరవిమానయానశాఖ సహాయమంత్రి మురళీధర్ మోహల్ చెప్పారు. కొత్త నియమావళి ప్రకారం టికెట్ బుక్ చేసిన 48 గంటల్లోపు రద్దుచేసుకుంటే ఎలాంటి ఛార్జీలు విధించకుండా పూర్తి రీఫండ్ చెల్లిస్తారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ గొల్ల బాబూరావు ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. రీఫండ్ అవసరం లేకపోతే ఫ్లైట్ డేట్ చేంజ్ లేదా ఫ్లైట్ చేంజ్ కూడా చేసుకోవచ్చన్నారు. ఈ ఫ్లైట్‌లో కాకుండా కొత్తగా మరో ఫ్లైట్‌లో వెళ్లాలనుకుంటే పాత టిక్కెట్ ధర కంటే ఎక్కువ ఉంటే.. ఎక్కువ ఉన్న మొత్తాన్ని మాత్రం చెలిస్తే సరిపోతుందన్నారు. ఎయిర్‌లైన్ వెబ్‌సైట్ నుంచి నేరుగా బుక్‌చేస్తేనే 48 గంటల్లో ఫ్రీ క్యాన్సిల్, మొత్తం రీఫండ్ వస్తుందని చెప్పారు. ఏజెంట్ లేదా థర్డ్ పార్టీ పోర్టల్ ద్వారా బుక్ చేస్తే రీఫండ్ బాధ్యత పూర్తిగా ఎయిర్‌లైన్స్‌దేనని తెలిపారు. 21 రోజుల్లో రీఫండ్ ప్రాసెస్‌ను పూర్తిచేయాలని ఆదేశాలిస్తున్నట్లు కేంద్రమంత్రి చెప్పారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP).,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

వింటర్‌ఫుల్ వంజంగి

ప్రముఖ పర్యాటక కేంద్రం వంజంగి హిల్స్‌లో ప్రకృతి అందాలు పర్యాటకులను మైమరిపిస్తున్నాయి. పాలసముద్రాన్ని తలపించేలా మంచు అందాలు అబ్బురపరుస్తున్నాయి. ఈ ప్రాంతానికి వచ్చిన పర్యాటకులు తనవితీరా ఆస్వాదిస్తూ పరవశించి పోతున్నారు. – పాడేరు

కమ్మని రుచులు.. కలసి తింటే..!

ఆర్.పాంపల్లె, ఉయ్యాలవాడ సమీపంలో పత్తి పొలాల్లో సామూహిక భోజనం చేస్తున్న కూలీలు

ఉరుకుపరుగుల జీవితాలు.. ఇంట్లో నలుగురు ఉన్నా కలసి తినేదెప్పుడో. అందరూ ఉన్నా టీవీ చూస్తూ.. ఫోన్ మాట్లాడుతూనే భోజనం పూర్తి చేసేవారందరో ఉన్నారు. రుచి ఎరుగరు.. కబుర్లు ఉండవు. మరి కొందరు ఆకలేస్తే అప్పటికప్పుడు ఆన్‌లైన్ ఆర్డర్లు తెప్పించుకోవడం తినేయడం జరుగుతోంది. కానీ పంట పొలాల్లో కూలీలు తమ కష్టాన్ని మైమరిచి కాసేపు కబుర్లు చెప్పకుంటూ.. రుచులు పంచుకుంటూ భోజనం ఆరగించే దృశ్యాలే కమనీయమే. పచ్చడి అన్నమైనా సరే ఆ రుచే వేరు. ప్రస్తుతం మిరప, కంది, సీడుపత్తి, పప్పుశనగ, తదితర పంట పొలాల్లో కలుపులు, పండు మిరప కాయల కోతలు కొనసాగుతున్నాయి. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ, చింతకుంట్ల, రుద్రవరం, సంజామల, తదితర గ్రామాల నుంచి మహిళా వ్యవసాయ కూలీలు మండలంలోని పలు గ్రామాలకు ట్రాక్టర్లు, ఆటోల్లో చేరుకుంటున్నారు. ఉదయానే వస్తూ వెంట సద్దులు తెచ్చుకుంటున్నారు. మధ్యాహ్నం వేళ అందరూ ఒక చోట చేరి సద్దులు (క్యారేర్లు) తిని కాస్త సేద తీరి ఆ వెంటనే పనుల్లోకి వెళ్లిపోతున్నారు.

– ఉయ్యాలవాడ

క్లుప్తంగా...

శ్రీశైలం ప్రాజెక్టుకు వెంటనే మరమ్మతులు చేయాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య డిమాండ్

సాక్షి, అమరావతి: శ్రీశైలం ప్రాజెక్టుకు తక్షణమే మరమ్మతులు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఈ విషయమై సీఎం చంద్రబాబుకు రాసిన లేఖను ఈశ్వరయ్య సోమవారం మీడియాకు విడుదల చేశారు. శ్రీశైలం జలాశయం ప్లంజ్‌పూల్ వద్ద ఏర్పడిన భారీ గోతులకు, కాంక్రీట్ సిలిండర్లకు వెంటనే మరమ్మతులు చేయాలని కోరారు.

టీచర్లకు సీసీఎల్స్ ఇవ్వాలి

స్కూల్ టీచర్స్ అసోసియేషన్ డిమాండ్

సాక్షి, అమరావతి: సెలవు రోజుల్లో పదో తరగతి విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధిస్తున్న ఉపాధ్యాయులకు కాంపన్సేటరీ క్యాజువల్ లీవ్స్(సీసీఎల్స్) మంజూరు చేయాలని ఏపీ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ సోమవారం డిమాండ్ చేసింది. అలాగే పనివేళల సమయాన్ని కూడా మార్చాలని రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాడిశెట్టి శ్రీనివాసులు, తమ్మినాన చందనరావు ప్రభుత్వానికి ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

ఎస్సీ హాస్టళ్లకు రూ.21 కోట్లు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సాంఘిక సంక్షేమ(ఎస్సీ) హాస్టళ్లలో మౌలిక వసతుల కల్పనకు అదనంగా రూ.21 కోట్లను ఖర్చు చేసేందుకు ప్రభుత్వం పరిపాలన అనుమతి ఇచ్చింది. ఈ మేరకు సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి ఎం.మల్లికార్జున నాయక్ సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఈ రూ.21 కోట్లను ఎస్సీ హాస్టళ్లలో మరుగుదొడ్ల నిర్మాణం, ఆర్వో ప్లాంట్లు, దోమ తెరలు ఏర్పాటుకు ఖర్చు చేయనున్నట్టు పేర్కొన్నారు.

పంట వ్యర్థాలను పొలంలోనే కలియదున్నడం మేలు

రాష్ట్ర వ్యవసాయ సంచాలకులు

సాక్షి, అమరావతి: పంట వ్యర్థాలను కాల్చకుండా.. పొలాల్లోనే కలియదున్నడం వల్ల మేలు జరుగుతుందని రాష్ట్ర వ్యవసాయ సంచాలకులు మనజీర్ జిలాని సమూన్ సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. ప్రస్తుతం ఖరీఫ్ వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. ఇప్పటికే కోతలు పూర్తయిన చోట కొందరు రైతులు వరి దుబ్బులను కాలుస్తున్నారని చెప్పారు. దాని వల్ల వచ్చే పొగతో పర్యావరణంతో పాటు పొలాలకు కూడా నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. దీనిపై రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని గ్రామ సచివాలయాల సిబ్బందికి ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు.

రాజ్ కేసిరెడ్డి బెయిల్ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్

11న తీర్పు వెలువరిస్తామన్న హైకోర్టు

సాక్షి, అమరావతి : మద్యం అక్రమ కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ కేసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యంలో తీర్పును హైకోర్టు రిజర్వ్ చేసింది. ఈ నెల 11న తీర్పు వెలువరిస్తామని స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాజ్ కేసిరెడ్డి బెయిల్ పిటిషన్‌పై గత వారం వాదనలు విన్న న్యాయమూర్తి ఇరుపక్షాలను రాతపూర్వక వాదనలు సమర్పించాలని ఆదేశించిన విషయం తెలిసిందే. సోమవారం ఈ వ్యాజ్యం విచారణ సందర్భంగా సీఐడీ సిట్ తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా, రాజ్ కేసిరెడ్డి తరపు న్యాయవాది యుగంధర్‌రెడ్డి హాజరయ్యారు. కోర్టు ఆదేశాల మేరకు రాతపూర్వక వాదనలను సమర్పించామని చెప్పారు. దీంతో న్యాయమూర్తి ఆ విషయాన్ని రికార్డ్ చేసి తీర్పును రిజర్వ్ చేస్తున్నట్టు ప్రకటించారు.

ఈ నెల 14 వరకు జాతీయ హస్తకళా వారోత్సవాలు

రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ వెల్లడి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సోమవారం ప్రారంభమైన జాతీయ హస్తకళా వారోత్సవాలు ఈ నెల 14వ తేదీ వరకు జరుగుతాయని రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ (ఏపీహెచ్‌డీసీ) చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ తెలిపారు. సోమవారం విజయవాడ గాంధీనగర్‌లోని లేపాక్షి ఎంపోరియంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. జాతీయ హస్తకళా వారోత్సవాల్లో భాగంగా ఏపీహెచ్‌డీసీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. ఈ నెల 10న వైఎస్సార్ కడప జిల్లా వోనిపెంటలో గురుశిష్య హస్త్ శిల్ప్ ప్రశిక్షణ్ ప్రోగ్రామ్ (జీఎస్‌హెచ్‌పీపీ) కింద 30 మంది ఇత్తడి, కంచులోహ హస్త కళాకారులకు శిక్షణ ప్రారంభిస్తామన్నారు. ఈ నెల 12న పల్నాడు జిల్లా దుర్గిలో 30 మంది కళాకారులకు డిజైన్ అభివృద్ధిపై వర్క్‌షాప్, 13న తిరుపతి జిల్లా మాధవమాల, శ్రీకాళహస్తిలో కలప చెక్క కళాకారులకు టూల్‌కిట్ల పంపిణీ, 14న అనకాపల్లి జిల్లా కేడీ పేటలో 50 మంది కళాకారులకు టూల్‌కిట్ల పంపిణీ, డిసెంబర్ 15నుంచి రాజమహేంద్రవరంలో 40 మంది కళాకారులతో ఏడు రోజుల గాంధీ శిల్ప్ బజార్, 17న నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో 50 మంది శిలా శిల్ప కళాకారులకు టూల్‌కిట్ల పంపిణీ ఉంటుందని వివరించారు.

ముగ్గురికి జాతీయ అవార్డులు

భారత ప్రభుత్వ జౌళి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 2023, 2024 సంవత్సరాలకు సంబంధించి హస్తకళా అవార్డుల ప్రదానోత్సవం ఈ నెల 9న ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరగతుందన్నారు. మన రాష్ట్రం నుంచి డి.శివమ్మ (తోలు బొమ్మలాట)కు శిల్పగురు అవార్డు, గోర్స సంతోష్ (ఏటికొప్పాక బొమ్మలు)కు జాతీయ అవార్డు–2024, పి.విజయలక్ష్మి (కలంకారీ హ్యాండ్ పెయింటింగ్)కు జాతీయ హస్తకళా అవార్డు–2023లను రాష్ట్రపతి చేతుల మీదుగా అందించనున్నట్టు హరిప్రసాద్ వెల్లడించారు. విలేకరుల సమావేశంలో రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎం.విశ్వ, లేపాక్షి మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీనాథ్ పాల్గొన్నారు.

గెడ్డపాలెంలో బయటపడిన బౌద్ధ శిల్పాలు

6వ శతాబ్దం నాటివిగా గుర్తింపు

ఎస్.రాయవరం: అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం గెడ్డపాలెం గ్రామానికి ఆనుకుని ఉన్న కొండపై అరుదైన బౌద్ధ శిల్పాలు బయటపడ్డాయని రాష్ట్ర పురావస్తు, ప్రదర్శన శాలల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.ఫల్గుణరావు తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు సోమవారం గెడ్డపాలెం గ్రామానికి వచ్చిన పురావస్తు బృందం శిల్పాలను పరిశీలించింది. ఈ స్థలం భారత బౌద్ధ చరిత్రలో మరో సువర్ణాధ్యాయంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో రాతిని చెక్కి రూపొందించిన గుహలు, బుద్ధుని శిల్పాలు బయటపడ్డాయన్నారు. నిపుణుల పరిశీలన మేరకు ఈ గుహలు, శిల్పాలు క్రీ.శ.6వ శతాబ్దానికి చెందినవి అయి ఉంటాయని చెప్పారు. శిల్పాల ప్రత్యేకత, వాటి కళాత్మక నైపుణ్యం ఇవన్నీ ఆ కాలపు బౌద్ధ శిల్ప సంపద ఎంత ఉన్నత స్థితిలో ఉందనే విషయాన్ని సూచిస్తుందన్నారు. గెడ్డపాలెం గ్రామంలో బయటపడిన ఈ కొత్త స్థలం మన బౌద్ధ వారసత్వంలో మరొక అమూల్యరత్నంగా నిలుస్తోందని అభిప్రాయపడ్డారు. పరిశీలన బృందంలో టెక్నికల్ అసిస్టెంట్ కె.శ్రీనివాసరావు, ఆర్కియాలజికల్ అసిస్టెంట్ డి.విశ్వేశ్వరరావు ఉన్నారు.

గెడ్డపాలెంలో బయటపడిన పురాతనమైన బుద్ధుని శిల్పం

హాజీలకు అసౌకర్యాలు పునరావృతం కానివ్వొద్దు

ఆంధ్రప్రదేశ్ హజ్ కమిటీ చైర్మన్ హసన్

సాక్షి, అమరావతి: హజ్–2025 యాత్రలో తలెత్తిన అసౌకర్యాలు, సమస్యలను హజ్–2026 యాత్రలో పునరావృతం కాకూడదని ఆంధ్రప్రదేశ్ హజ్ కమిటీ చైర్మన్ షేక్ హసన్‌బాషా అన్నారు. హజ్ కమిటీ విజయవాడలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విజయవాడ హజ్ హౌస్ స్థలం, భవన నిర్మాణానికి ప్రభుత్వ సహకారం తీసుకుంటామన్నారు. విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ అభివృద్ధి, ప్రతి హాజీకి ప్రభుత్వ సహకారం అందేలా చూడడం వంటి అంశాలపై చర్చించినట్లు చెప్పారు. సమావేశంలో హజ్ కమిటీ డైరెక్టర్లు మహబూబ్ బాషా, మీరా సాహెబ్, మీర్జా అబీద్ హుస్సేన్, ఎస్.బాబా ఫక్రుద్దీన్, పఠాన్ ఖాదర్ ఖాన్, ఎస్.రేష్మా పర్వీన్, షేక్ అబ్దుల్ హుస్సేన్, నూరి మన్సూర్ అలీ, సయ్యద్ షాజి సుల్తాన్ ముసవి, షేక్ జబీన్, హజ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గౌస్ పీర్ పాల్గొన్నారు.

కేంద్రమంత్రి రామ్మోహన్‌కు ఎంపీల భజన

పార్టీ తరుపున మా వెర్షన్ మేం చెబుతున్నాం

సాక్షి, న్యూఢిల్లీ: పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు వైఫల్యంపై దేశవ్యాప్తంగా నిరసనలు మిన్నంటుతున్న సమయంలో.. ఆయనను జాకీలు పెట్టి లేపేందుకు టీడీపీ ఎంపీలు నడుంబిగించారు. ఇందుకోసం రెండు రోజుల క్రితం 'ఎక్స్'లో అనుకూలమైన ట్వీట్లు చేయగా.. సోమవారం రాత్రి ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయులు, బీకే పార్థసారథి, నాగరాజు, ప్రసాదరావు, లక్ష్మీనారాయణ, మాగుంట శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ ఎంపీలు సాన సతీష్, బీద మస్తాన్‌రావు మీడియా సమావేశాన్ని నిర్వహించారు. రెండు రోజుల క్రితం కేంద్ర మంత్రి కేవలం ఎల్లో మీడియాను పిలిపించుకుని ఆయనకు నచ్చిన వార్తలు వచ్చేలా ప్లాన్ చేసుకున్నారు. ఇప్పుడు మీడియా సమావేశం బాధ్యతను ఎంపీలకు అప్పజెప్పారు. ఈసందర్భంగా లావు శ్రీకృష్ణదేవరాయులు మాట్లాడుతూ.. చాలా మంది చాలా రకాలుగా రామ్మోహన్ నాయుడుపై బురద జల్లుతున్నారన్నారు. సోషల్ మీడియాలో వ్యాఖ్యలు చేసేవారికి సరైన అవగాహన ఉండదని, వాళ్లు ముందూ వెనకా తెలియకుండా మాట్లాడతారని విమర్శించారు. ప్రతిపక్ష పార్టీలు, సోషల్ మీడియా వాళ్లు పూర్తి వివరాలు తెలుసుకోకుండా బురద జల్లుతున్నట్లు చెప్పుకొచ్చారు. దేశవ్యాప్తంగా మంత్రిని రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు, కేంద్ర మంత్రిగా సమాధానం చెప్పాల్సింది రామ్మోహన్ కదా? మీరెందుకు చెబుతున్నారని మీడియా ప్రశ్నించగా.. ''పార్టీ పరంగా మేం చెప్పాల్సింది మేం చెబుతున్నాం, కేంద్ర మంత్రిగా ఆయన సమాధానం చెప్పాల్సిన చోట అంటే రాజ్యసభలో అందరికీ సమాధానం చెప్పారు. మేం మా వెర్షన్ మేం చెప్పాలి కాబట్టి మేం చెబుతున్నాం '' అని లావు చెప్పుకొచ్చారు.

మన్యంలో చలి పులి

మన్యంలో చలి వణికిస్తోంది. కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో పాటు దట్టంగా మంచుకురుస్తోంది. ఈ కారణంగా చలి తీవ్రత గణనీయంగా పెరిగింది. అల్లూరి జిల్లా అరకులోయలో 3.6 డిగ్రీలు, డుంబ్రిగూడ, జి.మాడుగులలో 3.9, హుకుంపేటలో 4.6 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తెల్లవారి 10 గంటలు దాటే వరకూ మంచు తెరలు వీడకపోవడంతో సూర్యోదయం కానరావడం లేదు. వాహనచోదకులు లైట్లు వేసుకుని వాహనాలు నడపాల్సి వస్తోంది. - చింతపల్లి

మైక్రో క్రెడిట్ స్పెషల్ ఆఫీసర్‌గా చైత్ర వర్షిణి

సాక్షి, అమరావతి: పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పని చేస్తున్న చైత్ర వర్షిణిని గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కార్యాలయంలో మైక్రో క్రెడిట్ స్పెషల్ ఆఫీసర్‌గా నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కార్యాలయం ద్వారా అమలు చేసే పథకాలను చైత్ర వర్షిణి పర్యవేక్షిస్తారని పేర్కొంది. కాగా, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఆఫీసులో మైక్రో క్రెడిట్ స్పెషల్ ఆఫీసర్ అనే పోస్టు కొత్తదని, దాని గురించి తొలిసారి వింటున్నామని ఆ కార్యాలయ అధికారులు చెబుతున్నారు.

పవన్ వ్యాఖ్యల్ని వక్రీకరించారు

తెలంగాణ దిష్టి తగిలిందన్న వ్యాఖ్యలపై స్పందించిన ఏపీ మంత్రి నాదెండ్ల

సాక్షి, న్యూఢిల్లీ: కోనసీమకు తెలంగాణ వారి వల్ల దిష్టి తగిలిందని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సోమవారం స్పందించారు. పవన్ వ్యాఖ్యల్ని కొందరు వక్రీకరించారంటూ చెప్పుకొచ్చారు. రైతులతో మాట్లాడిన సందర్భంలో మాత్రమే ఆయన అలా అన్నారని, ఉద్దేశపూర్వకంగా కాదు అని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలపై పవన్‌కు నమ్మకం, ప్రేమ ఉందని తెలిపారు. ఇది రాజకీయం చేయాల్సిన అంశం కాదని మంత్రి చెప్పారు. ఢిల్లీ పర్యటనకు వచ్చిన మంత్రి మనోహర్ కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార ప్రజాపంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని కలిశారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ భవన్‌లో మంత్రి మీడియాతో మాట్లాడిన సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారు. 25 రోజుల్లో 2.69లక్షల మంది రైతుల నుంచి 17.37 లక్షల మెట్రిక్ టన్నుల వరిని కొనుగోలు చేసినట్లు తెలిపారు. పీడీఎస్ కార్యకలాపాలకు మద్దతు ఇవ్వడానికి రాష్ట్రంలో ఆహార ధాన్యాల నిల్వ కోసం గోడౌన్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం మద్దతు ఇస్తుందని మంత్రి చెప్పారు.

రామవరప్పాడులో స్పీకర్ నూతన క్యాంప్ ఆఫీస్

నెలకు రూ.లక్ష అద్దె, రూ.5 వేలు నిర్వహణ ఖర్చులు

ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

సాక్షి, అమరావతి: విజయవాడ రామవరప్పాడులోని ఎస్ఎల్‌వీ గ్రీన్ మీడోస్ విల్లా నంబర్ 76ను అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు కొత్త అధికారిక నివాసం, క్యాంప్ ఆఫీసుగా ప్రభుత్వం గుర్తించింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీనికి నెలకు రూ.లక్ష రూపాయల నివాస భత్యం, రూ.5 వేలు క్యాంప్ ఆఫీస్ నిర్వహణ భత్యం కింద చెల్లించనున్నట్లు ప్రకటించింది. ఈ ఏడాది డిసెంబర్ ఒకటో తేదీ నుంచి ఉత్తర్వులు అమల్లోకి వస్తాయని పేర్కొంది. ఇంతకుముందు తాడేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రెయిన్‌బో విల్లాస్‌లోని విల్లా నంబర్ 2ను స్పీకర్ అధికారిక నివాసంగా ప్రభుత్వం గుర్తించి, అదే అలవెన్సులను అమలు చేసింది. అయితే, స్పీకర్ నూతన నివాసం, క్యాంప్ ఆఫీసును గుర్తించి అధికారికంగా ప్రకటించాలని ఆయన కార్యాలయం గత నెలలో ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు రామవరప్పాడులోని కొత్త విల్లాను అధికారిక గృహంగా ప్రభుత్వం ప్రకటించింది.

కుప్పంలో కాపుభవన్‌కు భూమి కేటాయింపు

సాక్షి,అమరావతి: చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో కాపు భవన్ నిర్మాణానికి భూమి కేటాయిస్తూ ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కుప్పం మండలం పలర్లపల్లె గ్రామంలో మూడు సర్వే నంబర్లలో మొత్తం 2.46 ఎకరాల భూమి కేటాయించారు. ఇందులో సర్వే నంబర్ 22/1లో 27 సెంట్లు, సర్వే నంబర్ 22/3లో ఎకర 90 సెంట్లు, 22/3లో29 సెంట్లు కలిపి మొత్తం 2.46 ఎకరాల భూమిని కేటాయించారు.

కోటి సంతకాల కార్యక్రమాలను ప్రజలకు చేరవేయండి

వైఎస్సార్‌సీపీ జిల్లా మేనేజర్లు, డిజిటల్ మేనేజర్లకు ఎమ్మెల్సీ అప్పిరెడ్డి సూచన

అమరావతి: ప్రభుత్వ ప్రైవేటు మెడికల్ కళాశాలలను ప్రైవేటుకు అప్పగించాలన్న చంద్రబాబు ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని వైఎస్సార్‌సీపీ జిల్లా మేనేజర్లు, అసెంబ్లీ నియోజకవర్గ డిజిటల్ మేనేజర్లకు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి చెప్పారు. వైఎస్సార్‌సీపీ జిల్లా మేనేజర్లు, అసెంబ్లీ నియోజకవర్గ డిజిటల్ మేనేజర్లతో సోమవారం ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ ముగింపు కార్యక్రమాలపై వారికి అవగాహన కల్పించారు. కోటి సంతకాల సేకరణకు సంబంధించి 9వ తేదీ నుంచి 17వ తేదీ వరకు జరిగే ప్రతి కార్యక్రమాన్ని సోషల్ మీడియాలో లైవ్ ఇచ్చి ప్రజలకు చేరువ చేయాలని వారికి చెప్పారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేలా జరుగుతున్న ఈ పోరాటాన్ని మరింత ఉధృతంగా ముందుకు తీసుకెళ్లాలని అన్నారు.

17.37 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు

పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో రైతుల నుంచి 17.37 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఢిల్లీలో కేంద్ర ఆహార, పౌర సరఫరాలు, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషితో సోమవారం ఆయన భేటి అయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. కేంద్రం నిర్దేశించిన 51 లక్షల టన్నుల కొనుగోలులో రోజుకు 90 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఇప్పటివరకు సుమారు 2,69,315 మంది రైతుల నుంచి రూ.4,119.89 కోట్ల విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేయగా రూ.3,907.94 కోట్ల చెల్లింపులు చేశామన్నారు. ఏడున్నర కోట్ల గోనె సంచులను అందుబాటులో ఉంచినట్లు నాదెండ్ల చెప్పారు. 10 శాతం బ్రోకెన్ రైస్‌తో సీఎంఆర్‌ను అమలుచేసినందుకు కేంద్రమంత్రి అభినందనలు తెలిపారన్నారు. ఈ క్రమంలో ఎఫ్‌సీఐలో అదనపు గోడౌన్లు ఏర్పాటు, వచ్చే జనవరి నుంచి ఆంధ్రప్రదేశ్‌కు గోధుమలు, అదనపు రాగులు కేటాయించేందుకు కేంద్రమంత్రి సుముఖత వ్యక్తంచేశారన్నారు. తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కోనసీమ, కాకినాడ, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ధాన్యం ఉత్పత్తి అధికంగా ఉండటంతో, వీలైనంత త్వరలో పీపీపీ మోడల్‌లో ఆధునిక గోడౌన్‌లు ఏర్పాటుచేసేందుకు కేంద్ర అనుమతిచ్చిందని నాదెండ్ల చెప్పారు.

నేను.. మీ శిరోధైర్యాన్ని!

- నా మాట విని.. నన్ను ధరించండి...
- రక్షణతో పాటు రొక్కం కూడా మిగులుతుంది
- చెల్లించిన మూల్యం ఎంతో తెలుసా రూ.3.50 కోట్లు
- పదకొండు నెలల్లో 9,540 కేసులు

కర్నూలు: నాకే బాధేస్తోంది... ఇలా నా గురించి, నా అవసరం గురించి మీతో చెప్పక తప్పడం లేదు. జిల్లాలో నన్ను విస్మరిస్తున్న తీరును పోలీసులు విస్తృతంగా అవగాహన, ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ మార్పు కనిపించకపోవడంతో తట్టుకోలేక మీ ముందుకు వచ్చి నా గోడు వినిపిస్తున్నా.. ఇంతకూ నేనెవరనేగా... ఈ పాటికి మీకు అర్థమై ఉంటుంది. మీ ప్రయాణంలో మీ తలకు రక్షణగా ఉండే హెల్మెట్‌ను. మీ ప్రాణం విలువ మీ కంటే నాకే బాగా తెలుసు. రహదారి ప్రమాదంలో అయినవాళ్లను కోల్పోయిన వారి కుటుంబాలను చూస్తే గుండె తరుక్కుపోతోంది. ఇదంతా ఎందుకంటే ఇటీవల నన్ను ధరించని వారు జిల్లాలో అధికంగా ప్రాణాలు కోల్పోతున్నారు. పోలీసులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నా తీరు మార్చుకోకపోవడంతో ఎంతో బాధ కలుగుతోంది. అనాలోచిత చర్యల ద్వారా జరిగిన ప్రమాదాల్లో యువకులే అధికంగా ప్రాణాలు కోల్పోతున్నారు. ఇందులో పెళ్లి కాని వారు కొందరు ఉంటే పెళ్లయి ఏడాది, రెండేళ్లకే అనంత లోకాలకు చేరినవారు మరికొందరు. ఇందులో ఏ ఒక్కరూ నా విలువను గుర్తించినా నేడు వారి కుటుంబీకులతో ఆనందంగా ఉండేవారు. ఇప్పటికైనా మీరు మారండి.. నా మాట వినండి.. నన్ను తలకెక్కించుకోండి.

తలకు పెట్టుకుంటే ప్రాణం దక్కించుకున్నట్లే...

ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు నన్ను తప్పని సరిగా ధరించాలి. ప్రమాదం జరిగినప్పుడు అది ఊగి కింద పడకుండా బెల్టు పెట్టుకోవాలి. రహదారి భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా రూపొందించే ఐఎస్ఐ మార్కును పరిశీలించి వినియోగించండి. దురదృష్టవశాత్తు రోడ్డు ప్రమాదం జరిగితే తల దెబ్బ తగలకుండా ప్రాణాలు పోయే పరిస్థితి నుంచి తప్పించుకోవచ్చు. మీ శరీర భాగంలో నేను అండగా ఉండే తలే కీలకం. ఇందులోనూ మెదడు చాలా సున్నితమైంది. దెబ్బ తగలకుండా నేను కాపాడతా.. అందుకే నన్ను ధరించండి.. ధైర్యంగా ఉండండి. నన్ను ధరిస్తే జుట్టు ఊడిపోతుందనేది కేవలం అపోహనే. ఈ విషయం ఇప్పటికే వైద్య పరంగా రుజువైంది. నేను రక్షగా ఉంటే జుట్టు కాలుష్యం బారిన పడదు. జుట్టు ఊడుతుందన్న భయంతో మహిళలు నన్ను ధరించేందుకు వెనుకాడుతుంటారు. ఇది తగదని గుర్తుంచుకోండి. ముఖం పూర్తిగా కప్పి ఉంచేవి వాడటం వల్ల తలకు, ముఖానికి రక్షణగా ఉంటా.

చెల్లించిన మూల్యం ఎంతో తెలుసా?

నన్ను వినియోగించకపోవడం వల్ల పోలీసులు జిల్లాలో 9,540 కేసులు నమోదు చేశారు. అపరాధ రుసుం రూపంలో పదకొండు మాసాల కాలంలో మీరు రూ.3.50 కోట్లు మూల్యం చెల్లించారు. నన్ను ధరిస్తే రక్షణతో పాటు సొమ్ము కూడా మిగులుతుందన్న వాస్తవాన్ని గ్రహించుకోండి.

ఇట్లు...
మీ హితం కోరే హెల్మెట్

బిడ్డ పుట్టగానే చుట్టాలూ పక్కాలూ అందరి ముఖాల్లో సంతోషమే. బిడ్డ కాళ్లూ వేళ్లూ... ఇలా అవయవాలన్నీ సరిగా ఉన్నాయో లేదో చూసి అంతా బాగుంటే పండంటి బిడ్డ అంటూ ఆనందిస్తారు, ఆశీర్వదిస్తారు. ఎదుగుతున్నకొద్దీ ఆ చిన్నారి కనబరుస్తున్న తెలివితేటలను చూసి ఇంకాస్త మురిసిపోతుంటారు. కానీ ఇలా ఎదిగే సమయంలో ఏవైనా మానసిక సమస్యలు కనిపిస్తే మాత్రం ఆ తల్లిదండ్రుల వేదన చెప్పనలవి కాదు. ఆ బాధను మాటల్లో వర్ణించడానికి వీలు కాదు. సాధారణంగా ఇలాంటి శారీరక వైకల్యాలూ, లేదా మానసికమైన ఎదుగుదల లోపాలూ కనిపించే పిల్లలు మేనరికపు వివాహాల్లోని జంటలకే పుట్టడం ఎక్కువ. అందుకే డాక్టర్లు కూడా దగ్గరి సంబంధాలు వద్దనే సూచిస్తుంటారు. ఎందుకు? మేనరికపు వివాహాల్లో ఇలా ఎందుకిలా జరుగుతుంది, ఒకవేళ మేనరికపు పెళ్లిళ్లు తప్పనప్పుడు బిడ్డ పుట్టకముందూ, కడుపున పడ్డ తర్వాత చేయించుకోవాల్సిన పరీక్షలూ, తీసుకోవాల్సిన జాగ్రత్తలేమిటనే పలు అంశాలను తెలుసుకునేందుకు ఉపయోగపడే కథనమిది.

ప్రతీకాత్మక చిత్రం

మేనరికాల జోడు... భావితరాలకు చేటు!

డా॥ శ్రీజ గుర్రాల
సీనియర్ కన్సల్టెంట్
యూరోగైనకాలజిస్ట్

ఓ బిడ్డలో లోపం వచ్చిందంటే ... తల్లిదండ్రులిద్దరిలోంచి వచ్చిన జన్యువులే (జీన్స్) సాధారణంగా ఇందుకు కారణం. తల్లిదండ్రులకు చెందిన ఆ జన్యువుల్లో ఏ లోపాలూ లేకపోతే ఆరోగ్యకరమైన అవయవాలే బిడ్డలకు వస్తాయి. సాధారణంగా ఒక లోపం వచ్చిందంటే... తల్లిదండ్రుల్లో ఎవరిదో ఒకరి జీన్ లోపభూయిష్టంగా ఉండవచ్చు. అయితే ఆ లోపం తల్లిదండ్రుల్లో ఎవరినుంచి వచ్చిందో చెప్పడం కష్టం. ఇది ఎలా జరుగుతుందంటే... ఓ అవయవానికి సంబంధించి తల్లిదండ్రులిద్దరి నుంచీ జీన్స్ బిడ్డకు వస్తాయి. ఈ రెండింటిలో ఒకదాంట్లో లోపం ఉందనుకోండి. అప్పుడు అదే అవయవానికి సంబంధించిన మంచి జీన్... లోపమున్న జీన్‌ను డామినేట్ చేసి... ఆ లోపం రాకుండా నివారిస్తుంది. ఒకవేళ తల్లిదండ్రులిద్దరి జన్యువుల్లోనూ లోపం ఉంటే...? అప్పుడు ఆ బిడ్డకు ఆ అవయవానికి సంబంధించిన లోపం వస్తుంది. ఇప్పుడు తల్లిదండ్రులిద్దరూ ఎలాంటి దగ్గరి సంబంధాలూ లేని వేర్వేరు కుటుంబాలకు చెందిన వారనుకుందాం. అప్పుడు తల్లిదండ్రుల్లో ఒకరిలో జన్యులోపం ఉంటే లోపం లేని మరో జన్యువు దాన్ని డామినేట్ చేసి లోపాన్ని నివారిస్తుంది. అయితే ఒకే కుటుంబాల వారిలో (మేనరికాల్లో అదే కుటుంబాల వారి మధ్య పెళ్లి అవుతుంది కాబట్టి) ఇద్దరి జన్యువులూ లోపంతోనే ఉండే అవకాశముంటుంది కాబట్టి ఆ లోపం వచ్చే అవకాశాలు పెరుగుతాయి.

అందుకే దగ్గరి సంతతికి చెందిన... దగ్గరి సంబంధం కలిగిన వ్యక్తుల మధ్య పెళ్లిళ్లను ఆధునిక వైద్యశాస్త్రం అంతగా ప్రోత్సహించదు. మరి ఎలాంటి దగ్గరి సంబంధాలు లేనప్పుడు ఇలాంటి అవకరాలకు అవకాశం లేదా? ఉంటుంది. కానీ... దూరపు సంబంధాల్లో ప్రతి 400 జంటల్లో ఒకరికి లోపమున్న బిడ్డ పుట్టే అవకాశం ఉంటే... దగ్గరి సంబంధాల విషయంలో కేవలం 200 జంటల్లోనే లోపమున్న బిడ్డ పుట్టేందుకు ఛాన్సులెక్కువ. అందుకే ఆరోగ్యకరమైన బిడ్డ కోసం దూరపు సంబంధాలనూ, వీలైతే అసలు రక్తసంబంధాలే లేని ఇతర కుటుంబాల వారితో వివాహాలను ఆధునిక వైద్యశాస్త్రం ప్రోత్సహిస్తోంది.

రక్తసంబంధాల్లోనే వివాహాలకు కారణాలివి...

ఆర్థిక కారణాలూ, తెలిసినవారి కుటుంబంలో అయితే బిడ్డ బాగోగులు తెలుస్తాయనే ఈ రెండు అంశాలే దగ్గరి బంధుత్వాల్లో పెళ్లిళ్లకు కారణం. అందునా... ప్రధానంగా ఆర్థిక అంశాలే బాగా దగ్గరి సంబంధాలు చేసుకునేలా చాలావరకు ఆ కుటంబాలవారిని ప్రభావితం చేస్తుంటాయి. మేనత్త /మేనమామ పిల్లలను చేసుకుంటే ఆస్తి బయటివారికి చెందకుండా... ఆస్తిలో ఆస్తి కలుస్తుందనే అంశమే చాలా సందర్భాల్లో ఇలాంటి పెళ్లిళ్లను ఎక్కువగా ప్రోత్సహిస్తుంది. ఇక రెండో ప్రధాన అంశం... ఉద్వేగపూరిత బంధం. అంటే ఎమోషనల్ రిలేషన్‌షిప్. మనం ప్రాణప్రదంగా పెంచుకున్న మన బిడ్డను ఎక్కడో దూరంగా ఉన్నవారికి ఇచ్చి పెళ్లి చేస్తే... వారెలా చూసుకుంటారో. బాగా చూసుకుంటాం లేక ఆరళ్లు పెడుతూ బాధలకు గురిచేస్తారో? అదే... బిడ్డ మన కళ్లెదురుగా ఉంటే మనమూ కూతురి బాగోగులు కళ్లారా చూస్తూ ఉండవచ్చు. ఈ రెండు అంశాల కారణంగా కులాలు, మతాలు, ప్రాంతాలకు అతీతంగా దగ్గరి బంధువుల్లోనే పెళ్లిళ్లు జరుగుతుంటాయి. దాంతో తమ జీవనశైలుల్లోనూ, తమ సాంస్కృతిక విధానంలో దంపతులిద్దరూ తేలిగ్గా ఇమిడిపోతారు... దాంతో దంపతులకు ఇబ్బందులు రావనే భావన ఇలాంటి వివాహాలను ప్రోత్సహిస్తుంది.

కానీ... దగ్గరి సంబంధాల వివాహాలతో పుట్టబోయే బిడ్డలకు ముప్పు పొంచి ఉంటుందిలా...

దగ్గరి వివాహాలను వైద్య పరిభాషలో కన్‌సాంగ్వినియస్ మ్యారేజెస్ అంటారు. అంటే ఉదాహరణకు అక్కకూతుర్ని... అంటే కోడలు వరసయ్యే అమ్మాయి తన మామను చేసుకోవడం, లేదా మేనమామ, మేనత్త పిల్లలను పెళ్లి చేసుకోవడం. ఇలాంటి దగ్గరి సంబంధాల వల్ల పుట్టబోయే బిడ్డల్లో అనేక రకాల అవయవలోపాల నుంచి బుద్ధిమాంద్యం వరకు ఎన్నో రకాల రుగ్మతలు, సిండ్రోమ్స్ వచ్చే అవకాశం పొంచి ఉంటుంది.

సంబంధాల దగ్గరితనం వర్గీకరణ ఇలా...

తల్లిదండ్రులు – వారి పిల్లలు...
మొదటి డిగ్రీ సంబంధం
తోబుట్టువులు – మేనమామ, మేనత్త
రెండో డిగ్రీ సంబంధం
మేనమామ పిల్లలు, మేనత్త పిల్లలు
మూడో డిగ్రీ సంబంధం
తాత అన్నదమ్ముల పిల్లల పిల్లలు (మనవలు)
నాలుగో డిగ్రీ సంబంధం

పేరెంట్స్ నుంచి బిడ్డలకు పోలికలూ, గుణాలూ లక్షణాలెలా వస్తాయంటే...

బిడ్డ పుట్టగానే బంధువులందరూ చుట్టూ చేరి మురిపెంగా చూసుకుంటూ రకరకాల వ్యాఖ్యానాలు

చేస్తుంటారు. ''అరె... వీడి ముక్కు చూడండి. అచ్చం వాళ్ల నాన్నదే. వాడి కళ్లు చూడండి. అచ్చం వాళ్ల అమ్మవే'' అంటూ మురిపెంగా పోలికలు చూస్తూ మురిసిపోతుంటారు. బిడ్డలో ఎలా వస్తాయి ఈ పోలికలు? ఎలాగంటే...

మనిషి దేహం కోటానుకోట్ల కణాలతో నిర్మితమై ఉంటుంది. ఈ కణాలన్నీ మొదట ఒకే ఒక తొలికణంతో మొదలైన జైగోట్ నుంచి అనేకానేక కణవిభజనల తర్వాత ఏర్పడతాయి. ఇక మానవుని ప్రతి కణంలో 46 క్రోమోజోములుంటాయి. అంటే 23 జతలు. వీటిలో ఈ జతలో... 23 మహిళ నుంచి, మరో 23 పురుషుడి నుంచి వచ్చి కలిసి... తొలి కణం ఏర్పడుతుంది. దీన్నే మనం పిండం అంటాం. ఈ పిండంలోని 23 జతల క్రోమోజోములపై అనేక జన్యువులు ఉంటాయి. జన్యువు అంటే ఏమిటంటే... దేహంలోని ప్రతి అంశానికీ, ప్రతి అవయవానికీ, ఎదుగుదలకూ, బిడ్డ అవయవాల షేపుకూ, సైజ్‌కూ, పెరిగే ఒడ్డూపొడవుకు సంబంధించిన ప్రతి సమాచారమూ ఈ జన్యువుల్లో నిక్షిప్తమై ఉంటుంది. ఈ జన్యువులన్నీ క్రోమోజోములపై ఉంటాయి. ఈ క్రోమోజోముల 23 జతలు ఒకదానితో మరొకటి కలిసి ఒక కణంగా రూపొందే సమయంలో తల్లిదండ్రుల నుంచి బిడ్డలకు పోలికలు, తల్లిదండ్రుల లక్షణాలూ, శరీరాకృతి, రంగు వంటి అనేక అంశాలు సంక్రమిస్తాయి. ఇలా ఈ లక్షణాలన్నీ ఒక తరం నుంచి మరో తరానికి బదిలీ అవుతుంటాయి.

దగ్గరివాళ్లలో పెళ్లిళ్లతో లోపాలు ఎందుకంటే...

క్రోమోజోములపై లక్షణాలను సంక్రమింపజేసే జన్యువులు తండ్రి నుంచి ఒకటీ, తల్లి నుంచి మరొకటి కలిసి సంపూర్ణమవుతాయన్న విషయం తెలిసిందే. ఉదాహరణకు... ఒక మహిళలో (కాబోయే తల్లిలోని) ఒక జన్యువు కాస్త చెడిపోయి... బిడ్డలో అది ఆస్తమా వ్యాధిని కలగజేసే అవకాశం ఉందనుకుందాం. ఆ మహిళ తన కుటుంబంలోని దగ్గరి వారిని కాకుండా అసలు ఏ సంబంధమూ లేనివారిని పెళ్లి చేసుకుందని అనుకుందాం. ఆ పురుషుడిలోని అదే రకమైన జన్యువు ఆరోగ్యంగా ఉందనుకుందాం. ఈ ఆరోగ్యకరమైన పురుషుడి జన్యువు, అనారోగ్యకరమైన ఆ స్త్రీ జన్యువును అధిగమిస్తుంది. అంటే ఇంగ్లిష్‌లో చెప్పాలంటే డామినేట్ చేస్తుంది. ఇలా లొంగి ఉండే అనారోగ్యకరమైన జన్యువును 'రెసెసివ్' జీన్ అంటారు. అలాగే డామినేట్ చేసే జన్యువును 'డామినెంట్' జీన్ అంటారు. ఒకవేళ కుటుంబ సభ్యుల్లోని దగ్గరి సంబంధంలోనే పెళ్లి జరిగిందనుకోండి. అప్పుడు తల్లిదండ్రులిద్దరూ ఒకే కుటుంబం నుంచి వచ్చినవారు కాబట్టి వారిద్దరిలోనూ ఆ జన్యువులు ఒకేలా ఉంటాయి. దాంతో ఇద్దరి జన్యువుల్లోనూ ఏదీ మరొకదాన్ని డామినేట్ చేయకపోవడం, రెండూ లోపంతోనే ఉండటంతో పుట్టబోయే బిడ్డలో ఆస్తమా బయటపడుతుంది. ఇది ఒక జన్యువు ఉదాహరణ మాత్రమే. ఇలా తల్లిదండ్రుల లక్షణాలను మోసుకెళ్లే జన్యువులు ఒక్క క్రోమోజోమ్‌పై దాదాపు 20,000 వరకూ ఉంటాయి. అంటే భవిష్యత్తులో ఆ పుట్టబోయే బిడ్డ ప్రతి లక్షణమూ ముందే ప్రోగ్రామ్ అయిపోయి జన్యువుల్లో నిక్షిప్తమై ఉంటుంది. అందుకే దంపతులిద్దరూ అపరిచిత కుటుంబాల నుంచి పెళ్లిళ్లు చేసుకుంటే ఒకరిలో అనారోగ్యకరమైన జన్యువు (ఫాల్టీ జీన్) ఉన్నా... దాన్ని దంపతుల్లోని మరో ఆరోగ్యకరమైన జన్యువు డామినేట్ చేస్తుంది. అయితే ఇక్కడ పేర్కొన్న ఆస్తమా ఉదాహరణలా ఇది అన్నివేళలా ఇలాగే బిడ్డలో వ్యక్తమవ్వాలనే నిబంధన ఏదీ ఉండదు. కొన్ని ఫాల్టీ జీన్స్... ఇలా ఒక తరం నుంచి మరో తరానికి వెళ్లే క్రమంలో మరింతగా చెడిపోతూ.... చెడిపోతూ... అకస్మాత్తుగా ఒక పెద్ద లోపంగా బిడ్డలో వ్యక్తం (ఎగ్జిబిట్) కావచ్చు. అందువల్లనే మేనరికాల్లో దంపతులిద్దరూ ఒకే కుటుంబానికి చెందినవారు కావడంతోఫాల్టీ జీన్స్ అనేవి దంపతులిద్దరిలోనూ ఒకేలా ఉండి అవయవ లోపాలూ లేదా జబ్బులూ వ్యక్తమవుతాయి.

ఎలాంటి జబ్బులకు ఆస్కారం ఉంది?

మేనరికపు వివాహాలు చేసుకున్న వారిలో అవయవలోపాలూ, పుట్టుకతో వచ్చే జబ్బులు (కంజెనిటల్ డిసీజెస్), రక్తసంబంధిత వ్యాధులైన హీమోఫీలియా, థలసీమియా వంటివి, సిస్టిక్ ఫైబ్రోసిస్, మూత్రపిండాల వ్యాధులు (కంజెనిటల్ యురెట్రో పెల్విక్ అబ్‌స్ట్రక్షన్), కండరాల, నరాలకు సంబంధించిన వ్యాధులు, కొన్ని రకాల సిండ్రోములు (అనే జబ్బుల లక్షణాల మిశ్రమంతో ప్రయుక్తమయ్యే జబ్బులన్నింటినీ కలుపుకుని ఒకే ఒక మాటరూపంలో 'సిండ్రోమ్' అని పిలుస్తారు), బుద్ధిమాంద్యత, వికినిడి సమస్యలు, కళ్లసమస్యలు, గుండెకు సంబంధించిన సమస్యలు (గుండెలో రంధ్రాలు, వాటి ధమనుల్లో లోపాలు), చిన్నప్పుడే వచ్చే డయాబెటిస్, జన్యుపరమైన సమస్యలు రావచ్చు. ఇక కాబోయే తల్లిలో మాటిమాటికీ జరిగే గర్భస్రావాలు, బిడ్డ పుట్టగానే చనిపోవడం, బిడ్డకు శ్వాస సంబంధిత సమస్యలు, జీవక్రియలకు సంబంధించిన (మెటబాలిక్) సమస్యలు ఇలా అనేక వైద్యపరమైన సమస్యలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

చేసుకున్న ప్రతివారికీ ఇదే సమస్యా?

మేనరికపు వివాహం చేసుకున్న ప్రతి దంపతులకూ ఇలాంటి సమస్యలే వస్తాయని చెప్పడానికి లేదు. కానీ మిగతావారిలో 2–3 శాతం మందికి ఇలా పుట్టుకతో వచ్చే వైద్య సమస్యలు ఏర్పడే అవకాశం ఎక్కువ. అయితే మేనరికం చేసుకున్నవారిలో ఈ ముప్పు (రిస్క్) రెట్టింపు ఉంటుంది. అంటే మేనరికపు వివాహాలు చేసుకున్నవారిలో 4 – 6 శాతం మంది పిల్లలకు ఇలా వైద్యసమస్యలున్న పిల్లలు పుట్టవచ్చు. లేదా మొదటి సంతానం బాగానే పుట్టి రెండో సంతానానికి సమస్య రావచ్చు, లేదా దీనికి విరుద్ధంగా కూడా కావచ్చు. ఒక వ్యాధిని ఒక తరం నుంచి మరో తరానికి మోసుకెళ్లే ఒక రిసెసివ్ జీన్ తల్లిదండ్రులిద్దరిలోనూ ఉన్నప్పుడు వారి బిడ్డకు ఈ వ్యాధి వచ్చే అవకాశాలు 25 శాతం అన్నమాట. అంటే వారికి నలుగురు సంతానం కలిగితే ఒక్కరికి తప్పక ఇలా వ్యాధులు వచ్చే అవకాశాలుంటాయి. అలాగే ఆరోగ్యకరంగా ఉన్న ఆ పిల్లల్లోనూ సగం మందికి తమ కణాల్లో అదే చెడిపోయిన జీన్ (రిసెసివ్ జీన్) ఉండవచ్చు. అది తర్వాతి తరంలో వ్యక్తం కావచ్చు. లేదా అదృష్టం బాగుంటే వ్యక్తం కాకపోనూవచ్చు.

జన్యుపరమైన సమస్యలూ - రకాలు

సాధారణంగా జన్యుపరమైన సమస్యలను మూడు రకాలుగా విభజించవచ్చు, అవి...

1) ఆటోజోమల్ డామినెంట్ : ఇలాంటి జీన్స్ వచ్చిన పిల్లల్లో సమస్య బయటకు కనిపిస్తూ ఉంటుంది. పైగా లోపంతో ఉన్న జీన్ డామినెంట్‌గా ఉంటుంది. దాంతో ఒక్క జీన్

సంక్రమించినా పిల్లల్లో సమస్య బయటపడుతుంది.

2) ఆటోజోమల్ రెసెసివ్ : వీటిలో సమస్య బయటపడదుగానీ... సమస్యను / వ్యాధిని కలగజేసే జన్యువులు తల్లిదండ్రులిద్దరిలోనూ నిశ్శబ్దంగా లోపలే ఉంటాయి. వీళ్ల తర్వాత తరానికి సమస్యను మోసుకెళ్తారు. కాబట్టి వీరిని 'క్యారియర్స్' అంటారు. ఇద్దరు 'క్యారియర్స్' పెళ్లాడితే... రెండు రెసెసివ్ జీన్స్ కలిసి... పుట్టబోయే బిడ్డలో సమస్య తప్పక బయటపడుతుంది.

3) ఎక్స్ లింక్‌డ్ సమస్యలు : ఇలాంటి సమస్యలు 'ఎక్స్' క్రోమోజోమ్‌పై నిక్షిప్తమై ఉంటాయి. దాంతో ఈ జీన్ కలిగిన ఆడపిల్లలు సమస్యకు 'క్యారియర్స్'గా ఉంటారు. సమస్య మగపిల్లల్లో బయటపడుతుంది.

పెళ్లి తప్పదనుకుంటే...

ఈ సమస్యలను దృష్టిలో పెట్టుకుని మేనరికపు వివాహాలకు దూరంగా ఉండటమే చాలావరకు మంచిది. ఒకవేళ ఈ అంశాలన్నీ తెలియక నిశ్చితార్థమో, వివాహమో చేసుకుంటే... అప్పుడు ఆ జంట చేయాల్సిన పనులివి...

వివాహానికంటే ముందుగా : పెళ్లికి ముందే అమ్మాయీ, అబ్బాయి... ఈ ఇద్దరినీ ప్రీ–మేరిటల్ అండ్ జెనెటిక్ కౌన్సెలింగ్ కోసం నిపుణులను కలవాలి. అప్పుడా నిపుణులు కుటుంబ ఆరోగ్య చరిత్రను పరిగణనలో తీసుకుంటారు. అంటే వీరి తల్లిదండ్రులు, మేనత్త, మేనమామ, తాతలు, ముత్తాతల్లో ఏవైనా దగ్గరి సంబంధం చేసుకోవడం వల్ల వచ్చిన సమస్యలు ఉన్నాయా అని తెలుసుకుంటారు. ఉంటే... వీరికి పుట్టే పిల్లలకు ఆ ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశాలు ఎంతవరకు ఉన్నాయో విశ్లేషణాత్మకంగా అంచనావేస్తారు. వాటి ఆధారంగా రిస్క్ తీసుకోవచ్చా లేదా అనేది ఆ జంట నిర్ణయించుకోవచ్చు. అవసరమైతే ఆ జంటకు కొన్ని రక్తపరీక్షలూ చేయించే అవకాశమూ ఉంటుంది. సాధారణంగా వచ్చే జన్యుపరమైన సమస్యలను తెచ్చే జీన్స్ ఏమైనా ఉన్నాయా అనేది తెలుసుకోడానికి ఇద్దరికీ జెనెటిక్ టెస్టింగ్ చేస్తారు. అయితే ఎన్ని పరీక్షలు చేసినా వారికి ఏ సమస్యా రాదనో, వస్తుందనో నిర్ధారణగా చెప్పడం కష్టం. ఒకవేళ ఆటోజోమల్ డామినెంట్ సమస్యలు వస్తాయని తెలిస్తే వీలైనంతవరకు ఆ పెళ్లి వద్దనుకోవడమే మంచిది.

పెళ్లి తర్వాత : పెళ్లి తర్వాత కూడా జెనెటిక్ కౌన్సెలింగ్‌కు వెళ్లి పైన పేర్కొన్నవన్నీ పాటించవచ్చు. గర్భం దాల్చడానికి మూడు నెలల ముందు నుంచే ఫోలిక్‌యాసిడ్ మాత్రలు రోజుకు ఒకటి చొప్పున తీసుకోవాలి.

గర్భం వచ్చాక : ఇక్కడ పేర్కొంటున్న సమస్యలన్నీ జన్యుపరమైనవి కావడంతో పుట్టబోయే పిల్లల్లో ఏ సమస్యా రాకుండా చేయడమన్నది ఏ నిపుణులకూ సాధ్యం కాదు. కాకపోతే కొన్ని గుర్తించదగిన సమస్యలను ముందుగానే పసిగట్టడం వల్ల, పుట్టిన తర్వాత వెంటనే చెయ్యగలిగిన చికిత్సలేవైనా ఉంటే వాటికోసం తక్షణమే సన్నద్ధమయ్యేలా జాగ్రత్త తీసుకోవడం చేయవచ్చు. లేదా లోపల ఉన్న సమస్యను తెలుసుకోవడం... ఒకవేళ అది మెదడుకు సంబంధించినదీ లేదా ఎప్పటికీ సరిచేయలేనిదని తెలిస్తే గర్భస్రావం (ఐదు నెలల లోపల) అవకాశాల గురించి ఆలోచించడం లేదా బిడ్డను కనడం... ఈ రెండింటిలో వారికి అనువైన / తగిన నిర్ణయం తీసుకోవచ్చు.

మేనరికపు పెళ్లిళ్లు... దంపతులు చేయించుకోవాల్సిన పరీక్షలు :

- గర్భందాల్చిన మూడో నెలలో (12 వారాల్లో) డబుల్ మార్కర్ టెస్ట్ అనే రక్తపరీక్ష చేయించుకుంటే బిడ్డలో డౌన్స్ సిండ్రోమ్, ట్రైజోమ్ 18, 13 వంటి కొన్ని రకాల జన్యుపరమైన సమస్యలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయా లేక తక్కువగా ఉన్నాయా అని తెలుస్తుంది. ఈ పరీక్షల ఫలితాలను బట్టి వేరే పరీక్షలు అవసరమా కాదా అని తెలుస్తుంది.
- మూడో నెలలో (12వారాలప్పుడు) న్యూకల్ ట్రాన్స్‌లుయెన్సీ స్కాన్ (ఎన్టీ స్కాన్) చేయించుకుంటే, ఆ సమయానికి బయటపడే సమస్యలు ఏమైనా ఉంటే తెలుస్తాయి.
- పై పరీక్షల్లో కొన్ని జన్యుపరమైన సమస్యలు వచ్చే అవకాశం ఉందనే సందేహం కలిగినప్పుడు దాన్ని నిర్ధారణ చేయడానికి బిడ్డ చుట్టూ ఉండే మాయ నుంచి కొంత ముక్క సేకరించి 'కోరియా విల్లస్ బయాప్సీ' అనే పరీక్ష చేస్తారు.
- ఐదో నెలలో ట్రిపుల్ మార్కర్ లేదా క్వాడ్రపుల్ మార్కర్ వంటి రక్తపరీక్షలు చేయించుకుంటే పుట్టబోయే బిడ్డలో కొన్ని రకాల జన్యుపరమైన సమస్యల ముప్పు ఎక్కువా లేదా తక్కువా అన్నది తెలుస్తుంది.
- ఇందులో రిస్క్ ఎక్కువగా ఉన్నట్లు ఫలితాలు వస్తే అమ్నియోసెంటెసిస్ అనే పరీక్ష చేయించాలి. ఇందులో గర్భంలోని బిడ్డ చుట్టూ ఉండే ఉమ్మనీరు లోంచి 10 – 20 ఎమ్ఎల్ తీసి జన్యువుల పరీక్షకు (క్యారియోటైపింగ్‌కు) పంపించి సమస్యను నిర్ధారణ చేస్తారు. ఈ పరీక్ష వల్ల ఒక శాతం మందిలో గర్భస్రావమయ్యే అవకాశం ఉంటుంది.
- ఐదో నెల చివరిలో 18–22 వారాలప్పుడు 'టిఫ్ఫా' అనే స్కానింగ్ చేయడం వల్ల బిడ్డలో వచ్చే అవయవలోపాలను ముందుగానే గుర్తించవచ్చు. దీనితో పాటు జెనెటిక్ సోనోగ్రామ్ చేయించుకుంటే కొన్ని జన్యుసంబంధిత వ్యాధులను సూచించే సాఫ్ట్ మార్కర్‌లను గుర్తించి, దానికి తగినట్లుగా తర్వాతి నిర్ణయం తీసుకోవచ్చు.
- ఆరో నెలలో 22–24 వారాల్లో 2డీ ఫీటల్ ఎకో కూడా చేయించుకుంటే గుండెకు సంబంధించిన లోపాలను తెలుసుకోవచ్చు.
- స్కానింగ్‌లో నూటికి నూరు శాతం లోపాలను కనుక్కోలేకపోవచ్చు. కొందరిలో బిడ్డ పొజిషన్, ఉమ్మనీటి శాతం, తల్లి పొట్ట మీద అధికకొవ్వు వంటి అంశాలను బట్టి కూడా కొన్ని లోపాలను కనుగొనడం మిస్సయ్యే అవకాశం ఉంది.

బిడ్డ పుట్టాక : బిడ్డపుట్టిన తర్వాత మొదటి వారంలోనే నియోనేటల్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించడం వల్ల త్వరగా చికిత్స చేయదగిన వ్యాధులు ఏవైనా ఉంటే తెలుస్తుంది. అంటే ఎర్రర్స్ ఆఫ్ మెటబాలిజమ్ వంటివి గుర్తించవచ్చు. బిడ్డ మూడో నెలలో వినికిడి లోపాలను గుర్తించే పరీక్షలు చేయించి, ఒకవేళ ఉంటే వాటిని చాలావరకు సరిదిద్దవచ్చు.

చివరగా... మేనరికపు పెళ్లిళ్ల వల్ల పుట్టే పిల్లలకు వచ్చే అవయవ లోపాలను రాకుండా చేసేందుకు గర్భంతో ఉన్నప్పుడే ఇచ్చే మందులు, చేసే ఇంజెక్షన్లు ఉన్నాయని చాలా మంది అనుకుంటారు. కానీ అది కేవలం అపోహ మాత్రమే. అలాంటి ఇంజెక్షన్లుగానీ మందులు గానీ ఉండవు.

ఇక మేనరికపు వివాహాల వల్ల పిల్లలకు అవకరాలు వచ్చే అవకాశాలు ఎక్కువ కాబట్టి ఆస్తి కోసమో లేదా ఇతరత్రా కుటుంబ భద్రతల దృష్ట్యా అలాంటి వాటిని చేసుకుని... ఆర్థికంగా, మానసికంగా బాధపడటం కంటే... ఆరోగ్యకరమైన బిడ్డల కోసం కాస్తంత మంచి సంబంధాలు వెదికి బయటి సంబంధాలు చేసుకోవడమే మేలు అని గుర్తుంచుకోవాలి. అయితే ఇది వారి వారి వ్యక్తిగతమైన కుటుంబ పరిస్థితుల మీద ఆధారపడి ఉంటుంది.

వేలు పట్టి నడక నేర్పించిన నాన్నే... చేయి పట్టుకొని రేసింగ్‌కు తీసుకెళ్లాడు. పిల్లలకు కిక్ ఇచ్చే గో కార్టింగ్ రేసులో రయ్ రయ్ మనిపించే తనయుని ఉత్సాహాన్ని కళ్లారా చూశాక తండ్రి తన కుమారుడి తపనే తన తపన అనుకున్నాడు. ఏడేళ్ల ప్రాయం నుంచి టీనేజ్‌కొచ్చాక ఫార్ములావన్‌లో అరంగేట్రం చేసే వరకు ప్రతి పైసా తండ్రే వెచ్చించాడు. ఇలా తండ్రి ఆడమ్ చేయూత, లాండో నోరిస్ రాతను మార్చింది. ఎఫ్1 చాంపియన్‌ను చేసింది.

కుటుంబం తోడుగా... ప్రతిభే నిచ్చెనగా...

ఫార్ములావన్ కొత్త ప్రపంచ చాంపియన్ నోరిస్ ప్రస్థానం
ఏడేళ్లప్పుడే కార్టింగ్ పిచ్చి
జూనియర్ స్థాయిలో ట్రోఫీలు
మెక్‌లారెన్‌తో కల సాకారం

ఏ సీజన్‌లో	ఏ స్థానం
2019	11
2020	9
2021	6
2022	7
2023	6
2024	2
2025	1

తొలి కోచ్ రాబ్ డాడ్స్‌తో....

152 ఆరేళ్ల ఎఫ్1 కెరీర్‌లో నోరిస్ పాల్గొన్న రేసులు.

11 నోరిస్ తన కెరీర్‌లో గెలిచిన గ్రాండ్‌ప్రి రేసులు.

9 ఇప్పటి వరకు తొమ్మిది మంది వేర్వేరు డ్రైవర్లతో కలిసి నోరిస్ రేసుల్లో పాల్గొన్నాడు.

1430 ఇప్పటి వరకు ఎఫ్1లో నోరిస్ సాధించిన పాయింట్లు.

సాక్షి క్రీడా విభాగం

ఇప్పుడు ఫార్ములావన్ (ఎఫ్1) ప్రపంచ మంతా నోరిస్ వైపే చూస్తోంది. తాజా ఎఫ్1 వరల్డ్ డ్రైవర్స్ చాంపియన్‌గా అతను ఘనతకెక్కాడు. 18 ఏళ్ల తర్వాత మెక్‌లారెన్ రేసింగ్ టీమ్‌ను విజేతగా నిలిపాడు. చివరిసారిగా హామిల్టన్ 2008లో మెక్‌లారెన్‌కు టైటిల్ అందించాడు. దిగ్గజ రేసర్ హామిల్టన్, తాజా చాంపియన్ నోరిస్ ఇద్దరు బ్రిటన్ డ్రైవర్లే కావడం గమనార్హం. ఇక మెక్‌లారెన్ టీమ్‌ను కాకుండా దేశం గురించే చెప్పుకుంటే బ్రిటన్ తరఫున 11వ ఫార్ములావన్ చాంపియన్ నోరిస్. 26 ఏళ్ల వయసులో తొలి టైటిల్ సాధించాడు. ఆఖరి రేసుదాకా ఉత్కంఠ రేపినా... స్టార్ రేసర్ వెర్‌స్టాపెన్ వెనకే ఉండి (రెండో స్థానం) వెంటాడినా తను మాత్రం తక్కువేం కాదని, సర్క్యూట్‌లో దిగితే తగ్గేదే లేదని తన విజయంతో చాటి చెప్పాడు.

బాల్యంలోనే రేసింగ్ బాట

ఏడేళ్ల పసి ప్రాయంలో రేసింగ్ బాట పట్టిన నోరిస్ తాజాగా ఏడో సీజన్‌లో ప్రపంచ చాంపియన్‌గా నిలవడం విశేషం. నోరిస్ తండ్రి ఆడమ్ కోటీశ్వరుడు కావడంతో డబ్బుకు కొదవేం లేదు. పైగా ధైర్యం కూడా ఎక్కువే! లేదంటే కోట్లకు వారసుణ్ని ఏ తండ్రి అయిన ప్రమాదకర రేసింగ్‌కు తీసుకెళ్తాడా. కానీ ఆడమ్ చేయి పట్టుకొని కారులో కూర్చోబెట్టు కొని మరీ కార్టింగ్‌కు పరిచయం చేశాడు. అలా మొదలైన ప్రయాణం లో ఓ ఏడాది గడిచేసరికే చిన్న చితక పోటీల్లో గెలవడం కూడా మొదలుపెట్టాడు. ఇలా మూడు, నాలుగేళ్లు గడిచే సరికి 11 ఏళ్ల వయ సులో 'ఎంఎస్‌ఏ బ్రిటిష్ క్యాడెట్ కార్ట్ చాంపియన్‌షిప్'లో పోటీలకు దిగాడు. మెరుపు వేగం అందిపుచ్చుకొని పలుమార్లు విజేతగా నిలిచాడు. లాండో నోరిస్ రోజు రోజుకి కాదు... కానీ రేసు రేసుకి జోరు పెంచుతున్నాడు. టీనేజ్‌లో పాల్గొన్న పోటీల్లో తన సత్తా జూనియర్ రేసింగ్ జట్లను ఆకట్టుకునేలా చేసింది.

కుటుంబ సభ్యులతో...

14 ఏళ్లకే అవార్డు కూడా...

నోరిస్‌కు బాగా తెలిసిన ప్రపంచం రేసింగ్. తనని దూసుకెళ్లేలా చేస్తున్న ప్రపంచం కూడా రేసింగే! అందుకేనేమో అతని 'వేగం' అంతే వేగంగా అవార్డును తెచ్చిపెట్టింది మరి! 14 ఏళ్ల టీనేజ్‌లోనే నోరిస్ తొలి అవార్డు అందుకున్నాడు. మూడుసార్లు ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన సర్ జాకీ స్టివార్ట్ చేతుల మీదుగా 2013లో ఆ ఏడాదికి సంబంధించి 'ఆటో స్పోర్ట్' అవార్డు అందు కున్నాడు. ఇలా అవార్డుతో పాటు ఆ రేసు, ఈ రేసు గెలుచుకుంటూ సర్క్యూట్‌పై దుమ్మురేపే ప్రతిభనే ఆలంబనగా చేసుకొని రేసర్లంతా కలలు గనే ఎఫ్1 గడప తొక్కాడు. 2018, జనవరిలో 18 ఏళ్ల నోరిస్ మెక్‌లారెన్ రేసింగ్ టీమ్ సభ్యుడయ్యాడు. టీమ్ సీఈవో బ్రౌన్ ఆ యువ రేసర్‌కు అవకాశమివ్వాలని నిర్ణయించాడు. అప్పటికే సీనియర్‌గా ఉన్న డ్రైవర్ ఫెర్నాండో అలోన్సో స్థానంలో రేసు మొదలుపెట్టిన నోరిస్ ఆ తర్వాత కొంతకాలానికి పోల్ పొజిషన్‌లు సాధిస్తూ ముందంజ వేశాడు. అలా ఏకబికిన ఏడేళ్ల పాటు తన టీమ్ మెక్‌లారెన్ పెట్టిన నమ్మకానికి న్యాయం చేస్తూ ఏ సీజన్‌లోనూ, ఏ రేసులోనూ నమ్మకం కోల్పోకుండా తన రేసింగ్ జోరు చూపాడు. ఎట్టకేలకు తనకు అవకాశమిచ్చిన మెక్‌లారెన్‌ను గెలిపించాడు. ఎఫ్1 అరంగేట్రం నుంచి టైటిల్ గెలిచేదాకా మెక్‌లారెన్ రేసింగ్ జట్టు తోనే తన ఏడేళ్ల పయనం మొత్తానికి ఇలా విజయ వంతంగా సాగిపోతోంది.

వాడికేమో ఇష్టం, నాకేమో కష్టం

ఎవరో చెబితేనో... సరదాకో రేసింగ్‌కు వెళ్లలేదు. ఎంతో ఇష్టపడే కార్టింగ్ కార్ స్టీరింగ్ పట్టాడు. మా ఆడమ్ (నోరిస్ నాన్న) కూడా ప్రోత్సహించాడు. దీని వల్ల ఏడేళ్ల ప్రాయం నుంచి ఇప్పటి వరకు నా కుమారుడిని మిస్ అవుతూనే ఉన్నా. మొదట్లో కార్టింగ్ అంటూ ఇంటికి దూరంగా... సర్క్యూట్‌కు దగ్గరగా ఎక్కువ సమయం గడిపాడు. అనంతరం జూనియర్ స్థాయి పోటీల కోసమని అటు ఇటూ తిరిగాడు. కొన్నేళ్లుగా ప్రొ సర్క్యూట్ రేసర్‌గా మరింత బిజీ అయిపోయాడు. ఏం చేస్తాం. వాడికేమో అదే ఇష్టం. వాణ్నిలా రోజులు, నెలల తరబడి విడిచి ఉండటం నాకేమో కష్టం.

-నోరిస్ తల్లి సిస్కా

నాలుగుసార్లు వరల్డ్ చాంపియన్ వెర్‌స్టాపెన్‌తో నోరిస్

భారత్‌కు మూడో విజయం

వర్గీకరణ మ్యాచ్‌లో వేల్స్‌పై గెలుపు

సాంటియాగో (చిలీ): క్వార్టర్ ఫైనల్‌కు దూరమైన భారత జూనియర్ మహిళల హాకీ జట్టు... ప్రపంచకప్‌లో 9 నుంచి 16 స్థానాల కోసం వర్గీకరణ మ్యాచ్‌లు ఆడుతోంది. దీంట్లో భాగంగా వేల్స్ జట్టుతో జరిగిన వర్గీకరణ మ్యాచ్‌లో భారత్ 3–1 గోల్స్ తేడాతో విజయం సాధించింది. భారత్ తరఫున హీనా బానో (14వ నిమిషంలో), సునెలితా టొప్పో (24వ నిమిషంలో), ఇషిక (31వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. వేల్స్ జట్టుకు ఎలోయిజ్ మోట్ (52వ నిమిషంలో) ఏకైక గోల్ అందించింది. లీగ్ దశలో రెండు మ్యాచ్‌ల్లో గెలిచిన భారత జట్టు... జర్మనీ చేతిలో ఓడిపోయింది. జర్మనీతో మ్యాచ్‌ను భారత్ 'డ్రా' చేసుకొని ఉంటే క్వార్టర్ ఫైనల్ చేరేది. 36 ఏళ్ల ఈ టోర్నీ చరిత్రలో భారత జట్టు రెండుసార్లు (2013, 2022) మాత్రమే సెమీఫైనల్ చేరుకుంది. 2013లో మూడో స్థానాన్ని దక్కించుకోగా... 2022లో నాలుగో స్థానాన్ని సంపాదించింది.

30 సెకన్లలోనే పెనాల్టీ కార్నర్

నాకౌట్ దశకు చేరాలనే లక్ష్యంతో వచ్చిన జ్యోతి సింగ్ బృందం దానికి దూరమైంది. కనీసం తొమ్మిదో స్థానంలోనైనా నిలవాలనే ఆశతో వేల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో టీమిండియా స్వేచ్ఛగా ఆడింది. **తొలి 30 సెకన్లలోనే పెనాల్టీ కార్నర్ సంపాదించి తమ ఉద్దేశాన్ని స్పష్టం చేసింది. గోల్ చేసే అవకాశాలు సృష్టించుకున్నా 14వ నిమిషం వరకు** వాటిని సద్వినియోగం చేసుకోలేకపోయింది. 14వ నిమిషంలో హీనా బానో గోల్‌తో భారత్ ఖాతా తెరిచింది. భారత్‌కు దీటుగా బదులిచ్చిన వేల్స్ కూడా ఎదురుదాడులు చేసింది. కానీ భారత రక్షణ పంక్తి అప్రమత్తంగా వ్యవహరించి వేల్స్ ఆశలను వమ్ము చేసింది. మ్యాచ్ మరో ఎనిమిది నిమిషాల్లో ముగుస్తుందనగా వేల్స్ ఖాతా తెరిచామన్న సంతృప్తి కలిగింది. మ్యాచ్ మొత్తంలో భారత్‌కు 8 పెనాల్టీ కార్నర్‌లు, వేల్స్ జట్టుకు 10 పెనాల్టీ కార్నర్‌లు, 1 పెనాల్టీ స్ట్రోక్ లభించాయి. కానీ రెండు జట్లు అన్నింటిని వృథా చేశాయి. 9–12 స్థానాల కోసం నేడు జరిగే మ్యాచ్‌లో ఉరుగ్వేతో భారత్ తలపడుతుంది.

జొరావర్‌కు ఏడో స్థానం

ప్రపంచకప్ షూటింగ్ ఫైనల్స్‌ను ఆరు పతకాలతో ముగించిన భారత్

దోహా: షూటింగ్ సీజన్ ముగింపు టోర్నమెంట్ ప్రపంచకప్ ఫైనల్స్‌లో భారత్‌కు రెండో స్థానం దక్కింది. సోమవారం ముగిసిన ఈ మెగా టోర్నీలో చివరిరోజు భారత్‌కు పతకం లభించలేదు. చివరిరోజు పురుషుల షాట్‌గన్ ఈవెంట్‌లో భారత వెటరన్ షూటర్ జొరావర్ సింగ్ సంధూ బరిలోకి దిగాడు. ఎనిమిది మంది మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో 30 షాట్‌లతో జరిగిన ఫైనల్స్‌లో జొరావర్ సింగ్ 7 పాయింట్లే స్కోరు చేసి ఏడో స్థానంలో నిలిచాడు. 12 మంది పోటీపడ్డ క్వాలిఫయింగ్‌లో జొరావర్ 119 పాయింట్లు స్కోరు చేసి ఆరో స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించాడు. విలియమ్ హింటన్ (అమెరికా; 29 పాయింట్లు) స్వర్ణం... జీన్ పియరీ (గ్వాటెమాలా; 28 పాయింట్లు) రజతం... వాల్టన్ ఎలార్ (అమెరికా; 23 పాయింట్లు) కాంస్యం గెల్చుకున్నారు.

ఓవరాల్‌గా ఈ టోర్నీలో భారత్ 2 స్వర్ణాలు, 3 రజతాలు, 1 కాంస్యంతో కలిపి 6 పతకాలతో రెండో స్థానంలో నిలిచింది. చైనా 4 స్వర్ణాలు, 2 రజతాలు, 3 కాంస్యాలతో కలిపి 9 పతకాలతో టాప్ ర్యాంక్‌ను సొంతం చేసుకుంది. అమెరికా 2 స్వర్ణాలు, 2 రజతాలు, 2 కాంస్యాలతో 6 పతకాలతో మూడో స్థానాన్ని పొందింది. మొత్తం 13 దేశాల షూటర్లు కనీసం ఒక్క పతకమైనా సాధించారు.

క్యాండిడేట్స్ టోర్నీకి ప్రజ్ఞానంద అర్హత

లుసానే: పురుషుల క్లాసికల్ ఫార్మాట్ ప్రపంచ చాంపియన్ ప్రత్యర్థిని నిర్ణయించే క్యాండిడేట్స్ చెస్ టోర్నీకి భారత గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద అర్హత సాధించాడు. అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) 2025 సర్క్యూట్‌లో ప్రజ్ఞానంద 115.17 రేటింగ్ పాయింట్లు స్కోరు చేసి అగ్రస్థానంలో నిలిచాడు. తద్వారా క్యాండిడేట్స్ టోర్నీ బెర్త్‌ను ఖరారు చేసుకున్నాడు. 8 మంది గ్రాండ్‌మాస్టర్ల మధ్య క్యాండిడేట్స్ టోర్నీ వచ్చే ఏడాది మార్చి 28 నుంచి ఏప్రిల్ 16వ తేదీ వరకు సైప్రస్‌లో జరుగుతుంది. ఇప్పటి వరకు క్యాండిడేట్స్ టోర్నీకి 7 గురు గ్రాండ్‌మాస్టర్లు (కరువానా, అనీశ్ గిరి, మథియాస్ బ్లూబామ్, సిందరోవ్, వె యి, ఎసిపెంకో, ప్రజ్ఞానంద) అర్హత పొందారు. ఆగస్టు 2025 నుంచి 2026 జనవరి మధ్య కాలంలో అత్యధిక సగటు రేటింగ్ కలిగిన ప్లేయర్‌కు చివరిదైన ఎనిమిదో బెర్త్ లభిస్తుంది. 2026 క్యాండిడేట్స్ టోర్నీ విజేత ప్రపంచ చాంపియన్ గుకేశ్‌తో ప్రపంచ టైటిల్ కోసం తలపడతాడు.

షకీబ్ అల్ హసన్

'కావాలనే చకింగ్ చేశా'

ఆల్‌రౌండర్ షకీబ్ అల్ హసన్ ప్రకటన

లండన్: ఏడాది క్రితం బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ షకీబ్ అల్ హసన్ సందేహాస్పద బౌలింగ్ యాక్షన్ కారణంగా సస్పెన్షన్‌కు గురయ్యాడు. కౌంటీ క్రికెట్‌లో సర్రే తరఫున ఆడుతున్న సమయంలో ఇది చోటు చేసుకుంది. సీజన్‌లో అతను ఆడిన ఈ ఏకైక నాలుగు రోజుల కౌంటీ మ్యాచ్‌లో (సోమర్సెట్‌తో) షకీబ్ రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి మొత్తం 63.2 ఓవర్ల పాటు బౌలింగ్ చేశాడు. అయితే తీవ్ర అలసట వల్ల ఉద్దేశపూర్వకంగానే తాను 'చకింగ్'కు పాల్పడ్డానని, అంపైర్లు తనను బౌలింగ్ నుంచి తప్పించాలని కోరుకున్నట్లు అతను వెల్లడించాడు. 'ఆ ఒక్క మ్యాచ్‌లోనే నేను దాదాపు 70 ఓవర్లు బౌలింగ్ చేశాను. నేను ఆడిన టెస్టుల్లో కూడా ఎప్పుడూ ఇన్ని ఓవర్లు వేయలేదు. ఈ మ్యాచ్‌కు ముందు పాకిస్తాన్‌తో రెండు టెస్టులు ఆడి వచ్చాను. చాలా అలసిపోయాను. అందుకే కావాలనే అలా సందేహాస్పద రీతిలో బౌలింగ్ చేస్తూ పోయాను. అంపైర్లు ఎలాంటి హెచ్చరిక కూడా లేకుండా నన్ను బౌలింగ్ నుంచి తప్పించారు. ఆ తర్వాత జరిగిన పరీక్షలో కూడా నేను విఫలమయ్యాను. అనంతరం మళ్లీ రెండు వారాల పాటు ప్రాక్టీస్ చేసి సాధారణ స్థితికి రావడంతో మరోసారి సర్రేకు వెళ్లిపోయాను' అని షకీబ్ గుర్తు చేసుకున్నాడు. సర్రే మ్యాచ్ తదనంతర పరిణామాల్లో సందేహాస్పద బౌలింగ్ యాక్షన్ కారణంగా ముందుగా బంగ్లా క్రికెట్ బోర్డు, ఆపై ఐసీసీ కూడా షకీబ్‌పై నిషేధం విధించాయి. అయితే బౌలింగ్ యాక్షన్‌కు సంబంధించి తొలి రెండు పరీక్షల్లో విఫలమైన షకీబ్...మూడో పరీక్షలో మాత్రం సఫలమయ్యాడు. దాంతో ఈ ఏడాది ఆరంభంలో మళ్లీ బౌలింగ్ చేసేందుకు అతనికి అనుమతి లభించింది. కానీ బంగ్లాదేశ్‌లో మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో గత ఏడాది భారత్‌తో జరిగిన టెస్టు సిరీస్ తర్వాత అతడిని జాతీయ జట్టులోకి సెలక్టర్లు ఎంపిక చేయలేదు.

మన్‌సుఖ్

'సాయ్'లో 1191 పోస్టులు ఖాళీ

కేంద్ర క్రీడా మంత్రి ప్రకటన

న్యూఢిల్లీ: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్)లో సిబ్బంది తక్కువగా ఉందనే విషయాన్ని కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ అంగీకరించారు. త్వరలోనే వీటిని పూర్తి చేసి 'సాయ్'ను మరింత సమర్థంగా నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నామని ఆయన వెల్లడించారు. గత ఆగస్టులో క్రీడలపై ఏర్పాటు చేసిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ 'సాయ్'లో నిధుల కొరత ఉందని, తగినంత సిబ్బంది కూడా లేదని తమ నివేదికలో వెల్లడించింది. దీనిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలంటూ లోక్‌సభలో ఎంపీ ఆదూర్ ప్రకాశ్ అడిగిన ప్రశ్నపై మాండవీయ స్పందించారు. 'ప్రభుత్వం ఈ నివేదికలోని అంశాలను పరిగణనలోకి తీసుకుంది. స్పోర్ట్స్ అథారిటీలో మొత్తం 1191 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిలో కొన్నింటికి సంబంధించిన నియామక ప్రక్రియ ఇప్పటికే మొదలైంది. బడ్జెట్‌లో 'సాయ్'కు రూ.830 కోట్లు కేటాయించాం. సంబంధిత ఆర్థిక సంవత్సరంలో మా వద్దకు వచ్చిన ప్రతిపాదనలను బట్టి ఈ నిధులు ఇస్తాం. అయితే ఏడాది మధ్యలో కూడా అవసరమైతే తగిన పరిశీలన అనంతరం అదనపు నిధులు కూడా ఇస్తాం' అని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. మహిళా క్రీడాకారులపై లైంగిక వేధింపులకు సంబంధించి ప్రత్యేకంగా ఎలాంటి గణాంకాలు తాము నమోదు చేయడం లేదని... అయితే పోటీలు, శిక్షణ సమయంలో వారికి సరైన, సురక్షిత వాతావరణం కల్పించేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నామని కూడా మాండవీయ పేర్కొన్నారు.

బషర్ అల్ అసద్ నిరంకుశ పాలనకు తెరదించి ఏడాది పూర్తయిన సందర్భంగా సిరియా రాజధాని డమాస్కస్ నగరంలో ఆదివారం ఏర్పాటుచేసిన బహిరంగ ఎగ్జిబిషన్ ఇది. 'సిరియన్ రెవల్యూషన్ మిలటరీ ఎగ్జిబిషన్'లో పలు ఆయుధాలను ఆసక్తిగా పరిశీలిస్తున్న చిన్నారులు

ఎక్కడ చమురు కొనాలనేది భారత్ ఇష్టం

- సార్వభౌమ భారత్‌కు ఆ హక్కు ఉంది
- స్పష్టం చేసిన రష్యా

మాస్కో: అమెరికా ఆంక్షల నేపథ్యంలో ఇతర దేశాలకు ముడిచమురును విక్రయించుకునేందుకు అవరోధాలను ఎదుర్కొంటున్న రష్యా.. భారత్‌ను చమురు కొనుగోళ్ల విషయంలో ఆకర్షిస్తోందన్న ఆరోపణలపై రష్యా అధ్యక్షభవనం క్రెమ్లిన్ ఘాటుగా స్పందించింది. ఈ మేరకు క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ సోమవారం మాస్కోలో మీడియాతో మాట్లాడారు. ''భారత్ ఎల్లప్పుడూ సార్వభౌమ దేశమే. విదేశీ వాణిజ్య విధానాలు, నచ్చిన దేశం నుంచి చమురు వనరుల కొనుగోలు కార్యకలాపాల్లో భారత్ పూర్తిగా స్వీయనిర్ణయాలనే తీసుకుంటుంది. అందులో రష్యా వంటి మిత్రదేశాల పాత్ర ఉండబోదు. భారత్ తనకు లాభదాయకమైన చోటే ఇంధన కొనుగోళ్లు కొనసాగిస్తుంది. ఆ స్వేచ్ఛ భారత్ ఎప్పుడూ ఉంటుంది''అని పెస్కోవ్ అన్నారు. మీ వద్ద చమురు కొనుగోళ్లను పూర్తిగా తగ్గించుకోవాలంటూ భారత్‌పై అమెరికా తీవ్రస్థాయిలో ఒత్తిళ్లుచేస్తున్న నేపథ్యంలో భారతవైఖరి మారిందా? అన్న ప్రశ్నకు పెస్కోవ్ సమాధానమిచ్చారు. ''భారత్ అనేది తన ఆర్థిక ప్రయోజనాలకే మొదట్నుంచీ పెద్దపీట వేస్తోంది. ఇకమీదట సైతం భారత్‌లోని మా చమురుభాగస్వాములు అదే బాటలో పయనిస్తారని భావిస్తున్నాం''అని అన్నారు. వద్దని వారించినా రష్యా నుంచి భారత్ పెద్ద ఎత్తున ముడిచమురు కొనుగోళ్లు జరుపుతోందంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్‌పై 50 శాతం దిగుమతి సుంకాల భారం పడేసిన విషయం విదితమే. 2022లో మొదలైన ఉక్రెయిన్ యుద్ధం తర్వాత రష్యా నుంచి అత్యధిక స్థాయిలో క్రూడ్‌ఆయిల్‌ను కొంటున్న దేశాల్లో భారత్ సైతం ఒకటిగా నిలిచిన విషయం తెల్సిందే. అయితే ఇటీవలకాలంలో పశ్చిమదేశాల ఒత్తిడితో రష్యా నుంచి కొనుగోళ్లలో తగ్గుదల కనిపిస్తోందని అంతర్జాతీయ మీడియాలో ఇప్పటికే కథనలు వెలువడ్డాయి. ''మాకు అమెరికా ఆంక్షలను సమర్థవంతంగా ఎదుర్కొన్న చరిత్ర ఉంది. మా నుంచే భారత్ కొనుగోళ్లు చేయాలనుకుంటే ఆంక్షల ఛత్రం నుంచి ఒడుపుగా తప్పించుకుంటూనే భారత్‌కు ఆయిల్ సరఫరా చేసే నైపుణ్యాలు మాకు ఉన్నాయి''అని క్రెమ్లిన్ ఆర్థిక సలహాదారు మాక్సిమ్ ఒరెష్కిన్ 'ఛానల్1'ఇంటర్వ్యూలో చెప్పారు.

బార్ కౌన్సిళ్లలో మహిళా లాయర్లకు 30% సీట్లు

ఆదేశాలు జారీచేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: రాష్ట్రాల బార్ కౌన్సిళ్లలో మహిళా న్యాయవాదులకు 30 శాతం సీట్లు కేటాయించాలని సర్వోన్నత న్యాయస్థానం సోమవారం ఆదేశించింది. ఆయా కౌన్సిళ్లలో ఎన్నికల ప్రక్రియ ఇంకా మొదలుకాని రాష్ట్రాల్లోనే తమ నిర్ణయాన్ని వర్తింపజేయాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీల ధర్మాసనం స్పష్టం చేసింది. ''కౌన్సిళ్లకు ఎన్నికలు జరగని పక్షంలో ఆయా రాష్ట్రాల్లో మహిళలకు 20 శాతం సీట్లు కేటాయించాలి. పోటీ చేయడానికి సరిపడా మహిళా అభ్యర్థులు లేనిపక్షంలో మరో10 శాతం సీట్లను వీలైతే పురుషులకు కేటాయించుకోవచ్చు''అని ధర్మాసనం స్పష్టంచేసింది. గతంలో సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు ఇప్పటికే ఆరు బార్ కౌన్సిళ్లలో ఎన్నికల ప్రక్రియ మొదలెట్టేశామని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(బీసీఐ) ఛైర్మన్‌పర్సన్, సీనియర్ న్యాయవాది మనన్ కుమార్ మిశ్రా తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పంజాబ్, హరియాణా, ఉత్తరప్రదేశ్ బార్ కౌన్సిళ్లలో ఎన్నికలకు ఇప్పటికే నోటిఫికేషన్ విడుదలైంది. అన్ని రాష్ట్రాల బార్ కౌన్సిళ్లలో మహిళలకు మూడింట ఒకవంతు రిజర్వేషన్ అమలుచేయాలని లాయర్లు యోగమయ ఎం జీ, షెహ్లా చౌదరిలు వేసిన పిటిషన్ విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ధర్మాసనం పై విధంగా స్పందించింది. ఆఫీస్ బేరర్ పోస్టుల్లో కనీసం ఒక్కటైనా మహిళలకు కేటాయించాలని వాళ్లు ధర్మాసనాన్ని గతంలో కోరారు. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్, ఒక ఆఫీస్‌బేరర్ పోస్ట్ రిజర్వ్‌చేస్తూ గత ఏడాది మే రెండో తేదీన సుప్రీంకోర్టు తీర్పునివ్వడం తెల్సిందే.

నెహ్రూ ప్రతిష్టను ఎవరూ దెబ్బతీయలేరు

ఆయన సేవలు, ఘనతలపై మరక అంటించలేరు

- మోదీ ఎక్కడ ఏం మాట్లాడినా నెహ్రూ ప్రస్తావన తెస్తున్నారు
- లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష ఉపనేత గౌరవ్ గొగోయ్ ఆగ్రహం

న్యూఢిల్లీ: చరిత్రను తిరగరాయడానికి ప్రధాని మోదీ ప్రయత్నిస్తున్నారని లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష ఉపనేత గౌరవ్ గొగోయ్ విమర్శించారు. వందేమాతరంపై చర్చకు రాజకీయ రంగు రుద్దడానికి ఆరాటపడ్డారని ఎద్దేవా చేశారు. పార్లమెంట్ ఏ అంశంపై చర్చ జరిగినా జవహర్‌లాల్ నెహ్రూ ప్రస్తావన ఎందుకు తీసుకొస్తున్నారో చెప్పాలని ప్రధాని మోదీని ప్రశ్నించారు. బీజేపీ ఎంతగా ప్రయత్నించినా, ఎంత దుష్ప్రచారం చేసినా ఈ దేశానికి నెహ్రూ అందించిన సేవలు, ఆయన సాధించిన ఘనతలపై చిన్న మరక కూడా అంటించలేదని తేల్చిచెప్పారు. నెహ్రూ ప్రతిష్టను ఎవరూ దెబ్బతీయలేరని పేర్కొన్నారు. వందేమాతరం గీతానికి మహోన్నత స్థానాన్ని, జాతీయ గీతం హోదాను కల్పించింది కాంగ్రెస్ పార్టీయేనని గుర్తుచేశారు. వందేమాతరం 150వ వార్షికోత్సవంపై సోమవారం లోక్‌సభలో జరిగిన చర్చలో గౌరవ్ గొగోయ్ పాల్గొన్నారు. ప్రధాని మోదీ ఎక్కడ ఏం అంశంపై మాట్లాడినా నెహ్రూను, కాంగ్రెస్‌ను నిందించడం ఒక అలవాటుగా మార్చుకున్నారని మండిపడ్డారు. ఆపరేషన్ సిందూర్‌పై పార్లమెంట్‌లో జరిగిన చర్చలో నెహ్రూ పేరును 14 సార్లు, కాంగ్రెస్ పేరును 50 సార్లు ప్రస్తావించారని గుర్తుచేశారు. ఇప్పుడు వందేమాతరంపై చర్చలో నెహ్రూ పేరును 10 సార్లు, కాంగ్రెస్ పేరును 26 సార్లు తీసుకొచ్చారని ఆక్షేపించారు. 2022లో రాష్ట్రపతి ప్రసంగంపై జరిగిన చర్చలో మోదీ నోటివెంట నెహ్రూ ప్రస్తావన 15 సార్లు వచ్చిందన్నారు. 2020లో జరిగిన చర్చలో 20 సార్లు నెహ్రూ ప్రస్తావన తెచ్చారని వెల్లడించారు.

మోదీ పాలనలో విభజించు, పాలించు విధానం

నిజానికి వందేమాతరం పూర్తి గీతాన్ని ముస్లిం లీగ్ వ్యతిరేకించిందని గౌరవ్ గొగోయ్ వెల్లడించారు. వారి ఒత్తిళ్లను పట్టించుకోకుండా వందేమాతరం గీతాన్ని జాతీయ సభల్లో ఆలపించాలని 1937లో కాంగ్రెస్ నిర్ణయించినట్లు వెల్లడించారు. ఆ నిర్ణయాన్ని ముస్లిం లీగ్‌తోపాటు హిందూ మహాసభ కూడా వ్యతిరేకించాయని అన్నారు. బీజేపీ నాయకులు బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా ఎప్పుడు పోరాటం సాగించారో చెప్పాలని డిమాండ్ చేశారు. స్వాతంత్ర్య పోరాటంతో ఏమాత్రం సంబంధం లేని వ్యక్తులు వందేమాతరం గురించి ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. దేశాన్ని అర్థం చేసుకోవడానికి బీజేపీ ఏనాడూ ప్రయత్నించలేదని విమర్శించారు. దేశంలో ఎన్నో రాష్ట్రాలు, ఎన్నో భాషలు ఉన్నప్పటికీ జాతీయ గ్రంథం మాత్రమే రాజ్యాంగమేనని గొగోయ్ ఉద్ఘాటించారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా రాజ్యాంగాన్ని తాము కాపాడుకుంటున్నామని చెప్పారు. మోదీ ప్రభుత్వం ప్రజల హక్కులను హరిస్తోందని దుయ్యబట్టారు. నేడు దేశంలో బ్రిటిష్ పాలన లేకపోయినా మోదీ పాలనలో విభజించు, పాలించు విధానం అమలవుతోందని ఆరోపించారు. ప్రధాని మోదీ ప్రజల సమస్యల గురించి మాట్లాడకుండా ఎప్పటికప్పుడు తప్పించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. దేశ రాజధానిలో బాంబు పేలితే దాని గురించి నోరువిప్పలేదని తప్పుపట్టారు. మోదీ పాలనలో ప్రజలకు భద్రత ఉందా? అని ప్రశ్నించారు.

అంగారకునిపైనా... ఒక గంగ!

అవును. నిజమే. ఇప్పుడు పూర్తిగా పొడిబారి కనిపిస్తున్న అంగారక గ్రహం ఒకప్పుడు జల కళతో మురిసిపోయేదట. దానిమీద కూడా గంగ వంటి జీవ నదులు పొంగి పారేవట. అలా ఒకటి కాదు, రెండు కాదు, ఏకంగా 16 అతి పెద్ద నదీ వ్యవస్థలతో ఆ గ్రహం కళకళలాడిపోయేదట. ఇందుకు సంబంధించి పక్కా రుజువులు తాజాగా వెలుగు చూడటం విశేషం...!

అమెరికాలోని టెక్సాస్ యూనివర్సిటీ బృందం అంగారకునిపై ఒకప్పుడు కొనసాగిన నదీ వ్యవస్థలను మ్యాపింగ్ చేసింది. అక్కడి నీటిపారుదల వ్యవస్థలపై తొలిసారిగా జరిగిన ఈ సమగ్ర పరిశోధనలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. కనీసం 16 భారీ నదీ వ్యవస్థలు ఒకనాడు గురు గ్రహంపై విలసిల్లినట్టు తేలింది. ప్రాంతాలన్నిటా ఒకప్పుడు జీవం ఉనికి ఉండేదనేందుకు ఇది ఒక ప్రబల తార్కాణమని అధ్యయన బృందం చెబుతోంది.

జల కళ ఇలా...

గురు గ్రహంపై జలావిర్భావం గురించి పలు ఆసక్తికర అంశాలు పరిశోధనలో వెలుగులోకి వచ్చాయి. కొన్ని వందల కోట్ల ఏళ్ల కిందట అంతూ పొంతూ లేని రీతిలో కురిసిన వర్ష ధారల ధాటికి అక్కడ లోయలు, భారీ నదీ వ్యవస్థలు పుట్టుకొచ్చాయట. అవి ప్రస్తుతం భూమిపై తిరుగులేని జీవ వైవిధ్యానికి ప్రతీకలుగా విలసిల్లుతున్న అమెజాన్ వంటి నదీ వ్యవస్థలకు ఏ మాత్రమూ తీసిపోవని అధ్యయన బృందం అంటోంది. ఆ లెక్కన ఒకనాడు గురు గ్రహమూ చక్కని జల కళతో విలసిల్లే ఉంటుందని చెబుతోంది. అంతేకాదు, ఆ భారీ జల రాశి ఏకంగా మహా సముద్రాలుగా కూడా రూపు దాల్చిందట! 'గురు గ్రహంపై నదులు ఉండేవన్నది చాలాకాలంగా మనకు తెలిసిన సంగతే. అయితే బతికి సంబంధించి ఇంత స్పష్టతతో కూడిన వివరాలు వెలుగులోకి రావడం మాత్రం ఇదే తొలిసారి' అని అధ్యయన బృంద సారథి తిమోతీ ఎ.గౌడ్జ్ హర్షం వెలిబుచ్చారు. నదులు, లోయలు, అగాథాలు, పర్వతాలు తదితరాల చిహ్నాలతో కూడిన 19 వ్యవస్థలను పరిశోధకులు గుర్తించారు. వీటిలో 16 ఏకంగా లక్ష చదరపు కిలోమీటర్లకు మించిన విస్తీర్ణంతో కూడుకుని ఉండటం విశేషం. ''అయితే భూమిపై ఉన్న జల వ్యవస్థలతో పోలిస్తే ఇవి మరీ పెద్దవేం కావు. ఉదాహరణగా చెప్పాలంటే ఒక్క అమెజాన్ నదీ వ్యవస్థ విస్తీర్ణమే ఏకంగా 62 లక్షల చదరపు కి.మీ. ఉంటుంది''అని తిమోతీ వివరించారు.

అమూల్య వివరాలు

సమీప భవిష్యత్తులో అంగారక యాత్రలకు నాసా తదితర అంతరిక్ష సంస్థలు సిద్ధమవుతుండటం తెలిసిందే. అందుకు ఈ అరుణ గ్రహం మీద ఏ ప్రాంతాలను ఎంచుకోవాలో తేల్చుకునేందుకు ఈ పరిశోధన చక్కని వీలు కల్పిస్తుందని సైంటిస్టులు ఉంటున్నారు. అంతేగాక అక్కడ ఏయే ప్రాంతాలు ఆవాస యోగ్యమో కూడా కచ్చితమైన అంచనాకు వచ్చేందుకు తోడ్పడుతుందని హర్షం వెలిబుచ్చుతున్నారు. పరిశోధన పూర్తి వివరాలు పీఎన్ఏఎస్‌లో ప్రచురితమయ్యాయి.

\- సాక్షి, నేషనల్ డెస్క్

మయన్మార్ సైన్యం దాడిలో 18 మంది మృతి

టీ షాపులో ఫుట్‌బాల్ మ్యాచ్ చూస్తుండగా వైమానిక దాడి

బ్యాంకాక్: మయన్మార్‌లోని సగాయింగ్ ప్రాంతం మయకాన్ గ్రామంలో ఘోరం జరిగిపోయింది. టీ షాపులోని టీవీలో ఫుట్‌బాల్ మ్యాచ్ తిలకిస్తుండగా, మయన్మార్ సైన్యం వైమానిక దాడికి పాల్పడింది. ఈ ఘటనలో 18 మంది సాధారణ ప్రజలు మృతిచెందారు. ఈ నెల 5వ తేదీన జరిగిన ఈ సంఘటన వివరాలను స్థానిక స్వతంత్ర ఆన్‌లైన్ మీడియా సంస్థ సోమవారం వెల్లడించింది. మరో 20 మందికి గాయపడినట్లు తెలియజేసింది. ప్రజాస్వామ్య అనుకూల సాయుధ పోరాటాలపై మయన్మార్ విరుచుకుపడుతోంది. త్వరలో ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో తాజా దాడి చర్చనీయాంశంగా మారింది. మయన్మార్‌లో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ఆంగ్ సాన్ సూకీ ప్రభుత్వాన్ని 2021 ఫిబ్రవరి 1న సైన్యం కూలదోసింది. అప్పటినుంచి దేశంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. జనం భయంభయంగా బతుకుతున్నారు.

మా సార్వభౌమత్వం పరీక్షించొద్దు: అసిమ్ మునీర్

ఇస్లామాబాద్: పాకిస్తాన్ రక్షణ దళాల అధినేత, ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ నోటీ దురుసు ప్రదర్శిస్తూనే ఉన్నారు. పాకిస్తాన్ శాంతియుత దేశమని చెప్పారు. తమ దేశ ప్రాదేశిక సమగ్రత, సార్వభౌమత్వాన్ని ఎవరూ పరీక్షించొద్దని చెప్పారు. తమ జోలికి వస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. తమను రెచ్చగొట్టే చర్యలకు పాల్పడితే తమ ప్రతిస్పందన చాలా వేగంగా, తీవ్రంగా ఉంటుందన్నారు. ఆయన సోమవారం పాక్ సైనికాధికారులతో సమావేశమయ్యారు. అఫ్గానిస్తాన్‌లోని తాలిబన్లతో సఖ్యతను కోరుకుంటున్నామని చెప్పారు. పాకిస్తాన్ కావాలో లేక నిషేధిత తెహ్రీక్–ఇ–తాలిబన్ సంస్థ కావాలో తేల్చుకోవాలని తాలిబన్లకు అసిమ్ మునీర్ తేల్చిచెప్పారు.

కాంగోలో బాంబు పేలుడు...

30 మందికి పైగా మృతి

గోమా: తూర్పు కాంగోలోని సెంజ్ పట్టణం సమీపంలో సోమవారం జరిగిన బాంబు పేలుడులో కనీసం 30 మందికి లోగా మరణించారు. మరో 20 మందికి పైగా గాయపడ్డారు. సైన్యానికి, ప్రభుత్వ అనుకూల సాయుధ ముఠాలకు మధ్య ఘర్షణలో భాగంగా ఈ దుర్ఘటన జరిగింది. ఇరు వర్గాల మధ్య ఇటీవలే అమెరికా మధ్యవర్తిత్వంలో వాషింగ్టన్ లో శాంతి ఒప్పందం కుదిరింది. అయినా వారి మధ్య ఘర్షణలకు మాత్రం తెర పడటం లేదు. రువండా సరిహద్దుల సమీపంలోని పుష్కలమైన ఖనిజ నిల్వలకు నిలయమైన ప్రాంతాలపై పట్టు కోసం ఇటు సర్కారు, దాని అధీనంలో లేని సైన్యంతో పాటు కనీసం 100కు పైగా సాయుధ ముఠాలు పోటీ పడుతున్నాయి. ఫలితంగా ఏకంగా 70 లక్షల మందికి పైగా అక్కడి నుంచి పొట్ట చేతబట్టుకుని వలస బాట పట్టారు.

బంకిం దా కాదు.. బంకిం బాబు అనండి

న్యూఢిల్లీ: లోక్‌సభలో సోమవారం వందేమాతరంపై ప్రత్యేక చర్చ సందర్భంగా ఆసక్తికరమైన సన్నివేశం చోటుచేసుకుంది. వందేమాతర గీత రచయిత బంకించంద్ర చటర్జీ పేరును ప్రధాని నరేంద్ర మోదీ 'బంకిం దా'అని అని పలికారు. దీనిపై బెంగాల్‌కు చెందిన తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ సౌగతా రాయ్ అభ్యంతరం వ్యక్తంచేశారు. బంకిం దా కాదు.. బంకిం బాబు అనండి అంటూ సూచించారు. బంకించంద్ర చటర్జీ పేరు చివర గౌరవ సూచకంగా బాబు అనే మాట చేర్చాలని చెప్పారు. అందుకు మోదీ స్పందిస్తూ... ''బంకిం బాబు అని చెబుతా. మీకు కృతజ్ఞతలు. మీ సెంటిమెంట్‌ను గౌరవిస్తున్నా''అని బదులిచ్చారు. మిమ్మల్ని దాదా అని సంబోధించవచ్చా? అందుకు మీకేమైనా అభ్యంతరమా? అంటూ సౌగతా రాయ్‌ని సరదాగా ప్రశ్నించారు. దా అంటే బెంగాలీ భాషలో అన్న అని అర్థం. మరింత గౌరవంగా బాబు అని అంటుంటారు.

బిహార్‌లో గెలిచాం.. ఇక బెంగాల్ పనిపడతాం

వందేమాతరంపై చర్చను ప్రారంభించడానికి ప్రధాని మోదీ లోక్‌సభలోకి ప్రవేశిస్తుండగా, అప్పటికే సభలో ఉన్న బీజేపీ ఎంపీలు బిగ్గరగా నినాదాలు చేస్తూ ఆయనకు స్వాగతం పలికారు. 'బిహార్‌లో గెలిచాం.. ఇక బెంగాల్ పని పడతాం'అంటూ నినదించారు. అలాగే వందేమాతరం అంటూ మోదీకి అభివాదం చేశారు. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు వచ్చే ఏడాది జరుగబోతున్నాయి.

బీజేపీ కార్యక్రమానికి నేనెట్లా హాజరవుతా?

'గీతా పారాయణం' గైర్హాజరీపై మమతా బెనర్జీ

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో సనాతన సంస్కృతి సంసద్ నిర్వహించిన భగవద్గీత పారాయణ కార్యక్రమానికి గైర్హాజరీని ముఖ్యమంత్రి మమత బెనర్జీ సమర్థించుకున్నారు. అది భారతీయ జనతా పార్టీకి సంబంధించిన కార్యక్రమని, దానికి తానెలా? హాజరవుతానని ఆమె ప్రశ్నించారు. 'ఏ పార్టీతో సంబంధం లేని కార్యక్రమం అయితే నేను కచ్చితంగా హాజరవుతా. ఒక పార్టీకి సంబంధించిన కార్యక్రమాన్ని, సిద్ధాంతాన్ని నేనెలా అనుసరిస్తా. నేను అన్ని కులాలు, మతాలను గౌరవించే వ్యక్తిని అని ఆమె తెలిపారు. రాష్ట్రంలో అధికారిక పర్యటనకు బయలుదేరే ముందు కోల్‌కతా విమానాశ్రయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్‌ను దేశద్రోహిగా, మహాత్మాగాంధీ ఆదర్శాలను పాటించని వ్యక్తులు నిర్వహించే కార్యక్రమాలకు తాను హాజరు కాబోనని స్పష్టం చేశారు. తనను బెంగాలీ ఉపాధ్యాయులు తీర్చిదిద్దారని, బెంగాలు అవమానించే, వ్యతిరేకించే వారితో తాను ఉండబోనని ఆమె నొక్కి చెప్పారు. సనాతన సంస్కృతి సంసద్ సంస్థ ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా భగవద్గీత పారాయణం కార్యక్రమాన్ని నిర్వహించింది. దీనికి ముఖ్యమంత్రి మమతా బెనర్జీతోపాటు గవర్నర్ సీవీ ఆనంద్‌బోస్‌ని ఆహ్వానించారు. వేలాది మంది పాల్గొన్న ఈ కార్యక్రమానికి గవర్నర్, సీనియర్ బీజేపీ నాయకులు హాజరయ్యారు. ముఖ్యమంత్రి హాజరుకాకపోవడాన్ని రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు సువేందు అధికారి ప్రశ్నించారు. 'నిజమైన హిందువు అలాంటి ఆహ్వానాలను విస్మరించరు. అలా చేశారంటే.. వారి నమ్మకాలపై సందేహం వస్తుంది'అని విమర్శించారు.

బెంగాల్ 'బాబ్రీ' మసీదుకు రూ.1.30 కోట్ల విరాళాలు

బహరాంపూర్: పశ్చిమ బెంగాల్‌లో మసీదు నిర్మాణానికి ఇప్పటివరకు రూ.1.30 కోట్లకు పైగా విరాళాలు వచ్చాయని టీఎంసీ బహిష్కృత ఎమ్మెల్యే హుమాయున్ కబీర్ సన్నిహిత నాయకులు తెలిపారు. నాలుగు విరాళాల బాక్సులు, ఒక నంబి నుంచి రూ37.33 లక్షల నగదు, ఆన్‌లైన్‌లో రూ.93 లక్షల వచ్చాయని ప్రకటించారు. మరో ఏడు బాక్సులు ఇంకా లెక్కించాల్సి ఉందన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీలో ఉన్న కబీర్ 2012లో తృణమూల్ కాంగ్రెస్‌లో చేరారు. తరువాత కొంతకాలం బీజేపీకి వెళ్లి 2020లో అధికార పార్టీకి తిరిగొచ్చారు. పార్టీ నాయకత్వంతో నిత్యం ఘర్షణ పడుతూనే ఉన్నారు. ముర్షిదాబాద్‌లో ఈనెల 6న బాబ్రీ మసీదు తరహా మసీదు నిర్మాణాన్ని ప్రారంభిస్తానని ప్రకటించారు. దీనిని సీరియస్‌గా తీసుకున్న టీఎంసీ ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. దీంతో డిసెంబర్ 22న కొత్త రాజకీయ పార్టీని ప్రారంభిస్తానని, రాబోయే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో 135 అసెంబ్లీ నియోజకవర్గాల్లో అభ్యర్థులను పోటీ చేయిస్తానని ఆయన ప్రకటించారు. ముందే ప్రకటించిన మేరకు ముర్షిదాబాద్‌లోని రెజినగర్‌లో మసీదుకు శనివారం కేంద్ర, రాష్ట్ర బలగాల భారీ భద్రత మధ్య శంకుస్థాపన చేశారు. అయోధ్యలో బాబ్రీ మసీదు కూల్చివేసిన రోజు.. డిసెంబర్ 6ను శంకుస్థాపనకు ఎంచుకున్నారు. సభా వేదిక వద్ద విరాళాలకోసం 11 బాక్సులను ఏర్పాటు చేశారు. దీనికి పెద్ద ఎత్తున స్పందన వచ్చింది.

వర్చువల్‌గా హాజరవుతానన్న వాంగ్‌చుక్

వ్యతిరేకించిన కేంద్రం, విచారణ 15కు వాయిదా

న్యూఢిల్లీ: వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జోధ్‌పూర్ జైలు నుంచి తాను సుప్రీంకోర్టుకు హాజరవుతానని పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ చేసిన అభ్యర్థనను కేంద్రం వ్యతిరేకించింది. జాతీయ భద్రతా చట్టం కింద నిర్బంధాన్ని ఎదుర్కొంటున్న సోనమ్ వాంగ్‌చుక్ ప్రస్తుతం జోధ్‌పూర్ జైల్లో ఉన్నారు. వాంగ్‌చుక్‌ను నిర్బంధించడం చట్ట విరుద్ధమని, ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడమేనని ఆరోపిస్తూ ఆయన భార్య గీతాంజలి జె ఆంగ్మో వేసిన పిటిషన్‌ను సోమవారం సుప్రీంకోర్టు విచారించింది. అంగ్మో తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ హాజరై వాదించారు. వాంగ్‌చుక్ జైలు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరవ్వాలని కోరుకుంటున్నారని, బెంచ్ నుంచి అనుమతి కోరారని న్యాయమూర్తులు అరవింద్ కుమార్, ఎన్వీ అంజారియాలతో కూడిన ధర్మాసనానికి విన్నవించారు. అయితే వాంగ్‌చుక్ అభ్యర్థనను కేంద్రం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వ్యతిరేకించారు. దేశవ్యాప్తంగా ఆరోపణలు ఎదుర్కొంటున్నవారందరూ కోర్టు ముందు సమానమేనని, అందరికీ ఒకే విధంగా వ్యవహరించాల్సి ఉంటుందని తెలిపారు. దీంతో ధర్మాసనం కేసు విచారణను15కు వాయిదా వేసింది. లద్దాఖ్‌కు రాష్ట్ర హోదా, ఆరో షెడ్యూల్ హోదాను కోరుతూ సెప్టెంబర్ 24న జరిగిన నిరసనలు హింసాత్మకంగా మారాయి. నలుగురు మరణించగా, 90 మంది గాయపడ్డారు. హింసను ప్రేరేపించారన్న ఆరోపణలతో రెండు రోజుల తరువాత జాతీయ భద్రతా చట్టం కింద వాంగ్‌చుక్‌ను అదుపులోకి తీసుకున్నారు.

ఆరోగ్యభద్రత, జాతీయ భద్రత బిల్లుకు పార్లమెంట్ ఆమోదం

న్యూఢిల్లీ: దేశ ప్రజల ఆరోగ్యాన్ని హరిస్తూ పరోక్షంగా యువతరానికి ప్రాణసంకటంగా పరిణమించిన పాన్‌మసాలా వంటి అయోగ్య(డీమెరిట్) వస్తువుల తయారీ కర్మాగారాలపై అదనపు సెస్ విధింపునకు మార్గం సుగమంచేస్తూ తీసుకొచ్చిన 'ఆరోగ్య భద్రత నుంచి జాతీయ భద్రత బిల్లు2025'ను పార్లమెంట్ సోమవారం ఆమోదించింది. ఈ బిల్లు రాజ్యసభ ఆమోదం తెలిపి మళ్లీ లోక్‌సభకు పంపించింది. అయితే గత శుక్రవారమే లోక్‌సభలో ఈ బిల్లు ఆమోదంపొందిన విషయం తెల్సిందే. అయితే సోమవారం తొలుత ఈ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టినప్పుడు విపక్ష పార్టీల నేతలు అభ్యంతరం వ్యక్తంచేశారు. '' హెల్త్ సెక్యూరిటీ సే నేషనల్ సెక్యూరిటీ అంటూ బిల్లుకు హిందీ, ఇంగ్లిష్ భాషల కలగాపులకంగా పేరు పెట్టారు. తొలుత ఈ బిల్లును సమీక్ష కోసం పార్లమెంటరీ ప్యానెల్‌కు సిఫార్సుచేయాలి'' అని డిమాండ్‌చేశారు. దీనిపై ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడారు. '' ఇది నిత్యావసర వస్తువులపై సెస్ విధించేందుకు ఉద్దేశించిన బిల్లు కాదు'' అని స్పష్టంచేశారు. పాన్‌మసాలా వంటి అయోగ్య వస్తువుల నుంచి భారీగా ఆదాయం సమకూరుతున్నంత మాత్రాన దేశ ప్రజల ప్రాణాలను పణంగా పెట్టబోమని ఆమె వ్యాఖ్యానించారు.

మా ప్రతిపాదనను ఆయనింకా చదవలేదు

జెలెన్‌స్కీపై ట్రంప్ అసహనం

కీవ్: మధ్యవర్తిత్వం ద్వారా రష్యా–ఉక్రెయిన్ యుద్ధానికి ఓవైపు తాము శాయశక్తులా కృషిచేస్తుంటే ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ మాత్రం కనీసం ప్రతిపాదిత శాంతి ఒడంబడిక అంశాలను చదవలేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అసహనం వ్యక్తంచేశారు. సోమవారం కెన్నడీ సెంటర్ హానర్స్‌లో మీడియాతో ట్రంప్ మాట్లాడారు. ''రష్యా–ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు, పరిష్కారం వెతికేందుకు గురువారం నుంచి మూడ్రోజుల పాటు ఉక్రెయిన్ మధ్యవర్తులతో అమెరికా మధ్యవర్తులు ఎడతెరిపి చర్చలు జరిపారు. మేం ఇంతగా కష్టపడుతుంటే జెలెన్‌స్కీ మాత్రం పూర్తి నిర్లక్ష్యధోరణితో వ్యవహరిస్తున్నారు. ఇంతవరకు కనీసం అమెరికా ప్రతిపాదిత శాంతి ఒడంబడికలోని కీలక అంశాలను చదవకపోవడం నన్నెంతో నిరాశ పరిచింది. ఒడంబడికలో మేం పొందుపరిచిన అంశాలపై రష్యా సానుకూలంగా కనబడుతోంది. జెలెన్‌స్కీ వైఖరి పూర్తి భిన్నంగా ఉంది'' అని ట్రంప్ అసహనం వ్యక్తంచేశారు. మరోవైపు సోమవారం లండన్‌లో జెలెన్‌స్కీతో బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ నేతలు సమావేశమై యుద్ధాన్ని ముగించేందుకు ఆయనను ఒప్పించే ప్రయత్నంచేయనున్నారు.

మహారాష్ట్ర అసెంబ్లీలో పూర్తి వందేమాతరం

నాగ్‌పూర్: జాతీయ గీతం 'వందేమాతరం' పూర్తి ఆలాపనతో మహారాష్ట్ర అసెంబ్లీ, శాసనమండలి సమావేశాలు ప్రారంభమయ్యాయి. వందేమాతరం 150వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఉభయసభల సభ్యులు శీతాకాల సమావేశాల సందర్భంగా మొదటి రోజున వందేమాతరం పూర్తి వెర్షన్‌ను పాడారు. ఆ తర్వాత రాష్ట్ర అధికారిక గీతం ఆలపించారు. 'ప్రతి సమావేశంలో మొదటి రోజున వందేమాతరం మొదటి రెండు చరణాలను పఠించడం శాసనసభ సంప్రదాయం. అయితే, గీతం కూర్పు జరిగి 150 సంవత్సరాలు పూర్తయినందున ఈ సంవత్సరం సభ మొత్తం పాటను పారాయణం చేస్తుంది' అని అసెంబ్లీ స్పీకర్ రాహుల్ నర్వేకర్, కౌన్సిల్ చైర్ పర్సన్ రాం షిండే తెలిపారు. బంకిం చంద్ర ఛటర్జీ రాసిన వందేమాతరం గీతం 150వ వార్షికోత్సవం సందర్భంగా ఏడాది పొడవునా జరిగే వేడుకల్లో ఆలపించాలని ప్రధాని మోదీ నవంబర్ 7న సూచించారు. ముఖ్యంగా యువత, విద్యార్థుల్లో గీతం ప్రాముఖ్యతపై అవగాహన పెంచడం దీని లక్ష్యం.

ప్రాథమిక హక్కుల పరిరక్షణ కర్త సుప్రీంకోర్టు

వ్యక్తిగత స్వేచ్ఛలు, హక్కులు

ప్రకరణ–28

విద్యాలయాల్లో మత బోధన నిషేధం

ప్రకరణ 28(1): ప్రభుత్వ ఆర్థిక సహాయంతో నడిచే ప్రైవేట్ విద్యాసంస్థల్లో ప్రత్యేక మత బోధన నిషేధం. **ప్రకరణ 28(2):** పై నిబంధనకు కొన్ని మినహాయింపులిచ్చారు. ప్రభుత్వం నిర్వహించే దేవాదాయ, ధర్మాదాయ సంస్థల్లో ప్రత్యేక మత బోధన చేయవచ్చు. **ప్రకరణ 28(3):** ప్రభుత్వ గుర్తింపు ఉన్న, ప్రభుత్వ ఆర్థిక సహాయం పొందే విద్యాసంస్థల్లో ఒక వ్యక్తి ఐచ్ఛికంగా మత ప్రార్థనలు /బోధనల్లో పాల్గొనవచ్చు. అయితే పాల్గొనమని ఒత్తిడి చేయరాదు. ఆ వ్యక్తి మైనర్ అయితే తల్లిదండ్రులు లేదా సంరక్షకుడి అనుమతి తీసుకోవాలి.

ప్రకరణలు–29, 30

విద్యా, సాంస్కృతిక పరమైన హక్కులు

ప్రకరణ 29(1): భారతదేశంలో నివసిస్తున్న ప్రజలకు ప్రత్యేక భాష, లిపి, సంస్కృతి ఉంటే.. వాటిని పరిరక్షించుకుని, పెంపొందించుకునే స్వేచ్ఛ వారికి ఉంటుంది.

ప్రకరణ 29(2): ప్రభుత్వం నిర్వహిస్తోన్న లేదా ప్రభుత్వ ఆర్థిక సహాయం పొందుతున్న సంస్థల్లో ప్రవేశానికి మతం, జాతి, కులం, భాషా ప్రాతిపదికన వివక్ష చూపరాదు.

ప్రకరణ 30(1): మైనారిటీ వర్గాలవారు, ప్రత్యేక విద్యాసంస్థలను ఏర్పాటు చేసుకొని, నిర్వహించుకోవచ్చు.

ప్రకరణ 30(1)(ఎ): మైనారిటీలు నిర్వహిస్తున్న విద్యాసంస్థలు, వాటి ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటే, వారికి ప్రత్యేక నష్టపరిహారం చెల్లించాలి. 1978లో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ఈ క్లాజును చేర్చారు.

ప్రకరణ 30(2): ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించే సమయంలో విద్యాసంస్థల పట్ల వివక్ష చూపరాదు. అల్ప సంఖ్యాక వర్గాల వారు నడిపే సంస్థలు, అధిక సంఖ్యాక వర్గాల వారు నడిపే సంస్థలను సమ దృష్టితో చూడాలి.

వివరణ:

- ఆర్టికల్ 29, 30లలో 'మైనారిటీ' పదాన్ని ప్రస్తావించారు. కానీ ఈ పదాన్ని రాజ్యాంగంలో ఎక్కడా నిర్వచించలేదు.
- మైనారిటీల వర్గీకరణకు రాష్ట్రాన్ని ప్రాతిపదికగా తీసుకోవాలని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. దేశంలో రెండు రకాల మైనారిటీ వర్గాలున్నాయి. అవి మతపరమైన, భాషాపరమైన మైనారిటీ వర్గాలు.
- హిందువులు మినహా మిగతా వారంతా మతపరమైన మైనారిటీలే. భాషాపరమైన మైనారిటీలు రాష్ట్రాల వారీగా మారుతుంటారు. ఉదాహరణకు.. తెలంగాణలో కన్నడిగులు, గుజరాతీలు, మరాఠీలు భాషాపరంగా మైనారిటీలు.

సుప్రీంకోర్టు తీర్పులు

కేరళ విద్య పాఠ్యాంశాల సవరణ బిల్లు (1958) కేసు: కేరళ ప్రభుత్వ పాఠశాలల్లో విప్లవ, కమ్యూనిస్టు భావాలున్న పాఠ్యాంశాలను చేర్చారు. దీంతో ఈ బిల్లును సుప్రీంకోర్టు సలహా పరిధికి నివేదించారు. పాఠ్యాంశాల్లో తీవ్రవాద భావజాలాన్ని చేర్చడం చెల్లదని సుప్రీంకోర్టు తెలిపింది.

డి.ఎ.వి. కాలేజ్ v/s స్టేట్ ఆఫ్ పంజాబ్ (1971) కేసు: విశ్వవిద్యాలయాలు, వాటి అనుబంధ కళాశాలల్లో పంజాబీ మాత్రమే బోధన భాషగా ఉండాలని నిర్ణయించారు. అయితే ఇది చెల్లుబాటు కాదని సుప్రీంకోర్టు తీర్పుచెప్పింది.

ఆల్‌సెయింట్స్ v/s గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (1980) కేసు: మైనారిటీ విద్యాసంస్థల నిర్వహణలో ప్రభుత్వం జోక్యం చేసుకోరాదని ఈ కేసులో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

టి.ఎం.ఎ.పాయ్ v/s స్టేట్ ఆఫ్ కర్ణాటక (2003) కేసు: మైనారిటీ విద్యా సంస్థల విషయంలో ప్రభుత్వం ఏ సందర్భంలో జోక్యం చేసుకోవచ్చో, జోక్యం చేసుకోరాదో వివరణ ఇస్తూ కొన్ని మార్గదర్శకాలు జారీ చేసింది. అవి..

- మైనారిటీ స్థాయిని నిర్ణయించడానికి రాష్ట్రాన్ని మాత్రమే యూనిట్‌గా తీసుకోవాలి.
- మైనారిటీ అనే పదంలో భాషాపరమైన, మతపరమైన మైనారిటీలు ఉండవచ్చు.
- బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలు, వారిపై పాలనా నియంత్రణ సంబంధిత హక్కులు మేనేజ్‌మెంట్‌కే ఉంటాయి. ప్రభుత్వ ధనసహాయం పొందని మైనారిటీ విద్యాసంస్థల ఫీజులను నియంత్రించే అధికారం ప్రభుత్వానికి లేదు. అయితే క్యాపిటేషన్ ఫీజులను ప్రభుత్వం నియంత్రించవచ్చు.

ప్రకరణ – 31

ఆస్తిహక్కు

పార్లమెంటు ఆస్తి హక్కుకు సంబంధించి అనేక సవరణలు, చట్టాలు చేసింది. 1951లో మొదటి రాజ్యాంగ సవరణ,1964లో 17వ రాజ్యాంగ సవరణ, 1971లో 24వ రాజ్యాంగ సవరణ చేశారు. 1978లో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆస్తి హక్కును ప్రాథమిక హక్కుల జాబితా నుంచి తొలగించారు. దాన్ని 12వ భాగంలో ప్రకరణ 300–ఎలో రాజ్యాంగ పరమైన హక్కుగా (Constitutional Rights) చేర్చారు. 1979 జూన్ 20 నుంచి ఇది అమల్లోకి వచ్చింది. అలాగే ఆస్తి హక్కుకు సంబంధించి నూతన నిబంధనలను కూడా చేర్చారు.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

ప్రకరణ 31(ఎ): ప్రభుత్వం ఆస్తిని స్వాధీనం చేసుకున్నప్పుడు వర్తించే కొన్ని మినహాయింపులను ఈ ప్రకరణలో పేర్కొన్నారు. భూ సంస్కరణల అమలు కోసం చట్టాలు చేసినప్పుడు.. అవి 14, 19 ప్రకరణలకు వ్యతిరేకమనే కారణంతో న్యాయస్థానాల్లో ప్రశ్నించరాదు.

ప్రకరణ 31(బి): కొన్ని చట్టాల వర్తింపునకు మినహాయింపులు. వీటిని 9వ షెడ్యూల్డ్‌లో ప్రస్తావించారు. ప్రాథమిక హక్కులకు వ్యతిరేకంగా ఉన్నాయన్న కారణంతో ఇలాంటి చట్టాలను న్యాయస్థానాల్లో ప్రశ్నించరాదు. 9వ షెడ్యూల్డ్‌లో పేర్కొన్న అంశాలు సాధారణంగా న్యాయ సమీక్షకు గురికావు. కానీ 'రాజ్యాంగ మౌలిక నిర్మాణంలో న్యాయ సమీక్ష అంతర్భాగం. దాన్ని పరిమితం చేసే అధికారం పార్లమెంటుకు లేదు' అని కేశవానంద భారతి కేసు(1973)లో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

2007లో ఐ.ఆర్. కొహెల్హో v/s తమిళనాడు కేసులో 'న్యాయ సమీక్ష రాజ్యాంగ మౌలిక నిర్మాణంలోకి వస్తుంది. కాబట్టి 1973 తర్వాత 9వ షెడ్యూల్‌లో చేర్చిన అంశాలు న్యాయ సమీక్షకు గురవుతాయి' అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.

ప్రకరణ 31(సి): ఆదేశిక సూత్రాల అమలు కోసం ప్రాథమిక హక్కులపై, ముఖ్యంగా ఆస్తి హక్కుపై కొన్ని పరిమితులు విధించవచ్చు. ఈ పరిమితులు రాజ్యాంగ విరుద్ధమంటూ న్యాయస్థానాల్లో ప్రశ్నించడానికి వీల్లేదు. ఆదేశిక సూత్రాల్లోని ప్రకరణ 39లో ఉన్న క్లాజు బి, సిలో సామ్యవాద తరహా సమాజ స్థాపన గురించి పేర్కొన్నారు. ఈ విషయమై రాజ్యాంగ సవరణ ద్వారా పార్లమెంటు కొన్ని పరిమితులు విధిస్తే, అవి ప్రాథమిక హక్కులకు వ్యతిరేకమని న్యాయస్థానంలో ప్రశ్నించలేం.

వివరణ:

ప్రకరణ 31(ఎ), 31(బి), 31(సి)లు ఆస్తిహక్కుపై పరిమితికి సంబంధించినవి. ఇవి ఎలాంటి ప్రాథమిక హక్కులను ప్రసాదించవు. 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆస్తి హక్కు ప్రకరణ 31ను తొలగించారు. కానీ వీటిని మాత్రం కొనసాగించారు.

మత స్వేచ్ఛ - సుప్రీంకోర్టు తీర్పులు

బిజో ఇమాన్యువల్ v/s స్టేట్ ఆఫ్ కేరళ (1986) కేసు:
జాతీయ గీతాన్ని ఆలపించడం తమ మత విశ్వాసాలకు విరుద్ధమని నిరూపించగలిగితే.. జాతీయ గీతం పాడాలని ఏ వ్యక్తిని ఒత్తిడి చేయరాదని సుప్రీంకోర్టు పేర్కొంది. కేరళ పాఠశాలల్లో జాతీయ గీతం ఆలపించడం తప్పనిసరి చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. దీన్ని ప్రశ్నిస్తూ సుప్రీంకోర్టులో ఈ కేసు దాఖలైంది.

సెయింట్ జేవియర్స్ కాలేజీ v/s స్టేట్ ఆఫ్ గుజరాత్ (1974) కేసు:
'లౌకికతత్వం' పదానికి ఈ కేసులో సుప్రీంకోర్టు వివరణ ఇచ్చింది. మతానికి, దేవుడికి అతీతంగా వ్యవహరించడమే లౌకికతత్వం. దేవుడి పట్ల ప్రత్యేక ద్వేషం, వ్యతిరేకత చూపకూడదు. దేవుణ్ని నమ్మేవారిని, నమ్మని వారిని ప్రభుత్వం ఒకే విధంగా చూడాలి.

ప్రకరణ – 32

రాజ్యాంగ పరిహార హక్కు (Right to Constitutional Remedies)

ప్రాథమిక హక్కుల్లో ఇది అత్యంత ముఖ్యమైంది. మూడో భాగంలో పొందుపరచిన ప్రాథమిక హక్కులకు భంగం కలిగినా/ఆ హక్కులను పరిమితం చేసినా/అమలు చేయకపోయినా, బాధితులు నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించి తగిన రాజ్యాంగ పరిహారాలను పొందవచ్చు. మొదటి ఆరు ప్రాథమిక హక్కుల అమలు ఈ నిబంధన పైనే ఆధారపడి ఉంటుంది. హక్కులను గుర్తించడంతో పాటు, వాటి అమలుకు హామీ ఉన్నప్పుడే వాటికి విలువ ఉంటుంది. అమలు కాని హక్కులు వ్యర్థం.

ప్రాథమిక హక్కుల పరిరక్షణకు నిబంధన 32 (4) హామీ ఇస్తోంది. అందుకే అంబేద్కర్ రాజ్యాంగ పరిహార హక్కును రాజ్యాంగ ఆత్మగా, హృదయంగా వర్ణించారు.

ప్రకరణ 32(1): ఒక వ్యక్తి ప్రాథమిక హక్కులకు భంగం కలిగినప్పుడు లేదా అవి అమలు కానప్పుడు ఆ వ్యక్తి నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించి తగిన పరిహారం పొందవచ్చు.

ప్రకరణ 32(2): హక్కులను కాపాడటానికి ప్రత్యేక ఆదేశాలైన హెబియస్ కార్పస్, మాండమస్, ప్రొహిబిషన్, కో–వారెంటో, సెర్షియరీ లాంటి రిట్లను సుప్రీంకోర్టు జారీ చేసేందుకు ఈ భాగం వీలు కల్పిస్తుంది.

ప్రకరణ32(3):సుప్రీంకోర్టు అధికారాలకు విఘాతం కలగకుండా, ఇతర న్యాయస్థానాల(స్థానిక కోర్టులు, జిల్లా కోర్టులు)కు కూడా రిట్లు జారీచేసే అధికారాన్ని పార్లమెంటు చట్టం ద్వారా కల్పించవచ్చు.

ప్రకరణ 32(4): రాజ్యాంగంలో ఇతరత్రా అనుమతించిన విధంగా తప్ప ఈ ప్రకరణ ద్వారా గుర్తించిన హక్కులు రద్దు కావు.

వివరణ:

రాజ్యాంగ మౌలిక నిర్మాణంలో రాజ్యాంగ పరిహార హక్కు అంతర్భాగమని 1981లో ఫర్టిలైజర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

రిట్లు-పరిధి-పరిమితులు

ప్రాథమిక హక్కుల పరిరక్షణకు జారీచేసే ప్రత్యేక ఆదేశాలను న్యాయశాస్త్ర పరిభాషలో రిట్లు (Writs) అంటారు. రిట్లు జారీ చేసే పద్ధతిని బ్రిటన్ రాజ్యాంగం నుంచి గ్రహించారు. నిబంధన 32 ప్రకారం సుప్రీంకోర్టుకు, నిబంధన 226 ప్రకారం రాష్ట్ర హైకోర్టులకు రిట్లు జారీ చేసే అధికారాన్ని కల్పించారు. పార్లమెంటు ప్రత్యేక చట్టం ద్వారా ఈ అధికారాన్ని జిల్లా న్యాయస్థానాలకు కల్పించవచ్చు. ఇప్పటి దాకా పార్లమెంటు అలాంటి చట్టాలను రూపొందించలేదు. కాబట్టి సుప్రీంకోర్టు, హైకోర్టులకు మాత్రమే రిట్లు జారీ చేసే అధికారం ఉంది. రిట్ల జారీ విషయంలో సుప్రీంకోర్టు, హైకోర్టు మధ్య వ్యత్యాసాలు ఉన్నాయి. హైకోర్టులు జారీ చేసే రిట్ అత్యవసర పరిస్థితుల్లో రద్దవుతుంది. ప్రకరణ 226 విషయ పరిధి తక్కువ. కానీ సుప్రీంకోర్టు జారీ చేసే రిట్ అత్యవసర పరిస్థితుల్లో రద్దు కాదు. ప్రకరణ 32 విషయ పరిధి విస్తృతమైంది.

ప్రాథమిక హక్కుల పరిరక్షణలో సుప్రీం కోర్టుకు ప్రత్యేకమైన, ప్రాథమిక విచారణ పరిధి ఉంటుంది (Primary and Original). అందుకే సుప్రీం కోర్టును ప్రాథమిక హక్కుల పరిరక్షణ కర్త అంటారు.

ప్రాథమిక హక్కుల పరిరక్షణలో సుప్రీంకోర్టు, హైకోర్టులకు ఉమ్మడి పరిధి ఉంటుంది. అంటే పౌరులు ప్రాథమిక హక్కుల పరిరక్షణకు ప్రకరణ 32 ప్రకారం నేరుగా సుప్రీంకోర్టును లేదా ప్రకరణ 226 ప్రకారం హైకోర్టును ఆశ్రయించవచ్చు.

సాధారణంగా హైకోర్టు ద్వారా తగిన రక్షణ, ఉపశమనం లభిస్తుందని పౌరులు భావిస్తే, మొదట హైకోర్టును ఆశ్రయించాలని కనుభాయ్ బ్రహ్మ భట్ v/s గుజరాత్ (1972) కేసులో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

వివిధ రిట్లు-అర్థం-పరిధి-ప్రాముఖ్యత

హెబియస్ కార్పస్ (Hebeas Corpus)

ఈ పదం లాటిన్ భాష నుంచి వచ్చింది. హెబియస్ అంటే 'Have', కార్పస్ అంటే 'Body' అని అర్థం. ఒక వ్యక్తిని భౌతికంగా కోర్టు ముందు హాజరుపర్చడమని దీనికి అర్థం. ఇది పురాతన రిట్. నిబంధన 19–22 వరకు పొందుపరచిన వ్యక్తిగత స్వేచ్ఛలకు భంగం కలిగినప్పుడు ఈ రిట్ జారీ చేస్తారు. అరెస్టయిన వ్యక్తిని 24 గంటల్లోగా సమీప న్యాయస్థానంలో హాజరుపరచాలి. లేని పక్షంలో ఈ రిట్ దాఖలు చేస్తే వెంటనే ఆ వ్యక్తిని న్యాయస్థానం ముందు హాజరుపరచాలని కోర్టు ఆదేశిస్తుంది.

వ్యక్తిగత స్వేచ్ఛల పరిరక్షణతోపాటు చట్టబద్ధత లేకుండా ఏ వ్యక్తిని నిర్బంధించకుండా, శిక్షించకుండా కాపాడటం ఈ రిట్ ప్రధాన ఉద్దేశం. ఈ రిట్‌ను ప్రభుత్వ సంస్థలకు, ప్రైవేట్ వ్యక్తులకు కూడా జారీ చేయవచ్చు.

మూడో వ్యక్తికి కూడా ఇందులో జోక్యం చేసుకునే హక్కు(లోకస్ స్టాండై) ఉంటుంది. బాధితుల తరపున సామాజిక స్పృహ ఉన్న సంస్థ/వ్యక్తి ఈ రిట్ దాఖలు చేయవచ్చు. అందుకే దీన్ని ఉదారమైన రిట్ అని, వ్యక్తిగత స్వేచ్ఛల పరిరక్షణ సాధనమని అంటారు.

మినహాయింపులు:

పార్లమెంటు స్వాధికారాలకు భంగం కలిగించిన కారణంతో వ్యక్తిని నిర్బంధించినప్పుడు, కోర్టు ద్వారా నేరారోపణ నిరూపితమై జైలు శిక్ష అనుభవిస్తున్నప్పుడు ఇది వర్తించదు.

మాండమస్ (Mandamus)

భాషాపరంగా మాండమస్ అంటే ఆదేశం అని అర్థం.సుప్రీం కోర్టు లేదా హైకోర్టు జారీచేసే అత్యున్నత ఆదేశంగా దీన్ని చెప్పవచ్చు. ప్రభుత్వాధికారి/సంస్థ తమ చట్టబద్ధమైన విధులను నిర్వర్తించనప్పుడు వాటిని నిర్వర్తించమని న్యాయస్థానం ఇచ్చే ఆదేశం.

ప్రభుత్వాధికారులు, సంస్థలు తమ విధులను చట్టబద్ధంగా నిర్వర్తించనప్పుడు ప్రజల హక్కులకు భంగం వాటిల్లుతుంది.అలాంటి సందర్భాల్లో వారు సక్రమంగా విధులు నిర్వర్తించడానికి ఈ రిట్ జారీ చేస్తారు. పబ్లిక్ సంస్థలు, క్వాజి పబ్లిక్ (Quasi-Public),జ్యుడీషియల్ సంస్థలు,క్వాజి జ్యుడీషియల్ సంస్థలకు వ్యతిరేకంగా ఈ రిట్ జారీ చేయవచ్చు.

మినహాయింపులు:

రాష్ట్రపతి, గవర్నర్లకు ఈ రిట్ వర్తించదు. వీరు తమ అధికారాలు, విధులను నిర్వర్తించనప్పుడు వాటిని నిర్వర్తించమని ఏ కోర్టు ఆదేశించలేదు.

ప్రైవేట్ వ్యక్తులు, ప్రైవేటు సంస్థలకు వ్యతిరేకంగా ఈ రిట్ జారీచేయడానికి వీల్లేదు. మాండమస్ రిట్‌ను అంతిమ ప్రత్యామ్నాయంగా మాత్రమే జారీ చేస్తారు.అంటే పరిపాలనాపరమైన ప్రత్యామ్నాయాల ద్వారా పౌరులు న్యాయాన్ని పొందలేనప్పుడు ఈ రిట్ ద్వారా ఉపశమనం పొందవచ్చు. ఈ రిట్ జారీ అనేది కోర్టు విచక్షణపై ఆధారపడి ఉంటుంది. అధికారులు తప్పనిసరిగా నిర్వర్తించాల్సిన విధులకే ఇది వర్తిస్తుంది. విచక్షణా(Discretion) పూర్వకమైన విధులకు వర్తించదు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి ఉండాల్సిన ముఖ్య లక్షణం?

టెట్/డీఎస్సీ - ప్రత్యేకం

టీచింగ్ ఆప్టిట్యూడ్

మాదిరి ప్రశ్నలు

1. కిందివాటిలో విద్యా లక్ష్యం కానిది ఏది?
1) విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించడం
2) సమాజంతో విద్యార్థుల సంబంధాలు తెలపడం
3) విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దడం
4) విద్యార్థులకు ఉపాధి కల్పింపజేయడం

2. ప్రాథమిక విద్యను ఎవరికి బోధించాలని రాజ్యాంగం నిర్దేశించింది?
1) తెలివి ఉన్న వారికి
2) వెనుకబడినవారికి
3) 6 నుంచి 14 ఏళ్ల లోపు బాలబాలికలకు
4) 5 – 14 ఏళ్ల లోపు వెనుకబడిన వారికి

3. నూతన విద్యా ప్రణాళికలో ప్రధానాంశం?
1) జాతీయ సమైక్యత పెంపొందించడం
2) ప్రజల్లో స్నేహభావాన్ని పెంపొందించడం
3) మతం విషయంలో అవగాహన పెంపొందించడం
4) విద్యార్థుల మానసిక శక్తులను పెంపొందించడం

4. ఉత్తమ ఉపాధ్యాయుడికి ఉండాల్సిన ముఖ్య లక్షణం?
1) వృత్తికి న్యాయం చేయడం
2) నైతిక జీవనం పెంపొందించడం
3) ధనం సంపాదించడం
4) సమాజాన్ని గౌరవించడం

5. ఉపాధ్యాయునిగా మీరు సాధించాల్సింది?
1) మూఢనమ్మకాలను తొలగించడం
2) అక్షరాస్యతను విస్తరించడం
3) సమాజంలో చైతన్యం కలిగించడం
4) ఏదీకాదు

6. సమాజంలో ఉపాధ్యాయుని స్థానం?
1) విలువైనది 2) ఉన్నతమైనది
3) సాధారణమైనది
4) వ్యాపారాత్మకమైనది

7. ఉపాధ్యాయులు రాజకీయాల్లో పాల్గొనడంపై మీ అభిప్రాయం?
1) పాల్గొనవచ్చు 2) పాల్గొనరాదు
3) స్థానిక ఎన్నికల్లో పాల్గొనవచ్చు
4) ప్రభుత్వ అనుమతితో పాల్గొనవచ్చు

8. ప్రస్తుతం పాఠశాలల్లో అమలవుతున్న మూల్యాంకన విధానం ఏది?
1) నిర్మాణాత్మక మూల్యాంకనం
2) రూపాత్మక మూల్యాంకనం
3) గుణాత్మక మూల్యాంకనం
4) నిరంతర సమగ్ర మూల్యాంకనం

9. క్రమశిక్షణ పాటించని విద్యార్థులపై ఉపాధ్యాయుడు చర్య తీసుకోవడాన్ని మీరు సమర్థిస్తారా?
1) సమర్థిస్తాను
2) కొన్ని సందర్భాల్లో సమర్థిస్తాను
3) ఎటూ చెప్పలేను
4) సమర్థించను

10. పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాం నిర్దేశించడానికి కారణం?
1) ప్రశాంతత కోసం
2) అందంగా కనిపించడానికి
3) ప్రత్యేక గుర్తింపు కోసం
4) సమానత్వ భావన కోసం

11. గృహ సంబంధ, వృత్తి సంబంధ విషయాల్లో మీరు దేనికి ప్రాధాన్యమిస్తారు?
1) వృత్తి సంబంధ విషయాలకు
2) రెండింట్లో ఏది అవసరమో అది చేస్తాను
3) గృహ విషయాలకు
4) దేనికీ ప్రాధాన్యం ఇవ్వను

12. తరగతిలో విద్యార్థులు గోల చేస్తున్నప్పుడు ఉపాధ్యాయుడు ఏం చేస్తే బాగుంటుంది?
1) కొంతసేపు బోధనను ఆపాలి
2) గోలను పట్టించుకోకూడదు
3) గట్టిగా మాట్లాడాలి
4) కొంతమంది విద్యార్థులను బయటకు పంపించాలి

13. తరగతి గదిలోని ఏ విద్యార్థీ సరైన ప్రగతి సాధించలేకపోతే దానికి కారణం?
1) సరైన వసతులు లేకపోవడం
2) సరైన ప్రోత్సాహం లేకపోవడం
3) విద్యా ప్రణాళిక లోపం
4) ఉపాధ్యాయుడు దండించకపోవడం

14. తరగతి గదిలో ఉపాధ్యాయుడు పరిశీలించాల్సిన విషయం?
1) అల్లరి పిల్లల ప్రవర్తన
2) తరగతి గది పరిసరాలు
3) విద్యార్థుల సంభాషణలు
4) పాఠ్యాంశాలు

15. ఉపాధ్యాయుడు, విద్యార్థి మధ్య సంబంధం ఎలా ఉండాలి?
1) భౌతికంగా దూరంగా, మానసికంగా దగ్గరగా
2) భౌతికంగా దగ్గరగా, మానసికంగా దూరంగా
3) అంటీ ముట్టనట్లు
4) గాఢమైన స్నేహమైత్రి ఉండాలి

16. చక్కగా విధులు నిర్వహించే ఉపాధ్యాయుడిని విద్యార్థులు ఏవిధంగా పరిగణిస్తారు?
1) నాయకునిగా 2) స్నేహితుడిగా
3) మార్గదర్శకుడిగా
4) దైవంతో సమానంగా

17. విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయుడు ఎలా ఉండాలని ఆశిస్తారు?
1) మంచి ప్రజ్ఞా – జ్ఞానం ఉన్నవారు
2) సామర్థ్యం ఉన్నవారు
3) నిష్పక్షపాతంగా మూల్యాంకనం చేసేవారు
4) తమ పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపేవారు

18. కిందివాటిలో విద్యార్థులను ఎక్కువగా ప్రభావితం చేసేది?
1) స్నేహితులు 2) పాఠశాల
3) సినిమాలు 4) సమాజం, ధనం

19. కిందివాటిలో ఉపాధ్యాయుడు బోధన ఆపాల్సిన సందర్భం ఏది?
1) విద్యార్థి మానసికంగా అలసట చెందినప్పుడు
2) ఉపాధ్యాయునికి ముఖ్యమైన పనులున్నప్పుడు
3) ఉపాధ్యాయుడు అలసిపోయినప్పుడు
4) విద్యార్థులు నిరాసక్తతతో ఉన్నప్పుడు

20. తరగతి గదిలో హాస్యపూరిత వాతావరణం ఏవిధంగా దోహదపడుతుంది?
1) మంచిదికాదు
2) ఉపాధ్యాయుడు, విద్యార్థులు మిత్రుల్లా మెలగుతారు
3) తరగతిలో అభ్యసన ప్రక్రియ సరైన స్థితిలో ఉంటుంది
4) అభ్యసన ప్రక్రియ కుంటుపడుతుంది

21. తరగతి గదిలో క్రమశిక్షణ దేనిపై ఆధారపడి ఉంటుంది?
1) ఉపాధ్యాయుడి రౌద్ర స్వభావం
2) అల్లరి చేసేవారిని వెంటనే దండించడం
3) రాత పని ఎక్కువగా ఇవ్వడం
4) ఉపాధ్యాయుని బోధనా పటిమ

22. విద్యార్థుల్లో క్రమశిక్షణారాహిత్యానికి కారణం ఏమిటి?
1) పరిసరాలు, సామాజిక కారకాలు
2) బాధ్యతారాహిత్యమైన తల్లిదండ్రులు, కుటుంబ పరిస్థితులు
3) పాఠశాల పరిపాలన నిర్వహణ పద్ధతులు
4) పైవన్నీ

23. విద్యార్థుల వెనుకబాటుతనానికి కారణం?
1) సామాజికపరమైన పేదరికం
2) శారీరక లోపం
3) అతి గారాబం, చెడు సావాసాలు
4) పైవన్నీ

24. పేదరికం వల్ల ఒక విద్యార్థి పాఠశాలకు రావడం పూర్తిగా మానేస్తే ఉపాధ్యాయుడిగా మీరు ఏం చేస్తారు?
1) హాజరు పట్టీ నుంచి పేరు తొలగిస్తాను
2) తోటి విద్యార్థులతో తల్లిదండ్రులకు కబురు పంపుతాను
3) ప్రధానోపాధ్యాయుల దృష్టికి తీసుకువెళతాను
4) అవసరమైతే విద్యార్థి ఇంటికి వెళ్లి తల్లి దండ్రులతో మాట్లాడతాను

25. సాధారణంగా విద్యార్థులు నైతిక విలువలను ఎవరి నుంచి అలవర్చుకుంటారు?
1) తల్లిదండ్రులు 2) ఉపాధ్యాయులు
3) సమవయస్కులు 4) పైవారందరూ

26. తరగతి గదిలో పొరపాటు చేసిన ఉపాధ్యాయుడు?
1) తప్పును నిజమని అందరూ నమ్మేలా చేయాలి
2) తప్పు చేయడం సహజం అని విద్యార్థులు గుర్తించేట్లు చేయాలి
3) విద్యార్థులు గమనించకుండా తెలివిగా వ్యవహరించాలి
4) అంగీకరించి, సరైన దాన్ని సూచించాలి

27. విద్యార్థులు పాఠాన్ని మరింతగా అవగాహన చేసుకోవడానికి ఉపాధ్యాయుడిగా మీరు ఏం చేస్తారు?
1) ట్యూషన్ వెళ్లమని సలహా ఇస్తాను
2) కొత్త గ్రంథాలను చదవాలని చెబుతాను
3) క్రమశిక్షణతో బోధిస్తాను
4) విద్యార్థులకు మరిన్ని ఉదాహరణలతో వివరిస్తాను

28. మీరే విద్యార్థి అయితే ఉపాధ్యాయుడు బోధించే పాఠం అర్థం కాకపోతే ఏం చేస్తారు?
1) ఉపాధ్యాయునిపై గౌరవ భావంతో నిశ్శబ్దంగా కూర్చుంటాను
2) ఇంటివద్ద ట్యూషన్‌లో చదువుకుంటాను
3) నిస్సంకోచంగా సమస్యను ఉపాధ్యాయుని ముందు ఉంచుతాను
4) ప్రధానోపాధ్యాయునికి చెబుతాను

29. పరీక్షా పత్రాల మూల్యాంకనం తర్వాత అందరి కంటే తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థికి సంబంధించి ఉపాధ్యాయుడు ఏం చేయాలి?
1) విద్యార్థికి తక్కువ మార్కులు రావడానికి కారణాలు తెలుసుకోవాలి
2) తల్లిదండ్రులను పిలిచి అతడిని ఎక్కువ సమయం చదివించాలని చెప్పాలి
3) విద్యార్థిని టీవీ చూడటానికి, ఆటలకు దూరంగా ఉండాలని చెప్పాలి
4) పరీక్షా పత్రాన్ని ఎక్కువ సార్లు చూసి రాసుకు రావాలని చెప్పాలి

30. మీరు ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించాలనుకోవడానికి కారణం ఏమిటి?
1) అన్ని రకాల సౌకర్యాలు ఉంటాయి
2) విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంపొందించవచ్చు
3) రోజూ విద్యార్థులతో ఉల్లాసంగా గడపవచ్చు
4) వృత్తిలో గౌరవం లభిస్తుంది

31. ఉపాధ్యాయుడు ఎక్కువ సమయం ఎవరి కోసం కేటాయించాలి?
1) తెలివైన విద్యార్థులు
2) వెనుకబడిన విద్యార్థులు
3) క్రమశిక్షణారాహిత్యం ఉన్న విద్యార్థులు
4) సహ ఉపాధ్యాయులు

32. ఉపాధ్యాయుడి ఉత్తమ అభిరుచి ఏది?
1) నూతన జ్ఞాన సముపార్జన
2) ఆటలాడటం
3) ఇతరులతో మంచి సంబంధాలు కొనసాగించడం
4) తీయని స్వరంతో మాట్లాడటం, పాటలు పాడటం

33. ఉపాధ్యాయుడు ఏ విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని బోధించాలి?
1) బాగా చదివేవారిని
2) బాగా వెనుకబడిన వారిని
3) సగటు విద్యార్థిని
4) పై వారందరినీ

34. విద్యార్థిని ప్రగతి పథంలో నడిపించడానికి ఉపాధ్యాయుడిగా మీరు సూచించే మార్గం?
1) ఇతర విషయాల్లో దృష్టి మరల్చకుండా పాఠ్యాంశాల్లో చక్కని అవగాహన ఏర్పర్చుకునేట్లు చేస్తాను
2) ఆటలాడటం, మ్యాగజీన్స్ చదవడం మానిపిస్తాను
3) తరచుగా బట్టీ వేయిస్తాను
4) పాఠ్యాంశాలు, పాఠ్యేతరాలను ఆసక్తిగా ఉండేట్లు చేస్తాను

సమాధానాలు

1) 4; 2) 3; 3) 1; 4) 1; 5) 2;
6) 2; 7) 1; 8) 4; 9) 1; 10) 4;
11) 1; 12) 1; 13) 2; 14) 4; 15) 1;
16) 3; 17) 4; 18) 2; 19) 1; 20) 3;
21) 4; 22) 4; 23) 4; 24) 4; 25) 2;
26) 4; 27) 4; 28) 3; 29) 1; 30) 4;
31) 2; 32) 1; 33) 4; 34) 4.

విద్య, ఉద్యోగ సమాచారం

ఐఐటీ హైదరాబాద్‌లో సీనియర్ రీసెర్చ్ ఫెలోలు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) హైదరాబాద్ ఒప్పంద ప్రాతిపదికన సీనియర్ రీసెర్చ్ ఫెలోలు ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఎంఈ/ఎంటెక్ ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వయసు:** 10.12.2025 నాటికి 30 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.42,000.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**10.12.2025
» **వెబ్‌సైట్: https://www.iith.ac.in**

నిట్ వరంగల్‌లో జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్‌లు

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్) జూనియర్ రీసెర్చ్ ఫెలో/సీనియర్ రీసెర్చ్ ఫెలోల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత వి భాగంలో బీటెక్/బీఈ, ఎంటెక్‌లో ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 30 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.37,000.
» **ఎంపిక విధానం:**
ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**10.12.2025
» **వెబ్‌సైట్: https://nitw.ac.in**

నిట్ వరంగల్‌లో రీసెర్చ్ అసోసియేట్-1 పోస్టులు

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్) రీసెర్చ్ అసోసియేట్–1 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీహెచ్‌డీ లేదా ఎంఈ, ఎంటెక్‌లో ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.58,000.
» **ఎంపిక విధానం:**
ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**22.12.2025
» **వెబ్‌సైట్: https://nitw.ac.in**

వెయ్యేళ్ల కిందటే బతుకమ్మ ప్రారంభం!

భారతదేశ చరిత్రలోనే బహుశా మొదటిసారిగా ఒక అకృత్యానికి, అన్యాయానికి అహింసా పూర్వక సత్యాగ్రహాలతో నిరసన తెలిపిన ఏకైక ప్రక్రియ బతుకమ్మ. నాటి నుంచి నేటి వరకు శాంతియుతంగా, సత్యాగ్రహ రూపంలో నిరసన తెలిపిన ఉద్యమం ఇది. ప్రపంచంలో తెలంగాణ ప్రజలకు మాత్రమే ఈ ఘనత దక్కుతుంది.భారతదేశంలో వెయ్యేళ్ల క్రితం అహింసాయుతమైన సత్యాగ్రహానికి పునాది వేసిన ఘనత బతుకమ్మ పండుగదే.

బతుకమ్మ పండుగ

తెలంగాణ రాష్ట్ర పండుగ బతుకమ్మ. రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా 2014 అక్టోబర్ 2న ఈ పండుగను అధికారికంగా నిర్వహించింది. తెలంగాణ ఉద్యమం సందర్భంగా వివిధ దేశాల్లో నివసిస్తున్న తెలంగాణ ప్రజలు 'బతుకమ్మ' పండుగను జరుపుకొని ఈ పండుగ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పారు. ఇప్పుడిదొక బృహత్ పండుగ.

ఇప్పటిదాకా బతుకమ్మ పండుగ మూలాలు వెలుగులోకి రాలేదు. ఈ విషయాన్ని చరిత్రకారులు, సాహితీవేత్తలు ధ్రువీకరించారు. శతాబ్దాలుగా బతుకమ్మ పండుగపై ఎన్నో జానపద గాథలు, పాటలు తెలంగాణలో ప్రచారంలో ఉన్నాయి. ఎందరో తెలుగు రీసెర్చ్ స్కాలర్లు బతుకమ్మ పండుగ ప్రాధాన్యతపై ఎన్నో పరిశోధనలు చేశారు. కానీ ఈ పండుగను ఎప్పుడు, ఎవరు ప్రారంభించారు? ఎలా మొదలైంది? లాంటి ప్రశ్నలకు సమాధానం దొరకలేదు. ప్రపంచంలోనే ఏకైక పూల పండుగ, స్త్రీల కోసం ఉన్న పండుగ బతుకమ్మే.

కొందరు సాహితీవేత్తలు ఈ పండుగలో జైన మత అడుగుజాడలను, కాకతీయులతో ఉన్న సంబంధాన్ని వెలుగులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. కానీ అవి ప్రజామోదం పొందలేదు. కాకతీయులు కొంతకాలం ఆంధ్ర దేశం అంతటినీ పాలించినా ఈ పండుగ తెలంగాణాకే పరిమితం కావడం అర్థం కాని విషయం.

'బతుకమ్మ' చరిత్ర మూలాలు కనుక్కోవాలంటే వెయ్యేళ్ల క్రితం 'రాజ్యపాలన చేసిన కల్యాణి చాళుక్యుల, చోళుల చరిత్రను తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఉంది.

బతుకమ్మ చరిత్ర

973లో రాష్ట్రకూటుల సామంతుడైన రెండో తైలపుడు చివరి రాష్ట్రకూటరాజైన 'కర్కుడు-2'ను ఓడించి స్వతంత్ర కల్యాణీ చాళుక్య రాజ్యం స్థాపించాడు. ప్రస్తుత తెలంగాణ ప్రాంతం ఇతడి ఆధీనంలో ఉండేది. ఈ కాలంలోనే వేములవాడ చాళుక్య రాజ్యంలోని వేములవాడ 'రాజేశ్వరాలయం' అప్పటికే ప్రసిద్ధి చెందింది. తెలంగాణ ప్రజల ఇష్ట దైవంగా రాజేశ్వరుడు పూజలు అందుకునేవాడు. రెండో అరికేసరి(930-55) వేయించిన 'దానశాసనం'లో ఈ దేవాలయ ప్రసక్తి ఉంది. వేములవాడ చాళుక్య రాజులు రాష్ట్రకూటుల సామంతులు. అందువల్ల చోళులు, రాష్ట్రకూటుల మధ్య యుద్ధం జరిగితే వీరు రాష్ట్రకూటుల పక్షం వహించేవారు. ఈ విధంగా రెండో పరాంతకుడు వేములవాడలోని రాజేశ్వరాలయాన్ని కూడా సందర్శించాడని శాసనాల్లో పేర్కొన్నారు.

చోళుల కాలం నాటి చరిత్ర

రాజేంద్ర చోళుడు వేములవాడ దేవాలయాన్ని ధ్వంసం చేసిన అనంతరం వేములవాడ రాజేశ్వరుడి(బృహదీశ్వరుడి) మాహాత్మ్యం తెలుసుకుని లింగరూపంలో ఉన్న రాజేశ్వరుణ్ని కంచి నగరానికి తీసుకెళ్లాడు. తన విజయానికి గుర్తుగా తండ్రి అయిన రాజరాజచోళునికి ఈ లింగాన్ని బహూకరించాడని తెలుస్తోంది. 1006లో ఈ లింగానికి(బృహదీశ్వరుడికి) తంజావూరులో దేవాలయ నిర్మాణం ప్రారంభించాడు. 1010లో లింగ ప్రతిష్ఠాపన చేసి, గోపుర కలశాభిషేకాలు నిర్వహించినట్లు శాసనాల ద్వారా స్పష్టమవుతోంది.

రాజరాజచోళుడు బృహదీశ్వరుడికి కృతజ్ఞతాపూర్వకంగా బంగారు కమలాలను సమర్పించాడు. ఈ బృహదీశ్వరాలయాన్ని వేములవాడ చాళుక్య దేశంపై జరిగిన దండయాత్రలో దోచుకున్న ధనంతో నిర్మించామని తమిళ శాసనాల్లో చోళరాజులు ప్రకటించుకున్నారు. వేములవాడ భీమన్న గుడిలోని శివలింగం, బృహదీశ్వరాలయంలోని శివలింగం ఒకేలా ఉంటాయి. తంజావురులోని బృహదీశ్వరాలయం దక్షిణ భారతదేశంలోనే ఎత్తయిన 'విమానం'(విమానం అంటే గోపురం లేదా దేవాలయ ద్వారం) ఉన్న దేవాలయం దీన్ని 'ప్రపంచ వారసత్వ సంపదగా యునెస్కో గుర్తించింది.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ హిస్టరీ

బతుకమ్మ పండుగకు బృహదీశ్వరాలయం, వేములవాడ రాజన్న ఆలయాలతో సంబంధం ఏమిటి? చోళ, చాళుక్యుల చరిత్రను ఎందుకు ప్రస్తావించామనే విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం. వేములవాడ నుంచి శివలింగాన్ని దౌర్జన్యంగా తంజావూరుకు తరలించి, అక్కడ గొప్ప దేవాలయం నిర్మించడం చోళులకు గర్వకారణమైన విషయమే కావొచ్చు. కానీ అది తెలంగాణ ప్రజలకు బాధను కలిగించింది. చోళులు బృహదేశ్వరుడిని తీసుకెళ్లినందుకు నిరసనగా సృష్టికి కారణభూతమైన శక్తిస్వరూపాన్ని బృహతమ్మ (బతుకమ్మ)గా పూజించారు. అదే 'బృహత్' బృహతమ్మ లేదా బతుకమ్మగా ప్రాచుర్యం పొందింది.

బృహత్ అమ్మ, బ్రతుకమ్మ

బతుకమ్మను బృహతమ్మ రూపాంతరంగా భావిస్తూ తంజావూరు దేవాలయానికి బృహత్ అనే పదం వినియోగించారు. బృహత్ అనే పదాన్ని బృహతమ్మ (గొప్ప అమ్మ) అనే పేరుతో ఉపయోగించారు.

'బృహత్ కథ' అనే సంస్కృత గ్రంథం భారతీయ ప్రాచీన గాథలకు, అనేక కథలు, కావ్యాలు, నాటకాలకు మూలమైంది. దీన్ని రచించిన గుణాఢ్యుడు (మెదక్ జిల్లా) తెలంగాణ తొలికవి. బృహత్ కథను పైశాచీ నామంతో రచించాడు. రెండో శతాబ్దంలో 'పిరంగద్దై' పేరుతో తమిళంలోకి కూడా ఈ గ్రంథాన్ని అనువదించారు. రామాయణం, మహాభారతంతో సమాన ప్రతిపత్తి ఉన్న గొప్ప గ్రంథం ఇది. అనేక మంది కవులకు 'బృహత్‌కథ' కావ్య వస్తువుగా ఉండేది. ప్రాచీనమైన బృహత్‌ధారణ ఉపనిషత్ లేదా బృహదారణ్య ఉపనిషత్ పేరులో కూడా బృహత్ అనే పద వినియోగం కనిపిస్తుంది. బృహత్ పదాన్నే బృహతమ్మ లేదా బతుకమ్మగా ప్రజలు ఉపయోగించారని భావించాలి.

బృహతమ్మ (బతుకమ్మ) ఉద్యమం

రాజేంద్రచోళుడు వేములవాడ బృహత్ శివలింగాన్ని తంజావూరుకు తరలించాక తెలంగాణ ప్రజలు తమ ఆక్రోశాన్ని ఒక ఉద్యమంగా మార్చి చోళ రాజులకు తమ నిరసనను తెలిపే ప్రయత్నమే 'బతుకమ్మ' సృష్టికి దారితీసింది. తెలంగాణ నుంచి లింగాకారమైన శివుడు వెళ్లిపోయిన తర్వాత ఇక్కడున్న పార్వతిని ఊరడించే ప్రయత్నంలో భాగంగా పూలతో(సృష్టి) మేరు పర్వతంలా బతుకమ్మను పేర్చారు. దానిపై పసుపు గౌరమ్మను రూపొందించి, దసరా సందర్భంలో తొమ్మిది రోజులు ఆటపాటలతో పదేపదే తలుస్తూ.. చివరగా తిరిగి రమ్మంటూ నీళ్లలో వదలడం ఒక పండుగగా మారింది.

బహుశా దేశ చరిత్రలోనే మొదటిసారిగా ఒక అకృత్యానికి, అన్యాయానికి అహింసా పూర్వక సత్యాగ్రహాలతో నిరసన తెలిపిన ఏకైక ప్రక్రియ బతుకమ్మ.

బతుకమ్మ పాట

బతుకమ్మ పండుగ సందర్భంగా వివిధ రకాల పాటలు పాడతారు. అందులో ఒక ప్రాచీన చోళరాజును ప్రస్తుతించడం కనిపిస్తుంది. చోళదేశ రాజైన ధర్మాంగుడు నూరునోములు నోమి నూరు మందిని పొందాడట. ఆ పాటలోని ప్రథమార్థం ఇలా ఉంటుంది..

'శ్రీ లక్ష్మిదేవియు ఉయ్యాలో సృష్టి బతుకమ్మయే ఉయ్యాలో
పుట్టినా రీతి జెప్పే ఉయ్యాలో భట్టు నరసింహ కవి ఉయ్యాలో
ధరచోళదేశము ఉయ్యాలో ధర్మాంగుడనరాజు ఉయ్యాలో
ఆ రాజు భార్యయు ఉయ్యాలో అది సత్యవతియంద్రు ఉయ్యాలో
నూరు నోములు నోమి ఉయ్యాలో నూరు మందిని గాంచే ఉయ్యాలో
వారు శూరులయ్యి ఉయ్యాలో వైరులచే మృతులైరి ఉయ్యాలో...

ఈ పాటలో కనిపించిన 'చోళదేశం, నూరునోముల సృష్టి, బతుకమ్మయే' అనే పదాలు బతుకమ్మ ఉద్యమానికి దగ్గరగా ఉన్నాయి. వేములవాడ బృహదీశ్వరుణ్ని తరలించింది చోళరాజు. బహుశా రాజరాజచోళుడి తండ్రి రెండో పరాంతక చోళుడు రాజేశ్వర నోము నోచి దేవుడి అనుగ్రహంతో పొందిన కుమారుడికి దేవుడి పేరుమీద 'రాజరాజ' అని నామకరణం చేసి ఉండాలి. మరోచోట పూబోణి పదం బతుకమ్మకు ప్రతిరూపంగా కనిపిస్తుంది. బహుశా బతుకమ్మ ఉద్యమ తీవ్రతను గ్రహించిన చోళరాజులు నరసింహ కవి లాంటి కవులతో వారికి అనుగుణంగా తెలంగాణ ప్రజల ఉక్రోషాన్ని మరిపించేలా ఉయ్యాల పాటలను రాయించి ప్రజల మధ్య వ్యాప్తి చెందించారని భావించవచ్చు. ఇన్నేళ్ల బతుకమ్మ పాటల్లో చోళుల కథ జీవించి ఉండటం మరో విశేషం. దీన్ని సాహిత్య పరమైన రుజువుగా భావించవచ్చు.

ప్రతాపరుద్రుడి కాలంలో కాకతీయులు మేడారం రాజుతో యుద్ధం చేశారు. సమ్మక్క, సారక్క, పగిడిద్దరాజుకు మద్దతుగా.. తెలంగాణ ప్రజలు వారిని దేవతలుగా భావించి మరో పద్ధతిలో సత్యాగ్రహాన్ని వెలిబుచ్చారు. రెండేళ్లకు ఒకసారి లక్షల సంఖ్యలో ఒక చోట చేరి దాదాపు 700 ఏళ్ల తర్వాత కూడా తమ ఆగ్రహాన్ని ఒక తీర్థం రూపంలో వెలిబుచ్చడం తెలంగాణ చరిత్రలో మరో మరుపురాని సంఘటన. బతుకమ్మ ఉత్సవమే సమ్మక్క-సారక్క జాతరకు మూలాధారంగా భావించవచ్చు. మేడారం జాతర ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా ప్రసిద్ధిచెందింది.

చరిత్రలో ఏ అంశమైనా సంపూర్ణ నిర్ధారితం కానీ, సత్యం కానీ కాకపోవచ్చు. తగిన ఆధారాలు దొరకనప్పుడు కొంత ఊహ ఉంటుంది. ఊహకు ఓ ఆధారం ఉంటుంది. ఆధారం మీద ఓ ఊహ ఉంటుంది. కాబట్టి వెయ్యేళ్ల నాటి బృహతమ్మనే నేటి బతుకమ్మ. ఈ బతుకమ్మనే తెలంగాణ ఉద్యమానికి ప్రాణం పోసింది. తెలంగాణ ప్రజలకు ఆరాధ్య దైవంగా కలకాలం నిలిచిపోయింది.

మాదిరి ప్రశ్నలు

1. **తెలంగాణ ప్రభుత్వం బోనాలను రాష్ట్ర పండుగగా ఏ రోజున ప్రకటించింది? (2014లో)**
ఎ) జూన్ 2 బి) జూన్ 6
సి) జూన్ 16 డి) జూన్ 18

2. **బతుకమ్మ పండుగకు సంబంధించిన వాస్తవ అంశం?**
1. తంగేడి పూలు ఉపయోగించడం
2. అశ్వయుజ మాసం మొదటిరోజు ప్రారంభమవుతుంది
3. మొదటిరోజు ఎంగిలి పూల బతుకమ్మ
4. రెండో రోజు అటుకుల బతుకమ్మ
ఎ) 1, 3 మాత్రమే బి) 2, 4 మాత్రమే
సి) 1, 2 మాత్రమే డి) 1, 3, 4 మాత్రమే

3. **బోనాల పండుగకు సంబంధించి వాస్తవ అంశం?**
1. బోనం (భోజనం)
2. ఘటోత్సవం (కలశం)
3. రంగం (భవిష్యవాణి)
ఎ) 1, 2 మాత్రమే వాస్తవం
బి) 1, 3 మాత్రమే వాస్తవం
సి) 2, 3 మాత్రమే వాస్తవాలు
డి) పైవన్నీ వాస్తవాలే

4. **ఏడుపాయల జాతర ఏ ప్రాంతంలో ప్రసిద్ధి?**
ఎ) నాగసానిపల్లి బి) రంగధాం పల్లి
సి) కేస్లాపూర్ డి) వేలాల

5. **'సమ్మక్క-సారక్క' అతిపెద్ద గిరిజన జాతర. ఇది మేడారం(వరంగల్ జిల్లా)లో రెండేళ్లకు ఒకసారి జరుగుతుంది. దీనికి సంబంధించి సరికానిది?**
ఎ) 1996లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించింది
బి) ఇది ప్రధానంగా నాలుగు రోజుల పండుగ
సి) కన్నెపల్లి నుంచి సారక్కను తీసుకొస్తారు
డి) సమ్మక్క - సారలమ్మ అక్కా చెల్లెళ్లు

6. **హర్తాళిక పండుగను ఏ పండుగకు ముందు జరుపుకుంటారు?**
ఎ) దసరా
బి) వినాయక చవితి
సి) దీపావళి
డి) పీర్ల పండగ

7. **మేడారం తర్వాత అతిపెద్ద జాతరగా 'గొల్లగట్టు' జాతర ప్రసిద్ధి చెందింది. దీనికి సంబంధించిన అంశం?**
1. దీన్నే పెద్దగట్టు జాతర అంటారు
2. నల్గొండ జిల్లాలోని సూర్యాపేట సమీపంలోని దురాజ్‌పల్లిలో ఉంది
3. ఆరాధ్యదైవం లింగమంతుల స్వామి
ఎ) 1 మాత్రమే బి) 1, 2 మాత్రమే
సి) 2, 3 మాత్రమే
డి) 1, 2, 3 మాత్రమే

8. **సాధారణంగా వర్షాకాలం ప్రారంభమై నాట్లు పూర్తయిన తర్వాత తొమ్మిది రోజులపాటు జరుపుకొనే ఆదివాసీల పండుగ?**
ఎ) నాగశేష
బి) పెర్సాపెన్
సి) శీతల భవానీ
డి) తీజ్ పండుగ

సమాధానాలు

1) సి; 2) డి; 3) డి; 4) ఎ; 5) డి; 6) బి; 7) డి; 8) డి.

The last stage in the selling process?

BANK EXAMS

MARKETING AWARENESS

1. Which of the following information forms available to the marketing manager can usually be accessed more quickly and cheaply than other information sources?
a) Marketing intelligence
b) Marketing research
c) Customer profiles
d) External databases
e) Internal databases

2. Banks selling Insurance and Mutual funds is:
a) A relatively high level of diversification
b) An example of product diversification
c) Unlikely to reduce variability in the firm's profitability since the banks are all in same business
d) An example of related linked diversification
e) None of the above

3. An ideal marketing framework is designed to address three key management questions. Which of the following is one of those questions?
a) Value Proposition - i.e. How can value propositions be made profitable?
b) Value chain - i.e. Are there weak links in the company's value chain?
c) Value network - i.e. How can a company effectively network?
d) Value exploration – i.e. How can a company identify new value opportunities?
e) All of the above

4. The biggest or greatest amount of involvement in a foreign market comes through which of the following?
a) Exporting b) Joint venturing
c) Licensing
d) Indirect investment
e) Direct investment

5. A strategy wherein A "three-day cooling off period" in which buyers can cancel a contract after re-thinking it is to protect the consumer is called:
a) creative selling
b) high pressure selling
c) detail selling
d) hard core selling
e) detail hard core selling

6. The last stage in the selling process is:
a) Approach
b) Handling objections
c) Closing
d) Follow –up
e) None of the above

7. The more direct connections among businesses, the more ____ is the relatedness of the diversification.
a) linked
b) constrained
c) integrated
d) intense
e) None of the above

8. _____ are products bought by individuals and organizations for further processing or for use in conducting a business.
a) Consumer products
b) Services
c) Industrial products
d) Specialty products
e) None of the above

9. All of the following would be forces that might be contained in a company's microenvironment EXCEPT:
a) Economic forces
b) The company itself
c) Marketing channel firms
d) Suppliers
e) Dealers

10. Which of the following elements of marketing mix customer analyzes at the last, taking a decision of buying a particular product?
a) Promotion b) Place
c) Price d) Product
e) People

11. Which of the following is a value-reducing reason for diversification?
a) Enhancing the strategic competitiveness of the entire company
b) Expanding the business portfolio in order to reduce managerial employment risk
c) Gaining market power relative to competitors
d) Conforming to antitrust regulation
e) None of the above

12. _____ is the set of benefits a company promises to deliver its consumers to Satisfy their needs.
a) A money-back guarantee
b) An attribute
c) A value proposition
d) Good customer service
e) None of the above

13. When backed by buying power, wants become _____.
a) Demands
b) Social Needs
c) Exchanges
d) Self-Esteem needs
e) Social exchanges

14. The type of sales presentation approach that requires good listening and problem-solving skills is:
a) Canned approach
b) Formula approach
c) Need-satisfaction approach
d) Critical-thinking approach
e) All of the above

15. Marketing research firms, advertising agencies, and media firms would all be examples of which of the following marketing intermediaries?
a) Financial intermediaries
b) Physical distribution firms
c) Marketing service agencies
d) Resellers
e) None of the above

16. If a company's objective were to reach masses of buyers that were geographically dispersed at a low cost per exposure, the company would likely choose which of the following promotion forms?
a) Advertising
b) Personal selling
c) Public relations
d) Sales promotion
e) Marketing

17. The purchasing of firms in the same industry is called:
a) Unrelated diversification
b) Vertical integration
c) Networking the organization
d) Horizontal acquisition
e) None of the above

18. Which of the following is a disadvantage of primary market research?
a) Up to date
b) Expensive to collect
c) Focused d) Exclusive
e) Inclusive

19. Companies selling mass consumer goods and services such as soft drinks, cosmetics, air travel and athletic shoes and equipment spend a great deal of time trying to establish a superior brand image in markets is called _____.
a) Business markets
b) Global markets
c) Consumer markets
d) Nonprofit and governmental markets
e) Dealer markets

20. If a consumer describes a car as being the "most economical car on the market," then this descriptor is a:
a) Rule b) Attitude c) Belief
d) Clue e) Praise

21. Through _____, many companies today are strengthening their connections to all partners, form providers of raw materials to components to final products that are carried to final buyers.
a) Partnership relationship marketing
b) Customized marketing
c) Direct marketing
d) Deviated marketing
e) Indirect marketing

22. Wal-Mart owned Sam's club is an example of a retail form called a(n):
a) factory outlet
b) super specialty store
c) seconds store
d) warehouse club
e) All of the above

23. The typical method of retail operation used by supermarkets and catalog showrooms is called:
a) Self-service retailing
b) Limited-service retailing
c) Full-service retailing
d) Service-merchandiser
e) None of the above

24. Using a successful brand name to introduce additional items in a given product category under the same brand name (such as new flavors, forms, colors, added ingredients, or package sizes) is called a(n):
a) Line extension
b) Brand extension
c) Multi-branding
d) New brands
e) None of the above

25. In terms of special product life cycles, a ____ is a basic and distinctive mode of expression.
a) genre b) style
c) fashion d) fad e) shape

26. Customers buy from stores and firms that offer the highest ____
a) Customer perceived value
b) Concern form society's interests
c) Company image
d) Level of customer satisfaction
e) Product quality

27. ____ consists of dividing a market into distinct groups of buyers on the basis of needs, characteristics, or behavior that might require separate products or marketing mixes.
a) Product differentiation
b) Market segmentation
c) Market targeting
d) Market positioning
e) Market differentiation

28. A(n) _____ is a retail store that carries a narrow product line with a deep assortment within that line.
a) shopping goods store
b) convenience store
c) specialty store
d) department store
e) None of the above

29. _____ is a strategy of using a successful brand name to launch a new or modified product in a new category.
a) Duo branding b) Line extension
c) Brand extension
d) Multi-branding
e) Single branding

30. Minimizing pollution from production and all environmental impacts throughout the full Product life cycle is called _____
a) Design For Environment (DFE)
b) Green Marketing
c) Environmental Sustainability
d) Product Stewardship
e) Red Marketing

Answers

1) e; 2) b; 3) d; 4) e; 5) b;
6) d; 7) b; 8) c; 9) a; 10) a;
11) b; 12) c; 13) a; 14) c; 15) c;
16) a; 17) d; 18) b; 19) c; 20) c;
21) b; 22) d; 23) a; 24) a; 25) b;
26) a; 27) b; 28) c; 29) c; 30) b;